

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసీ గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 225

బుధవారం 6-11-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మేము సైతం...

2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం బిడ్ దాఖలు చేసిన భారత్. -12లో



రూ. 57 నుంచి 5,000కు!

ఈ2ఈ షేరు ప్రభంజనం.. చిన్న కంపెనీగా ప్రారంభమై మిడ్‌క్యాప్ స్థాయికి.. -13లో

వికీపీడియాకు కేంద్రం నోటీసులు

వికీపీడియా అందించే సమాచారంలో పక్షపాత ధోరణి కనిపిస్తోందంటూ పలు ఫిర్యాదులు రావడంతో కేంద్రం నోటీసులు జారీచేసింది.

- వివరాలు 6లో▶



ఇకపై ఎన్నికల్లో పోటీ చేయను

భవిష్యత్తులో జరిగే ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయబోనని, యువ తరానికి మార్గదర్శకంగా ఉంటానని శరద్ పవార్ అన్నారు.


- వివరాలు 6లో▶



కుమారస్వామిపై కేసు

కేంద్ర మంత్రి కుమారస్వామిపై కర్ణాటకలో కేసు నమోదైంది. మంత్రి తనను బెదిరించారని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు.

- వివరాలు 6లో▶



25 నుంచి పార్లమెంట్

'నవంబర్ 25 నుంచి డిసెంబర్ 20 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి కిరెణ్ రిజిజు తెలిపారు.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

షాబాద్, ములుగులో వెహికల్ స్క్రాప్ సెంటర్లు



పాత వాహనాలను తుక్కుగా మార్చేందుకు రవాణాశాఖ రెండు కేంద్రాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వికారాబాద్ జిల్లా చేవెళ్ల సమీపంలోని షాబాద్, సిద్దిపేట జిల్లా ములుగు ప్రాంతాల్లో వెహికల్ స్క్రాప్ సెంటర్లను ఇందుకు వినియోగించుకోవాలని నిర్ణయించింది.

- వివరాలు 10లో▶

ఆయిల్ ఫెడ్‌లో అక్రమ దందా?



ఆయిల్‌ఫెడ్‌లో నూనె దందా నడుస్తోందని, కేంద్రం నూనెపై దిగుమతి సుంకం పెంచిన తర్వాత, కేంద్రం ఆదేశాలను పట్టించుకోకుండా నెలన్నర కాలంలోనే ఏకంగా 12 సార్లు ధరలను పెంచడం ద్వారా వినియోగదారులపై భారం మోపిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- వివరాలు 10లో▶

నలిగిపోతున్న నాలుగో సింహం



కేన్సర్..లేదంటే కిడ్నీ జబ్బుల బారిన పడే పోలీసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఐదేళ్ల గణాంకాలు పరిశీలిస్తే..ఈ విషయం స్పష్టమవుతోంది. పోలీస్‌శాఖలోని దాదాపు 40 శాతం మందికిపైగా సిబ్బందికి బీపీ, షుగర్ రావడం సర్వసాధారణంగా మారింది. పని ఒత్తిడి, సమయం తప్పిన జీవనశైలి అనారోగ్య సమస్యలకు దారితీస్తోంది.

- వివరాలు 14లో▶

ఇదంజగత్



పన్లో పని.. పేదరికానికి, ఉగ్రవాదానికి కూడా భారతే కారణమని అనండి సార్!

అన్ని ప్రైవేట్ ఆస్తుల స్వాధీనానికి

రాష్ట్రాలకు అధికారం లేదు

సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు

- ప్రైవేట్ ఆస్తులన్నీ సామాజిక వనరుల పరిధిలోకి రావు
- వచ్చేవాటిని నిర్దిష్ట అవసరాల నిమిత్తం సేకరించవచ్చు
- 7: 2 మెజారిటీ తీర్పులో పేర్కొన్న రాజ్యాంగ ధర్మాసనం
- తీర్పులు ప్రస్తుత, భావి అవసరాలకు అనుగుణంగా ఉండాలి
- గత పరిస్థితులు ప్రాతిపదిక కారాదు: సీజేఐ జస్టిస్ చంద్రచూడ్
- తీర్పుతో విభేదించిన జస్టిస్ ధూలియా, జస్టిస్ బి.వి.నాగరత్న



> ఆర్టికల్ 39(బి)లో పేర్కొన్న సామాజిక వనరులు అన్న పదబంధం ప్రైవేటు యాజమాన్యంలోని అన్ని ఆస్తులు, వనరులకు వర్తిస్తుందా అన్నది మా ముందున్న ప్రశ్న. సైద్ధాంతికంగా చూస్తే అవుననే సమాధానమే వస్తుంది. కానీ ఆ మేరకు జస్టిస్ కృష్ణయ్యర్ ఇచ్చిన తీర్పు, దాని ఆధారంగా సంజీవ్ కోక్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఏకీభవించలేక పోతున్నాం. కేవలం భౌతిక అవసరాల నిర్వచన పరిధిలోకి వచ్చినంత మాత్రాన ప్రతి ప్రైవేట్ ఆస్తినీ సామాజిక వనరుగా పరిగణించడం కుదరదు.
>
> - సీజేఐ జస్టిస్ చంద్రచూడ్



న్యూఢిల్లీ: ప్రైవేట్ ఆస్తులపై ప్రభుత్వాల అధికార పరిధికి సంబంధించిన అతి కీలకమైన అంశంపై సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది. అన్ని ప్రైవేట్ ఆస్తులూ సామాజిక వనరుల నిర్వచన పరిధిలోకి రావని స్పష్టం చేసింది. ''కనుక రాష్ట్ర ప్రభుత్వాలకు అన్ని ప్రైవేట్ ఆస్తుల మీదా హక్కులు ఉండబోవు. సమాజ హితం, ఉమ్మడి ప్రయోజనాలు, సామాజిక పంపకం నిమిత్తం ఏ ప్రైవేట్ ఆస్తినైనా స్వాధీనం చేసుకునేందుకు వాటికి అధికారం లేదు'' అని తేల్చి చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ సారథ్యంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ఈ మేరకు 7–2 మెజారిటీతో చరిత్రాత్మక తీర్పు వెల్లడించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 39(బి) ఆధారంగా ప్రైవేట్ యాజమాన్యంలోని అన్ని వనరులను స్వాధీనం చేసుకునే హక్కు రాష్ట్రాలకు లేదని పేర్కొంది. వాటికి ఆ అధికారం ఉందంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణయ్యర్, జస్టిస్ చిన్నపరెడ్డి తదితరులు ఇచ్చిన గత తీర్పులతో విభేదించింది. వాటిలో వెలిబుచ్చిన అభిప్రాయాలను లోపభూయిష్టమైనవిగా, కాలదోషం పట్టినవిగా పేర్కొంది. ఆ తీర్పులను కొట్టేసింది. ఆర్థిక ప్రజాస్వామ్యానికి కూడా రాజ్యాంగం అనుమతిస్తోందంటూ ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, ''కొన్ని ప్రైవేట్ ఆస్తులు మాత్రం ఆర్టికల్ 39(బి)లో పేర్కొన్న 'సామాజిక వనరులు, సమాజ హితం' పరిధిలోకి వస్తాయి. ఆ నిర్దిష్ట అవసరాల నిమిత్తం వాటిని ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవచ్చు'' అని స్పష్టం చేసింది. సీజేఐతో పాటు

మిగతా 10వ పేజీలో ▶

ఆర్టికల్ 39(బి) ఏం చెబుతోందంటే..

"సామాజిక వనరులు సమాజ విశాల హితం కోసం పంపిణీ అయ్యేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. ఇందుకు వీలుగా సదరు వనరుల యాజమాన్యం, నియంత్రణకు అవసరమైన విధానాలను రూపొందించాలి".







అంతులేని ఉత్కంఠ

అమెరికా ఎన్నికల్లో భారీగా ఓటింగ్

- కిక్కిరిసిన పోలింగ్ బూత్‌లు
- కమలా హారిస్, డొనాల్డ్ ట్రంప్ హోరాహోరీ
- తొలి ఫలితంలో చెరి సగం.. డిక్స్‌విల్లేలో చెరో 3 ఓట్లు

ఫలితం తేలేదెప్పుడు?

అమెరికా చరిత్రలోనే అత్యంత హోరాహోరీగా సాగిన ప్రచార ఘట్టానికి తెర పడింది. అధ్యక్ష ఎన్నికల్లో అతి కీలకమైన పోలింగ్ ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్లు తమ తీర్పును బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంల్లో నిక్షిప్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం (భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4.30) నుంచే పోలింగ్ బూత్‌ల ముందు ఓటర్లు బారులు తీరారు.

వివరాలు 6లో▶

అణువణువునా కుల వివక్ష

- కార్పొరేట్‌తో పాటు న్యాయ, రాజకీయ వ్యవస్థల్లోనూ ఉంది
- కులగణన సంప్రదింపుల సదస్సులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ
- కుల వివక్ష దేశ ప్రజల జీవితాలను విధ్వంసం చేస్తోంది. భారత రాజ్యాంగానికి, జాతికీ ముప్పులా పరిణమించింది
- దేశ వాస్తవ పరిస్థితిని ప్రజల ముందుంచాల్సిందే..
- కుల వివక్షను నిర్మూలిస్తానని ప్రధాని మోదీ ఎందుకు చెప్పడం లేదని ప్రశ్న
- కులగణన 100 శాతం పూర్తి చేసి తీరుతాం: సీఎం రేవంత్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ. చిత్రంలో రేవంత్‌రెడ్డి, భట్టి, మహేశ్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: 'భారత సమాజంలో కుల వివక్ష అన్నిచోట్లా లోతుగా, బలంగా ఉంది. అణువణువునా దేశంలో కుల వివక్ష ఉందన్న వాస్తవాన్ని అందరం అంగీకరించాల్సిందే. ఈ వివక్ష కేవలం దేశ ప్రజల జీవితాలను విధ్వంసం చేయడమే కాదు.. భారత రాజ్యాంగానికి, జాతికి సైతం ముప్పులా పరిణమించింది..' అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలు, న్యాయ వ్యవస్థ, రాజకీయ రంగం.. ఇలా ప్రతిచోటా ఉన్న ఈ వివక్ష దేశ ప్రజల భవిష్యత్తుపై ప్రభావం చూపుతోందని, దేశంపై వారి నమ్మకాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. తాను వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం లేదని, కులవివక్షను అందరూ అంగీకరించి దేశ వాస్తవ పరిస్థితిని ప్రజల ముందు ఉంచాల్సిందేనని స్పష్టం చేశారు. కులంతో కూడిన అసమానత చాలా దారుణమని, దళితులను ముట్టుకోని పరిస్థితులు ప్రపంచంలో మరెక్కడా ఉండవని చెప్పారు. టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో కులగణనపై రాష్ట్రస్థాయి సంప్రదింపుల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రాహుల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఇది ఒక ఎక్స్‌రే లాంటిది

'కుల వివక్ష ఎంత తీవ్రస్థాయిలో ఉందో దేశ ప్రజల ముందు ఉంచుదాం. ఇది కూడా ఎక్స్‌రే లాంటిదే. కుల వివక్షపై మాట్లాడితే దేశాన్ని నేను విభజించేందుకు ప్రయత్నిస్తున్నానని బీజేపీ నేతలు, దేశ

మిగతా 3వ పేజీలో ▶

రాహుల్.. టైటానిక్ కథ

'1912లో ఓ పడవ యూకే నుంచి అమెరికాకు బయలుదేరింది. దాని పేరు టైటానిక్. అది ఎప్పటికీ మునిగిపోదని తయారు చేసిన వాళ్లు అనుకున్నారు. కానీ సముద్రంలోని ఒక మంచు కొండను ఢీకొట్టి 20 నిమిషాల్లో ఆ పడవ మునిగిపోయింది. సముద్రం అడుగున ఉన్న ఆ కొండ కేవలం 10 శాతం మాత్రమే కనిపించడంతో ప్రమాదం జరిగింది. ఇలా దేశంలో కనిపించకుండా ఉన్న కుల వివక్ష అనే వ్యాధి చాలా ప్రమాదకరమైనది. దీని గురించి తెలుసుకునేందుకు పరీక్షలు చేయాలని అనుకుంటున్నాం. ఇందులో కులగణన అత్యంత కీలకం..' అని రాహుల్ చెప్పారు.



స్పీకర్‌కు కోర్టులు గడువు విధించలేవు

'అనర్హత' అంశంపై ప్రభుత్వం తరఫున ఏజీ వాదనలు

- సమయం ఇవ్వకుండానే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్లు
- రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు
- స్పీకర్ నిర్ణయం తీసుకోక ముందు న్యాయ సమీక్ష చెల్లదని వాదన
- అసెంబ్లీ కార్యదర్శి అప్పీళ్లపై సీజే ధర్మాసనం విచారణ

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల ఫిరాయింపుపై దాఖలైన అనర్హత పిటిషన్లలో ఫలానా తేదీలోపు నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానాలు గడువు విధించలేవని హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి కనీస సమయం ఇవ్వకుండానే కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. అంతేకాదు తమ పిటిషన్లు తీసుకోలేదంటూ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని'ఏజీ సుదీర్ఘ వాదనలు వినిపించారు. అనంతరం తదుపరి విచారణను న్యాయస్థానం బుధవారానికి వాయిదా వేసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నాలుగు వారాలకు గడువిస్తున్నామని.. ఆలోగా వివరాలు

మిగతా 10వ పేజీలో ▶

నేటి నుంచి

కుటుంబ సర్వే



- ఇంటింటికీ వెళ్లనున్న ఎన్యుమరేటర్లు
- వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక వివరాల సేకరణ

85,000 సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లు

175 కుటుంబాలు ఒక బ్లాకుగా వర్గీకరణ

2లో

- ప్రతి పదిమంది ఎన్యుమరేటర్లకు ఒక పరిశీలకుడు
- సేకరించిన సమాచారం వెంటనే కంప్యూటరీకరణ
- ప్రణాళిక శాఖకు రోజువారీ పురోగతి నివేదిక
- నెలాఖరు వరకు సర్వే పూర్తికి ప్రభుత్వ ఆదేశం



కులం, మతం వద్దు అనుకునే స్వేచ్ఛను రాజ్యాంగం ఇచ్చింది

- ఆ వినతిపత్రాలను పరిగణనలోకి తీసుకోండి
- సమగ్ర కుటుంబ సర్వేపై హైకోర్టు ఆదేశం 2లో

సెక్యూరిటీ లేకుండా వెళ్తే

ప్రజలే తంతారు



- సీఎం రేవంత్‌రెడ్డిపై అంతగా వ్యతిరేకత ఉంది
- హామీల అమల్లో విఫలంపై జనాగ్రహం
- ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు సర్కారే కారణం
- ఆటో డ్రైవర్ల జేఏసీ ధర్నాలో కేటీఆర్

ఆటో డ్రైవర్ల మహాధర్నాలో కేటీఆర్. చిత్రంలో ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

కవాడిగూడ/రాంగోపాల్‌పేట్: సెక్యూరిటీ లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బయటకు వెళ్తే ప్రజలు తన్నే పరిస్థితి వచ్చిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో సీఎంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని తెలిపారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో మీటర్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ ఆటో డ్రైవర్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వస్తుందని అనుకోలేదని చెప్పారు. గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో అభివృద్ధి ఫలాలు అనుభవిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిని తీసుకొచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలోని

మిగతా 3వ పేజీలో ▶

రాశులకొద్దీ ధాన్యం.. కొనేవారేరీ?



వరంగల్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం

రైతులకు తప్పని పడిగాపులు

- సోమ, మంగళవారాల్లోనే చాలా జిల్లాల్లో మొదలైన కొనుగోళ్లు.. ముందుకు రాని మిల్లర్లు
- ఒప్పించేందుకు అధికారుల తంటాలు
- కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్ రోజువారీ సమీక్షలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి, హైదరాబాద్: పలు జిల్లాల్లో ఈసారి పంట దిగుబడి పెరగడంతో ధాన్యం రాశులతో పల్లెలన్నీ కళకళలాడుతున్నాయి. అయితే ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వెళ్లిన రైతులకు మాత్రం నిరాశే ఎదురవుతోంది. మంత్రి ఉత్తమ్ ప్రతిరోజూ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నా, క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు ముందుకు సాగడం లేదు. కొనుగోలు కేంద్రాలు తెరిచినా, కాంటా వేయడం లేదు. దీంతో రైతులకు పడిగాపులు తప్పడం లేదు. నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లోని కొన్ని మండలాల్లో పండిన మేలురకం సన్న ధాన్యాన్ని ఇప్పటికే బహిరంగ మార్కెట్‌లో రైతులు విక్రయించారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ వచ్చే సన్న ధాన్యాన్ని, ఎక్కువగా సాగయ్యే దొడ్డు ధాన్యాన్ని విక్రయించేందుకు వీలుగా రాష్ట్రంలో 7,572 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో ఇప్పటి

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేటి నుంచి ఒక్క పూటే ప్రాథమిక పాఠశాలలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బుధవారం నుంచి ఒంటిపూట మాత్రమే నిర్వహిస్తారు. కుల గణన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎస్‌జీటీల సేవలను సర్వేకు ఉపయోగిస్తున్నందున, మధ్యాహ్నం నుంచి పాఠశాలలను మూడు వారాల పాటు మధ్యాహ్నం ఒంటిగంట వరకూ నడపాలని పాఠశాల విద్య డైరెక్టరేట్ ఆదేశించింది. మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులను ఇళ్లకు పంపుతారు.

టెట్ బులెటిన్ విడుదల రేపు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్షకు సంబంధించిన ఇన్ఫర్మేషన్ బులెటిన్‌ను ఈ నెల 7వ తేదీన విడుదల చేయనున్నట్టు పాఠశాల విద్య డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. వాస్తవానికి ఈ బులెటిన్‌ను మంగళవారం విడుదల చేయాల్సి ఉంది. సాంకేతిక కారణాల వల్ల సాధ్యం కాలేదని పేర్కొంది.

ఎంబీఏ సాయంకాలపు కోర్సుల ప్రవేశ పరీక్ష 17కు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 9న జరగాల్సిన ఓయూ ఎంబీఏ సాయంకాలపు కోర్సుల ప్రవేశ పరీక్షను నవంబర్ 17కు వాయిదా వేశారు. వర్సిటీ క్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో సాయంకాలపు కోర్సులైన ఎంబీఏ, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ (టీఎం) ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఈ నెల 14 వరకు రూ.500 అపరాధ రుసముతో దరఖాస్తు చేసుకోవచ్చని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు.



నేటి నుంచి కుటుంబ సర్వే

ఇంటింటికి వెళ్లనున్న ఎన్యుమరేటర్లు

- వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక వివరాల సేకరణ
- సర్వేలో 85 వేల మంది ఎన్యుమరేటర్లు
- 175 కుటుంబాలు ఒక బ్లాకుగా వర్గీకరణ
- ప్రతి పదిమంది ఎన్యుమరేటర్లకు ఒక పరిశీలకుడు
- సేకరించిన సమాచారం వెంటనే కంప్యూటరీకరణ
- ప్రణాళిక శాఖకు రోజువారీ పురోగతి నివేదిక

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర వివరాలు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఉదయం నుంచే ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతంలో ఇంటింటికి తిరిగి కుటుంబాల సమగ్ర వివరాలను నమోదుచేస్తారు. ఈ సర్వేలో 85 వేల మంది ఎన్యుమరేటర్లు పాల్గొంటున్నారు. ప్రతి పదిమంది ఎన్యుమ రేటర్లకు ఒక పరిశీలకుడు చొప్పున 850 మందిని ప్రభుత్వం నియమించింది. ఎన్యుమరేటర్లలో 32 వేల మంది టీచర్లు ఉన్నారు. ఇప్పటికే ఎన్యుమరేటర్లకు, పరిశీలకులకు, పర్యవేక్షణ అధికారులకు విడతలవారీగా జిల్లా కలెక్టర్లు శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే టీచర్లు మధ్యాహ్నం భోజనం తర్వాత సర్వే ప్రక్రియను ప్రారంభిస్తారు. సర్వే ప్రక్రియలో ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందితో పాటు ప్రభుత్వ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, గెస్ట్ టీచర్లను సైతం నియమించారు.

పూర్తి వివరాలు సేకరణ

ఈ సర్వే రెండు భాగాలుగా సాగుతుంది. మొదటి విభాగం(పార్ట్-1)లో కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి. సాధారణ వివరాలు, విద్య, ఉద్యోగ, ఉపాధి, భూమి, రిజర్వేషన్లు, రాజకీయాలు, వలసలకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. రెండో విభాగం (పార్ట్-2)లో కుటుంబ ఆర్థిక స్థితిగతులపై ప్రశ్నలుంటాయి. రుణాలు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు, పశు సంపద, స్థిరాస్తి, రేషన్ కార్డు, నివాసగృహం, తాగునీరు తదితర ప్రశ్నలు అడుగుతారు. సర్వే ప్రశ్నావళిలో 75 ప్రశ్నలుండగా... ఇందులో 56 ప్రధాన ప్రశ్నలు, 19 ఉప ప్రశ్నలు.


175 కుటుంబాలు ఒక బ్లాకు

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను సులభతరంగా చేపట్టేందుకు 175 ఇళ్లను ఒక బ్లాకుగా విభజించి ఎన్యుమరేటర్లకు కేటాయించారు. ఈ బ్లాకుల విభజన ప్రక్రియ జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో జరిగింది. సెన్సెస్ డైరెక్టర్ నుంచి ఎన్యు మరేషన్ బ్లాక్(ఈబీ) మ్యాపులు తీసుకుని బ్లాకులను విభ జించారు. ఎన్యుమరేటర్లు వారికి కేటాయించిన బ్లాకులోని ప్రతి ఇంటిని సర్వే చేయాలి. అనంతరం సర్వే పూర్తి చేసినట్లు స్టిక్కర్ అంటిస్తారు. ఎన్యుమరేటర్లు సర్వే పూర్తి చేసిన తర్వాత ఆ సమాచారంలోని 10 శాతం కుటుంబాలను ర్యాండమ్‌గా ఎంపిక చేసి వాటిని సూపర్‌వైజర్లు మరోమారు తనిఖీ చేసి ఎన్యుమరేటర్ పనితీరును అంచనా వేస్తారు. ఎన్యుమరేటర్లు సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచాలి. సేకరించిన కుటుంబాల వివరాలను ఏ రోజుకారోజు కంప్యూటర్లలో ఎంట్రీ చేస్తారు. ఈ ఎంట్రీనే అత్యంత కీలకం కానుంది. డేటా ఎంట్రీలో పొరపాట్లు దొర్లితే సర్వే స్వరూపం మారిపోతుంది. అందుకే డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సర్వేకు ప్రతి జిల్లాలో నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్‌ను ప్రభుత్వం నియమించింది. సర్వే నిర్వహణలో రోజువారీ పురోగతిని ప్రణాళిక శాఖకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల లోపు పంపాలి. ఈ నెలాఖరు నాటికి సర్వేను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించడంతో ఆ మేరకు జిల్లా కలెక్టర్లు కార్యాచరణ సిద్ధం చేశారు.

కులం, మతం వద్దు అనుకునే స్వేచ్ఛను రాజ్యాంగం ఇచ్చింది

ఆ వినతిపత్రాలను పరిగణనలోకి తీసుకోండి

- చట్ట ప్రకారం నిర్ణయం తీసుకుని పిటిషనర్లకు తెలియజేయండి
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రతి ఒక్కరికీ మతం వద్దు, కులం వద్దు అనుకునే స్వేచ్ఛను రాజ్యాంగం ఇచ్చిందని ఓ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు స్పష్టం చేసింది. కులాన్ని, మతాన్ని ప్రకటించడానికి, ఆచరించడానికి ప్రజలందరికీ సమాన స్వేచ్ఛ ఉందని అభిప్రాయపడింది. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో 'కులం లేదు, మతం లేదు'అనే కాలమ్‌ను చేర్చాలంటూ పిటిషనర్లు అక్టోబర్ 29న, నవంబర్ 1న ఇచ్చిన వినతిపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే నవంబర్ 6 నుంచే సర్వే ప్రారంభమవుతున్నందున 'కులం లేదు, మతం లేదు'అనే కాలమ్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పింది. ఏ నిర్ణయం తీసుకున్నదీ పిటిషనర్లకు తెలియజేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ డిసెంబర్ 4కు వాయిదా వేసింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో 'కులం లేదు, మతం లేదు'అనే కాలమ్‌ను చేర్చాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ వాహీద్, కృష్ణ చంద్ రెండుసార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయినా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, అధికారుల తీరు ఉన్నత న్యాయస్థానం గత ఉత్తర్వులకు విరుద్ధమంటూ వారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా మంగళవారం విచారణ చేపట్టారు. వాదనల అనంతరం.. 'మతం లేదు.. కులం లేదు' అనుకునేవారి కోసం భారత సెన్సెస్ కమిషన్ వాటిని ప్రస్తావించకుండా స్వేచ్ఛను మంజూరు చేసిందని న్యాయమూర్తి తెలిపారు. 2010, 2021లో దాఖలైన పిటిషన్లలో హైకోర్టు ఇచ్చిన తీర్పులను ప్రస్తావించారు. పాఠశాల విద్యా సర్టిఫికెట్లలో కులం, మతం ప్రస్తావన వద్దంటూ పిటిషనర్లు కోరగా, వారికి అనుకూలంగా ఉత్తర్వులు వెలువడ్డాయని చెప్పారు. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, జీఏడీ, సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేశారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను ఇంటర్ బోర్డ్ మంగళవారం వెల్లడించింది. 2025లో పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు.. నిర్ణయించిన తేదీల్లో సంబంధిత కాలేజీ ప్రిన్సిపాళ్ల ద్వారా ఫీజు చెల్లించాలని బోర్డ్ స్పష్టం చేసింది. మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం ఆర్ట్స్ విద్యార్థులు రూ.520 చెల్లించాలి. ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్స్, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు రూ.230తో కలిపి రూ.750 చెల్లించాల్సి ఉంటుంది.

ఫీజు తేదీలు

6-11-24 నుంచి 26-11-24	ఫీజు చెల్లింపు గడువు
27-11-24 నుంచి 4-12-24	రూ.100 ఫైన్‌తో చెల్లింపు
5-12-24 నుంచి 11-12-24	రూ.500 ఫైన్‌తో చెల్లింపు
12-12-24 నుంచి 18-12-24	రూ.వెయ్యి ఫైన్‌తో చెల్లింపు
19-12-24 నుంచి 27-12-24	రూ.2 వేల ఫైన్‌తో చెల్లింపు

సర్వే నుంచి ఎస్‌జీటీలను మినహాయించాలి

విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం : మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: 'సమగ్ర కుటుంబ సర్వే'విధుల నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను (ఎస్‌జీటీ) మినహాయించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సర్వేలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సేవలు వినియోగించాలనే ప్రభుత్వ నిర్ణయం విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు మంగళవారం బహిరంగలేఖ రాశారు. 36,559 మంది ఎస్జీటీలు, 3,414 మంది హెచ్ఎంలను సర్వేలో భాగస్వాములను చేస్తూ నవంబర్ ఒకటో తేదీన విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం దిగజారిపోతుండగా, అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులు, ఉపాధ్యాయులకు శాపంగా మారుతున్నాయన్నారు. విద్యాహక్కు చట్టం నిబంధనల ప్రకారం జనగణన లెక్కలు, ప్రకృతి వైపరీత్యాల్లో సహాయ విధులు, పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ, స్థానిక ఎన్నికలకు సంబంధించిన విధుల్లో మాత్రమే ఉపాధ్యాయుల సేవలు వినియోగించుకోవాలన్నారు. అకస్మాత్తుగా ఒంటిపూట బడులు నడపడం వల్ల పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా ఇబ్బందులు ఉంటాయని హరీశ్‌రావు చెప్పారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ కర్కశ పాలన

ఎన్నికలకు ముందు అశోక్‌నగర్‌లో రాహుల్‌గాంధీని నిరుద్యోగ యువత కలిసిన ప్రదేశంలోనే రేవంత్ ప్రజాపాలనలో వారిపై దాడులు జరిగాయని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జాబ్ కేలండర్ విడుదల చేస్తామనే హామీని కాంగ్రెస్ విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ కర్కశపాలనను నిరుద్యోగ యువత గుర్తుపెట్టుకుంటుందని హెచ్చరించారు.

అఫిడవిట్‌లోని అంశాల అమలు తీరును మేమే పర్యవేక్షిస్తాం

వట్టె జానయ్య కేసులో సుప్రీంకోర్టు వెల్లడి

- తదుపరి విచారణ 3 నెలలకు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: సూర్యాపేట జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మాజీనేత వట్టె జానయ్యపై నమోదైన కేసులపై తెలంగాణ డీజీపీ దాఖలు చేసిన అఫిడవిట్‌లోని అంశాల అమలు తీరును తామే పర్యవేక్షిస్తామని దేశ సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తనపై ఒకేసారి తెలంగాణ పోలీసులు పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ వట్టె జానయ్య గతేడాది సెప్టెంబర్ 20న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బెయిల్, మధ్యంతర బెయిల్, ముందస్తు బెయిల్ కోరుతూ మొత్తం ఆరు స్పెషల్ లీవ్ పిటిషన్లు(ఎస్ఎల్పీ) దాఖలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం (గత బీఆర్ఎస్ సర్కార్) తనపై ఒకేసారి అక్రమాస్తులు, నేరపూరిత బెదిరింపులు, దొంగతనం, దోపిడీలకు సంబంధించి పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసిందని ఇందులో పేర్కొన్నారు. మంగళవారం వట్టె జానయ్యపై దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ హృషికేశ్‌రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిల ధర్మాసనం విచారణ చేపట్టింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జానయ్యపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, తీసుకున్న చర్యలు, తదుపరి తీసుకోబోయే చర్యలపై సవివరంగా అఫిడవిట్‌లో పొందుపరిచినట్టు రాష్ట్ర పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. తాము అఫిడవిట్‌ను పరిగణనలోకి తీసుకున్నామని, తామే పర్యవేక్షిస్తామని చెబుతూ.. కేసును మూడు నెలలకు వాయిదా వేసింది. కాగా వట్టె జానయ్యపై దాఖలైన కేసుల్లో ఇప్పటికే సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

ముగిసిన వివిధ సెట్ల కౌన్సెలింగ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ విద్యా సంవత్సరానికి వివిధ సెట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసిందని కన్వీనర్ ప్రొఫెసర్ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. పీజీ లాసెట్, లాసెట్-2024, పీజీఈసెట్-2024, ఎడ్‌సెట్- 2024, పీఈసెట్-2024 తదితర సెట్ల కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేసినట్లు చెప్పారు.

ఆరోగ్యశ్రీలోకి మరో 150 ఆస్పత్రులు

వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఆరోగ్యశ్రీ సేవలను మరింత విస్తృతం చేయాలని వైద్య,ఆరోగ్యశాఖ నిర్ణయించింది. కొత్తగా 150 ఆస్పత్రులను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ జాబితాలో చేర్చేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిగా నమోద య్యేందుకు అవసరమైన నిబంధనలను మరింత సులభతరం చేసింది. ప్రైవేటు ఆస్పత్రులు దర ఖాస్తు చేసిన తక్కువ సమయంలోనే నెట్‌వర్క్ ఆస్పత్రిగా మారే వెసులుబాటు కలగనుంది. కనీ సం 50 పడకలకుపైన ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో చేరేందుకు అవకాశం కల్పించనున్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో చేరాలంటే దవాఖానలు 13 పారామీటర్లను దాటుకొని రావాలి. దీని వల్ల అనుసంధాన ఆస్పత్రులుగా మారడం చాలా క్లిష్టతరంగా మారింది. దీంతో 13 అంచెల నుంచి 10కి కుదించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర జనాభాకు తగ్గట్లుగా ఆరోగ్యశ్రీ అనుబంధ ఆస్పత్రులు లేవు. ఆరోగ్యశ్రీ కింద ప్రస్తుతం 374 నెట్‌వర్క్ ఆస్పత్రులు మాత్రమే ఉన్నాయి. ఏపీలో జనాభా సంఖ్యకు మించి 800 వరకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. దీంతో ఇక్కడ కూడా నెట్‌వర్క్ ఆస్పత్రులు పెంచాలని నిర్ణయించారు.

రూ.20 వేల కోట్ల బకాయిలిస్తేనే విద్యుత్

నీటిపారుదల శాఖకు ట్రాన్స్‌కో స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: డెవలప్‌మెంట్ చార్జీలతో పాటు మొత్తం రూ.20 వేల కోట్లకు పైగా విద్యుత్ బకాయిలను చెల్లించకపోతే నిర్మాణంలోని ఎత్తిపోతల పథకాలకు సబ్ స్టేషన్లు, లైన్లు నిర్మించలేమని, విద్యుత్ సరఫరా సాధ్యం కాదని నీటిపారుదల శాఖకు తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థ(ట్రాన్స్‌కో) తేల్చి చెప్పింది. ట్రాన్స్‌కో డైరెక్టర్లు టి.జగత్ రెడ్డి, సూర్య ప్రకాశ్ మంగళవారం విద్యుత్ సౌధలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ, సీఈలతో సమావేశమయ్యారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.2 వేల కోట్లు, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అదనపు టీఎంసీ పనులకు రూ.2,700 కోట్లు, సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.120 కోట్లు.. ఇతర బకాయిలు కలిపి మొత్తం రూ.6 వేల కోట్ల డెవలప్‌మెంట్ చార్జీల బకాయిలను తక్షణమే చెల్లించాలని నీటిపారుదల శాఖను కోరారు. కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను చెల్లిస్తేనే సబ్‌స్టేషన్లు, లైన్ల నిర్మాణ పనులను పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. ఇక ఎత్తిపోతల పథకాలు వాడుకున్న విద్యుత్‌కు రూ.14,957 కోట్ల బిల్లుల బకాయిలతో పాటు రూ.6వేల కోట్ల డెవలప్‌మెంట్ చార్జీల బకాయిలను చెల్లించాలని సూచించారు.

ఆరు గ్యారంటీలపై పాదయాత్ర చేస్తారా?

రాహుల్‌గాంధీకి దమ్ముంటే హామీలపై సమాధానం చెప్పాలి: బండి సంజయ్

సిరిసిల్ల: రాష్ట్ర పర్యటనకు వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై సమాధానం చెప్పే దమ్ముందా? అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. దేశమంతా పాదయాత్ర చేశానని చెప్పుకొంటున్న ఆయనకు ధైర్యముంటే ఆరు గ్యారంటీలపై తెలంగాణలో పాదయాత్ర చేయాలని సవాల్ విసిరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి, కోనరావుపేట మండలాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. రుద్రంగిలో మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటక, తెలంగాణ ప్రజలను దొంగహామీలతో కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. తెలంగాణలో రుణమాఫీ చేసినట్లు, ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నట్లు మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ మీడియాకు ప్రకటనలు ఇవ్వడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ కూడా ఇలాగే తెలంగాణ సొమ్మును మహారాష్ట్ర, పంజాబ్‌కు పంచారని తెలిపారు. మూసీని ప్రక్షాళన చేయాలని బీజేపీ మొదటి నుంచీ కోరుతోందని, కానీ ఆ పేరుతో పేదల ఇళ్లను కూల్చొద్దని సూచించారు. రూ.15 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రూ.లక్షన్నర కోట్లకు పెంచి కమీషన్లు దండుకోవాలని ప్రభుత్వ పెద్దలు చూస్తున్నారని విమర్శించారు. అంతకుముందు రుద్రంగిలో రూ. 22 లక్షల ఎంపీ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

నేడు మంత్రితో ముఖాముఖి

సాక్షి, హైదరాబాద్: ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నుంచి వినతిపత్రాలు తీసుకునేందుకు టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మంత్రితో ముఖాముఖి'కార్యక్రమం బుధవారం జరగనుంది. గాంధీభవన్‌లో మధ్యాహ్నం 1 గంటకు జరగనున్న ఈ కార్యక్రమానికి దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై వినతిపత్రాలు స్వీకరిస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

అణువణువునా కుల వివక్ష



కులగణనపై జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న రాహుల్‌గాంధీ. తన ప్రసంగాన్ని చక్కగా అనువదించారంటూ ఉత్తమ్‌ను అభినందిస్తున్న రాహుల్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధాని మోదీ విమర్శిస్తున్నారు. దేశ వాస్తవ పరిస్థితిని బయటపెడితే అది విభజించడమా? దేశంలో దళితులు, ఓబీసీలు, ఆదివాసీలు, మైనార్టీలు, మహిళలు, ఇతర కులాల వారు ఎంతమంది ఉన్నా రో తెలుసుకోవాలి. ఆ తర్వాత సంపద ఎలా పంపిణీ చేయాలో నిర్ణయించుకోవాలి. కార్పొరేట్ కంపెనీలు, న్యాయవ్యవస్థ, సైన్యంలో ఎంతమంది ఏ వర్గాల వారున్నారో అడగాలి. ఈ ప్రశ్నలను అడిగేందుకు ఎందుకు భయపడుతున్నారు? నిజాన్ని తొక్కిపెట్టాలనుకునే వారు, దీని గురించి దేశం తెలుసుకోకూడదని అనుకుంటున్నవారే ఈ ప్రశ్నలను అడ్డుకుంటున్నారు. వీరంతా కుల వివక్ష కారణంగా లబ్ధి పొందినవారే. దేశంలో కుల వివక్షను నిర్మూలిస్తానని మోదీ బహిరంగంగా ఎందుకు చెప్పలేకపోతున్నారు? కార్పొరేట్ కంపెనీల్లో ఎంతమంది దళితులు, న్యాయవ్యవస్థలో ఎంత మంది ఓబీసీలు, మీడియాలో ఎంతమంది ఆదివాసీలు పనిచేస్తున్నారో తెలుసుకునేందుకు మోదీ ఎందుకు ఇష్టపడడం లేదో చెప్పాలి..' అని రాహుల్ డిమాండ్ చేశారు.

కులగణనకు మోడల్‌గా తెలంగాణ

'కులగణనకు తెలంగాణ మోడల్ అవుతుంది. ఈ అంశంలో తెలంగాణ నాయకత్వం చాలా బాగా పనిచేసింది. అయితే బ్యూరోక్రాటిక్ కులగణన వద్దు. కులగణనలో అడిగే ప్రశ్నలు అధికారులు ఎక్కడో కూర్చుని రాసేవి కాకూడదు. అదే జరిగితే ప్రజలను అవమానించడమే. ఏ ప్రశ్నలు అడగాలో దేశ ప్రజలే చెప్పాలి. దళితులు, ఓబీసీలు, ఆదివాసీలు, మహిళల నుంచి ఈ ప్రశ్నలు రావాలి. అప్పుడే ఫలితం ఉంటుంది. కేవలం కులగణన జరగడమే కాకుండా దేశానికి అభివృద్ధి పరంగా, రాజకీయంగా ఓ అస్త్రాన్ని ఇస్తుంది. తెలంగాణలో కేవలం కులగణన మాత్రమే జరగడం లేదు. దేశ భవిష్యత్తు కోసం పాలనా వ్యవస్థను డిజైన్ చేస్తున్నాం. తెలంగాణ నుంచే కార్యాచరణ చేపడుతున్నందుకు గర్వంగా ఉంది' అని రాహుల్ అన్నారు.

ఉత్తమ్‌రెడ్డి.. ఎక్సెలెంట్ ప్రెజెంటేషన్

తెలంగాణలో కులగణన చేపడుతున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లకు రాహుల్ కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రసంగాన్ని చక్కగా అనువదించారని, 'ఎక్సలెంట్ ప్రెజెంటేషన్' అంటూ రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. సదస్సులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నేతలు ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్, ప్రొఫెసర్లు సింహాద్రి, కంచె ఐలయ్య, భుక్యా నాయక్, సూరేపల్లి సుజాత తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వందన సమర్పణ చేశారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయంలో రాహుల్ గాంధీకి సీఎం రేవంత్‌రెడ్డి, తదితరులు స్వాగతం పలికారు. సమావేశం ముగిసిన తర్వాత రాహుల్ ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు.

కులగణనకు ధైర్యం కావాలి: సీఎం రేవంత్

రాహుల్‌గాంధీ దేశ ప్రజలకు, తెలంగాణ పౌర సమాజానికి ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కులగణన చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. కులగణనను ఎలాంటి న్యాయ వివాదాలు, విమర్శలకు తావివ్వకుండా 100 శాతం పూర్తి చేసి ఓబీసీల జనాభా లెక్కలను దేశానికి అందిస్తామని తెలిపారు. కులగణన నిర్ణయం తీసుకునేందుకు గుండె ధైర్యం కావాలని, సామాజిక బాధ్యతతో పాటు సమాన అవకాశాలుండాలనే పట్టుదల ఉండాలని రేవంత్ అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే చిత్తశుద్ధి కూడా ఉండాలని, ఆ ఆలోచనతోనే దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్నికలున్నా కులగణన సదస్సుకు రాహుల్ వచ్చారని చెప్పారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి కులగణన చేస్తున్నాం: భట్టి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ ప్రకటించిన విధంగా, ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ కులగణనను అమలు చేస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వ్యాఖ్యానించారు. మంగళవారం జరిగిన కులగణన రాష్ట్రస్థాయి సంప్రదింపుల సదస్సులో ఆయన మాట్లాడుతూ, తాము ఇచ్చిన మాటకు కట్టుబడి ముందుకెళుతున్నామని చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు పెంచుతాం: ఉత్తమ్

రాష్ట్రంలో కులగణన చేపట్టేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కులగణన కోసం తమిళనాడు, కర్ణాటకల్లో అధ్యయనం చేశామని చెప్పిన ఉత్తమ్, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికగా బీసీల రిజర్వేషన్లు పెంచుతామన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల అభ్యున్నతి, సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

దళితుడిని సీఎం చేస్తామని వెనక్కి తగ్గారు

బీఆర్‌ఎస్‌ను నిలదీసిన మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సవాల్ విసిరారు. ఈ మేరకు ఆయన మంగళవారం బహిరంగలేఖ రాశారు. బీఆర్‌ఎస్ నేతలు తాను సంధించే పది ప్రశ్నలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. 'అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతామన్న పెద్దలు.. అసలా మాటే అననే లేదని నాలుక మడత పెట్టింది వాస్తవం కాదా. దళితులకు 3 ఎకరాల భూమి నీటిమూట అయ్యింది వాస్తవం కాదా? మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన 1,200 మంది విద్యార్థులు, యువకుల కుటుంబాలను బీఆర్‌ఎస్ పెద్దలు ఎందుకు విస్మరించారో ఇప్పుడైనా జవాబు చెప్పగలరా? 2014 జూన్ 14న ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానంలో 1,200 బలిదానాలు జరిగినట్టు కేసీఆర్ స్వయంగా పేర్కొన్నారు. ఆ తర్వాత అనేకసార్లు మాట మార్చి అమరుల సంఖ్యను 585కు కుదిస్తూ వేర్వేరు ఉత్తర్వుల్లో వెల్లడించారు. మిగిలిన 615 మంది ఏమైపోయారో.. పదేళ్ల విధ్వంస పాలనలో ఎప్పుడైనా ఆత్మ విమర్శ చేసుకున్నారా? ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలకు రూ.10 లక్షల నగదు, గృహవసతి, సాగుభూమి, కుటుంబానికో ఉద్యోగం, ఉచిత విద్య, వైద్యం ఇప్పిస్తామని ఎన్నో హామీలిచ్చి.. చివరకు కొద్దిమందికి నగదు, ఉద్యోగాలు ఇచ్చినా, మిగిలిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. బిడ్డలను, కుటుంబ పెద్దలను కోల్పోయిన ఆ కుటుంబాల గురించి కారు పార్టీ పెద్దలు ఎందుకు మాట్లాడటం లేదు?' అంటూ ఆయన ప్రశ్నలు సంధించారు. గ్రూప్-1 పరీక్ష పేపర్ లీకైనా సమర్థించుకున్న చరిత్ర ఎవరిదో రాష్ట్ర ప్రజలకు తెలుసునని శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు.

ఆహార భద్రతపై కలెక్టరేట్లలో ఫిర్యాదు కేంద్రాలు

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి
- ఏడాదికి 24 వేల ఆహార నమూనాలు పరీక్ష చేసేలా లేబొరేటరీలు.. హైదరాబాద్ బిర్యానీ పేరు నిలబెట్టేలా ఆహార పరిశ్రమ ఉండాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ)కు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం కలెక్టరేట్లలోనే స్పెషల్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్సు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. గత పదేళ్లలో పెరిగిన హోటళ్లు, జనాభా సంఖ్యకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ విభాగం బలోపేతం కాలేదని మంత్రి అన్నారు. తామిప్పుడు ఫుడ్ సేఫ్టీ అధికారుల సంఖ్యను పెంచబోతున్నామని చెప్పారు. నాచారం ఫుడ్ సేఫ్టీ ల్యాబ్‌ను ఆధునీకరిస్తున్నామని, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లలో కొత్తగా మరో మూడు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇవిగాకుండా కొత్తగా 5 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ తీసుకొస్తున్నామన్నారు. సంవత్సరానికి కనీసం 24 వేల ఆహార నమూనాలు పరీక్షించేలా లేబొరేటరీలను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్ బిర్యానీకి విశ్వవ్యాప్తంగా మంచిపేరు ఉందని, ఆ పేరును నిలబెట్టేలా రాష్ట్రంలో ఫుడ్ ఇండస్ట్రీ ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. మంచిగా బిజినెస్ చేసుకునే వారికి అండగా ఉంటూనే, తప్పు చేస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టబోమని మంత్రి హెచ్చరించారు. హోటల్స్, స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ మాత్రమే కాదని, హాస్టళ్లు, హాస్పిటల్స్, వర్క్‌ప్లేస్‌లో ఉండే క్యాంటీన్లు కూడా ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాల్సిందేనన్నారు.

భద్రకాళి టెంపుల్‌కు భోగ్ సర్టిఫికేషన్...: వరంగల్‌లోని భద్రకాళి దేవస్థానానికి, హైదరాబాద్‌లోని శ్రీజయలక్ష్మి మాతా యోగా సెంటర్ ట్రస్ట్‌కు భోగ్ సర్టిఫికెట్లను మంత్రి దామోదర అందజేశారు. హైజెనిక్ కండీషన్‌లో ఫుడ్ తయారు చేస్తూ, ఫుడ్ సేఫ్టీ నిబంధనలను పాటించే దేవస్థానాలు, మందిరాలకు ఫుడ్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి భోగ్ సర్టిఫికెట్ ఇస్తారన్నారు. మన రాష్ట్రంలో యాదగిరిగుట్ట, సికింద్రాబాద్ మహంకాళి దేవాలయం, బల్కంపేట్ ఎల్లమ్మ ఆలయంసహా సుమారు పది ఆలయాలు, ధ్యాన మందిరాలకు భోగ్ సర్టిఫికేషన్ ఉందని తెలిపారు. కాగా, రాష్ట్రంలో ఫుడ్ సేఫ్టీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ చెప్పారు.



ఏడాదిలోగా వరంగల్ ఎయిర్‌పోర్టు

- యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలుపెట్టాలి.. 2050- విజన్‌తో వరంగల్ మాస్టర్ ప్లాన్
- వరంగల్ అభివృద్ధిపై సమావేశంలో మంత్రి పొంగులేటి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో సురేఖ, వేం నరేందర్‌రెడ్డి, పొన్నం

సాక్షి, హైదరాబాద్: చారిత్రక నేపథ్యం కలిగిన వరంగల్ నగరంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 2050 విజన్‌తో మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రానున్న 25 ఏళ్లలో పెరిగే జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కోసం రూపొందుతున్న మాస్టర్‌ప్లాన్ తుదిదశలో ఉందని, త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా విడుదల చేస్తామని వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో వరంగల్, హనుమకొండ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర మాస్టర్ ప్లాన్, వరంగల్ ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, భద్రకాళి ఆలయ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మెగా టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్‌పోర్ట్, ఎకో టూరిజం అంశాలపై చర్చించారు. పొంగులేటి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలన్న కృతనిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రింగ్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 41 కిలోమీటర్ల పొడవైన ఔటర్ రింగ్ రోడ్డును 3 దశల్లో చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఎయిర్‌పోర్ట్ పనులను త్వరలో ప్రారంభించి, ఏడాదిలోపు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి చెరువులో పూడిక తీసి, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని అన్నారు.

వరంగల్ ప్రజల చిరకాల వాంఛ ఎయిర్ పోర్టు: మంత్రి కొండా సురేఖ

వరంగల్ జిల్లా ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మామునూరు ఎయిర్‌పోర్ట్ కల త్వరలోనే సాకారం కానుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ వరంగల్ విమానాశ్రయం నిర్మాణానికి అంగీకరించిందని చెప్పారు. సమావేశంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె నాగరాజు, నాయిని రాజేందర్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

సెక్యూరిటీ లేకుండా వెళ్తే ప్రజలే తంతారు

▶ మొదటి పేజీ తరువాయి

ఆరున్నర లక్షల ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా తయారైందని అన్నారు.

ఆటో డ్రైవర్లకు రూ.5 వేల భృతి ఏది?

ఆటో డ్రైవర్లకు నెలకు రూ.5 వేల భృతి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు నెలకు రూ.2,500 భృతి ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ అమలు సాధ్యం కాని హామీలిచ్చిందని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల పేర్ల జాబితాను ప్రభుత్వానికి ఇస్తే ఇప్పటివరకు వారి కుటుంబాలను ఆదుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. రాబోయే శాసనసభ సమావేశాల్లో ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎన్ని కేసులు పెట్టినా వెనక్కు తగ్గం

నిరుద్యోగులను, రైతులను, వృద్ధులను కూడా మార్పు పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షం సీపీఐ అనుబంధ కార్మిక సంఘం ఏఐటీయూసీ కూడా ప్రభుత్వంపై పోరాడటం సంతోషకరమన్నారు. ప్రభుత్వం తమపై ఎన్ని కేసులు పెట్టి జైలుకు పంపినా ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడుతామని, వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, బీఆర్ నేతలు బాల్కసుమన్, గణేష్‌గుప్త, దాస్యం వినయ్ భాస్కర్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆటో డ్రైవర్ జేఏసీ నాయకులు జీ వెంకటేశం, వేముల మారయ్య, పి. శ్రీకాంత్, లింగంగౌడ్ తదితరులు హాజరయ్యారు. మహాధర్నాకు కేటీఆర్, బీఆర్‌ఎస్ నేతలు ఆటోలో రావటం గమనార్హం.


ఇందిరా పార్క్ వద్ద ఆటో డ్రైవర్ల మహాధర్నా కార్యక్రమానికి మద్దతుగా ఆటోలో వస్తున్న కేటీఆర్


ప్యారడైజ్‌లో ఓ యువతితో కరచాలనం చేస్తున్న కేటీఆర్

ప్యారడైజ్‌లో లంచ్

మహాధర్నాలో పాల్గొన్న తర్వాత కేటీఆర్ తన పార్టీ నేతలతో కలిసి ప్యారడైజ్‌లో హోటల్‌లో మధ్యాహ్న భోజనం చేశారు. కేటీఆర్ వెంట బీఆర్‌ఎస్ నేతలు తలసాని, పద్మారావు తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌ను పిలువనేలేదు

ఇందిపార్కు వద్ద చేపట్టిన ఆటో డ్రైవర్ల మహాధర్నాకు కేటీఆర్‌ను ఆహ్వానించలేదు. అయినా ఆయన హాజరై మా సమస్యలను పక్కదారి పట్టించారు.

-బి. వెంకటేశం, ఆటో డ్రైవర్ల జేఏసీ నేత, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి





'నాకు సంతోషం దొరకాలని కోరుకోవడం స్వార్థ చింతన కాబోదు. మనలోని సంతోష వనరులను గుర్తించి, వృద్ధి చేసుకున్నప్పుడే వాటిని ఇతరుల మీదకు ప్రసరించగలం.'
– థానిస్సరో భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 6 నవంబర్ 2024

ఆగని ఆగడాలు

ఎంత గట్టిగా చెప్పినా, ఎన్నిసార్లు నిరసన తెలిపినా భారత్‌కూ, భారతీయులకూ వ్యతిరేకంగా కెనడాలో ఆగడాలు ఆగడం లేదు. ఈ ఉత్తర అమెరికా దేశంలో ఆదివారం జరిగిన సంఘటనలు అందుకు తాజా నిదర్శనం. టొరంటోకి దాదాపు 50 కిలోమీటర్ల దూరంలోని బ్రాంప్టన్‌లో హిందూ సభ ఆలయం వద్ద పసుపుపచ్చ ఖలిస్తానీ జెండాలు ధరించిన మూకలు హిందూ భక్తులతో, భారతదేశ జెండాలు ధరించినవారితో ఘర్షణకు దిగి, దాడి చేసిన ఘటన ముక్తకంఠంతో ఖండించాల్సిన విషయం. భారత దౌత్యాధికారులు ప్రార్థనా మందిరాన్ని సందర్శిస్తున్నప్పుడు జరిగిన ఈ వ్యవహారాన్ని భారత్ తీవ్రంగా పరిగణించింది. మన ప్రధాని, విదేశాంగ మంత్రి తమ నిరసనను కటువుగానే తెలిపారు. ఖలిస్తానీ మద్దతుదారులైన 25 మంది ఎంపీల అండతో ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సైతం తప్పనిసరి పరిస్థితుల్లో ఈ ఘటన ఖండించాల్సి వచ్చింది. అయితే, సాక్షాత్తూ ట్రూడో ప్రాతినిధ్యం వహిస్తున్న లిబరల్ పార్టీ పార్లమెంట్ సభ్యుడు చంద్ర ఆర్య ఇదంతా ఖలిస్తానీ తీవ్రవాదుల పని అనీ, వారు లక్ష్మణ రేఖ దాటారనీ పేర్కొనడంతో సమస్యకు మూలకారణం సర్కారు వారి సొంత వైఖరిలోనే ఉందని కుండబద్దలు కొట్టినట్టయింది.

సీనియర్ సిటిజన్లయిన భారతీయ, కెనడియన్లకు లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి స్థానిక హిందూ సభ మందిరంతో కలసి భారత అధికారులు దౌత్య శిబిరం నిర్వహించిన సందర్భంలో తాజా ఘటనలు జరిగాయి. ఇది మరీ దుస్సహం. అటు బ్రాంప్టన్‌లోని హిందూ సభ మందిరం, ఇటు సర్రీలోని లక్ష్మీనారాయణ ఆలయం వద్ద జరిగిన ఘర్షణల్ని చెదురుమదురు ఘటనలు అనుకోలేం. భారత, హిందూ ధర్మ వ్యతిరేక ధోరణితో హిందూ దేవాలయాలను లక్ష్యంగా చేసుకొని అల్లరి మూకలు కొన్నేళ్ళుగా దౌర్జన్యాలకు దిగుతున్న వార్తలు తరచూ వింటూనే ఉన్నాం. భారత్‌కు వ్యతిరేకంగా, ఖలిస్తాన్‌కు అనుకూలంగా మందిరాల వద్ద గోడలపై రాతలు రాస్తున్న వైనం మీడియాలో చూస్తూనే ఉన్నాం. కెనడాతో భారత్ తన నిరసన తెలిపి, అక్కడి భారతీయులు, ఖలిస్తానీ అనుకూలేతరుల భద్రత గురించి ఆందోళన వ్యక్తం చేసినా ఫలితం కనిపించట్లేదు. ట్రూడో సర్కార్ చిత్తశుద్ధి లేమికి ఇది అద్దం పడుతోంది. కెనడాలో ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన మతధర్మాన్ని స్వేచ్ఛగా, సురక్షితంగా పాటించే హక్కుందని ఆ దేశ ప్రధాని పైకి అంటున్నారు. కానీ లోలోపల సర్కారీ అండ చూసుకొనే ఆ దేశంలో మందిరాలపై ఖలిస్తానీ దాడులు పెరుగుతున్నాయనేది చేదు నిజం.

కెనడాలోని పరిణామాలు ఇతరులకేమో కానీ, భారత్‌కు మాత్రం ఆశ్చర్యకరమేమీ కాదు. నిజం చెప్పాలంటే కొంతకాలంగా, మరీ ముఖ్యంగా గడచిన నాలుగేళ్ళుగా వేర్పాటువాద ఖలిస్తానీ మద్దతుదారులకు కెనడా ఒక కేంద్రంగా తయారైంది. భారత వ్యతిరేకులైన ఈ తీవ్రవాదులకు కెనడా ఆశ్రయం ఇవ్వడమే కాక, వారికి రక్షణగా నిలుస్తోంది. భారత్‌లో హింస, భయాందోళనల్ని వ్యాపింపజేస్తూ, ఆయుధాలు అందిస్తున్నట్టుగా వీరిలో చాలామందిపై భారత అధికారులు ఇప్పటికే క్రిమినల్ కేసులు పెట్టారు. అయినా సరే, డిజిటల్ మీడియా సహా వివిధ వేదికలపై ఖలిస్తాన్‌కు మద్దతుగా నిలుస్తూ, భారత వ్యతిరేక ప్రకటనలు చేస్తున్నవారిని కెనడా ప్రభుత్వం ఇంటి అల్లుళ్ళ కన్నా ఎక్కువగా చూసుకుంటోంది. నిజానికి, భారత ప్రభుత్వం కరడుగట్టిన గ్యాంగ్‌స్టర్లు ఏడుగురి పేర్లను గత ఏడాదే కెనడాకు అందజేసింది. జస్టిన్ ట్రూడో సర్కారు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుంది. వీటన్నిటి పర్యవసానమే... ఇప్పుడు కెనడాలో హిందువులపై జరుగుతున్న దాడులు. అల్లరి మూకలకు ఆశ్రయం ఇవ్వడం వల్లనే ఇలాంటి హింసాత్మక ఘటనలకు కెనడా నెలవుగా మారిందని ఇప్పుడు ప్రపంచానికి తేటతెల్లమైంది.

హిందువులందరూ భారత్‌కు తిరిగి వెళ్ళిపోవాలని ఖలిస్తానీ గురుపత్‌వంత్ సింగ్ పన్నూ గత ఏడాది బాహాటంగానే హెచ్చరించారు. మొన్నటికి మొన్న దీపావళి జరుపుకోరాదనీ బెదిరించారు. బ్రాంప్టన్, వాంకూవర్‌లలో ఖలిస్తానీ మద్దతుదారులు భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యోదంతాన్ని ఉత్సవంలా చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా ట్రూడో సర్కార్ మాటలకే తప్ప చేతలకు దిగలేదు. ఆగడాలను ఆపే ప్రయత్నం చేయనే లేదు. తాజా ఘటనల్లో ఖలిస్తానీ అల్లరి మూకలను ఆపే బదులు కెనడా స్థానిక పోలీసులు మౌనంగా చూస్తూ నిల్చొని, బాధిత హిందూ భక్తులపైనే విరుచుకుపడడం విడ్డూరం. కొందరు పోలీసు ఉద్యోగులు సాధారణ దుస్తుల్లో ఖలిస్తానీ జెండాలతో తిరగడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. రక్షకభటులు ఓ వర్గానికి కొమ్ముకాయడం ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు లేకుండా జరిగే పని కాదు. ఇది భారతీయ కెనడియన్ల భద్రతపై ఆందోళన రేపే అంశం.

ట్రూడో అధికారంలోకి వచ్చాక భారత, కెనడా సంబంధాలు అంతకంతకూ క్షీణిస్తూ వస్తున్నాయనేది బహిరంగ రహస్యం. గత ఏడాది కాలంగా సాక్ష్యాధారాలు చూపకుండా భారత్‌పై కెనడా ఆరోపణలు, మన దేశ ప్రతి విమర్శలు, మొన్న అక్టోబర్‌లో దౌత్యాధికారుల పరస్పర బహిష్కరణ దాకా అనేక పరిణామాలు సంభవించాయి. వచ్చే ఏడాది జరిగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ట్రూడో ఓటు బ్యాంక్ రాజకీయాలు చేయడానికే మొగ్గు చూపడం చివరకు ద్వైపాక్షిక సంబంధాలు ఇంతగా దెబ్బతినడానికి కారణమవుతోంది. ప్రజాస్వామ్యంలో స్వాతంత్ర్యం, భావప్రకటన స్వేచ్ఛ ఉండాల్సిందే కానీ, దాని మాటున తీవ్రవాదుల ఇష్టారాజ్యం సాగనిద్దామనే ధోరణి సరైనది కాదు. ఈ వైఖరి పోనుపోనూ భారత, కెనడా ద్వైపాక్షిక సంబంధాలకే కాదు... చివరకు భవిష్యత్తులో కెనడా సొంత మనుగడకే ముప్పు తేవచ్చు. పాలు పోసి పెంచిన పాము మన ప్రత్యర్థిని మాత్రమే కాటు వేస్తుందనుకోవడం పిచ్చి భ్రమ. ట్రూడో సర్కార్ ఆ సంగతి ఇప్పటికైనా తెలుసుకొంటే మంచిది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.పంచమి రా.9.26 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** మూల ఉ.9.09 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.7.32 నుండి 9.08 వరకు, తదుపరి సా.6.53 నుండి 8.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.23 నుండి 12.11 వరకు, **అమృతఘడియలు:** తె.4.37 నుండి 6.13 వరకు (తెల్లవారితే గురువారం).

సూర్యోదయం : 6.04
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

'దళపతి' అడుగుల ముద్ర పడేనా?

విశ్లేషణ



దిలీప్ రెడ్డి

'సామాజిక స్పృహ టు రాజ్యాధికారం, వయా సినిమా.' తమిళనాట ఏడున్నర దశాబ్దాలుగా రాజ్యమేలుతున్న రాజకీయ ఫార్ములా! సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోకి రావాలని యత్నించి వెనకడుగు వేసిన చోట, సినీ తుఫాన్ విజయ్‌కాంత్ రాజకీయంగా మెరుపు మెరిసి కనుమరుగైన చోట, మరో దిగ్గజ నటుడు కమల్‌హాసన్ పార్టీ పెట్టి ఇప్పటికీ నిలదొక్కుకోలేకపోతున్న చోట... ఇంకో నటుడు 'దళపతి' విజయ్ కొత్త పార్టీ పెట్టారు. ''మారాల్సింది సైన్స్ అండ్ టెక్నాలజీ ఒక్కటేనా? రాజకీయాలు కూడా మారాలి'' అన్న ఆయన కామెంట్స్ సోషల్ మీడియాలో హోరెత్తాయి. రజనీకాంత్ తర్వాతి తరంలో అత్యధిక అభిమాన గణం ఉన్న నటుడిగా గుర్తింపు పొందిన విజయ్ ఆగమనం తమిళనాడు రాజకీయాల్లో మార్పు తెస్తుందా?

తమిళ నటుడు విజయ్ ఈ ఏడాది ఫిబ్రవరిలో 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పేరిట కొత్త పార్టీని ప్రకటించి, అక్టోబరు 27న విక్రవండిలో మొదటి బహిరంగ సభ నిర్వహించారు. ఒక ఎంజీఆర్, ఒక కరుణానిధి, ఓ జయలలిత... సినీరంగ నేపథ్యంతో రాజకీయాలకు వచ్చి, తమదైన ముద్ర వేయడమే కాకుండా తమిళనాడు సామాజికార్థిక, రాజకీయ స్థితిగతుల్నే మార్చిన చరిత్ర కొనసాగింపే తాజా పరిణామం. తీవ్రమైన భావోద్వేగాలకు నెలవైన తమిళ నేలలో 'దళపతి' ప్రభావమెంత?

ఇరుగు పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడు రాజకీయాలు భిన్నమైనవి. అసెంబ్లీలో ప్రత్యర్థి సభ్యులు భౌతికదాడికి పాల్పడి అవమానించినపుడు, 'ఒక్క డీఎంకే సభ్యుడు కూడా లేని సభకే మళ్లీ వస్తా'నని దివంగత ముఖ్యమంత్రి జయలలిత శపథం చేస్తే, అటువంటి సభనే ఏర్పరచిన తమిళ తీర్పు ఒక భావోద్వేగ చరిత్ర! ఆత్మగౌరవ ఉద్యమాన్ని, జస్టిస్ పార్టీని కలిపి 1944లో రామస్వామి పెరియార్ 'ద్రావిడర్ కళగం' (డీకే) ఏర్పాటు చేశారు. అర్ధ శతాబ్దానికి పైగా తమిళనాడును పాలిస్తున్న ద్రవిడ కళగం పార్టీలన్నీ ఈ డీకే నుంచి పుట్టినవే! పెరియార్‌తో విబేధాలు రావడంతో డీకే నుంచి బయటకొచ్చిన అన్నాదురై... 1949లో ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) స్థాపించారు. ద్రవిడ సిద్ధాంతాల ప్రకారం బ్రాహ్మణులు, కాంగ్రెస్, బీజేపీ ఉత్తరాది ఆర్యుల పార్టీల పెత్తనం చెల్లదు.

అన్నాదురై తర్వాత డీఎంకేలో ఉంటూ ద్రవిడ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రచయిత కరుణానిధి 1969లో ముఖ్యమంత్రి అయ్యారు. కరుణానిధి తన గురువు అన్నాదురై సిద్ధాంతాలకు విరుద్ధంగా పని చేస్తున్నారని ఆరోపిస్తూ... నటుడు ఎంజీ రామచంద్రన్ డీఎంకే నుంచి బయటకు వచ్చి 1972లో అన్నా డీఎంకే పార్టీని స్థాపించారు. ఆ రోజుల్లో నటునిగా తిరుగులేని ప్రజాకర్షణ కలిగిన ఎంజీఆర్, 1977లో అన్నాడీఎంకేని గెలిపించి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత ఎంజీఆర్ వారసత్వాన్ని జయలలిత కొనసాగించారు. డీఎంకే, అన్నా డీఎంకేలు కేంద్ర ప్రభుత్వాలకు అవసరమైనపుడు ఆ మేరకు మద్దతునిచ్చినా... తమిళనాడులో ఆ యా జాతీయ పార్టీలు బలపడకుండా అవి నివారించగలిగాయి. దీంతో 5 దశాబ్దాలుగా అక్కడి రాజకీయాలు డీఎంకే వర్సెస్ అన్నా డీఎంకేగా నడుస్తున్నాయి.

ఎంజీఆర్ స్ఫూర్తితో చాలామంది నటులు రాజకీయ ప్రవేశం చేశారు కానీ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ మినహా ఎవరూ అంతటి విజయం సాధించలేకపోయారు. ఎంజీఆర్ కొత్త పార్టీ పెట్టడానికి ముందు నటించిన సినిమాలను తన రాజకీయ ఆశయాలను ప్రచారం చేయడానికి వాడుకున్నారు. ఇటీవల విజయ్ సినిమాల్లో కూడా ఇదే



తంతు కనిపించింది. 2018లో విజయ్ నటించిన సర్కార్ చిత్రంలో... హీరో రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని చూసి షాక్ తిని, రాజకీయ నాయకుడిగా మారుతాడు. ఈ సినిమాలోనే, ఆ సమయంలో అధికారంలో ఉన్న అన్నాడీఎంకేను అవమానించేలా కొన్ని సన్నివేశాలు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి. కానీ, మొదటి బహిరంగ సభలో విజయ్ అన్నాడీఎంకేను ఒక్కమాటా అనలేదు! ఇటీవల విడుదలైన పలు చిత్రాల్లో పరోక్షంగా పంచ్ డైలాగ్స్‌తో డీఎంకేను విమర్శించారు.

పెరియార్, అన్నా పేర్లను స్మరిస్తూ ద్రవిడ నమూనా పేరుతో తమిళనాడును ఒక కుటుంబం దోచుకుంటోందని విమర్శిస్తూ, ఆ పార్టీయే మన శత్రువని విజయ్ ప్రకటించారు. హేతువాది పెరియారే తన పార్టీకి విధాన మార్గదర్శి, కానీ పెరియార్ నాస్తిక సిద్ధాంతాన్ని మాత్రమే తాము అంగీకరించమని చెప్పారు. ఈ విషయంలో 'ఒకటే వంశం – ఒకటే దేవుడు' అన్న 'అన్నా' సూత్రాన్ని పాటిస్తామన్నారు. విధానపరంగా తమ సిద్ధాంతంలో ద్రవిడ, తమిళ జాతీయవాదం మధ్య విభజన లేదని వ్యాఖ్యానిస్తూ, ఆ రెండూ తనకు రెండు కళ్ళు అని చెప్పారు. పరస్పర విరుద్ధాంశాలపై అభిప్రాయానికి పొంతన లేకపోవడంతో విజయ్ సిద్ధాంతాల్లో స్పష్టత కొరవడినట్టు కనిపిస్తోంది. పార్టీల పేర్లను ప్రస్తావించకుండా, మతోన్మాద బీజేపీ తమ సైద్ధాంతిక ప్రత్యర్థిగా చెప్పినప్పటికీ, డీఎంకేకు వ్యతిరేకంగా మాట్లాడినంతగా బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడకపోవడం పలు ఊహాగానాలకు ఆస్కారం కల్పిస్తోంది. కుల గణన నిర్వహించాలనీ, విద్య ఉద్యోగాల్లో దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలనీ చెప్పిన విజయ్, మైనారిటీల గురించి, వారి భద్రత గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడమే ఆయనలోని ద్వైదీభావనకు నిదర్శనం!

పలు తమిళ ఫ్యాన్ పేజీల్లో ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్‌తో విజయ్‌కు పోలికలు తేవడం చూడొచ్చు. వీరిరువురు ఒకరి సినిమాలు ఇంకొకరు రీమేకులు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. రాజకీయంగా కూడా ఇలాంటి రీమేక్ జరుగుతుందనే చర్చను అభిమానులు తెరపైకి తెస్తున్నారు. విజయ్, పవన్ మధ్య సామ్యాలు ఉన్నన్ని వైరుధ్యాలు కూడా ఉన్నాయి. పైగా, తెలుగు, తమిళ రాజకీయాలకు నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా ఉంటుందని గమనించాలి. ఏపీలో జనసేన అధికార భాగస్వామ్య పక్షమైనప్పటికీ, వాస్తవానికి ఆ పార్టీ ఇప్పటికీ క్షేత్రస్థాయిలో బలపడలేదు. ఎన్నికల ఫలితాల్లో నూరు శాతం సక్సెస్ రేట్ సాధించినప్పటికీ, పకడ్బందీ పార్టీ వ్యవస్థ ఏర్పడలేదు. రాజకీయ సిద్ధాంత విధానాల్లోనూ స్పష్టత లేదు. విజయ్ టీవీకేకూ ఇదే వర్తిస్తుంది.

ఎంజీఆర్ పార్టీ పెట్టడానికీ, ఇతర నటులు పార్టీ పెట్టడానికీ తేడా ఉంది. ఎంజీఆర్ డీఎంకేను విడిచిపెట్టినప్పుడు, ఆయన అప్పటికే పార్టీలో నంబర్ త్రీగా ఉన్నారు. పదేళ్ల శాసనసభ అనుభవం గడించి ఉన్నారు. డీఎంకే కోశాధికారిగా పనిచేశారు. తమిళనాడులో కొత్త పార్టీలు పెట్టడానికి ఎవరో ఒకరి సపోర్ట్ ఉంటుందనే వాదన ఉంది. ఎంజీఆర్ వెనుక ఇందిరాగాంధీ ఉన్నారు. కొంతమేరకు విజయం సాధించగలిగిన నటుడు విజయకాంత్ వెనక పన్రుటి ఎస్. రామచంద్రన్ వంటి అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు ఉన్నారు. మరి, విజయ్ వెనుక కూడా ఎవరైనా ఉండొచ్చు అనే అనుమానా లున్నాయి.

''2026 అసెంబ్లీ ఎన్నికల్లో మాకే మెజారిటీ వస్తుందని ఆశిస్తున్నాం. భావసారూప్య పార్టీలతో పొత్తులకు, కూటమి ఏర్పాట్లకూ సిద్ధమే. మాతో పొత్తు పెట్టుకున్న వారినే అధికారంలో భాగస్వాములను చేస్తాం'' అని విజయ్ చెప్పారు. కానీ, సోషల్ మీడియాను దాటి క్షేత్రస్థాయి పరిస్థితులను గమనిస్తే మెజారిటీ సులభంగా కనిపించదు. మరోవైపు, అన్నాడీఎంకే ముందు పరోక్షంగా పొత్తు సంకేతాలు ఉంచినట్లయ్యింది. ఒకవేళ ఆయన అన్నాడీఎంకేతో కలిసి నడిస్తే కూటమిగా విజయం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. 2021లో అధికార డీఎంకే 37.7 శాతం ఓట్లు సాధించగా, అన్నాడీఎంకే 33.29 శాతం ఓట్లు సాధించింది. విజయ్ పార్టీ వచ్చే రెండేళ్ల క్షేత్రస్థాయిలో ఉంటే 7 శాతం వరకు ఓట్లు సాధించవచ్చు. అంటే, విజయ్ అన్నా డీఎంకేతో కలిస్తే, డీఎంకేకు నష్టం కలుగుతుంది. ఒకవేళ ఒంటరిగా పోటీ చేస్తే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలి, డీఎంకేకు లబ్ధి చేకూరుతుంది. అందుకే ఉభయ ద్రవిడ పార్టీలు విజయ్ అడుగులనూ, ఆయనకు లభించే ప్రజాదరణనూ జాగ్రత్తగా గమనిస్తున్నాయి.

వ్యాసకర్త 'పీపుల్స్ పల్స్' రీసెర్చ్ సంస్థ డైరెక్టర్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

చస్తూనే ఉండాలా?

నిరుపేదరికం అనేది స్లో మోషన్‌లో జరిగే ప్రాణాంతకమైన ప్రమాదం లాంటిది. అది ఏళ్లకేళ్లు ఉండొచ్చు, తరచుగా జీవితాంతం కూడా!

– జావేద్ అఖ్తర్, కవి

నాటు వాస్తవాలు

ఇవ్వాళ మీకు రెండు కఠిన వాస్తవాలు: ఒక్క నాటో సభ్యదేశం కూడా ఇంత వరకూ ఎన్నడూ రష్యా మీద సైనిక దాడికి పాల్పడలేదు. ఏ ఒక్క నాటో సభ్యదేశం మీద కూడా రష్యా ఇంతవరకూ సైనిక దాడికి పాల్పడలేదు.

– వెలీనా త్చకరోవా, విశ్లేషకురాలు

మరింత శక్తి?

ఆర్మీ చీఫ్ పదవీకాలాన్ని పెద్ద చర్చ లేకుండానే మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పెంచుతూ పాకిస్తాన్ పార్లమెంట్ బిల్లును పాస్ చేసింది. పాకిస్తాన్‌లో అత్యంత శక్తిమంతమైన పదవి మరింత శక్తిమంతం అయింది. శాసనసభ అనేది రబ్బర్ స్టాంపులా మారిపోయినప్పుడు ప్రజాస్వామ్యం అనేది ఎప్పటికీ విజేత కాలేదు.

– మైకేల్ కుగెల్‌మాన్, విధాన నిపుణుడు

మనకెందుకు?

ఖలిస్తాన్ అనేది ఎవరో ఒకరి రసవత్తరమైన కట్టుకథ. మనం ఆ కథనానికి ఎందుకు అంత ప్రాధాన్యం ఇస్తూ దానికి దేశపు హోదా ఇస్తున్నాం? ఈ ముఠాకోరులందరూ కెనడా పౌరులు. అంటే వాళ్లు కెనడా తీవ్రవాదులు, కెనడా తీవ్రవాద సానుభూతిపరులు.

– మోహన్ సిన్హా, జర్నలిస్ట్

మహా-గందరగోళం

కంట్లో పడ్డ కథనం: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కొల్హాపూర్ నార్త్ స్థానంలోని అధికారిక కాంగ్రెస్ అభ్యర్థి చివరి క్షణంలో ఎన్నికల నుంచి విరమించుకోవడంతో మహా వికాస్ అఘాడీకి అభ్యర్థే లేనట్టయింది. ఇప్పుడు కూటమి తాము టికెట్ నిరాకరించిన 'రెబెల్'కు మద్దతివ్వాల్సి ఉంటుంది.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఎవరు గెలుస్తారో!

వలసలు, ద్రవ్యోల్బణం, ప్రచార కథనాల నియంత్రణతో డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలవొచ్చు. లేదా, సంతానోత్పత్తి హక్కులకు సంబంధించిన ఒక నిశ్శబ్ద మహిళా ఓటు ఆయన పట్ల చాలా బలమైన వ్యతిరేకతనూ చూపొచ్చు. ఇది ఎలా పరిణమిస్తుందోగానీ చాలా ఆసక్తికరంగా ఉంది.

– వీర్ దాస్, స్టాండప్ కమెడియన్

చదవాల్సిన తత్వం

మనం ఒక రాజకీయ తత్వశాస్త్ర స్టడీ సర్కిల్‌ను ప్రారంభించాల్సి ఉంది. వెనక్కి వెళ్లి అరిస్టాటిల్, ఇమాన్యుయల్ కాంట్, థామస్ హాబ్స్‌ను మళ్లీ చదవాలి. వాళ్లు దాదాపుగా బ్లూప్రింట్‌ను వేశారు. మనం చేయాల్సిందల్లా దాన్ని అక్కడక్కడా కొంత సవరించుకోవడం! పోస్ట్-మాడర్నిటీ, పోస్ట్-ట్రూత్ ప్రతిదాన్నీ నాశనం చేశాయి.

– సంజుక్తా బసు, పరిశోధకురాలు

ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను editpage@sakshi.com మెయిల్‌కు పంపాలి. వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

ప్రభుత్వం రక్షణ ఇవ్వదా?

తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా హిందూ వ్యతిరేక పాలన కొనసాగుతోంది. పోలీసుల తీరు రజాకార్లను గుర్తు చేస్తోంది. ముఖ్యంగా హిందూ దేవీ దేవతలకు రక్షణ కరువైపోయింది. ఒకటి కాదు రెండు కాదు... వరుసగా రాష్ట్రంలో దాడులు జరుగుతూనే ఉన్నాయి. కానీ చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం మీన మేశాలు లెక్కిస్తోంది. హిందూ వ్యతిరేక శక్తులు రాష్ట్రంలో వరుసగా దేవాలయాలపై దాడులు చేస్తూ... విగ్రహాలను ధ్వంసం చేస్తున్నాయి. కొందరు పండు గలను లక్ష్యంగా చేసుకొని హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరుస్తున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరం. రాష్ట్ర ముఖ్యమంత్రి దగ్గరే హోంశాఖ కూడా ఉన్నప్పటికీ వరుస దాడుల ఘటనపై స్పందించకపోవడం విడ్డూరం. ఈ ఘటనల ఆధారంగా హిందుత్వాన్ని ప్రభుత్వం ఎంత మేర గౌరవిస్తుందో తెలిసిపోతోంది. పైగా దేవాలయాలపై, విగ్రహాలపై దాడులు చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాల్సింది పోయి... వారు పిచ్చివారిగా సర్టిఫికెట్ జారీ చేయడంతో హిందుత్వంపై రెట్టింపు స్థాయిలో దాడులకు ప్రేరేపిస్తున్నట్లు అనుమానం వ్యక్తం అవుతోంది. రాష్ట్రంలోని శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్న అసాంఘిక శక్తుల విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. కానీ ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తూ ఇటువంటి వారికి మద్దతు ఇచ్చే విధంగా వ్యవహరించడం అప్రజాస్వామికం.

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో హిందువుల మనో భావాలను దెబ్బతీస్తున్న సంఘటనలు ఎన్ని జరుగుతున్నా దేవాదాయ శాఖ మంత్రి కనీసం స్పందించకపోవడం శోచనీయం. భాగ్యనగరంలో పోలీసులు మరీ ఘోరంగా వ్యవహరిస్తున్నారు. వారు హిందువులపైనే రకరకాల కేసులు పెట్టడం గమనార్హం. చట్టాన్ని ఉల్లంఘించి సికింద్రాబాద్‌లో లాఠీ చార్జీ చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలి. దేవాలయాలపై వరుస దాడులు నేపథ్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలి. దోషులను గుర్తించి, వెంటనే కఠినంగా శిక్షించాలి.

– పగుడాకుల బాలస్వామి ၊ ప్రచార ప్రముఖ్, విశ్వహిందూ పరిషత్

భారతీయ అమెరికన్ ఓటర్లు ఎటువైపు?

అభిప్రాయం



ఉల్లి బాలరంగయ్య

నవంబర్ 5వ తేదీన జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠతో ప్రపంచ రాజకీయ విశ్లేషకులు తర్జన భర్జనలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో భారతీయ మూలాలు ఉన్న కమలా హ్యారిస్ డెమొక్రటిక్ పార్టీ తరఫున, మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ చేశారు. భారతీయ అమెరికన్ ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపారనే విషయం పైననే జయాపజయాలు ఉంటాయని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు. వాస్తవంగా ఎన్నికల సర్వేలన్నీ కమలా హ్యారిస్ ముందంజలో ఉన్నట్లు అక్టోబర్ చివరి వరకు తెలియ జేశాయి. విశ్లేషణాత్మకంగా చూస్తే– ఓటు హక్కును వినియోగించుకోవడంలో రిపబ్లికన్ ఓటర్లు ముందు ఉంటారని, డెమొక్రాటిక్ పార్టీ ఓటర్లు వెనుకంజలో ఉంటారని ఒక అపవాదు ఉంది. ఈ అపవాదు నిజమైతే, ఈ ఎన్నికల్లో ట్రంప్ గెలుపు సులభమే.

అరబ్ అమెరికన్ ఓటర్లు సహజంగా డెమొక్రటిక్ పార్టీ వైపు ఉంటారు. ప్రస్తుతం డెమొక్రటిక్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, పాలస్తీనాలో జరుగుతున్న ముస్లింల నరమేధాన్ని డెమొక్రాట్లు ఆపలేకపోయారనీ, పైగా దీనికి కారణమైన ఇజ్రాయెల్‌ను బహిరంగంగా బైడెన్ ప్రభుత్వం సమర్థించిందనీ, ఆర్థిక సైనిక సహకారం అందించిందనీ, అరబ్ అమెరికన్ ఓటర్లు ఆక్రోశాన్ని వ్యక్తం చేస్తున్నారు. తాము డెమొక్రాట్లను నమ్ముకున్నందుకు నట్టేట మునిగి పోయామని అరబ్ అమెరికన్ హక్కుల లీగ్ ఛైర్మన్ నహబ్ అయద్ పత్రికల ముందు వాపోవడం ఇక్కడ గమనార్హం. డెమొక్రటిక్ పార్టీ తరఫున ఎన్నికైన కొందరు ముస్లిం మేయర్లు ట్రంప్‌కు బహిరంగంగా మద్దతు ఇవ్వడం కూడా ఇక్కడ గమనార్హం. పైగా కమలా హ్యారిస్ భారతీయ (హిందూ) మూలాలు ఉన్న వ్యక్తి కాబట్టి ఆమెకు ముస్లింలు ఓట్లు వేయరాదని కొన్ని ముస్లిం మతోన్మాద సంస్థలు పిలుపునివ్వడం డెమొక్రాట్లకు కొంత నష్టమే. వాస్తవంగా కమలా హ్యారిస్‌కు, ఆమె తల్లి శ్యామలా గోపాలన్‌కు



భారతీయ ఆధ్యాత్మిక విషయాలపై, భారతీయ సంస్కృతిపై, భారతీయ మేథో సంపత్తిపై సదభిప్రాయం లేదంటారు. ఈ విషయం భారతీయ అమెరికన్ ఓటర్లకు బాగా తెలుసు.

ఇక రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిపిన అమానుష దాడులను బహిరంగంగా ఖండించడం, భారతీయులు తనకు అత్యంత ప్రియ మిత్రులని గతంలో అనేకమార్లు ఆయన ప్రకటించడం, అమెరికాలోని హిందూ ఓటర్ల మనోభావాలను ప్రభావితం చేస్తుందని చెప్పవచ్చు.

అక్రమ వలసలను కట్టడి చేసి, అమెరికా ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడానికి కమలా హ్యారిస్ కంటే ట్రంప్ ముందు ఉంటాడని మెజారిటీ అమెరికన్ల అభిప్రాయం. ఇదే సందర్భంలో హెచ్ వన్ వీసాల విడుదలలో నియమాలు కఠినతరం చేస్తే, కొంత మంది భారతీయులు ఇబ్బంది పడతారనీ, ఈ విషయంలో కమలా హ్యారిస్ ఆలోచన ధోరణి తమకు ప్రయోజనకరంగా ఉంటుందని కొంతమంది భారతీయ అమెరికన్ ఓటర్లు ఆలోచిస్తున్నారు. ఇలాంటి ఓటర్లను గోడమీద పిల్లులు అని అంటారు. చివరి నిమిషంలో వీరి ఆలోచన మారితే జయాపజయాలు తారుమారయ్యే పరిస్థితి కూడా ఉంది.

ఇక ఉపాధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న జేడీ వాన్స్ భార్య ఉష తెలుగింటి ఆడపడుచు కావడం, అమెరికాలోని ముఖ్యమైన అధికారులతో ఆమె సత్సంబంధాలు కలిగి ఉండడం, భారతీయ అమెరికన్ ఓటర్లతో ఆమె అనేక సమావేశాలు నిర్వహించడం, ట్రంప్ విజయానికి కొంత కలిసి వచ్చే విషయమే. ఇక ఆఫ్రికన్ యూరోపియన్ ఓటర్లు ఇరుపార్టీలకూ సమంగా ఉన్నట్లు రిపోర్టులు తెలియజేస్తున్నాయి.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

ప్రదక్షిణ ఫలం

భూమిపై ఈశ్వరుడు అరుణాచల రూపంలో ఉన్నాడని భక్తుల నమ్మకం. ఆయన చుట్టూ సురలూ, మునులూ ఉంటారు కాబట్టి... అరుణాచల ప్రదక్షిణం చేయడంలో అడుగు తీసి అడుగు వేసే సరికి తొలి జన్మలలో చేసిన పాపాలన్నీ పటాపంచ లవుతాయని ఒక నమ్మకం ఉంది. వేయి అశ్వమేధ యాగాలు చేసిన ఫలం, ఇలపై గల తీర్థాలన్నీ సేవించిన ఫలం అరుణాచల ప్రదక్షిణం వల్ల వస్తుందనీ, ఇది ముమ్మాటికీ సత్యమని గౌతమ మహర్షి మాట.



జ్యోతిర్మయం

అరుణాచల ప్రదక్షిణలో ఒక పాదముతో భూలోకమునూ, రెండవ పాదముతో అంతరిక్షమునూ, మూడవ పాదముతో స్వర్గలోక మునూ వశపర్చుకునే శక్తి వస్తుందంటారు. అలాగే ఒక పాదముతో మానసికమైన పాపమునూ, రెండవ పాదముతో మాటచే వచ్చిన పాపమునూ, మూడవ అడుగుతో శారీరకమైన పాపమునూ మనిషి పోగొట్టుకుంటాడని ప్రతీతి. అగ్నిస్తంభమయమైన ఈశ్వర రూపమే అరుణాద్రి అని భక్తుల విశ్వాసం. దానియందున్న గుహ ధ్యానానికి యోగ్యమైనది.

భక్తుడు స్నానం చేసి, విశుద్ధ వస్త్రధారియై, భస్మ రుద్రాక్ష మాలాధరుడై, శివస్మరణ చేస్తూ మెల్లగా ప్రదక్షిణం చెయ్యాలి. శివనామ సంకీర్తనం చేస్తూ, ఆనంద నృత్యం చేస్తూ వెళ్ళవచ్చు. అలాగే ఎవరైనా చెప్తూ ఉంటే ఈశ్వర మహిమను వింటూ సంతోషిస్తూ మెల్ల మెల్లగా అడుగులు వేస్తూ ప్రదక్షిణం చేయాలి. అడిగిన వారికి లేదనక యథాశక్తిగా దానధర్మాలు చేస్తూ వెళ్ళాలి. కృతయుగ మందు అగ్నిమయమైన లింగమునూ, త్రేతా యుగ మందు మణి పర్వతమునూ, ద్వాపరమందు మేరురూప మూర్తినీ సేవించిన వారికి లభించినట్లే... కలియుగ మందు మరకతాచలం లేదా స్ఫటిక లింగం లేదా అరుణాచల రూప లింగమును సేవించే వారికి సర్వ పాపముల నుంచి విముక్తి కలిగి 'శివపథం' లభిస్తుందని భక్తుల విశ్వాసం.

అరుణాచల ప్రదక్షిణం నిశ్చలబుద్ధితో ఈశ్వరుని స్మరిస్తూ చేసే వారి పాదధూళిచే భూమి పవిత్ర మౌతుందంటారు. 'ప్రదక్షిణ' పదం లోని 'ప్ర' అంటే పాపమును ఛేదిస్తుందనీ 'ద' అంటే కోరిన కోరికను నెరవేర్చుతుందనీ, 'క్షి' అంటే కర్మ క్షీణిస్తుందనీ, 'ణ' అంటే ముక్తినిస్తుందనీ అర్థాలు ఉన్నాయి.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

ఎత్తుకెళ్లిన ఆయుధాలివే..

ఫొటో విడుదల చేసిన మావోయిస్టులు



మావోయిస్టులు విడుదల చేసిన ఫొటో

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జేగురుగొండలోని వారపు సంతలో విధులు నిర్వర్తిస్తున్న జవాన్లపై దాడి జరిపి ఎత్తుకెళ్లిన ఆయుధాల ఫొటో, వివరాలతో సౌత్ సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి సమత పేరిట మంగళవారం లేఖ విడుదల చేశారు. జవాన్ల నుండి ఎత్తుకెళ్లిన ఏకే – 47, ఎస్ఎల్ఆర్ ఆయుధాలతో పాటు క్యాట్రిడ్జ్‌లు ఈ ఫొటోలో ఉన్నాయి. కాగా, పీఎల్‌జీఏ దళాలు ఈ ఘటనలో పాల్గొని విజయవంతం చేశాయని ఆమె లేఖలో వెల్లడించారు.

మహిళపై సామూహిక లైంగికదాడి

మధురానగర్ పరిధిలో దారుణం

వెంగళరావునగర్: బట్టలు ఉతికే పనిఉందని మహిళను నమ్మించి.. తమ గదికి తీసుకెళ్లి ముగ్గురు వ్యక్తులు అత్యాచారం చేశారు. ఈ ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొండాపూర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ హైటెక్‌సిటీలోని ప్రైవేట్ సంస్థలో హౌస్ కీపింగ్‌గా విధులు నిర్వహిస్తోంది. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని తన ఇంటికి వెళ్లడానికి హైటెక్ సిటీ బస్టాప్ సమీపంలో ఎదురుచూస్తోంది. ఇదే సమయంలో ముగ్గురు వ్యక్తులు ఆమె వద్దకు వచ్చి తమ దుస్తులు ఉతకడానికి రావాలని ఆమెను కోరారు. సరేనన్న ఆమె వారి వెంట ఆటోలో బయలుదేరింది. ముగ్గురు వ్యక్తులు ఆమెను తాము నివసించే ఓంనగర్ ఏరియాలో ఉన్న ఇంటికి తీసుకెళ్లారు. ఇంట్లోకి వెళ్లాక తలుపులు మూసి ఆమె నోట్లో గుడ్డలు కుక్కి కట్టేశారు. ఆమె తప్పించుకోవడానికి ప్రయత్నించగా విపరీతంగా ఆమెను కొట్టారు. అనంతరం ముగ్గురు వ్యక్తులు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఎలాగోలా కట్లు విప్పేసుకున్న ఆమె కేకలు వేయడంతో పక్కింటి మహిళ తలుపు కొట్టింది. దీంతో తలుపులు తీసి జరిగిన విషయాన్ని ఆ మహిళకు తెలియజేసింది. అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కాగా యూపీకి చెందిన రఫీక్, చోటూ, చందు అనే వ్యక్తులు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ విలేకరులకు తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంజేపీ విద్యార్థి అనుమానాస్పద మృతి

జాతీయ రహదారిపై కుటుంబ సభ్యుల ఆందోళన



అయాన్ (ఫైల్)

నిర్మల్ రూరల్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే (ఎంజేపీ) బాలుర గురుకుల విద్యార్థి అయాన్ హుస్సేన్ (14) మంగళవారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. 9వ తరగతి చదువుతున్న హుస్సేన్ ఉదయం పాఠశాలలో విద్యార్థులతో కలిసి బేస్‌బాల్ ఆడుతూ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. నోటి నుంచి నురగలు, ముక్కు నుంచి రక్తం కారడంతో పాఠశాల సిబ్బంది నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు హుస్సేన్ ఫిట్స్‌తో చనిపోయినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం న్యూలోలం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ నాజర్ కుమారుడు హుస్సేన్. కొడుకు మృతి వార్త తెలియగానే కుటుంబ సభ్యులు హుటాహుటిన పాఠశాలకు చేరుకున్నారు. బాధ్యులను సస్పెండ్ చేసి కుటుంబానికి న్యాయం చేయాలని జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ఆర్డీవో రత్నకళ్యాణి, డీఈవో రవీందర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సమాచారం ఇవ్వడంతో బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల పరిహారం , కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థి మృతికి బాధ్యులుగా ప్రిన్సిపాల్ సంతోష్, పీఈటీ పెంటన్న, మరో ఇద్దరు సిబ్బందిని విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు.

కృష్ణాతీరంలో జెన్‌కో టౌన్‌షిప్

- యాదాద్రి పవర్ ప్లాంటుకు అనుబంధంగా నిర్మాణం
- కృష్ణాలో తుంగపాడు వాగు కలిసేచోట కొత్త పట్టణం
- రూ.928.52 కోట్ల అంచనాలతో టెండర్ ప్రకటన
- 3,52,771.02 చ.మీ.ల విస్తీర్ణంలో టౌన్‌షిప్ ఏర్పాటు
- ప్రాజెక్టు పూర్తికి 30 నెలల గడువు
- వచ్చే నెల 7వ తేదీన ప్రైస్‌బిడ్లు తెరిచి టెండర్ ఖరారు



సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లాలో కృష్ణానది వెంట కొత్త పట్టణం నిర్మాణం కానున్నది. దామరచర్ల మండలం వీర్లపాలెం లోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం సమీపంలో రూ.928.52 కోట్ల అంచనాతో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణానికి తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) టెండర్లను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు బిడ్లను స్వీకరిస్తారు. టెక్నికల్ బిడ్లను వచ్చే నెల 3న, ప్రైస్ బిడ్లను 7న తెరిచి టెండర్లను ఖరారు చేయనున్నారు.

సంగమ క్షేత్రంలో కొత్త పట్టణం

కృష్ణా నదిలో తుంగపాడు వాగు కలిసే చోట ఈ టౌన్‌షిప్‌ను నిర్మించాలని నిర్ణయించారు. డిజైన్లు, డ్రాయింగ్స్ ప్రకారం మొత్తం 3,52,771.02 చ.మీ.ల విస్తీర్ణంలో టౌన్‌షిప్ నిర్మాణం జరుగుతుంది. 2,21,903.67 చ.మీ.ల విస్తీర్ణంలో నివా స గృహసముదాయాలతో లేఅవుట్‌ను తయారు చేశారు. 75,185 చ.మీ.ల విస్తీర్ణంలో పార్కులు, మొక్కల పెంపకం, పచ్చిక బయళ్లు, మరో 55,682.35 చ.మీ.ల విస్తీర్ణంలో రోడ్లు, ఇతర సదుపాయాలు ఏర్పాటుచేస్తారు. 2025 మార్చి నాటికి 4 వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తి కావాల్సి ఉన్నది. వేల సంఖ్యలో ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగులు, ఇతర కార్మికులు ఇక్కడ రాత్రింబవళ్లు పనిచేయనున్నారు. వీరంతా తప్పనిసరిగా స్థానికంగా నివాసం ఉండాల్సి రావడంతో టౌన్‌షిప్‌ను జెన్‌కో నిర్మిస్తోంది. ఉన్నతాధికారుల కోసం 'ఏ'–టైప్‌లో రెండు ఇండిపెండెంట్ క్వార్టర్లను, 'బీ'–టైప్‌లో 6 ఇండిపెండెంట్ క్వార్టర్లను నిర్మిస్తున్నారు. అధికారులకు 'డీ', 'ఈ'టైప్ క్వా ర్టర్లను, కార్మికులకు 'ఎఫ్'టైప్ క్వార్టర్లను కేటాయిస్తారు. ఈ భవనాలు 11 అంతస్తుల ఎత్తు ఉంటాయి. డీ, ఈ–టైప్ క్వార్టర్ల కోసం రెండు భవనాలు ఉంటాయి. వీటిల్లో 360 చొప్పున ఫ్లాట్లు ఉంటాయి. ఎఫ్–టైప్ క్వార్టర్లలో 1,350 ఫ్లాట్లు కలిపి మొత్తం 2,970 ఫ్లాట్లను నిర్మించనున్నారు.

సకల సదుపాయాలు

టౌన్‌షిప్‌లో ఉద్యోగులకు సకల సదుపాయాలు కల్పిస్తారు. అగ్నిమాపక కేంద్రం, ఆస్పత్రి, పాఠశాల భవనాలు, క్లబ్ హౌస్, కమర్షియల్ కాంప్లెక్స్, ఇండోర్ స్టేడియం, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, సెక్యూరిటీ రూమ్స్, మెయింటెనెన్స్ ఆఫీస్, రోడ్లు, డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ పోర్టబుల్ వాటర్ ట్యాంక్స్, ఓవర్ హెడ్ స్టోరేజీ రిజర్వాయర్స్, సెప్టిక్ ట్యాంక్స్, పార్కింగ్ షెడ్స్, పచ్చదనం, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ, తుంగపాడు వాగుపై బ్రిడ్జీ, కాంపౌండ్ వాల్, టౌన్‌షిప్‌కు అప్రోచ్ రోడ్డును ఈ ప్రాజెక్టులో భాగంగా జెన్‌కో నిర్మిస్తోంది. టౌన్‌షిప్ నుంచి విడుదలయ్యే మురుగు నీటిని శుద్ధి చేయడానికి రోజుకు 1,000 కిలో లీటర్ల శుద్ధి సామర్థ్యంతో సీవరేజీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ను సైతం నిర్మిస్తోంది. కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించిన తర్వాత 30 నెలల్లోగా ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంటుందని టెండర్ నోటిఫికేషన్‌లో జెన్‌కో తెలిపింది.

పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- ఇప్పటికే 11,255 టన్నుల పత్తి కొనుగోలు చేశామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఇప్పటివరకు 5,251 మంది రైతుల నుంచి రూ.82.44 కోట్లతో 11,255 టన్నుల పత్తి కొనుగోలు చేశామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పత్తి కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలని అధికారులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో పత్తి కొనుగోళ్లపై అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడాది ఇదే సమయానికి కేవలం రూ. 3.91 కోట్లతో 560.37 టన్నుల పత్తిని 233 మంది రైతులనుంచి మాత్రమే కొనుగోలు చేశారని చెప్పారు. పత్తిని ఆరబెట్టుకొని, సీసీఐ నిబంధనలను అనుసరించి తేమ శాతం 8 నుంచి 12 మధ్యలో ఉండే విధంగా చూసుకొని, అధిక మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు గన్ని బస్తాలలో పత్తిని తెచ్చినా కూడా సీసీఐ నిబంధనల ప్రకారం పత్తిని కొనుగోలు చేయరని, సంచులలో కొనుగోలు వలన పత్తి పాడయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లా కలెక్టర్లు, మార్కెటింగ్ అధికారులు విధిగా పర్యవేక్షించాలని, వాట్సాప్ (88972 81111) ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును మార్కెటింగ్ శాఖ సంచాలకులు పరిశీలించి, తిరిగి ఫోన్ ద్వారా రైతుల ఫిర్యాదులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని మంత్రి రైతులకు సూచించారు.

మిలిటెంట్ పోరుతోనే సమస్యల పరిష్కారం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విమర్శించారు. విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో నిర్వహించిన విద్యార్థుల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. బీసీ ఉద్యమాన్ని మరింత పటిష్టవంతంగా, నిర్మాణాత్మకంగా ఉధృతం చేయడానికి బీసీలు సంఘటితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఆర్డీవోకు ఈడీ సమన్లు

ఈనెల 7న విచారణకు హాజరుకావాలని నోటీసు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూదాన్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్స్ కేసు దర్యాప్తులో ఈడీ అధికారులు వేగం పెంచారు. కేసు దర్యాప్తులో భాగంగా మాజీ ఆర్డీవో వెంకటాచారిని ఈ నెల 7న విచారణకు హాజరుకావాలని మంగళవారం సమన్లు జారీ చేశారు. ఈ భూ కుంభకోణానికి సంబంధించి ఇప్పటికే ఐఏఎస్ అధికారి, రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను ఈడీ అధికారులు గత నెలలో మూడు రోజులపాటు ప్రశ్నించడం తెలిసిందే. అంతకుముందు మహేశ్వరం తహసీల్దార్ జ్యోతి వాంగ్మూలాన్ని ఈడీ అధికారులు నమోదు చేశారు. ఈ ఇద్దరు అధికారుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగానే.. తాజాగా మాజీ ఆర్డీవో వెంకటాచారికి ఈడీ సమన్లు జారీ చేసినట్టు తెలిసింది.

ఊపిరి పీల్చగలిగేది రెండు నెలలే!

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి లభించేది ఏడాదిలో కేవలం రెండు నెలలే. మిగిలిన పది నెలలు వాయు కాలుష్యంతో వెంటాడుతోంది. నివాస ప్రాంతాలు, పారిశ్రామిక వాడలు అనే తేడా లేకుండా అన్ని చోట్ల రికార్డు స్థాయిలో గాలిలో నాణ్యత ప్రమాణాలు పడిపోతున్నాయి. పెరిగిన వాహన రద్దీ, నిర్మాణ వ్యర్థాలు, తగ్గిన వృక్ష సంపద, పారిశ్రామికీకరణ తదితర అంశాలు వాయు కాలుష్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఈ ఏడాది జూన్, జులై నెలల్లో పూర్తి స్థాయిలో స్వచ్ఛమైన గాలి అందగా, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొద్ది రోజులు మాత్రమే గాలిలో నాణ్యత ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయి.

రాశులకొద్దీ ధాన్యం.. కొనేవారేరీ?



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

▶ మొదటి పేజీ తరువాయి

వరకు 4,600 కేంద్రాలను తెరిచినా, అందులో సగం కేంద్రాల్లో కూడా ధాన్యం కొనుగోళ్లు సాగడం లేదు. బ్యాంకు గ్యారంటీలు ఇచ్చిన మిల్లర్లకే కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం ధాన్యం కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో నాలుగు రోజుల క్రితం వరకు మిల్లర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆ బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు నయానో, భయానో మిల్లర్లను ఒప్పించి 15 రోజుల్లో బ్యాంకు గ్యారంటీలు ఇస్తామని రాతపూర్వకంగా 'అండర్ టేకింగ్'తీసుకుంటూ మిల్లులకు ధాన్యం కేటాయిస్తున్నారు. దీంతో చాలా జిల్లాల్లో సోమవారం నుంచి కొనుగోళ్ల ప్రక్రియ కొంత మెరుగైంది. అయినా, అనేక జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు కుప్పలుకుప్పలుగా దర్శనమిస్తున్నాయి.

బ్యాంక్ గ్యారంటీలిస్తేనే...

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో ఎక్కువగా ఉన్న ఈ డిఫాల్ట్ రైస్‌మిల్లర్ల నుంచి అండర్ టేకింగ్ తీసుకుంటూ బ్యాంక్ గార్యంటీలు, సెక్యూరిటీ డిపాజిట్లు ఇస్తామని కాగితాలు రాయించుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకు ఏ ఒక్క మిల్లర్ అవి ఇవ్వలేదని తెలుస్తోంది.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా

- ఈ జిల్లాలో 615 ధాన్యం కొనుగోలు కేంద్రాలుండగా, 404 సన్నరకాలకు 211 దొడ్డు రకాల కొనుగోళ్లకు కేటాయించారు. వీటిల్లో కేవలం 121 కేంద్రాల్లో సన్న రకం, 86 కేంద్రాల్లో దొడ్డు రకం కొనుగోళ్లు సాగుతున్నాయి. మంగళవారం నాటికి 18,320 టన్నుల సన్నరకం, 11,334 టన్నుల దొడ్డురకం ధాన్యం సేకరించారు. బ్యాంకు గ్యారంటీలు ఇస్తామని 190 మంది రైస్‌మిల్లర్లు అండర్ టేకింగ్ ఇచ్చారు.
- కామారెడ్డి జిల్లాలో 423 కేంద్రాలకుగాను 150 కేంద్రాల్లో కొనుగోళ్లు మొదలయ్యాయి. ఇందులో సన్నరకాలకు 63 కేంద్రాలే తెరిచారు. కేవలం 4,250 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం కొన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా

- ఉమ్మడి వరంగల్‌లో ఆయా జిల్లాల వారీగా చూస్తే..వరంగల్‌లో 203 కేంద్రాలకుగాను 24 కేంద్రాలే తెరుచుకోగా, అక్కడ కొనుగోళ్లు జరుగుతున్నాయి. హనుమకొండలో మొత్తంగా 149 కేంద్రాలు, జనగామలో మొత్తంగా 180, ములుగులో మొత్తంగా 178 కేంద్రాలు తెరుచుకున్నాయి. మహబూబాబాద్‌లో 234 కేంద్రాలకుగాను 59, భూపాలపల్లిలో 189గాను 79 కేంద్రాలే మొదలయ్యాయి.
- జనగామ జిల్లాలో 33,336 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి 30 రా రైస్, బాయిల్డ్ రైస్‌మిల్లులకు సరఫరా చేశారు. మరో 19 రైస్‌మిల్లులకు ధాన్యం తరలించేందుకు 10 శాతం గ్యారంటీపై చర్చలు జరుగుతున్నాయి.
- జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ఇంకా ధాన్యం కొనుగోళ్లు మొదలు కాలేదు. హనుమకొండ జిల్లాలో ఇప్పుడిప్పుడే కొనుగోళ్లు మొదలయ్యాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లా

- నల్లగొండ జిల్లాలో బ్యాంకు గ్యారంటీలు ఇస్తామని అగ్రిమెంట్ చేసుకున్న 145 మిల్లులకు సోమవారం ధాన్యం కేటాయింపులు షురూ చేశారు. 345 కేంద్రాలను ప్రారంభించినట్టు అధికారులు చెబుతున్నా, సగం కేంద్రాల్లో కూడా కొనుగోళ్లు సక్రమంగా సాగడం లేదు. మంగళవారం వరకు జిల్లాలో కేవలం 15 వేల మెట్రిక్ టన్నులు కొనుగోళ్లు జరిగాయి. అయితే ఇంతవరకు సన్నాల కొనుగోళ్లు మొదలే కాలేదు.
- సూర్యాపేట జిల్లాలో ఇప్పటివరకు కొనుగోళ్లను ప్రారంభించలేదు. కేవలం కేంద్రాలను మాత్రమే ప్రారంభించి కాంటాలను మరిచారు. గ్యారంటీ ఇచ్చిన 15 మిల్లులకు ధాన్యం కేటాయించారు.
- యాదాద్రి జిల్లాలో అఫిడవిట్‌లు ఇచ్చిన 50 మిల్లులకు ధాన్యం అలాట్ చేశారు.

ఉమ్మడి మెదక్ జిల్లా

- మెదక్ జిల్లాలో 490 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, సన్నధాన్యం కొనుగోలుకు కేవలం 91 కేంద్రాలే కేటాయించారు. ఈ జిల్లాలోని 104 మిల్లుల్లో 60 మిల్లులు డిఫాల్ట్ జాబితాలో ఉండగా, 54 మిల్లులకే ధాన్యం కేటాయించాలని నిర్ణయించారు. వీరిలోనూ 30 మంది మిల్లర్లు మాత్రమే అండర్ టేకింగ్ ఇచ్చారు. దీంతో మంగళవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు.
- సిద్దిపేట జిల్లాలో 417 కొనుగోలు కేంద్రాలకుగాను ఇప్పటివరకు 348 కేంద్రాలను ప్రారంభించారు. బ్యాంక్ గ్యారంటీ ఇస్తామని అండర్ టేకింగ్ ఇచ్చిన 25 మిల్లులకు ధాన్యం కేటాయించారు.
- సంగారెడ్డి జిల్లాలో 183 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినా, ఇప్పటివరకు కనీసం 50 సెంటర్లలో కూడా సేకరణ షురూ కాలేదు.
- ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో ఇంకా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. కోతలు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి.

కాంటా ఎప్పుడేస్తరో తెల్వదు



నా పేరు చందు మల్లయ్య, నాది వరంగల్ జిల్లా రాయపర్తి. 8 ఎకరాల్లో వరి సాగుచేశా. అందులో పండిన వడ్లను రాగన్నగూడెం కొనుగోలు కేంద్రంలో పోశా. ఇప్పటివరకు కొనుగోళ్లు మొదలుకాలేదు. 15 రోజుల నుంచి కాంటా కోసం రైతులం ఎదురుచూస్తున్నం. పరదాలు అద్దెకు తెచ్చి వడ్లు పోశాం. కేంద్రం ఎప్పుడు తెరుస్తారో, కాంటా ఎప్పుడేస్తరో తెల్వదు. వర్షం ఎప్పుడు పడుతుందోనని భయంతో ఆకాశం వైపు చూస్తున్నాం.

– చందు మల్లయ్య

తేమ పేరుతో కొనడం లేదు



నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకొచ్చి పది రోజులవుతోంది. అధికారులు తేమ పేరుతో వడ్లు కొనడం లేదు. పది రోజులుగా కేంద్రం వద్దే పడిగాపులు కాస్తున్నాం. వానొస్తే వడ్లు తడిసి ఇంకా నష్టపోయే ప్రమాదముంది.

– మూఢావత్ శంకర్, డిండి

మిల్లులు కేటాయించాలి



ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెంటనే రైస్ మిల్లులు కేటాయించాలి. కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు పెరిగిపోతున్నాయి. కాంటాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

– లలిత, కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలు, సింగారెడ్డి పాలెం.(సూర్యాపేట జిల్లా)

పంట దిగుబడిలో దేశంలోనే తెలంగాణ టాప్

- ధాన్యం కొనుగోళ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం
- రూ.11,537.40 కోట్ల రుణభారం తగ్గించుకున్నాం
- మంత్రి తుమ్మలతో కలిసి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ వీడియోకాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల

సాక్షి, హైదరాబాద్: పంట దిగుబడిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం రికార్డు సృష్టిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సహచర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. రాష్ట్రంలో ఈసారి 60.80 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారని, 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తుందన్నారు. దీంట్లో 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆస్కారముందని చెప్పారు. ఖరీఫ్ నుంచి సన్నాలకు బోనస్‌గా క్వింటాల్‌కు రూ.500 ప్రకటించిన నేపథ్యంలో రైతులు సన్నాల వైపు మొగ్గుచూపినట్టు తెలిపారు. ఈ మొత్తం ధాన్యం సేకరణకు రూ.30 వేల కోట్లు ఖర్చు అవుతుందని, అందులో ఇప్పటికే రూ.20 వేల కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. 10 నెలల వ్యవధిలోనే పౌరసరఫరాల సంస్థకు ఉన్న రుణంలో రూ.11,537.40 కోట్ల భారాన్ని తగ్గించుకున్నట్టు ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో 7,572 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ బియ్యానికి బిహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో డిమాండ్ ఉందని, ఇతర దేశాలు కూడా తెలంగాణ బియ్యాన్ని దిగుమతి చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఎలాంటి అవాంతరాలు సంభవించినా, అధిగమించేందుకు అధికారులను సన్నద్ధం చేయాలని పౌర సరఫరాలశాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్. చౌహాన్‌ను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. నిబంధనల మేరకే బ్యాంకు గ్యారంటీలను తీసుకోవాలని నిర్ణయించినట్టు తెలిపారు.

ప్రాణం తీసిన ఫుడ్‌పాయిజన్

- నిర్మల్‌లోని గ్రిల్–9 హోటల్‌లో ఘటన..
- మధ్యప్రదేశ్ యువతి మృతి.. మరో 25 మందికి అస్వస్థత

నిర్మల్: మంచిభోజనం ఆరగిద్దామని హోటల్‌కి వచ్చి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు ఆ కస్టమర్స్. ఆహారం విషతుల్యం కావడంతో ఏకంగా ఒకరి ప్రాణంపోగా, 20 మంది వరకు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని గ్రిల్–9 హోటల్‌లో ఈనెల 2, 3 తేదీల్లో భోజనం చేసిన వారంతా ఆస్పత్రుల పాలయ్యారు. ఫుడ్ పాయిజన్ కారణంగా వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు.

యువతి మృతి..

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర క్రాస్‌రోడ్డు వద్ద గల సెయింట్ థామస్ పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్ స్మితా జార్జ్, వైస్ ప్రిన్సిపాల్ దీపక్, ఉపాధ్యాయులు సోఫీ, ఫిజీ, వంటమనిషి ఫూల్‌కాలీబైగా (19) ఈనెల 2న షాపింగ్ కోసం నిర్మల్‌కు వచ్చారు. రాత్రి తిరిగి వెళ్తూ గ్రిల్–9 హోటల్‌లో రాత్రి భోజనం చేశారు. చికెన్–65, తందూరి చికెన్, చికెన్ ఫ్రైడ్‌రైస్ ఆరగించారు. అదేరోజు అర్ధరాత్రి నుంచి ఐదుగురికీ వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. స్థానిక బోథ్ సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి ఫూల్‌కాలీబైగా మంగళవారం మృతిచెందింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఫూల్‌కాలీబైగా ఉపాధి నిమిత్తం సెయింట్ థామస్ స్కూల్‌లో వంటపని చేసేందుకు వచ్చింది. ప్రిన్సిపాల్ స్మితా జార్జ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోథ్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, నిర్మల్ పోలీసులకు పంపించారు.



మృతిచెందిన ఫూల్‌కాలీబైగా

25 మందికిపైగా..

గ్రిల్–9 హోటల్‌లో వండిన ఆహారం విషతుల్యం కావడం వల్లే భోజనం చేసినవారిలో పదుల సంఖ్యలో అస్వస్థతకు గురైనట్లు తేలింది. ఖానాపూర్‌కు చెందిన పదిమంది వరకు యువకులు ఈ హోటల్‌లో ఆరగించి వెళ్లగానే వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన మరో ఆరుగురు కుటుంబ సభ్యులు ఇక్కడి మండీ విభాగంలో చికెన్ ఆరగించడంతో వారూ బాధితులయ్యారు. బోథ్ స్కూల్ స్టాఫ్‌తో కలిసి దాదాపు 25 మంది అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. ఈ ఘటన నేపథ్యంలో గ్రిల్–9 హోటల్ పరిసరాలను 'సాక్షి'పరిశీలించగా, ఏమాత్రం శుభ్రత, నాణ్యత పాటించడం లేదన్న విషయం స్పష్టమైంది. హోటల్ వ్యర్థాలు, మురికినీరు అంతా వెనుకభాగంలో నిలిచి ఉంది. దీనిపై ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ ప్రత్యూషను ఫోన్‌లో వివరణ కోరగా, తాము సదరు హోటల్‌కు వెళ్లామని, తాళం వేసి యాజమాన్యం, వర్కర్లు పరారీలో ఉన్నారని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నిర్మల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుటుంబసభ్యులు

వికీపీడియాకు నోటీసులు

అసంబద్ధ సమాచారం అందిస్తోంది: కేంద్రం

న్యూఢిల్లీ: వికీపీడియా అందించే సమాచారంలో పక్షపాత ధోరణి కనిపిస్తోందంటూ పలు ఫిర్యాదులు రావడంతో కేంద్ర ప్రభుత్వం కలగజేసుకుంది. ఈ విషయంలో వివరణ కోరుతూ వికీపీడియాకు కేంద్రం నోటీసులు జారీచేసింది. మధ్యవర్తిగా కాకుండా ప్రచురణకర్తగా వికీపీడియాను ఎందుకు పరిగణించకూడదో తెలపాలని సూచించింది. వికీపీడియాలో అందుబాటులో ఉన్న పేజీలను ఎడిట్ చేసే అవకాశం కేవలం కొంత మంది 'ఎడిటోరియల్' సిబ్బందికి మాత్రమే ఉందన్న అభిప్రాయంపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ నోటీసులు జారీచేసినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియాగా తాము సమస్త సమాచారాన్ని ఉచితంగా అందిస్తామని వికీపీడియా భారత్‌లో సేవలు మొదలుపెట్టిన తొలినాళ్లలోనే ప్రకటించుకోవడం తెల్సిందే. స్వచ్ఛందంగా ముందుకొచ్చే కొందరు రచయితలు, కంటెంట్ క్రియేటర్లు విస్తృతస్థాయి అంశాలపై విశేషమైన సమాచారాన్ని సృష్టించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారని వికీపీడియా వెల్లడించడం విదితమే.

25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఈ నెల 25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం అవుతాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు తెలిపారు. మంగళవారం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ' నవంబర్ 25 నుంచి డిసెంబర్ 20 వరకు శీతాకాల సమావేశాల కోసం పార్లమెంట్ ఉభయసభలను సమావేశపరచాలన్న కేంద్రప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్రపతి ముర్ము ఆమోదముద్ర వేశారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ దినోత్సవం అయిన నవంబర్ 26వ తేదీన సంవిధాన్ సదన్(పాత పార్లమెంట్‌భవనం)లోని సెంట్రల్ హాల్‌లో ప్రత్యేక సంబరాలు నిర్వహించనున్నాం' అని మంత్రి రిజిజు వెల్లడించారు.

వాడీవేడిగా చర్చలు

విపక్షాల విమర్శలు, ప్రభుత్వ ప్రతిదాడులతో ఈ శీతాకాల సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశముంది. జమిలీ ఎన్నికలు, వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై ప్రధానంగా చర్చ జరిగే వీలుంది. జమిలీ ఎన్నికల ప్రతిపాదనకు ఇప్పటికే కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు కోసం ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ సంబంధిత నివేదికను సిద్ధం చేసే పనిలో బిజీగా ఉంది. వరసగా రెండు రోజులు కమిటీ సమావేశమై సంబంధిత వర్గాల నుంచి



అభిప్రాయాల సేకరణను కొనసాగింది. నవంబర్ 29వ తేదీన కమిటీ తన నివేదికను పార్లమెంట్‌లో సమర్పించే వీలుంది. ఈ బిల్లుపై అధికార, ప్రతిపక్షాల మధ్య ఇప్పటికే మాటల యుద్ధం కొనసాగుతోంది. జమ్మూకశ్మీర్‌కు పూర్తి స్థాయి రాష్ట్ర హోదా ఇచ్చేందుకు ఉద్దేశించిన బిల్లును ప్రభుత్వం ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టే వీలుందని తెలుస్తోంది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన రెండు రోజుల తర్వాత నవంబర్ 25న ఈ సమావేశాలు జరుగుతుండటం గమనార్హం.

రికార్డు స్థాయిలో దిగుబడులు

ఖరీఫ్ అంచనాలు విడుదల చేసిన వ్యవసాయ శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: 2024–25 సంవత్సరంలో ఖరీఫ్ పంటల దిగుబడి రికార్డు స్థాయిలో ఉంటుందని కేంద్ర వ్యవసాయ శాఖ అంచనావేసింది. మొట్టమొదటిసారిగా, డిజిటల్ క్రాప్ సర్వేతో రూపొందించిన ఈ అంచనాలను ఆ శాఖ మంగళవారం విడుదల చేసింది. దీని ప్రకారం .. ఉత్తరప్రదేశ్‌లో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఈ మేరకు ఉత్తరప్రదేశ్‌లో వరి దిగుబడి ఈసారి 217.43 (ఎల్ఎంటీ)లక్ష మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని అంచనా. ఆ తర్వాతి స్థానాల్లో 146.82 ఎల్ఎంటీలతో పంజాబ్, 120.75 ఎల్ఎంటీతో పశ్చిమబెంగాల్, 93.03 ఎల్ఎంటీలతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఉన్నాయి. తెలంగాణ 81.74 ఎల్ఎంటీల వరి దిగుబడితో ఐదో స్థానంలో ఉంది. ఈ అంచనాల ప్రకారం 2024–25 ఖరీఫ్‌లో ఆహార ధాన్యాల దిగుబడి 1647.05 ఎల్ఎంటీలుగా ఉంది. ఇది గతేడాది ఖరీఫ్ ఆహారధాన్యాల దిగుబడితో పోలిస్తే 89.37 ఎల్ఎంటీలు అధికం. వరి, జొన్న, మొక్కజొన్నల అధిక ఉత్పత్తి కారణంగా ఆహార ధాన్యాల దిగుబడి రికార్డు స్థాయిలో పెరిగింది.

అంతులేని ఉత్కంఠ

భారీగా ఓటేస్తున్న అమెరికన్లు • కిక్కిరిసిన పోలింగ్ బూత్‌లు

హారిస్, ట్రంప్ హోరాహోరీ • తొలి ఫలితంలో చెరి సగం • డిక్స్‌విల్‌లో చెరో 3 ఓట్లు



సిన్సినాటిలోని పోలింగ్ బూత్‌కు భార్య ఉష, పిల్లలతో వచ్చిన రిపబ్లికన్ ఉపాధ్యక్ష అభ్యర్థి వాన్స్



ఫ్లోరిడాలోని పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు బ్యాలెట్ పేపర్‌తో వెళ్తున్న యువతి



ఇండియానా పొలిస్ పోలింగ్ కేంద్రంలో ఓటేస్తున్న ఓటర్లు

వాషింగ్టన్: అమెరికా చరిత్రలోనే అత్యంత హోరాహోరీగా సాగిన ప్రచార ఘట్టానికి తెర పడింది. అధ్యక్ష ఎన్నికల్లో అతి కీలకమైన పోలింగ్ ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్లు తమ తీర్పును బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంల్లో నిక్షిప్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం (భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4.30) నుంచే పోలింగ్ బూత్‌ల ముందు జనం భారీగా బారులు తీరారు. అమెరికాలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో సమయానికి పోలింగ్ మొదలవుతుంది. కనెక్టికట్, వ్యోమింగ్, ఇండియానా, కెంటకీ, మైన్ వంటి రాష్ట్రాల్లో ఉదయం ఆరింటికి; అరిజోనా, అయోవా, లూసియానా, విస్కాన్సిన్ తదితర రాష్ట్రాల్లో 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. డెమొక్రాట్ల అభ్యర్థి కమలా హారిస్, ఆమె రిపబ్లికన్ ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్ నువ్వా నేనా అన్నట్టుగా తలపడుతున్నట్టు ఓటింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. దాంతో ఎవరు గెలుస్తార్నది రాజకీయ పండితుల అంచనాలకు కూడా అందడం లేదు. ఈసారి స్వింగ్ స్టేట్స్‌తో పాటు పలు ఇతర రాష్ట్రాల్లో కూడా గెలుపోటముల మధ్య తేడా అతి స్వల్పంగానే ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అభ్యర్థులిద్దరిలో ఎవరు గెలిచినా రికార్డే కానుండటం విశేషం. హారిస్ నెగ్గితే అమెరికాలో అత్యున్నత పీఠాన్ని అధిష్టించిన తొలి మహిళగా నూతన చరిత్ర సృష్టిస్తారు. నల్లజాతి, ఆసియా, భారత మూలాలున్న తొలి అధ్యక్షురాలు కూడా అవుతారు.



న్యూ హాంప్‌షైర్‌లోని డిక్స్‌విల్ నాచ్ పోలింగ్ కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి దాటాక తొలి ఓటేసిన లెస్ ఒట్టెన్. అతని నుంచి బ్యాలెట్ పేపర్‌ను అందుకుంటున్న అధికారి.

అదే ట్రంప్ గెలిస్తే గత 132 ఏళ్లలో ఒకసారి అధ్యక్షునిగా చేశాక కొన్నేళ్ల విరామం తర్వాత మళ్లీ ఆ పదవి చేపట్టిన తొలి వ్యక్తిగా రికార్డులకెక్కుతారు. ప్రచారం పొడవునా వారి మధ్య తీవ్ర విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు, వాదనలు సాగడం తెలిసిందే. 16 కోట్ల పై చిలుకు ఓటర్లలో సగానికి సగం, అంటే దాదాపు 8 కోట్ల మంది ఈసారి ముందస్తు, పోస్టల్ తదితర పద్ధతుల్లో ఇప్పటికే ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం. మంగళవారం సాయంత్రం ఆరింటికి (భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 11.30కు) పోలింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆ వెంటనే రాష్ట్రాలవారీగా ఎక్కడికక్కడ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టినా తుది ఫలితం తేలడానికి కొద్ది రోజులు పట్టవచ్చు. అయితే విజేత ఎవరన్న దానిపై ఓటింగ్ ముగిసిన కొద్ది గంటల్లోనే స్పష్టత వచ్చే అవకాశం లేకపోలేదు. దాంతో ఇక అందరి కళ్లూ ఫలితాలను తేల్చడంలో కీలకమైన స్వింగ్ రాష్ట్రాలపైనే ఉన్నాయి. మహిళల ఓటు కూడా ఈసారి కీలకంగా మారుతుందని భావిస్తున్నారు.

అమెరికా చరిత్రలోనే కీలకమైన రోజు: ట్రంప్

మంగళవారాన్ని అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన రోజుగా ట్రంప్ అభివర్ణించారు. ''పోలింగ్ రోజు వచ్చేసింది! భారీ సంఖ్యలో వచ్చి ఓటేయండి'' అంటూ లక్షలాది మంది అభిమానులు, మద్దతుదారులకు మంగళవారం ఆయన ఈ మెయిళ్లు పంపారు. అమెరికాను మరోసారి గొప్ప దేశంగా మలచుకుందాం. మీరు ఓటేయకుండానే వెనుదిరగాలని రాడికల్ కమ్యూనిస్టు డెమొక్రాట్లు ఆశిస్తున్నారు. మనమంతా కలిసి వారి ఆశలను వమ్ము చేద్దాం'' అంటూ పిలుపునిచ్చారు.

జీవనవ్యయం తగ్గిస్తా: హారిస్

ప్రెసిడెంట్‌గా తన విజయం ఇప్పటికే ఖాయమైపోయిందని హారిస్ పేర్కొన్నారు. ప్రజల జీవన వ్యయాన్ని తగ్గించడం, వెన్ను విరిగిన వలసల విధానాన్ని సరిచేయడం తన తొలి ప్రాథమ్యాలని ప్రకటించారు. మంగళవారం ఆమె పిట్స్‌బర్గ్‌లో న్యూస్‌రేడియో మార్నింగ్ షోలో పాల్గొన్నారు. ధరాభారానికి ముకుతాడు వేసేందుకు తనవద్ద ఇప్పటికే ప్రణాళిక సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.



ఫ్లోరిడాలో ఓటేసిన ట్రంప్

ట్రంప్ ఫ్లోరిడాలో ఓటేశారు. మంగళవారం ఉదయం భార్య మెలానియాతో కలిసి తన నివాసం సమీపంలోని పామ్ బీచ్‌లోని పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. హారిస్ ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయడం తెలిసిందే. అధ్యక్షుడు జో బైడెన్ కూడా తన స్వస్థలం డెలావేర్‌లో కొద్ది రోజుల ముందే ఓటేశారు.

డిక్స్‌విల్ నాచ్‌లో తొలి ఫలితం

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓ బుల్లి కౌంటీలో 'తొలి ఫలితం' వచ్చేసింది. పోలింగ్ మొదలైన కొద్ది గంటల్లోనే అక్కడ కౌంటింగ్ కూడా పూర్తవమే ఇందుకు కారణం. న్యూహాంప్‌షైర్ రాష్ట్రంలోని డిక్స్‌విల్ నాచ్‌లో కేవలం ఆరుగురు ఓటర్లే ఉన్నారు. అక్కడ 60 ఏళ్లుగా అర్ధరాత్రి ఓటు హక్కు వినియోగించుకునే సంప్రదాయముంది. దాని ప్రకారం మంగళవారం మొదలవుతూనే (సోమవారం అర్ధరాత్రి దాటగానే) పోలింగ్ మొదలైంది. ఆరుగురు ఓటర్లే ఉండటంతో కాసేపటికే పోలింగ్, ఆ వెంటనే కౌంటింగ్ కూడా ముగిశాయి. హోరాహోరీ పోరుకు అద్దం పట్టేలా హారిస్, ట్రంప్‌కు చెరో మూడు ఓట్లు పడటం విశేషం. కెనడా సరిహద్దు సమీపంలో ఉండే డిక్స్‌విల్‌కు అమెరికా ఎన్నికల్లో తొలి ఫలితం వచ్చే ప్రదేశంగా పేరుంది. అమెరికాలో కొన్ని రాష్ట్రాల్లో ఉదయం ఆరింటికి, మరి కొన్నింట్లో 7, 8, 9 గంటలకు పోలింగ్ మొదలవుతుంది.



బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయం వద్ద త్రివర్ణ పతాకాలతో ర్యాలీలో పాల్గొన్న భారత సంతతి ప్రజలు

కెనడాలో హిందువుల ర్యాలీ

దాడులను వ్యతిరేకిస్తూ ఆందోళనలు

టొరంటో: కెనడాలో హిందూ దేవాలయంపై ఖలిస్తానీ మద్దతుదారుల దాడిని నిరసిస్తూ వేలాది మంది సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. నార్త్ అమెరికా హిందువుల కూటమి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన ర్యాలీలో ఇరు దేశాల జాతీయ జెండాలను ప్రదర్శించారు. జై శ్రీరామ్, ఖలిస్తాన్ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. కెనడాలోని హిందువులు ఏళ్లుగా నిరంతర వివక్షకు గురవుతున్నారని వాపోయారు. కెనడా ప్రభుత్వం హిందువులకు రక్షణ కల్పించాలని కోరారు. ''హిందూ కెనడియన్లు కెనడాకు ఎంతో విధేయులు. వారిపై ఈ దాడులు సరికాదని రాజకీయ నాయకులంతా గ్రహించాలి. భారత్, కెనడా సంబంధాలు బలపడాలని కోరుకుంటున్నాం'' అని వెల్లడించారు. ర్యాలీ సందర్భంగా హిందువులపై పోలీసులు వివక్ష చూపారని ఆరోపించారు. దాన్ని కూడా నిరసిస్తూ శాంతియుతంగా ప్రదర్శన జరిపామన్నారు. హిందూఫోబియాకు కెనడా అడ్డుకట్ట వేయాలని హిందూ న్యాయవాద బృందం కోరింది.

పోలీసుల ఓవరాక్షన్

నిరసనల సందర్భంగా కెనడా పోలీసులు ఓవరాక్షన్ చేశారు. అవి చట్ట విరుద్ధమని ప్రకటించారు. వాటిలో పాల్గొన్న వారి దగ్గర ఆయుధాలు కనిపించాయని ఆరోపించారు. తక్షణం వెళ్లిపోకుంటే అరెస్టులు తప్పవని హెచ్చరించారు. దీన్ని హిందూ సమాజం తీవ్రంగా నిరసించింది. పోలీసులపై కేసు పెట్టే యోచనలో ఉంది. ఖలిస్తానీ వ్యతిరేక నినాదాలు చేసినందుకు ముగ్గురిని అరెస్టు చేశారని ఆలయ అధికార ప్రతినిధి పురుషోత్తం గోయల్ తెలిపారు. వారిలో 16 ఏళ్ల బాలుడు కూడా ఉన్నాడు. ఆలయ ప్రవేశ ద్వారాన్ని దిగ్బంధించేందుకు, బలప్రయోగానికి పోలీసులకు అధికారం లేదని గోయల్ అన్నారు. వారిని విడుదల చేసేదాకా పోలీసు ప్రధాన కార్యాలయం బయట ఆలయ యాజమాన్యం నిరసనకు దిగింది.

ఉగ్రవాదులకు కెనడా అండ: జై శంకర్

కాన్‌బెర్రా: కెనడాలోని బ్రాంప్టన్ హిందూ ఆలయంలో ఆదివారం ఖలిస్తానీలు దౌర్జన్యానికి పాల్పడటంపై విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ స్పందించారు. కెనడా ప్రభుత్వం ఉగ్రవాదులకు రాజకీయంగా అండగా ఉన్న విషయం ఈ ఘటనను బట్టి తెలుసుకోవచ్చని, ఇది ఎంతో ఆందోళన కలిగించే విషయమని ఆయన వ్యాఖ్యానించారు. ఆస్ట్రేలియాలోని కాన్‌బెర్రాలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఎలాంటి ఆధారాలు చూపకుండా ఆరోపణలు చేయడమనే వైఖరిని కెనడా అనుసరిస్తోంది. మా దౌత్యాధికారులపై నిఘా పెట్టింది. ఇది చాలా ఆక్షేపణీయం. ఆందోళనకరం'అని జై శంకర్ అన్నారు. బ్రాంప్టన్ ఘటనకు సంబంధించిన వీడియో చూస్తే చాలు.. ఆ దేశ ప్రభుత్వం ఉగ్రవాదులకు రాజకీయంగా ఎలాంటి అవకాశమిచ్చిందీ అవగతమవుతుందన్నారు. భారత కాన్సులేట్, ఆలయ నిర్వాహకులు కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఖలిస్తాన్ వాదులు అడ్డుకోవడం, హిందువులపై దాడికి పాల్పడటం తెలిసిందే. ఆ ఘటనను విదేశాంగ శాఖతో పాటు మోదీ కూడా ఖండించారు.

వక్ఫ్ జేపీసీ చైర్మన్‌పై స్పీకర్‌కు ఫిర్యాదు

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లును సమీక్షిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న బీజేపీ నేత జగదాంబికా పాల్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కమిటీలోని విపక్ష సభ్యులు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం విపక్ష సభ్యుల బృందం ఢిల్లీలో స్పీకర్‌తో సమావేశమైంది. చైర్మన్, బిల్లుపై తమ తీవ్ర అభ్యంతరాలతో కూడిన మెమొరాండమ్‌ను స్పీకర్‌కు సమర్పించారు. భేటీ తర్వాత ఆప్ సభ్యుడు సంజయ్ సింగ్, డీఎంకే ఎంపీ ఎ.రాజా మీడియాతో మాట్లాడారు. '' మా అభ్యంతరాలను స్పీకర్ సావధానంగా ఆలకించారు. జేపీసీ చైర్మన్ జగదాంబికా పాల్ ఒంటెత్తు పోక డలను మానుకునేలా, సభ్యుల సమ్మతితో ఉమ్మడి నిర్ణయాలు తీసుకునేలా ఆయనకు ఆదేశాలివ్వాలని స్పీకర్‌ను కోరాం. అందుకు స్పీకర్ సానుకూలంగా స్పందించారు. తమ డిమాండ్ల మేరకు ఆదేశాలు రాని పక్షంలో కమిటీ నుంచి వైదొలగుతామనే తమ ఉమ్మడి నిర్ణయాన్ని స్పీకర్ వద్ద కరాఖండీగా చెప్పాం'' అని సభ్యులు వెల్లడించారు.

ఇకపై ఎన్నికల్లో పోటీ చేయను

సీనియర్ నేత శరద్ పవార్ వెల్లడి



పుణే: ఎన్సీపీ దిగ్గజ నేత శరద్ పవార్ త్వరలో రాజకీయాల నుంచి వైదొలగనున్నారా? అంటే అవుననే చెప్పుకోవాల్సి ఉంటుంది. మంగళవారం మహారాష్ట్రలోని బారామతిలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన వెల్లడించిన విషయం దీనిని రూఢీ చేస్తోంది. భవిష్యత్తులో జరిగే ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయబోనని, యువ తరానికి మార్గదర్శకంగా ఉంటానని శరద్ పవార్ అన్నారు. 'ప్రస్తుతం అధికారంలో లేను. రాజ్యసభ సభ్యుడిగా మరో ఏడాదిన్నర కొనసాగుతాను. కానీ, ఆ తర్వాత మళ్లీ రాజ్యసభకు పోటీ చేయాలా వద్దా అనే విషయం ఆలోచించాలి. లోక్‌సభకే కాదు, ఇకపై ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయను'అని అన్నారు. 'బారామతి నుంచి 14 సార్లు పోటీ చేశా. ప్రతిసారీ మీరు నన్ను గెలిపించారు. ఒక్కసారి కూడా ఓడించలేదు. కానీ, నేనే దీనికి ముగింపు పలకాలి. కొత్త తరాన్ని ముందుకు తీసుకురావాలి. ఆ తపనతోనే పనిచేస్తున్నా. అధికారం కాదు, ప్రజలకు సేవ చేయాలనేదే నా ఉద్దేశం. ప్రజల కోసం ఇకపైనా పనిచేస్తూనే ఉంటా'అని ఆయన ప్రకటించారు. ఆరు దశాబ్దాలుగా మహారాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా ఉన్న శరద్‌పవార్ వయస్సు 83 ఏళ్లు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగు పర్యాయాలు పనిచేశారు. 1967లో మొదటిసారిగా బారామతి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గత 57 ఏళ్లలో ఒక్క ఓటమిని కూడా ఎరగని నేత శరద్‌పవార్.

ఫలితం తేలేదెప్పుడు?

అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు ఈసారి ఆలస్యంగా వెల్లడయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. స్పష్టమైన చిత్రం ఆవిష్కృతమవ్వడానికి రెండు, మూడు రోజులు పట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మనదేశంలో లాగా అమెరికాలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఉండదు. ఓట్ల లెక్కింపు బాధ్యత రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాలదే. 50 రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ఒకేలా ఉండదు. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేక నిబంధనలు ఉంటాయి. డెమొక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మధ్య హోరాహోరీ పోరు సాగిన నేపథ్యంలో ఫలితాల వెల్లడికి సమయం పట్టే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. పోలింగ్ ముగిసిన కొద్ది గంటల్లో అమెరికా మీడియా సంస్థలు ఎవరు ఆధిక్యంలో ఉన్నారనే విషయాన్ని వెల్లడిస్తాయి. అమెరికన్లతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఫలితాల కోసం వీటిపైనే ఆధారపడతారు. అమెరికాలో ఆరు కాలమానాలున్నాయి. భారత కాలమానం ప్రకారం బుధవారం 11:30 గంటలకు అమెరికావ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ముగుస్తుంది. అంటే బుధవారం రాత్రికల్లా ఫలితాల ట్రెండ్స్ ఎలా ఉన్నాయనేది తెలిసే అవకాశం ఉంటుంది. చాలా రాష్ట్రాల్లో అవి ఎటువైపు మొగ్గుతాయనేది ముందు నుంచే తెలిసి ఉంటుంది. సులభంగా అంచనా వేయవచ్చు. ఈ రాష్ట్రాల్లో ఫలితాలు తొందరగానే వెల్లడయ్యే అవకాశం ఉంటుంది. కాకపోతే అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చేది ఏడు స్వింగ్ రాష్ట్రాలు. వీటిలో ఫలితాలు వెల్లడైతే గాని ఉత్కంఠకు తెరపడదు. హోరాహోరీ పోరు దృష్ట్యా స్వింగ్ రాష్ట్రాలు.. ముఖ్యంగా పెన్సిల్వేనియా తదుపరి అధ్యక్షుడు ఎవరనేది నిర్ణయించనున్నాయి. ఏడు స్వింగ్ రాష్ట్రాల్లో కలిపి 93 ఎలక్టోరల్ కాలేజీలు ఉన్నాయి. ఈ స్వింగ్ రాష్ట్రాలు స్వల్ప ఆధిక్యంతో ఏదైనా పార్టీ ఖాతాలో పడొచ్చు. అప్పుడు రీకౌంటింగ్ అవసరమవుతుంది. అప్పుడు ఫలితాల వెల్లడి మరింత ఆలస్యమవుతుంది.

ఒక రాష్ట్రంలో ఏ పార్టీకి ఆధిక్యం లభిస్తే.. అక్కడున్న ఎలక్టోరల్ ఓట్లన్నీ సదరు పార్టీ ఖాతాలో పడతాయి. ప్రతి రాష్ట్రానికి జనాభాను బట్టి నిర్దిష్ట సంఖ్యలో ఎలక్టోరల్ కాలేజీ ఓట్లుంటాయి. మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లుంటాయి. అధ్యక్ష పదవిని చేపట్టడానికి 270 ఎలక్టోరల్ ఓట్లు సాధించాలి. దేశవ్యాప్తంగా మెజారిటీ ఓట్లు సాధించినా అధ్యక్షపదవి వరిస్తుందనే గ్యారంటీ ఏమీ లేదు. ఎలక్టోరల్ ఓట్లే అధ్యక్షుడెవరనేది నిర్ణయిస్తాయి. 2020లో నవంబరు 3న ఎన్నికలు జరగ్గా... ఫలితం తేలడానికి నాలుగు రోజులు పట్టింది. పెన్సిల్వేనియాలో ఫలితం స్పష్టమయ్యాక.. జో బైడెన్ నెగ్గారని మీడియా ప్రకటించింది. ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యాక ట్రంప్ తొలుత 11 శాతం ఓట్ల ఆధిక్యం కనబర్చారు. తర్వాత రెండురోజుల్లో పోస్టల్ బ్యాలెట్లను లెక్కింపు ప్రారంభమయ్యాక.. బైడెన్ ఆధిక్యంలోకి వచ్చారు. వార్త సంస్థ 'అసోసియేటెడ్ ప్రెస్' తొలుత విజేతను ప్రకటిస్తూ వస్తోంది. 1848 నుంచి కచ్చితంగా విజేత ఎవరో తొలుత చెబుతోంది. 2016 ఎన్నికలు జరిగిన రోజు రాత్రే డొనాల్డ్ ట్రంప్‌ను అసోసియేటెడ్ ప్రెస్ విజేతగా ప్రకటించింది. అధికారిక ప్రక్రియ మాత్రం కొనసాగుతూ ఉంటుంది. డిసెంబరు 11 కల్లా రాష్ట్రాలు ఫలితాలను ప్రకటించాలి.

– సాక్షి, నేషనల్ డెస్క్



గాలంట్

రక్షణ మంత్రిపై నెతన్యాహూ వేటు!

జెరుసలేం: గాజాలోని హమాస్, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సాయుధ గ్రూపులపై ఒకవైపు తమ ఆర్మీ భీకర దాడులకు పాల్పడుతున్న వేళ.. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌కు ఉద్వాసన పలికారు. గాజాలో హమాస్‌తో జరుగుతున్న యుద్ధం విషయంలో ఇరువురి మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ ప్రజాదరణ కలిగిన నేత కావడంతో నెతన్యాహూ ఇప్పటిదాకా ఆయన్ను కొనసాగిస్తూ వచ్చారు. గాలంట్‌ను బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు ఆయన మంగళవారం చేసిన ప్రకటనతో అందరూ ఆశ్చర్యపోయారు. 2023 మార్చిలో ఆయనను తప్పిస్తారనే వార్తలు రావడంతో నెతన్యాహూకు వ్యతిరేకంగా జనం పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగారు. దీంతో, ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారని సమాచారం.

జానపద గాయని శారద సిన్హా కన్నుమూత

న్యూఢిల్లీ: ప్రముఖ జానపద గాయని శారద సిన్హా (72) మంగళవారం రాత్రి కన్నుమూశారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడిన శారద ఎయిమ్స్‌లో మంగళవారం రాత్రి 9:20 గంటలకు తుదిశ్వాస విడిచారు. పద్మభూషణ్ శారద సిన్హా భోజ్‌పురి, మైథిలి, మగ్హాహి భాషల్లో ప్రఖ్యాత జానపద గాయకురాలిగా పేరుగడించారు. ఆమె వెంటిలేటర్‌పై ఉన్నారని తెలిసినప్పటినుంచీ ప్రధాని మోదీ నేరుగా ఎయిమ్స్ వైద్యబృందంతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 'కార్తీక్ మాస్ ఐజోరియా', 'కోయల్ బిన్' తదితర విఖ్యాత జానపద గేయాలను ఆమె స్వరపరిచినవే. గ్యాంగ్స్ ఆఫ్ వసేపూర్ సినిమాలో 'తార్ బిజ్లీ' పాటను, హమ్ ఆప్కే హై కౌన్ సినిమాలో 'బాబుల్' పాటను ఆమె పాడారు. భోజ్‌పురి గేయాలకు విశేష ప్రాచుర్యం కల్పించిన శారద సిన్హాను బిహార్ కోకిలగా పిలుస్తారు. 2017 నుంచి ఆమె బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు.

యూపీ మదర్సాలకు భారీ ఊరట

హైకోర్టు తీర్పును కొట్టేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో నడుస్తున్న వేలాది మదర్సాలకు సర్వోన్నత న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. యూపీ మదర్సా విద్యా చట్టాన్ని రద్దుచేస్తూ గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్డివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం మంగళవారం తీర్పు చెప్పింది. ఈ కేసు తీర్పును గత నెల 22న రిజర్వ్‌చేసిన సుప్రీంకోర్టు మంగళవారం 70 పేజీల తీర్పును వెలువరించింది. లౌకిక సూత్రాలను ఉల్లంఘిస్తూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం 'యూపీ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్, 2004'ను తెచ్చిందంటూ అలహాబాద్ హైకోర్టు మార్చి 22న వెలువరిచిన తీర్పు తప్పు అని సుప్రీంకోర్టు తేల్చింది. మదర్సాల్లోని విద్యార్థులను వీలైనంత త్వరగా సాధారణ పాఠశాలల్లోకి మార్చాలని ఆనాడు హైకోర్టు తీర్పు చెప్పడం తెల్సిందే. దీంతో అంజుమ్ కదారీ, యూపీ సర్కార్ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ ఏప్రిల్ ఐదున సుప్రీంకోర్టు ఉత్తర్వులివ్వడం తెల్సిందే. రాజ్యాంగంలోని ఉమ్మడి(మూడో) జాబితాలోని 25వ ఎంట్రీలో పేర్కొన్న మేరకే యూపీ మదర్సా చట్టం ఉందని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టంచేసింది.అయితే ఈ మదర్సాలు ఇచ్చే బ్యాచిలర్(ఫజిల్), పోస్ట్‌గ్రాడ్యుయేట్(కమిల్) డిగ్రీలు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నియమనిబంధనలకు లోబడి లేవని కోర్టు తేల్చింది. ఇలాంటి డిగ్రీలు ఇవ్వడం చట్టవ్యతిరేకమని కోర్టు పేర్కొంది.

కుమారస్వామిపై కేసు



బెంగళూరు: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి, జేడీ(ఎస్) నేత హెచ్‌డీ కుమారస్వామిపై కర్ణాటకలో కేసు నమోదైంది. 2006–08 కాలంలో కర్ణాటక సీఎంగా ఉన్న కాలంలో కుమారస్వామి ఒక గనుల తవ్వకం సంస్థకు అక్రమంగా మైనింగ్ అనుమతులు ఇచ్చారని గతంలో ఒక కేసు నమోదైంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందానికి సారథ్యం వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎం.చంద్రశేఖర్ తాజాగా ఫిర్యాదుచేయడంతో బెంగళూరులోని సంజయ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కుమారస్వామిపై కేసు నమోదైంది. కుమారస్వామి ప్రభుత్వ అధికారిగా తన విధి నిర్వహణకు అడ్డు తగులుతున్నారని, తనను బెదిరించారని చంద్రశేఖర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. చట్టాలను అతిక్రమించి నాడు బళ్లారి జిల్లాలో శ్రీసాయి వెంకటేశ్వర మినరల్స్ సంస్థకు 550 ఎకరాల్లో గనుల తవ్వకం అనుమతులు ఇచ్చారని కుమారస్వామిపై కేసు నమోదైన సంగతి తెలిసిందే.

కుట్రపూరిత కేసు: కుమారస్వామి

తాజా కేసుపై కుమారస్వామి స్పందించారు. '' ఇది పూర్తిగా కుట్రపూరితంగా నమోదుచేసిన కేసు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుంది. ఐజీపై నేను పత్రికాసమావేశంలో ఆరోపణలు చేశానని ఫిర్యాదులో పేర్కొన్నారు. అది నిజమని నిరూపించగలరా? కావాలంటే ప్రెస్‌మీట్ వీడియోను మరోసారి చూడండి. ఈ కేసును నేను చట్టప్రకారమే ఎదుర్కొంటా'' అని మంత్రి అన్నారు.

సాక్షి
కరీంనగర్
బుధవారం | 6 | నవంబర్ | 2024



క్వింటాల్ పత్తి రూ.6,950

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం క్వింటాల్ పత్తి ధర రూ.6,950 పలికింది. సీసీఐ సంస్థ గరిష్ట ధర రూ.7,320కి కొనుగోలు చేసింది.



'మిడ్‌మానేరు'లో 26 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు నీటిమట్టం 26.89 టీఎంసీలకు చేరింది. ఎస్సారెస్పీ నుంచి 190 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 'భగీరథ'కు 40 క్యూసెక్కులు విడుదల చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/18.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి వెంకటేశ్



కరీంనగర్‌రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ అన్నారు. మంగళవారం కరీంనగర్ మండలంలోని నగునూరు సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్సా ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల చట్టం, గృహ హింస, సైబర్ నేరాలు, ర్యాగింగ్, డ్రగ్స్ తదితర కేసులపై అవగాహన కల్పించారు. అంతకుముందు కళాశాల తరగతి గదులు, వంటగది, భోజనశాలను తనిఖీ చేశారు. డిప్యూటీ లీగల్ కౌన్సెలర్ మహేశ్, ప్రిన్సిపాల్ మాలతి, అధ్యాపకులు శంకరయ్య, వెంకటేశ్వర్లు, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సరైన వైద్యం అందించాలి

- డీఎంహెచ్‌వో వెంకటరమణ



కరీంనగర్‌టౌన్: మహిళలకు సరైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా వారికి అందిస్తున్న 8 రకాల వైద్య సేవల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని బీఆర్‌ఆర్ కాలనీ యూపీహెచ్‌సీ, చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. వైద్య సేవల తీరును మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమానికి ఎక్కువ మంది మహిళలు హాజరయ్యేలా ఆశవర్కర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. వైద్యులు మనోహర్, సల్మా, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ పెంచాలి

వ్యాక్సినేషన్ పెంచడం, ఆరోగ్య సేవలను మెరుగుపర్చడమే లక్ష్యంగా ఆరోగ్య సిబ్బంది పని చేయాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. మంగళవారం తన కార్యాయలంలో రొటీన్ ఇమ్యునైజేషన్‌పై జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు వ్యాక్సినేషన్‌పై దృష్టిసారించి, విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రస్థాయి శిక్షకులు డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్, డాక్టర్ అతుల్ నిగమే, డాక్టర్ జ్యోత్స్న, డేవిడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానా, పల్లె దవాఖానా వైద్యులు, సూపర్‌వైజర్లకు దిశానిర్దేశం చేశారు. వైద్యులు సుజాత, సాజిదా అతహరి, శ్రీనివాస్, చందు, కైక తదితరులు పాల్గొన్నారు.

గన్నీ బ్యాగుల టెండర్లలో భారీ స్కాం

- సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్



కరీంనగర్: గన్నీ బ్యాగుల కొనుగోలు టెండర్ల నిబంధనలు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం భారీ స్కాంకు తెరలేపిందని సివిల్ సప్లయి కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ విమర్శించారు. మంగళవారం కరీంనగర్‌లో మాట్లాడుతూ గన్నీ బ్యాగుల కోసం, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల టెండర్లను పిలిచిందని, తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో రూ.14.50 నుంచి రూ.16 ఒక గన్నీ బ్యాగు కొనుగోలుకు టెండర్లు పిలిచామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిబంధనలను ఎందుకు మార్చారని ప్రశ్నించారు. ఓ సిఫాలిష్ ద్వారా టెండర్‌లో నిబంధనలు మార్చారని, ఆయనే కమీషన్లను వసూలు చేస్తూ షాడో మంత్రిగా పనిచేస్తున్నాడని విమర్శించారు. టెండర్ నిబంధనలను మార్చి ఒక్కో గన్నీబ్యాగ్‌కు అదనంగా తొమ్మిది రూపాయలు వేయడంతో రూ.63 కోట్ల కమీషన్ల తీసుకొని మహారాష్ట్రలో జరిగే ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీకి పంపించేందుకే నిబంధనలు మార్చిందని విమర్శించారు. గన్నీ బ్యాగ్ కుంభకోణంపై స్పందించకుంటే కోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేసైనా రూ.63 కోట్ల ప్రజాధనాన్ని కాపాడేందుకు వెనకాడనని స్పష్టం చేశారు.


పిల్లలేం చూస్తున్నారో?

Special Story
సాక్షి



- సెల్‌ఫోన్ మైకంలో విద్యార్థులు, యువత
- తల్లిదండ్రులూ.. నిఘా తప్పనిసరి
- ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో 71 సైబర్ క్రైం కేసులు

నేటి పిల్లలు, యువత సెల్‌ఫోన్ మైకంలో ఉంటున్నారు. క్షణం తీరిక లేకుండా తిండి, నిద్ర మానేసి, అందులోనే లీనమవుతున్నారు. ఫోన్, కంప్యూటర్ వాడేవారు ఇంటర్‌నెట్‌లోకి వెళ్లగానే ఏదో ఒక రూపంలో అశ్లీలం పలకరిస్తుంది. పొరపాటున దాన్ని క్లిక్ చేస్తే ఆ తర్వాత అన్నీ అలాంటి దృశ్యాలే పదేపదే వస్తుంటాయి. విద్యార్థులు, ముఖ్యంగా యువత ఇలాంటి సైట్లు చూడటం మొదలుపెడితే అది అలవాటుగా మారి, చివరికి వ్యసనమవుతుంది. గంటల తరబడి సోషల్ మీడియాలో ఉంటున్న పలువురు అనర్థాలు కొనితెచ్చుకుంటున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 71 సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలు ఫోన్, కంప్యూటర్‌లో ఏం చూస్తున్నారో నిఘా ఉంచాలి. అవసరం తీరగానే వాటిని తీసుకోవాలి. - 8లో▸



సర్వేకు అంతా సిద్ధం

- కులగణనకు మారిన షెడ్యూల్
- జిల్లాలో 9 నుంచి ఇంటింటి సర్వే
- మొత్తం 2,90,657 కుటుంబాలు
- ప్రత్యేకాధికారుల నియామకం
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారిగా ఆర్వీ కర్ణన్



ఇటీవల శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

కరీంనగర్ అర్బన్: కులగణన షెడ్యూల్ మారింది. ఈ నెల 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కావాల్సి ఉండగా 9 నుంచి చేపట్టనున్నారు. ఎన్యుమరేటర్లుగా టీచర్లను తీసుకునే ప్రక్రియలో జరిగిన జాప్యమే ఇందుకు కారణం. 6, 7, 8 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియ నిర్వహించనుండగా శుక్రవారం బ్లాక్‌ల సంఖ్యపై స్పష్టత రానుంది. గత గణాంకాల ప్రకారం 1,984 బ్లాక్‌లుగా నివాసాలను విభజించి, జనగణన నిర్వహించారు. ఈసారి కుటుంబాల సంఖ్య ఆధారంగా బ్లాక్‌లను ఏర్పాటు చేయనుండగా హౌస్ లిస్టింగ్‌లో కుటుంబాల వారీగా ఇళ్లకు స్టిక్కర్లు అంటించనున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబాల సంఖ్యపై స్పష్టత రానుండగా బ్లాక్‌ల సంఖ్య పెరగనుందని సమాచారం.

ఎస్జీటీలకు శిక్షణ..

ఎన్యుమరేటర్లుగా ఉపాధ్యాయులు మినహా ఇతర సిబ్బందిని నియమించాలని తొలుత ప్రభుత్వం సూచించింది. కానీ, క్షేత్రస్థాయిలో సిబ్బంది సరిపడా లేకపోవడంతో టీచర్లను కూడా ఎన్యుమరేటర్లుగా నియమించాలని ఆదేశించింది. దీంతో ఎస్జీటీలకు సర్వేపై సోమవారం శిక్షణనిచ్చారు. 2011లో 2,90,657 కుటుంబాలుండగా బుధవారం నుంచి శుక్రవారం వరకు కుటుంబాల వారీగా హౌస్ లిస్టింగ్ చేయనున్నారు. ప్రతీ ఇంటికి స్టిక్కర్ అంటించనుండగా 2,500లకు పైగా బ్లాక్‌లు వచ్చే అవకాశాలున్నాయని తెలిసింది.

కలెక్టర్ ప్రత్యేక చర్యలు..

కులగణన పక్కాగా జరిగేలా కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక చర్యలు చేపట్టారు. నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ వ్యవహరిస్తుండగా ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారిగా ఆర్వీ కర్ణన్‌ను ప్రభుత్వం నియమించింది. ఒక ఎన్యుమరేటర్‌కు 150 కుటుంబాలు కేటాయించారు. ప్రతీ 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ ఉండనుండగా తహసీల్దార్, డీటీ, పంచాయతీరాజ్, డీఆర్డీఏ అధికారులను, మండలానికో ప్రత్యేక అధికారిగా వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులను నియమించారు. కాగా, సమగ్ర సర్వేకు అంతా సిద్ధమైనట్లు జిల్లా అధికారులు తెలిపారు.

మండలాల వారీగా ప్రత్యేకాధికారులు

చిగురుమామిడి	కె.వేణుగోపాల్‌రావు(డీపీఏవో)
చొప్పదండి	తిరుపతిరావు (జిల్లా ఉపాధి అధికారి)
ఇల్లందకుంట	కమలాకర్‌రెడ్డి (డీహెచ్‌ఎస్‌వో)
గంగాధర	యం.శ్రీనివాస్ (జెడ్పీ సీఈవో)
గన్నేరువరం	ఎస్.రామానుజాచారి(డీసీవో)
హుజూరాబాద్	ఎస్.రమేశ్‌బాబు (ఆర్డీవో, హుజూరాబాద్)
జమ్మికుంట	కిరణ్‌ప్రకాశ్ (ఎస్డీసీ, ఎల్‌ఏ)
కరీంనగర్ రూరల్	కె.మహేశ్వర్ (ఆర్డీవో, కరీంనగర్)
కొత్తపల్లి	ఎస్.రామాచారి (ఏడీ, మైన్స్)
మానకొండూరు	వి.శ్రీధర్ (డీఆర్డీవో)
రామడుగు	ఎం.అనిల్‌ప్రకాశ్‌కిరణ్ (బీసీ అభివృద్ధి అధికారి)
సైదాపూర్	మహేశ్ (జిల్లా వ్యవసాయ అధికారి)
శంకరపట్నం	సురేశ్ (డీఐసీ, జీఎం)
తిమ్మాపూర్	ఎ.రవీందర్ (డీపీవో)
వీణవంక	సునీత (అడిషనల్ డీఆర్డీవో)

మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారులు

కరీంనగర్	చాహత్ బాజ్‌పేయ్ (కమిషనర్)
కొత్తపల్లి	కె.రణధీర్‌రెడ్డి (ఏడీఏ, కరీంనగర్)
చొప్పదండి	ఎన్.ప్రియదర్శిని (ఏడీఏ, చొప్పదండి)
జమ్మికుంట	నాగ ఐలేశ్వర్ (డీడీ, ఎస్సీడీవో)
హుజూరాబాద్	పి.పవన్‌కుమార్ (జిల్లా మైనారిటీ అధికారి)

2011 గణాంకాల ప్రకారం

జిల్లా జనాభా 10,05,711 మంది. కుటుంబాల సంఖ్య 2,90,657. నివాసాల సంఖ్య 2,58,485. గ్రామీణ జనాభా 6,96,727, పట్టణ జనాభా 3,08,984, పురుషులు 5,04,620, మహిళలు 5,01,091, ఎస్సీలు 1,86,648, ఎస్టీలు 12,779, మైనారిటీలు 94,881, ముస్లింలు 85,664, క్రిస్టియన్లు 7,717, సిక్కులు 1,224, బుద్దిస్టులు 123, జైనులు 153 మంది ఉన్నారు.

స్టేడియం.. చెత్తమయం



కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో దీపావళికి టపాకాయల విక్రయ దుకాణాలకు అధికారులు అనుమతి ఇచ్చారు. వాటికి సంబంధించిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి, వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. ఇవి వాతావరణ కాలుష్యానికి కూడా కారణమవుతాయని అంటున్నారు. పండుగ పోయి 6 రోజులైనా ఇటు క్రీడాశాఖ, అటు మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.

– కరీంనగర్ స్పోర్ట్స్

విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



మార్కెట్ షెడ్డు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్/కరీంనగర్ కార్పొరేషన్/ సప్తగిరికాలనీ: విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించనున్న చెకుముకి టాలెంట్ టెస్టుకు సంబంధించిన వాల్ పోస్టర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ పరీక్ష 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పాఠశాల, మండల, జిల్లాలో, రాష్ట్ర స్థాయిలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహిస్తున్నామని వేదిక జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ప్రశ్నపత్రాలను వేదిక కార్యాలయంలో తీసుకోవాలని హెచ్‌ఎంలకు సూచించారు. 94903 00725, 63047 04413, 97032 95685 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఫిజిక్స్ టీచర్లకు వర్క్‌షాప్..

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 220 మంది ఫిజిక్స్ టీచర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. విజ్ఞాన శాస్త్రాన్ని పిల్లలకు ఆసక్తి కలిగేలా బోధించాలన్నారు. పరిసరాల మీద అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకతను వారికి వివరించాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ టీచర్లకు పలు సూచనలు చేశారు. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణనిస్తున్నట్లు డీఈవో జనార్దన్‌రావు తెలిపారు. క్వాలిటీ కో–ఆర్డినేటర్ కర్ర అశోక్ రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి మారం స్వదేశీకుమార్, సైన్స్ ఆఫీసర్ చాడ జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ షెడ్డును వినియోగంలోకి తీసుకురావాలి

నగరంలోని చైతన్యపురి మార్కెట్ షెడ్డును వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం షెడ్డును పరిశీలించారు. ఎస్సారార్ కళాశాల నుంచి డీమార్ట్ వైపునకు వెళ్లే రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న చిరువ్యాపారులను అందులోకి తరలించాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, ఎస్ఈ రాజ్‌కుమార్, డీఈ వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ పరశురాం తదితరులున్నారు.

చివరి దశలో 'సమీకృత' పనులు

- డిసెంబర్‌లో అందుబాటులోకి పద్మనగర్ మార్కెట్
- మేయర్ యాదగిరి సునీల్‌రావు



మార్కెట్‌లో పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు, కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్

కరీంనగర్ కార్పొరేషన్: స్మార్ట్ సిటీలో భాగంగా పద్మనగర్‌లో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ డిసెంబర్‌లో ప్రజలకు అందుబాటులోకి రానుందని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. రూ.14 కోట్లతో చేపడుతున్న మార్కెట్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రజలకు అన్ని ఆహార పదార్థాలు ఒకేచోట లభించేలా అత్యాధునిక హంగులతో సమీకృత మార్కెట్లను నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా, పద్మనగర్ బుల్ సెమన్ స్థలంలో, కశ్మీగడ్డ రైతు బజార్‌లో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. పద్మనగర్‌లో పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. ఈ మార్కెట్‌లో 138 వెజిటబుల్ స్టాళ్లు, 38 నాన్‌వెజిటేబుల్ స్టాళ్లు వేర్వేరుగా నిర్మిస్తున్నట్లు చెప్పారు. 22 ప్రత్యేక షట్టర్లు నిర్మిస్తున్నామని, వాటిని కిరాణా సామగ్రి విక్రయించుకునేందుకు కేటాయిస్తామన్నారు. మార్కెట్‌లో నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, డ్రైనేజీ, పార్కింగ్, స్టోరేజీ, చుట్టూ ప్రహరీ, లోపల సీసీ కెమెరాల ఏర్పాటు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. మిగతా మార్కెట్ల పనులు కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

2.60 లక్షల మంది ఓటు నమోదు

- అర్హులందరూ దరఖాస్తు చేసుకోండి
- డీఆర్వో, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

కరీంనగర్ అర్బన్: అర్హులైన ఉపాధ్యాయులు, పట్టభద్రులందరూ తమ ఓటు నమోదు చేసుకోవాలని డీఆర్వో, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 4వ తేదీ వరకు ఆయా జిల్లాల్లోని 271 మండలాల్లో 2,60,044 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని 16 మండలాల నుంచి ఆఫ్‌లైన్‌లో 210, ఆన్‌లైన్‌లో 58,657 మొత్తం 58,867 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు సంబంధించి 271 మండలాల్లో 18,913 మంది నుంచి ఓటరు నమోదు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో కరీంనగర్ జిల్లా నుంచి వచ్చినవి 2,959 ఉన్నాయని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటు నమోదులో తలెత్తుతున్న ఇబ్బందులను డీఆర్వో దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఆర్డీవో మహేశ్వర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో సుధాకర్, మడుపు మోహన్‌చారి(కాంగ్రెస్), సత్తినేని శ్రీనివాస్(బీఆర్ఎస్), సిరిసిల్ల అంజయ్య(బీఎస్పీ), నాంపల్లి శ్రీనివాస్(బీజేపీ), ఎం.వాసుదేవ రెడ్డి (సీపీఐ(ఎం), కల్యాణపు ఆగయ్య(టీడీపీ) తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేవు.. అభివృద్ధి లేదు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్



మాట్లాడుతున్న హరిశంకర్

కరీంనగర్: నిధులు లేవు.. కరీంనగర్ అభివృద్ధి లేదు.. వీటి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లు కరీంనగర్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దితే 10 నెలల కాలంలోనే అంధకారంగా మార్చారని మండిపడ్డారు. కరీంనగర్‌లోని మీసేవ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు నయాపైసా తేవడం లేదని, అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఒద్యారం వరకు ఏర్పాటు చేసిన లైట్లు వెలగడం లేదని, 14 కూడళ్ల సుందరీకరణ పనులు ఆగిపోయాయని, తీగల వంతెనపై లైట్లు వెలగడం లేదని, ఆర్అండ్‌బీ రోడ్లపై గుంతలు పూడ్చకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు బండి సంజయ్, పొన్నం ప్రభాకర్‌లు ఇకనైనా కరీంనగర్‌కు నిధులు తీసుకువచ్చి, అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, షౌకత్, దీకొండ కుల్దీప్‌వర్మ, వాజిద్, గంగాధర చందు, చేతి చంద్రశేఖర్, ఆరె రవిగౌడ్ తదితరులున్నారు.

బల్దియాలో రేపు త్రిసభ్య కమిటీ విచారణ

- కమిషనర్‌పై గతంలో మాజీ కార్పొరేటర్ ఫిర్యాదు

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్‌ని గురువారం సాయంత్రం 4 గంటలకు నగరపాలిక కార్యాలయంలో త్రిసభ్య కమిటీ విచారించనుంది. కమిషనర్ తనను అవమానించారంటూ మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లను ఆశ్రయించిన నేపథ్యంలో కలెక్టర్ పమేలా సత్పతి ముగ్గురు జిల్లా అధికారులతో కమిటీ వేశారు. గత సెప్టెంబర్ 5వ తేదీన టీపీఎస్, మాజీ కార్పొరేటర్ మధ్య మొదలైన వివాదం కమిషనర్ వద్దకు చేరింది. ఆ సమయంలో ఆమెతో దురుసుగా ప్రవర్తించారనే అభియోగంపై చంద్రశేఖర్‌ను అదేరోజు అరెస్టు చేసి, జైలుకు పంపించారు. అయితే, ప్రజా సమస్యలపై కమిషనర్‌ను కలిసేందుకు ప్రయత్నించగా, తనను గెట్ అవుట్ అంటూ అవమానించారని ఆయన రాష్ట్ర, జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్‌లకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా ట్రెజరీ అధికారి, డీపీఆర్‌వోలతో కూడిన త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమించారు. మెండి చంద్రశేఖర్ ఫిర్యాదుపై విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుకు కమిటీ తరఫున సమాచారం అందించారు. ఇదిలా ఉంటే మేయర్ యాదగిరి సునీల్‌రావుపై 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత ఇచ్చిన ఫిర్యాదుపైనా ఈ కమిటీ విచారణ చేపట్టనుంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుల దుర్మరణం



అరుణ్‌, శివాజీ మృతదేహాలు

రామడుగు: మండలంలోని షా నగర్‌ గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందినట్లు ఎస్సై శేఖర్‌ పేర్కొన్నారు . మండల కేంద్రానికి చెందిన సామంతుల శివాజీ (18) నీలం అరుణ్‌ (20) ద్విచక్రవాహనంపై వెదిర వైపు నుంచి రామడుగు గ్రామానికి వెళ్తున్నారు. షానగర్‌ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న టాటాఏస్‌ వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి


సాగర్‌ మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల కొత్త బస్టాండ్‌ సమీపంలో సాగర్‌ అనే వ్యక్తి మద్యం మత్తులో డ్రెయినేజీలో పడి మృతిచెందాడు. బీర్‌పూర్‌ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన బందెల సాగర్‌ (35) పదేళ్లుగా కొత్తబస్టాండ్‌సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం సేవిస్తున్నాడు. మంగళవారం ఉదయం అతిగా మద్యం సేవించి డ్రెయినేజీ పక్క నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావ కుంబాల భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

చేప తగిలి యువకుడు..

గొల్లపల్లి: మండలంలోని చెందోళికి చెందిన నారవేణి తిరుపతి(38) చేపల వేటకు వెళ్లగా.. అక్కడ చేప తగిలి గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తిరుపతి తన మిత్రులతో కలిసి గ్రామంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఓ చేప వచ్చి తిరుపతి చాతి భాగంలో బలంగా తగిలింది. అతడిని స్నేహితులు, స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. తిరుపతి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య


శ్యాం (ఫైల్‌)

శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లిలో మంగళవారం ఉరేసుకొని దాసారపు శ్యాం(25) ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాసారపు ఎల్లయ్య–తిరుపతమ్మ చిన్న కుమారుడు శ్యాం కారు కొనుక్కుని హైదరాబాద్‌లో కొన్నేళ్లుగా అద్దెకు నడుపుతున్నాడు. పదిరోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఇటీవల అప్పులు ఉన్నాయని కుటుంబసభ్యులు, బంధువులకు తెలిపాడు. తల్లిదండ్రులు పనికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. లోన్‌యాప్‌ వేధింపులతోనే శ్యాం ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. ఈ విషయమై కేశవపట్నం ఎస్సై రవిని వివరాలు కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

పిల్లలేం చూస్తున్నారో?

- సెల్‌ఫోన్‌ మైకంలో విద్యార్థులు, యువత
- 'నెట్‌'లో పడితే అంతే సంగతులు
- తల్లిదండ్రులూ.. నిఘా తప్పనిసరి
- నిర్లక్ష్యం చేస్తే అవమానాలు, అంతులేని శోకమే
- ఈ ఏడాది ఇప్పటివరకు కరీంనగర్‌ జిల్లాలో 71 సైబర్‌ క్రైం కేసులు

కరీంనగర్‌ క్రైం: కరోనా కారణంగా కాలు బయటపెట్టే వీల్లేకపోవడంతో పిల్లలు ఫోన్‌, కంప్యూటర్లలో ఆటలకు పరిమితమయ్యారు. అవి వారిలో హింసా ప్రవృత్తిని ప్రేరేపించాయి. క్రమంగా బెట్టింగ్‌కు అలవాటు పడేలా చేశాయి. ఇలా రూ.లక్షలు పోగొట్టుకున్నవారు ఉన్నారు. పరువు పోతుందని బయటకు రాని సంఘటలు ఎన్నో. గతంలో బ్లూవేల్‌ ఆటకు అలవాటు పడ్డ పిల్లలు ఆత్మహత్య చేసుకున్న ఘటనలూ ఉన్నాయి.



★ సోషల్‌ మీడియాతో చేటు



ఈ కాలపు యువత కాలక్షేపం అంతా సోషల్‌ మీడియాలోనే. నేరగాళ్లు వీటి మాటున చెలరేగుతున్నారు. ఫేస్‌బుక్‌ వేదికగా జరుగుతున్న మోసాలకూ అంతులేదు. అవతలి వ్యక్తి ఎవరో తెలియకుండా మొదలవుతున్న స్నేహం అనర్థాలకు దారితీస్తోంది. అమ్మాయిల ఫొటోలతో చాటింగ్‌ మొదలు పెడుతున్నవారు ఉచ్చు బిగించి, వేధింపులకు పాల్పడుతున్నారు.

★ మాల్‌వేర్‌ చొరబాటు..



అనేక అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటున్నాయి. చదవాలనే ఆసక్తితో కొన్నింటిని తెరవగానే కంప్యూటర్లలోకి మాల్‌వేర్‌ చొరబడుతోంది. ఇది కంప్యూటర్‌ కార్యకలాపాలను నేరస్తులకు చేరవేయడమే కాదు.. బ్యాంకు ఖాతాల సమాచారాన్నీ చోరీ చేస్తుంది.

★ సైబర్‌ స్టాకింగ్‌..



ఆన్‌లైన్లో మారుపేరుతో స్నేహం చేస్తూ.. మహిళలను లైంగికంగా వేధించడమే సైబర్‌ స్టాకింగ్‌. ఈ తరహా నేరగాళ్లు మహిళల ఫోన్‌ నంబర్లు, ఈ–మెయిల్‌ ఐడీలు సేకరించి, ఇబ్బంది పెడతారు. విద్యార్థినులు, ఉద్యోగినులు దీని బారిన పడుతున్నారు.

★ సైబర్‌ టీజింగ్‌..



సూటిపోటి మాటలతో వేధించడం టీజింగ్‌. అదే ఆన్‌లైన్లో చేస్తే సైబర్‌ టీజింగ్‌. అనేక మంది ఇప్పుడు ఆన్‌లైన్లో దీన్నే ఫాలో అవుతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలను రకరకాలుగా వేధిస్తున్నారు. తల్లిదండ్రులకు చెబితే ఏమనుకుంటారో అనే భయంతో వారు తమలో తామే కుమిలిపోతుంటారు.

★ క్యాట్‌ ఫిషింగ్‌..



మారుపేరుతో మోసానికి పాల్పడటం క్యాట్‌ ఫిషింగ్‌. ఈ తరహా నేరగాళ్లు మారుపేర్లు, ఫొటోలతో ఆన్‌లైన్‌ ప్రొఫైల్స్‌ పెట్టుకుంటారు. సామాజిక మాధ్యమాల ద్వారా కొంతకాలం స్నేహితులుగా నటిస్తారు. తర్వాత తమకు ప్రమాదం జరిగిందని, ఇంట్లో వాళ్లకు తీవ్ర అనారోగ్యం వచ్చిందని డబ్బు గుంజేందుకు ప్రయత్నిస్తుంటారు.

★ డాక్సింగ్‌..



ప్రముఖ వ్యక్తులు, సంస్థలను రకరకాలుగా వేధించడమే డాక్సింగ్‌. సంస్థలు, వ్యక్తుల కంప్యూటర్లలోకి చాటుగా చొరబడుతున్న నిందితులు కీలక సమాచారం తస్కరిస్తున్నారు. దాన్ని అంతర్జాలంలో పెడుతూ పరువు తీస్తున్నారు. అడిగినంత డబ్బు చెల్లించకపోతే ఇంకా ముఖ్యమైన సమాచారం బహిర్గతం చేస్తామని బెదిరిస్తారు.

★ సైబర్‌ బుల్లీయింగ్‌..



60 శాతం మంది యువత సైబర్‌ బుల్లీయింగ్‌ బారిన పడుతున్నారు. ఎదుటివారిని మానసికంగా దెబ్బతీసేలా పోస్టులు పెడుతూ ఇబ్బంది పెడతారు.

★ స్వాటింగ్‌..



ఫలానా వ్యక్తి సంఘ విద్రోహశక్తి. అతని దగ్గర మారణాయుధాలో, మాదకద్రవ్యాలో ఉన్నాయని పోలీసులకు సమాచారమిచ్చి, ఇబ్బందులకు గురిచేయడమే స్వాటింగ్‌. గిట్టనివారిని లక్ష్యంగా చేసుకునే నేరమిది.

★ వీడియో చాట్‌తో మోసం



రకరకాల పద్ధతుల్లో ఫోన్‌ నంబర్లు సేకరిస్తున్న నేరగాళ్లు అందమైన అమ్మాయిలతో మాట్లాడిస్తున్నారు. కొద్దిగా పరిచయం కాగానే వీడియో కాల్‌లో చాటింగ్‌ చేద్దామని ముగ్గులోకి దింపుతారు. అందుకు సిద్ధమవగానే రెచ్చగొట్టేందుకు వీడియో కెమెరా ముందే నగ్నంగా మారిపోతారు. మాటలతో మభ్యపెట్టి, ఎదుటివారినీ నగ్నంగా మారాలంటూ కవ్విస్తారు. లొంగిపోతే.. ఇక అయిపోయినట్లే. ఆ వ్యవహారమంతా రికార్డు చేస్తారు. సంబంధిత ఫొటోలు, వీడియోలు బయట పెడతామంటూ బెదిరించి, డబ్బు గుంజుతారు.

చెడు తొందరగా ఆకర్షిస్తుంది



సెల్‌ఫోన్‌ ఎక్కువగా వాడుతున్న యువత పక్కదారి పడుతోంది. ఫోన్‌లో ఉన్న మంచి కంటే చెడే ఎక్కువగా ఆకర్షిస్తుంది. పిల్లల్లో చదువు, ఇతర విషయాలపై ఏకాగ్రత సన్నగిల్లుతుంది. ఫలితంగా ఆత్మ విశ్వాసం కోల్పోతూ కోపం, మానసిక ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతాయి. పోర్న్‌ వీడియోలకు బానిసలై, సంఘ విద్రోహ శక్తులుగా తయారవుతున్నారు.

– డాక్టర్‌ ఎ.శ్రీనివాస్‌ రెడ్డి, సైకాలజిస్టు

నేర ప్రవృత్తి పెరుగుతోంది



పిల్లలకు ఆన్‌లైన్‌ క్లాసులు, వివిధ కారణాలతో సెల్‌ఫోన్లు ఇవ్వాల్సి వస్తోంది. అయితే, వారు ఏం చూస్తున్నారని తల్లిదండ్రులు గమనిస్తుండాలి. పిల్లలు ఆన్‌లైన్‌ గేమ్స్‌కు అలవాటు పడి, తల్లిదండ్రుల అకౌంట్లలోని డబ్బులు పోగొడుతున్నారు. అశ్లీల చిత్రాలు, ఇతర వీడియోలతో నేర ప్రవృత్తి పెరిగి, పలు నేరాలు చేస్తున్నారు. కేసుల పాలవుతూ జైలుకు సైతం వెళ్తున్నారు.

– జి.నరేందర్‌, ఏసీపీ, కరీంనగర్‌ టౌన్‌

సెల్‌ఫోన్లే కారణం



పిల్లలు, యువత చెడుమార్గంలో పయనించడానికి ముఖ్య కారణం సెల్‌ఫోన్‌లే. ఆన్‌లైన్‌ క్లాసుల నెపంతో వివిధ లింకులు, వీడియోలు చూస్తూ మొబైల్‌కు బానిసలవుతున్నారు. చదువుపై ధ్యాస పెట్టకుండా, జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. కొందరు వీడియోలు చూస్తూ మద్యం, డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఫోన్‌ అవసరం తీరాక తల్లిదండ్రులు వెంటనే తీసుకోవాలి.

– ఎ.కిరణ్‌కుమార్‌, న్యాయవాది

అవగాహన కల్పించాలి



ఫోన్లను చదువు కోసం కాకుండా చెడిపోవడానికే ఎక్కువగా వాడుతున్నారు. తల్లిదండ్రులు పట్టించుకుంటే దీన్ని చాలావరకు నియంత్రించవచ్చు. స్కూళ్లు, కాలేజీల్లో సెల్‌ఫోన్లతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి. ఈ మధ్య ఆన్‌లైన్‌ గేమ్స్‌ ఆడి, డబ్బులు పోగొట్టుకోవడం, వివిధ నేరాలకు పాల్పడటం, చదువుకున్న యువత జల్సాల కోసం చోరీలు చేస్తుండటం బాధ కలిగిస్తోంది.

– శనిగరపు రవి, ప్రభుత్వ టీచర్‌

గంజాయి విక్రేతల అరెస్ట్‌


నిందితుల అరెస్ట్‌ చూపుతున్న పోలీసులు

బుగ్గారం: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన గుజ్జేటి వంశీ, ధర్మపురికి చెందిన తుమ్మ ఉపేందర్‌ మంగళవారం గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. స్పందించిన ఎస్సై తమ సిబ్బందితో వెల్గొండ క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీలు చేపట్టారు. ఇందులో అక్రమంగా తరలిస్తున్న 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏడుగురికి గంజాయి పరీక్షలు

చందుర్తి (వేములవాడ): చందుర్తి సర్కిల్‌ పరిధిలోని గ్రామాల్లో అనుమానిత యువకులకు మంగళవారం గంజాయి పరీక్షలు నిర్వహించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గంజాయి సేవిస్తున్నారన్న అనుమానంతో వారికి పోలీసుస్టేషన్‌ ఆవరణలో పరీక్షలు నిర్వహించారు. నెగెటివ్‌ రావడంతో వారిని వదిలేసినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరికి జైలు, జరిమానా

సిరిసిల్ల కల్చరల్‌: దొంగతనాలకు సంబంధించిన రెండు వేర్వేరు కేసుల్లో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్‌ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్పీఅఖిల్‌ మహాజన్‌ తెలి పిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జయనగర్‌కు చెందని పుదరి రాజు 2017 నవంబర్‌ 11న అంబికా నగర్‌లోని ఓ ఇంటి తాళం పగలగొట్టి రూ.97 వేల సామగ్రిని దొంగిలించాడు. ఇంటి యజమాని ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రాజును అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏడుగురి సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించింది. పట్టణంలోని శివనగర్‌కు చెందిన ఐలవేణి సుమన్‌ అలియాస్‌ అర్జున్‌ గంజాయికి అలవా టుపడ్డాడు. అవసరమైన వారికి అమ్మడానికి రవా ణా చేస్తుండగా పోలీసులు సాయినగర్‌ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. అప్పటి సీఐ ఉపేందర్‌ చార్జ్‌షీట్‌ దాఖలు చేశారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ చె లుమల సందీప్‌ కేసు వాదించగా, తొమ్మిది మంది సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి సుమన్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

కొడుకు పోషించడం లేదని.. వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: కొడుకు పోషించడం లేదని జగిత్యాల అర్బన్‌ మండలం హస్నాబాద్‌ గ్రామానికి చెందిన చట్లపల్లి గంగారాం (70) తీవ్ర మనస్తాపంతో మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్సై మన్మథరావు కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన గంగారాం పేరున ఆస్తులున్నాయి. ఉన్న ఇంట్లోనే కొడుకు వేరుకాపురం పెట్టాడు. గంగారాం తన భార్య భాగ్యమ్మతో కలిసి నివసిస్తున్నాడు. గంగారాంను కొడుకు కొద్దిరోజులుగా పట్టించుకోవడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'శ్రీచైతన్య'లో కాన్షియస్‌నెస్‌ క్లబ్‌


అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్‌ సీఐ బాబా

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): కలెక్టర్‌ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో మంగళవారం కాన్షియస్‌నెస్‌ క్లబ్‌ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించామని ఎక్సైజ్‌ సీఐ కె.బాబా తెలిపారు. క్లబ్‌లో స్కూల్‌ ప్రిన్సిపాల్‌, ఇద్దరు ఉపాధ్యాయులతోపాటు ఇద్దరు విద్యార్థులు సభ్యులుగా ఉంటారని వివరించారు. ఎక్సైజ్‌ ఎస్సై శ్రీకాంత్‌ మాట్లాడుతూ... విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, నషా ముక్త్‌ భారత్‌ అభియాన్‌లో భాగంగా డ్రగ్‌ ఫ్రీ ఇండియా నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. చైల్డ్‌లైన్‌ కోఆర్డినేటర్‌ సంపత్‌ మాట్లాడుతూ.. చైల్డ్‌ రైట్స్‌, గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టాచ్‌, మొబైల్‌ అతివినియోగం అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ ఎ.రవీందర్‌రెడ్డి, ఎక్సైజ్‌ సిబ్బంది శేషగిరి రాజు, కొండల్‌రెడ్డి, మనోహర్‌, ధనలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ సిబ్బంది రమేశ్‌, సాయికిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

విషాదం మిగిల్చిన రోడ్డు ప్రమాదం

- కారు ఢీకొని వ్యక్తి మృతి
- మరో వ్యక్తికి తీవ్రగాయాలు


స్వామి (ఫైల్‌)

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లి బస్టాండ్‌ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే గ్రామానికి చెందిన పెసరు స్వామి(46) దుర్మరణం చెందడం ఆ కుటుంబంలో తీవ్రవిషాదం నింపింది. ఇదే ఘటనలో మరో వ్యక్తి మిట్ట ఆశాలు తీవ్రంగా గాయపడ్డాడు. బంజేరుపల్లి నుంచి కటికెనపల్లికి స్వామి, ఆశాలు మోటారు సైకిల్‌పై వస్తున్నారు. ఎదురుగా వచ్చిన కారు అతివేగంగా ఢీకొనడంతో పెసరు స్వామి అక్కడికక్కడే మరణించాడు. మిట్ట ఆశాలు కాలు విరిగింది. సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణ్‌ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ఆశాలును కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. స్వామి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి పంపించారు.

ఆ కుటుంబానికి అన్నీ కష్టాలే..

పేద కుటుంబానికి చెందిన పెసరు స్వామి– స్వప్న దంపతులు. వీరికి కూతుళ్లు సింధూ, శివాణి ఉన్నారు. చిన్నకూతురు శివాణి ఇంజినీరింగ్‌ కోర్సు చదువుతోంది. పెద్దకూతురు సింధూకు నాలుగేళ్ల క్రితం వేములవాడ మండలం నూకలమర్రికి చెందిన సమీప బంధువు, వరుసకు మేనల్లుడు, ముంబాయిలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి కునాల్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఒక కుమారుడు జన్మించాడు. ఆ తర్వాత వీరి కాపురంలో కలతలు రావడంతో మనస్తాపానికి గురైన సింధూ ముంబాయిలోని తమ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుమారుడిని స్వామి దంపతులు తీసుకొచ్చి సంరక్షించుకుంటున్నారు. స్వామి ఫొటోగ్రాఫర్‌గా పనిచేసినా ఆశించిన ఆదాయం రాక కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో భార్య స్వప్నతో కలిసి గ్రామంలోనే టిఫిన్‌ సెంటర్‌ ఏర్పాటు చేసుకున్నారు. రెండేళ్లక్రితం పెద్ద కూతురు చనిపోవడం, ప్రస్తుతం భర్త స్వామి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో స్వప్నతోపాటు కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తండ్రి మరణవార్త విన్న శివాణి స్పృహతప్పి పడియింది. గ్రామస్తులు వెంటనే వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు.

హత్య కేసులో నిందితుడిపై పీడీయాక్ట్‌

- రామగుండం సీపీ శ్రీనివాస్‌ వెల్లడి


పీడీయాక్ట్‌ పత్రం అందిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

గోదావరిఖని: మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్‌పై పీడీయాక్టు అమలు చేసినట్లు రామగుండం పోలీసు కమిషనర్‌ శ్రీనివాస్‌ తెలిపారు. ఆదిలాబాద్‌ జైలులో ఉన్న కుంట శ్రీనివాస్‌కు మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు మంగళవారం పీడీయాక్టు పత్రాన్ని అందజేసి చర్లపల్లి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. మంచిర్యాల ప్రజలు, రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఇతడిపై ఇప్పటికే నాలుగు కేసులు నమోదు చేసి జైలులో ఉన్నాడని తెలిపారు. గతంలో రామగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో అడ్వకేట్‌ వామన్‌రావు హత్య కేసులో జైలుకు వెళ్లిన అతడి నేరప్రవృత్తి తీరులో మార్పు రాకపోవడంతో పీడీయాక్ట్‌ నమోదు చేసినట్లు వెల్లడించారు. గ్రూప్‌లుగా ఏర్పడి గొడవలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి జాబితా సిద్ధం చేశామని, త్వరలో వారిపై కూడా పీడీయాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు. హత్యాయత్నాలు, హత్యలకు పాల్పడిన, అక్రమ ఫైనాన్స్‌, గంజాయి రవాణా, పేకాట, పీడీఎస్‌ రైస్‌ అక్రమ రవాణా, భూకబ్జాలకు పాల్పడడం, వైట్‌కాలర్‌ నేరస్తులపై పీడీ యాక్ట్‌ అమలు చేయనున్నట్లు సీపీ హెచ్చరించారు.

మొబైల్‌ షాపులో చోరీ


దొంగతనం జరిగిన మొబైల్‌ పాయింట్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గాయత్రి మొబైల్స్‌ షాపులో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు వెంటిలేటర్‌ నుంచి చొరబడి సుమారు రూ.2 లక్షల విలువైన ఫోన్లను దొంగిలించారు. షాపుయజమాని సోమవారం సాయంత్రం షాపునకు తాళాలు వేసుకుని వెళ్లాడు. గుర్తుతెలియని దొంగలు షాపు వెనకాల ఉన్న వెంటిలేటర్‌ నుంచి చొరబడ్డారు. మొబైల్‌ఫోన్స్‌తోపాటు రూ.15 వేలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం షాపు యజమాని వచ్చి చూసేసరికి సామగ్రి చిందరవందరగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని క్లూస్‌టీం ఆధారంగా ఫింగర్‌ ప్రింట్స్‌ సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం.. నిందితుల అరెస్టు

సిరిసిల్ల క్రైం: సాఫ్ట్‌వేర్‌ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని రిమాండ్‌ చేసినట్లు సిరిసిల్ల టౌన్‌ సీఐ కృష్ణ తెలిపారు. కలెక్టరేట్లో డిస్ట్రిక్‌ కో–ఆర్డినేటర్‌ ఉద్యోగం ఇప్పిస్తామని పలువురు దగ్గర డబ్బులు తీసుకున్న నిందితులను అరెస్టు చేసినట్లు వివరించారు. సీఐ వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన కాకర్ల భాను ప్రకాశ్‌ టెస్టా టెక్నాలజీస్‌ ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ అనే సాఫ్ట్‌వేర్‌ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని సిరిసిల్లకు చెందిన రాపెల్లి విద్యాసాగర్‌ వద్ద రూ.2లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా.. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. బాధితుడి ఫిర్యాదుతో కాకర్ల భాను ప్రకాశ్‌ను అరెస్టు చేశారు. సిరిసిల్ల కలెక్టర్‌లో డిస్ట్రిక్ట్‌ కో–ఆర్డినేటర్‌ జాబ్‌ ఇప్పిస్తానని మోసం చేసిన కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన కొండికొప్పుల శంకర్‌, వేల్పుల నగేశ్‌, శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి, ఒకరిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. సిరిసిల్లలోని బీవై.నగర్‌కు చెందిన సాగల జీవన్‌కు సిరిసిల్ల కలెక్టర్‌ కార్యాలయంలో డిస్ట్రిక్ట్‌ కో–ఆర్డినేటర్‌ ఉద్యోగం ఇప్పిస్తామని నిందితులు రూ.2లక్షలు, దానిని సుప్రియ వద్ద రూ.1.70లక్షలు తీసుకుని మోసం చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు కొండికొప్పుల శంకర్‌ను అరెస్టు చేశారు. మిగితావారు పరారీలో ఉన్నట్లు సీఐ వెల్లడించారు.



జైశ్రీరామ్‌.. జై హనుమాన్‌

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అంజన్నతోపాటు శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం చలి అధికంగా ఉండడంతో మధ్యాహ్న సమయంలో రద్దీ పెరిగింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఏఈవో అంజయ్య, అధికారులు ఉమామహేశ్వరరావు, హరిహరనాథ్‌, రాజేందర్‌ రెడ్డి, చంద్రశేఖర్‌ పర్యవేక్షించారు.






భక్తి గీతాలు.. కార్తీక దీపాలు

వేములవాడఅర్బన్‌: వేములవాడ రాజన్న ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఏఈవో శ్రావణ్‌ కుమార్‌, శ్రీనివాస్‌ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. శ్రీ మండప హనుమాన్‌ భజన మండలి వారి భజన కార్యక్రమం ఆకట్టుకుంది. అనంతరం ఆలయం ఆవరణలో వివిధ ఆకృతులతో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

కరీంనగర్: సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద 117 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.27,73,592 విలువ గల చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు గందె మహేశ్, ఐలేందర్ యాదవ్, తుల బాలయ్య, ఎదుల్ల రాజశేఖర్, నాంపల్లి శ్రీనివాస్, సుధగోని కృష్ణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు సంపత్‌రావు, భాగ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



కరీంనగర్‌క్రైం: వరంగల్ ఆటోనగర్‌కు చెందిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైరి రాజేశ్ అనారోగ్య కారణంగా గత ఫిబ్రవరి నెలలో మరణించగా, ఆయన కుటుంబ సభ్యులకు తోటి సీఐలు మంగళవారం కరీంనగర్‌లో రూ.4లక్షలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు రమేశ్, శ్రీనివాస్, సంతోష్‌కుమార్, విజయ్‌కుమార్, కోటేశ్వర్, ప్రదీప్ కుమార్, స్వామి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



హిమబిందును అభినందిస్తున్న సిబ్బంది

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్-1 డిపో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా హిమబిందు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమెను డిపో సిబ్బంది అభినందించి సన్మానించారు. డిపో సూపర్‌వైజర్లు కిషన్, ఏవీఆర్ రెడ్డి, రవీందర్, వెంకటేశ్వర్లు, మనోహర్, ఈఆర్ రెడ్డి, అడిచెర్ల శ్రీనివాస్, సంపత్, గోలి ప్రవీణ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పురమల్ల శ్రీనివాస్

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ ఉద్యమకారులు ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న మహా పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ఆవిష్కరించారు. పాదయాత్ర 27న కరీంనగర్‌లోని అమరవీరుల స్తూపం నుంచి ప్రారంభమై 28న వేములవాడ ఆలయం వరకు చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు కనకం కుమారస్వామి, ఐల ప్రసన్న, కారుపాకల మున్న, జంగాపల్లి కుమార్, ఉమారాణి, మహాదేవుని భార్గవి, రేణుక, మేకల మాధవి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం



కరీంనగర్: నగరంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన జాతీయ ఎస్సీ కమిషన్ గౌరవ సభ్యులు వడ్డేపల్లి రామచంద్రంను మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో దళిత సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎస్సీల భవిష్యత్ అవసరాలకు అధునాతన వసతులతో అంబేడ్కర్ నాలెడ్జి సెంటర్‌తో పాటు నిరుద్యోగ ఎస్సీ యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను మంజూరు చేయించాలని కోరారు. దళిత సంఘాల నాయకులు గంగారాం, రామయ్య, రాజేందర్, మడిపెల్లి శంకర్, గాలిపెల్లి కుమారస్వామి, జెరిపోతుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

13న ఉపాధ్యాయుల ధర్నా

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లాలో సస్పెన్షన్ విధించబడిన ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని, పదోన్నతులు నష్టపోయిన ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అపరిష్కృతంగా సమస్యల పరిష్కారానికి ఈనెల 13న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని మంగళవారం డీఈవో కార్యాలయంలో డీఈఓ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ పర్యవేక్షకులు నర్సింహస్వామికి డీటీఎఫ్, టీపీటీఎఫ్ నాయకులు ధర్నా నోటీసు అందించారు. డీటీఎఫ్, టీపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు రాజిరెడ్డి, మాడుగుల రాములు, ఆవాల నరహరి, తూముల తిరుపతి, పోరెడ్డి దామోదర్ రెడ్డి, చంద్రశేఖర్, రాజమౌళి, రాంచంద్రారెడ్డి, చకినాల రాంమోహన్, దామోదర్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి







నాగుల చవితిని భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టల్లో పాలు పోసి బియ్యం, నువ్వుల పిండి ముద్దలు, నూక, పండ్లు, వెండి చెవులు, కళ్లు, పడిగెలు సమర్పించి పుట్ట మట్టిని బంగారంగా భావించి తిలకధారణ చేసుకున్నారు. యజ్ఞవరాహస్వామిక్షేత్రంలో అనంత నాగేంద్రస్వామి, కృష్ణానగర్ రాహుకేతు సహిత సంతాన ప్రద అనంతనాగేంద్రస్వామి పుట్టలున్న ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీపురం సమీపంలో, కోర్టు చౌరసా వద్ద గల పుట్టల్లో భక్తులు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మహాశక్తి ఆలయంలోని అనంత నాగేంద్ర స్వామికి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అభిషేక పూజలు చేశారు. – కరీంనగర్ కల్చరల్

కల్తీ పాలతో మోసం

- పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ విభాగం



ఆవు పాలను గేదె పాలుగా విక్రయం(రెడ్ రబ్బర్)

కరీంనగర్ అర్బన్: వినియోగదారుల అభిరుచిని ఆదాయ వనరుగా మలచుకుంటున్నారు పలువురు అక్రమార్కులు. ప్యాకెట్ పాలను నమ్మే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు డెయిరీ ఫామ్ నిర్వహించే వారి నుంచే నేరుగా కొనుగోలు చేస్తున్నారు. నగరంలోని అంబేడ్కర్ మైదానం ఎదుట పలు ప్రాంతాల్లో డెయిరీ ఫామ్ నిర్వాహకులు పాలను విక్రయిస్తున్నారు. మధ్య దళారీ లేకుండా నేరుగా వినియోగదారులకే విక్రయిస్తుండటంతో అటు ఫామ్ నిర్వాహకులకు, ప్రజలకు ప్రయోజనం కలుగుతోంది. ఈ క్రమంలో పలువురు అక్రమార్కులు తమకు డెయిరీ ఫామ్ ఉందంటూ ప్రజలను మోసగిస్తున్నారు. ఆవు పాలను గేదె పాల పేరుతో విక్రయిస్తుండగా అర లీటరు ప్యాకెట్‌గా విక్రయిస్తున్నారు. కానీ ప్యాకెట్ అరలీటరు ఉండకపోగా కల్తీ పాలు విక్రయిస్తున్నారు. నియంత్రించాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ తనిఖీ చేస్తున్నారో, ఎవరిపై కేసులు నమోదు చేస్తున్నారో అంతా రహస్యమే. ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారమిచ్చినా తనిఖీలు చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెండింగ్ బిల్లులు, డీఏలు, పీఆర్సీ ప్రకటించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న తపస్ నాయకులు

కరీంనగర్: పెండింగ్ బిల్లులు, అన్ని డీఏలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, తిరుపతిరావులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులను మభ్యపెట్టి మేనిఫెస్టోలో వారికి సంబంధించిన అంశాలను ఆకర్షణీయంగా చెప్పి వారి మద్దతు పొంది గద్దెనెక్కిందని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. తపస్ నాయకులు వేణుకుమార్, శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రావు, ప్రేమచంద్రారెడ్డి, సత్యం, నాగరాజు, శ్రీనివాసరాజు, శ్రీకాంత్, లచ్చయ్య, రవీందర్‌రెడ్డి, శంకరయ్య, కుమార్, పవన్‌కుమార్, శ్రీధర్‌రావు, యాదయ్య, వెంకటేశ్వర్లు, హరిచరణ్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, వేణుగోపాల్, మల్లేశం, రవికిరణ్, శ్రీకాంత్‌రావు, కమలాకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్లకు దరఖాస్తు చేసుకోవాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో ఇంటి నంబర్లు కేటాయించకుండా ఉన్న ఇంటి యజమానులు నంబర్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నగరపాలకసంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయి ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు బుధవారం నుంచి నగరంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే ప్రారంభమవుతుందన్నారు. సర్వే సక్రమంగా జరగాలంటే ప్రతీ ఇంటికి నంబర్ ఉండాలన్నారు. ఒకవేళ ఇంటి నంబర్ లేకుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఆధారంగా రెవెన్యూ అధికారులు పరిశీలించి, ఆన్‌లైన్ దరఖాస్తును ఆమోదిస్తారన్నారు. నగర ప్రజలు సర్వేకు సహకరించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లాలో 2024–25 సంవత్సరానకు 169 పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం నిర్వహించడానికి ఆసక్తి గల ట్రైనర్స్ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఈనెల 8 లోపు తమ దరఖాస్తులు జిల్లా క్రీడా శాఖ కార్యాలయంలో అందజేయాలని అన్నారు. స్థానిక మండలం, మహిళా అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.

చేగుర్తి రేషన్ డీలర్ సస్పెన్షన్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చేగుర్తి గ్రామ రేషన్ డీలర్ సీహెచ్.రాజయ్యను సివిల్ సప్లయి శాఖ మంగళవారం సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాజయ్య లబ్ధిదారులకు సక్రమంగా బియ్యం ఇవ్వడం లేదనే స్థానికుల ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు సోమవారం రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. బియ్యం బస్తాల స్టాక్‌లో 6 క్వింటాళ్ల 63కిలోలు తక్కువగా రావడంతో అధికారులు సివిల్ సప్లయి శాఖకు నివేదిక ఇచ్చారు. మంగళవారం డీలర్ రాజయ్యపై 6ఏ కేసు నమోదుతో పాటు సస్పెన్షన్ చేసి చామనపల్లి డీలర్ వెంకటేశ్‌కు బాధ్యతలు అప్పగించినట్లు సివిల్ సప్లయి డీటీ సురేందర్ తెలిపారు.

దళితుల భూములు కాపాడాలి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లిలోని దళితులకు చెందిన భూములను కాపాడేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతికి పలువురు దళితులు వినతిపత్రం ఇచ్చారు. 1994లో సర్వే నం.367 లోని 4.24 ఎకరాలను గందె మాధవరావు వద్ద నుంచి దాదాపు 90 దళిత కుటుంబాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మాధవరావు వారసులు ఈ భూమి తమదేనంటూ చదును చేస్తున్నారని, అడ్డు వచ్చిన దళితులను బెదిరిస్తున్నారని వివరించారు.

కుటుంబాల గుర్తింపు షురూ



మొగ్ధుంపూర్‌లో ఇంటికి స్టిక్కర్ వేస్తున్న ఉపాధ్యాయురాలు

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సర్వే షెడ్యూల్‌లో ప్రభుత్వం మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం బుధవారం నుంచి 8 వరకు ఎన్యూమరేటర్లు గ్రామాల్లో పర్యటించి కుటుంబాలను గుర్తించి నివాసగృహాలకు స్టిక్కర్లు అంటించే ప్రక్రియ చేపడుతారు. ముందుగా సర్వే చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బందిని ఎన్యూమరేటర్లుగా నియమించారు. ఈనెల 1న ఎన్యూమరేటర్లు కుటుంబాలను గుర్తించి స్టిక్కర్లు అంటించే ప్రక్రియ ప్రారంభించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2 నుంచి స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని కరీంనగర్ మండలంలో నిలిపేశారు. ప్రస్తుతం సమగ్ర సర్వే నిర్వహించేందుకు ప్రభుత్వం కొత్తగా ఉపాధ్యాయులను నియమించడంతో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు.

నేటి నుంచి కుటుంబాల గుర్తింపు

సమగ్ర సర్వే నిర్వహణలో ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. వాస్తవానికి బుధవారం నుంచి సమగ్ర సర్వే నిర్వహించాల్సి ఉండగా ఎన్యూమరేటర్ల నియామకం వ్యవహారంతో జాప్యమేర్పడింది. ఈనెల 1 నుంచి 3వరకు కుటుంబాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులను నియమించడంతో వాయిదా పడింది. దీంతో కొత్తగా ఈనెల 6, 7, 8 తేదీల్లో కుటుంబాలను గుర్తించే ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. కరీంనగర్ మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో 12,210 కుటుంబాలుండగా బొమ్మకల్ గ్రామంలో సర్వే చేసే బాధ్యతను మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగించారు. సర్వే చేసేందుకు మొత్తం 56 మంది ఎన్యూమరేటర్లతో పాటు 9 మంది మండలస్థాయి అధికారులను సూపర్‌వైజర్లుగా నియమించారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 175 కుటుంబాల వరకు కేటాయించారు. అయితే కొందరు ఎన్యూమరేటర్లు పని సులువు అవుతుందనే ఉద్దేశంతో మంగళవారం నుంచే కొన్ని గ్రామాల్లో కుటుంబాల గుర్తింపు చేపట్టారు. కుటుంబాలను గుర్తించిన అనంతరం ఇండ్లకు స్టిక్కర్లు అంటించారు. అయితే కుటుంబాలకు సరిపడే స్టిక్కర్లు ఇవ్వలేదని కొందరు ఎన్యూమరేటర్లు తెలిపారు. ఈ నెల 8 వరకు కుటుంబాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం 9నుంచి ఇంటింటికీ వెళ్లి సర్వే వివరాల నమోదు ప్రారంభిస్తారు. 15రోజుల పాటు ప్రభుత్వం నిర్దేశించిన దాదాపు 56 అంశాలు, 75 ప్రశ్నల సర్వే పత్రం ద్వారా వివరాలు సేకరిస్తారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ పనుల నిమిత్తం బుధవారం 11కేవీ గౌతమినగర్ ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.లావణ్య తెలిపారు. తిరుమల్‌నగర్, కోతిరాంపూర్, కట్టరాంపూర్, భవానీ నగర్, శ్రీనివాస్‌నగర్, ప్రొఫెసర్ నగర్, దుర్గాదేవీ నగర్, మహాలక్ష్మి ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నామని అన్నారు.

బ్లడ్ స్టోరేజీ

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజీ సెంటర్‌లో మంగళవారం వరకు ఏ పాజిటివ్ 46, బీ పాజిటివ్ 43, ఓ పాజిటివ్ 90, ఏబీ పాజిటివ్ 15, బీ నెగెటివ్ 02, ఓ నెగెటివ్ 05 యూనిట్ల రక్తం అందుబాటులో ఉందని రెడ్‌క్రాస్ సెక్రటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి తెలిపారు. అత్యవసరంగా రక్తం కావాలిసిన వారు ఫోన్: 95025 02942 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్రీడా వార్తలు

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ పోటీలకు స్పందన



ఎంపికైన ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 14 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు విశేష స్పందన వచ్చింది. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో రాణించిన క్రీడాకారులను హుస్నాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అంతకుముందు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, పెటా సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సురేందర్, పీడీ, పీఈటీలు శ్రీనివాస్, అశోక్, ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ వాలీబాల్ విజేత ‘వివేకానంద’



కరీంనగర్‌స్పోర్ట్స్: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలకు ఈనెల 4న జరిగిన అంతర్ విశ్వ విద్యాలయాల స్థాయి వాలీబాల్ పోటీల్లో వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జట్టు ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచినట్లు కళాశాల పీడీ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్, శ్రవణ్ కుమార్, సంపత్‌కుమార్, రామేశ్వర్‌రావులు అభినందించారు.

రాష్ట్రస్థాయి అర్చరీలో జిల్లాకు పతకాలు

కరీంనగర్‌స్పోర్ట్స్: మహబూబాబాద్ జిల్లాలో జరుగుతున్న 68వ పాఠశాలల, కళాశాలల రాష్ట్రస్థాయి అండర్14,17,19 అర్చరీ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. కాంపౌండ్ విభాగంలో మధుహసిని, అర్షిత, హరిణి పతకాలు సాధించగా రికర్వ్ విభాగంలో ఆనందిని పతకం సాధించి సత్తా చాటారు. గుజరాత్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

రేపు ‘అబుల్ కలాం ఆజాద్’పై వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న అహ్మద్ అలీ

కరీంనగర్‌కార్పొరేషన్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు ఈనెల 7న హుస్సేనిపుర రోడ్ నం.3 లోని నేషనల్ ఫంక్షన్ ప్యాలెస్‌లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు అహ్మద్ అలీ తెలిపారు. మంగళవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిటీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఎ. మోసిన్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, కాంగ్రెస్ మైనారిటీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





నగరంలోని అశోక్‌నగర్ ఎస్ఎస్ గార్డెన్ ఎదురుగా మెయిన్ రోడ్‌పై ఉన్న స్ట్రీట్ లైట్ పోల్ విరిగిపోయింది. పదిరోజులుగా ఈ పోల్ విరిగి పడి ఉంది. ఈ ప్రాంతంలో మరికొన్ని పోల్స్ కూడా ఇలానే విరిగి ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.
– ఆకుతోట సంధ్యారాణి, కరీంనగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
అబ్దుల్ గపూర్, ఏఈ, 79950 13525

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

ఉద్యోగుల సభ్యత్వ నమోదుకు స్పందన



సభ్యత్వం ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణరావు

కరీంనగర్ అర్బన్: టీఎన్జీవోల సంఘం సభ్యత్వ నమోదులో వెల్లువలా ఉద్యోగులు స్పందిస్తున్నారని, దశాబ్దాలుగా ఉద్యోగుల సంక్షేమానికి సంఘం చేస్తున్న కృషి ఫలితమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌తో పాటు అర్బన్ తహసీల్దార్ ఆఫీస్, రూరల్ తహసీల్దార్ ఆఫీస్, రెవెన్యూ డివిజనల్ ఆఫీస్, డిస్ట్రిక్ ఎడ్యూకేషన్ ఆఫీస్‌లలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలకు త్వరలోనే పరిష్కరించే అవకాశముందని అన్నారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ, తదితర సమస్యలతో ఉద్యోగులు నానాపాట్లు పడుతున్నారని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసినవారు బెనిఫిట్స్ రాక కన్నీటి పర్యంతమవుతున్నారని అన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కలెక్టరేట్ ఏవో సుధాకర్, తహసీల్దార్ రాజు, నరేందర్, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, టీజీవో నాయకులు మడిపల్లి కాళిచరణ్, కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి నేరెళ్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే కులస్తులుగా పరిగణించాలి



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఒకే కులస్తులుగా పరిగణించి కులగణన చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న కులగణనలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఒకే కులంగా కాకుండా వృత్తులుగా విడదీయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు ద్రోణాచారి, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు, జిల్లా కన్వీనర్ రవీంద్రచారి, నాయకులు శ్రీనివాస్, హయగ్రీవ చారి, శివప్రసాద్, సత్యనారాయణ, పవన్‌కుమార్, శంకరయ్య, జగదీశ్వరాచారి, సదానందం, బ్రహ్మాచార్యులు, సదానంద్, లక్ష్మీ, సత్యనారాయణ, శ్రీనివాస్ సురేశ్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



బొమ్మకల్‌లో స్టార్టర్ పరిశీలిస్తున్న డీఈ రాజం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం గుంటూరుపల్లిలో మంగళవారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమం చేపట్టారు. డీఈ రాజం, ఏడీఈ రఘు, ఏఈ అనిల్‌కుమార్‌లు విద్యుత్ సిబ్బందితో కలిసి వ్యవసాయ విద్యుత్ మోటార్ల కనెక్షన్లు, లూజు లైన్లు పరిశీలించారు. తాత్కాలిక విద్యుత్ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. రైతులు తప్పనిసరిగా కెపాసిటర్ బిగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది సత్తార్, కొండగట్టు ఫారుక్, నాయకులు రవీందర్, చెట్టి శ్రీనివాస్, రాజు, కొమురయ్య, లక్ష్మయ్య, సదానందం, శ్రీధర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులకు రూ.1కే హెల్త్ ఇన్సూరెన్స్



మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రులతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులకు రూ.1కే ప్రమాద బీమా(ఇన్సూరెన్స్) చేయిస్తానని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. మంగళవారం కరీంనగర్ పట్టణంతోపాటు హుస్నాబాద్ లోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను కరీంనగర్ మేయర్ ఉన్నప్పుడు రూపాయికే నల్లా కనెక్షన్, అంత్యక్రియల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానని తెలిపారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో దిగుతున్నానని, తనను గెలిపిస్తే పట్టభద్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్ల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, గొట్టం మహేశ్, పొన్నం అనిల్‌గౌడ్, నాగరాజు, గణేశ్, మేకల చంద్రశేఖర్ యాదవ్, తేజ్‌దీప్ రెడ్డి తదితరులున్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టాలని కరీంనగర్ మండల విద్యాధికారి కె.రవీందర్ అన్నారు. డీఈవో ఆదేశాల మేరకు మంగళవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు శుభ్రమైన, రుచికరమైన భోజనం అందించాలన్నారు. ప్రతిరోజూ మెనూలో పేర్కొన్నట్లు భోజనం తయారు చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం తయారీపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రత్నాకర్‌రావు, రమాదేవి, పద్మ, అబ్దుల్ బాసిత్, జలజ, సీఆర్పీలు రమేశ్, మంగ, అర్చన, సీసీవో శ్రీనివాస్‌తో పాటు మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కరీంనగర్ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు ఎంపీ రెడ్డి, కొమురయ్య, కేతిరి శంకర్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, పీజే రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

షాబాద్, ములుగులో వెహికిల్ స్క్రాప్ సెంటర్లు!

వారం రోజుల్లో తుక్కు ప్రక్రియ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: పాత వాహనాలను తుక్కుగా మార్చేందుకు రవాణాశాఖ రెండు కేంద్రాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వికారాబాద్ జిల్లా చేవెళ్ల సమీపంలోని షాబాద్, సిద్దిపేట జిల్లా ములుగు ప్రాంతాల్లో వెహికిల్ స్క్రాప్ సెంటర్లను ఇందుకు వినియోగించుకోవాలని నిర్ణయించింది. మరో వారంలో అధికారికంగా వీటి వివరాలు వెల్లడించనుంది. ఇప్పటికే వాటిని నోటిఫై చేయటంతో ఆ సెంటర్లలో వాహనాలను తుక్కుగా మారుస్తారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం వాహనాలను తుక్కుగా మార్చేందుకు ప్రత్యేక పాలసీని ప్రకటించిన విషయం తెలిసిందే. 15 సంవత్సరాలు నిండిన వాహనాలను తుక్కుగా మార్చేందుకు వాహనదారులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించింది. అయితే వాహనాల ఫిట్‌నెస్ ఉందని భావిస్తే, గ్రీన్‌ట్యాక్స్ చెల్లించి మరో ఐదేళ్లు నడుపుకొనే వెసులుబాటు కూడా ఇచ్చింది. ఎవరైనా 15 ఏళ్ల వాహనాలను తుక్కుగా మార్చాలని భావిస్తే, ఈ రెండు కేంద్రాల్లో ఒకదానికి పంపుతారు. అక్కడ తుక్కు ప్రక్రియ ప్రారంభించి, ఆ వివరాలను రికార్డుల్లో పొందుపరిచి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. దానికి సంబంధించిన రుసుము చెల్లించాల్సి ఉంటుంది. తుక్కు కేంద్రంలో వాహన ఛాసిస్‌ను కట్ చేసి వాహన కేటగిరీ ఆధారంగా నిర్ధారిత మొత్తాన్ని తుక్కు కేంద్ర నిర్వాహకులు చెల్లిస్తారు. ఈ సందర్భంగా ఓ సర్టిఫికెట్ జారీ చేస్తారు. అదే కేటగిరీకి చెందిన కొత్త వాహనాన్ని కొనేప్పుడు ఆ సర్టిఫికెట్‌ను షోరూమ్‌లో చూపితే, ప్రభుత్వం స్క్రాప్ పాలసీలో పొందుపరిచిన విధంగా లైఫ్‌ట్యాక్స్‌లో రాయితీ ఇస్తుంది.

విజయ్ వెంట న్యాయవాది కూడా..

'జన్వాడ' కేసులో హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: 'జన్వాడ'కేసులో నిందితుడు మద్దూరి విజయ్ విచారణకు హాజరైనప్పుడు.. అతని వెంట న్యాయవాదిని కూడా అనుమతించాలని మోఖిల పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. జన్వాడ పార్టీ కేసులో కొకైన్ తీసుకున్నట్లు నిర్ధారణయ్యిందంటూ విజయ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తెలిసిందే. అయితే పోలీసులు చట్టవిరుద్ధంగా తనపై కేసు నమోదు చేశారని, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ విజయ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన వాంగ్మూలాన్ని కూడా మార్చారని, ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరారు. లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విజయ్ వ్యాపార వ్యవహారాల్లో భాగంగా విదేశాలకు వెళ్లి వస్తుంటారని తెలిపారు. ఇటీవల నెదర్లాండ్స్ నుంచి ఆయన వచ్చిన వెంటనే.. దీపావళి వేడుకల్లో పాల్గొనాలని పాకాల రాజేంద్ర ప్రసాద్ నుంచి ఆహ్వానం వచ్చిందన్నారు. దీంతో కుటుంబ సమేతంగా హాజరయ్యారని చెప్పారు. ఫాం హౌస్‌లో ఉండగా పోలీసులు దాడులు జరిపి మూత్రం శాంపిల్స్ తీసుకున్నారని, ఇందులో కొకైన్ తీసుకున్నట్లు పాజిటివ్ వచ్చిందని కేసు బనాయించారని చెప్పారు. ఈనెల 4న బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసు ఇచ్చి రెండు రోజుల్లో హాజరుకావాలని పోలీసులు ఆదేశించారని, అరెస్ట్ చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. అదనపు అడ్వొకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ.. నిందితుడు కొకైన్ తీసుకున్నట్లు పాజిటివ్ నివేదిక వచ్చిందని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 మధ్య విచారణకు హాజరు కావాలని విజయ్‌ను ఆదేశిస్తూ.. అతని వెంట న్యాయవాదిని అనుమతించాలని పోలీసులకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ వాయిదా వేశారు.

ఆయిల్ ఫెడ్‌లో అక్రమ దందా?

కేంద్రం నూనెల దిగుమతి సుంకం పెంచడం ఆసరాగా చేసుకుని డీలర్లతో కుమ్మక్కు!

- నెలన్నరలో ఇష్టారాజ్యంగా 12 సార్లు ధరలు పెంచిన సంస్థ
- పాత నిల్వలు పాత ధరకే అమ్మాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘన
- డీలర్లకు పాత ధరకిచ్చి, కొత్త ధరకు విక్రయించుకునేలా వెసులుబాటు
- కీలక అధికారులు రూ.10 కోట్ల కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు



సాక్షి, హైదరాబాద్: ఆయిల్‌ఫెడ్‌లో నూనె దందా నడుస్తోందని, కేంద్రం నూనెపై దిగుమతి సుంకం పెంచిన తర్వాత, కేంద్రం ఆదేశాలను పట్టించుకోకుండా నెలన్నర కాలంలోనే ఏకంగా 12 సార్లు ధరలను పెంచడం ద్వారా వినియోగదారులపై పెద్దయెత్తున భారం మోపిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కేంద్రం దిగుమతి సుంకం పెంచడాన్ని అవకాశంగా తీసుకుని కొందరు అధికారులు అక్రమార్జనకు తెరలేపారని, కోట్ల రూపాయల కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సుంకం పెంచిన తర్వాత అప్పటికే నిల్వ ఉన్న వంట నూనెలను పాత ధరకే ప్రైవేట్ డీలర్లకు ఇచ్చి.. వారు పెరిగిన ధరల ప్రకారం వినియోగదారులకు అమ్ముకునేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.

వంటనూనెల ధరలన్నీ భారీగా పెంపు

కేంద్రం సెప్టెంబర్ 14వ తేదీన వంట నూనెల దిగుమతి సుంకాన్ని భారీగా పెంచింది. సన్‌ఫ్లవర్, సోయాబీన్, రిఫైన్డ్ పామాయిల్, వేరుశనగ నూనెపై 12.5 శాతం నుంచి 32.5 శాతం వరకు పెంచింది. ఇది దేశవ్యాప్తంగా నూనెల ధరల పెరుగుదలకు కారణం అయ్యింది. అయితే పాత నిల్వలను పాత ధరకే అమ్మాలని కేంద్రం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న పాత నిల్వలు నెలన్నర రోజులకు పైగా సరిపోతాయని, ఆ తర్వాత కొత్త నిల్వలకు కొత్త ధరలు అమలు చేయాలని పేర్కొంది. కానీ ఆయిల్ ఫెడ్ కేంద్రం నిర్ణయాన్ని పెడచెవిన పెట్టి, దిగుమతి సుంకం పెంచిన రోజునే సంస్థ పరిధిలోని నూనె ధరలను పెంచేసింది. అలా పలుమార్లు ధరలు పెంచుకుంటూ పోయింది. అలా ఈనెల ఐదో తేదీలోగా పామాయిల్ లీటర్ ధరను రూ.96 నుంచి ఏకంగా రూ.131కు పెంచింది. అంటే ధర రూ.35 పెరిగిపోయిందన్న మాట. అలాగే సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరను రూ.104 నుంచి రూ.138కి, రైస్ బ్రాన్ ధరను రూ.105 నుంచి రూ.136కు పెంచింది. దీపం ఆయిల్ ధరను కూడా రూ. 31 పెంచేసింది. కేంద్రం చెప్పినట్టు కాకుండా దిగుమతి సుంకం పెంచిన రోజు నుంచే ఆయిల్‌ఫెడ్ ఇలా ధరలు పెంచుతూ పోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని అంటున్నారు.

ధరలు స్థిరీకరించాల్సింది పోయి

బహిరంగ మార్కెట్లో నూనెల ధరలు పెరిగే సమయంలో వాటిని స్థిరీకరించాల్సిన బాధ్యత ఆయిల్‌ఫెడ్‌పై ఉండగా, అందుకు భిన్నంగా, కేంద్రం ఆదేశాలను ఉల్లంఘించి నూనె ధరలను పెంచేసింది. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచిన రోజున ఆయిల్‌ఫెడ్ వద్ద, దాని డీలర్ల వద్ద దాదాపు 5 వేల మెట్రిక్ టన్నుల నిల్వ నూనె ఉన్నట్లు అంచనా. కాగా తన వద్ద ఉన్న నిల్వ నూనెను పాత ధరకు ఇచ్చి, కొత్త ధరకు అమ్ముకోవాలని కొందరు డీలర్లకు కొందరు ఆయిల్‌ఫెడ్ అధికారులు సూచించారు. అంతేకాకుండా డీలర్ల వద్ద అప్పటికే ఉన్న నిల్వ నూనెను కూడా కొత్త ధరకే అమ్ముకోవాలని చెప్పారు. ఇప్పటివరకు 12 సార్లు ధరలను పెంచిన నేపథ్యంలో పెంచిన ప్రతిసారీ పాత నిల్వ నూనెలను కొత్త ధరకే అమ్ముకునేలా వెసులుబాటు కల్పించారు. ఇలా నిల్వ నూనెలు కొత్త ధరకు విక్రయించడం వల్ల ప్రైవేట్ డీలర్లు అక్రమంగా దాదాపు రూ.10 కోట్ల అదనపు లాభం పొందినట్లు అంచనా. కాగా అందులో సగం అంటే సుమారు రూ.5 కోట్ల మేరకు ఆయిల్‌ఫెడ్‌లోని కొందరు కీలకమైన అధికారులకు డీలర్లు కమీషన్లుగా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. పలుమార్లు ధరల పెంపుపై వినియోగదారుల నుంచి విమర్శలు వచ్చినా ఆయిల్‌ఫెడ్ అధికారులు కమీషన్ల మత్తులో ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీపావళికి ముందు రోజు ధర పెంపుపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినా ఆయిల్‌ఫెడ్ ఖాతరు చేయలేదని అంటున్నారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపిస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిపై వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించడానికి 'సాక్షి' ప్రయత్నించగా ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా స్పందించలేదు.

ముఖ్య నేత కుట్రతోనే పోలీసుల దమనకాండ

ఏపీలో సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు

న్యాయపోరాటానికి సిద్ధపడుతున్న వైఎస్సార్‌సీపీ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ ముఖ్య నేత ఆదేశాలతోనే ఏపీలో భావ ప్రకటనా స్వేచ్ఛపై పోలీసులు దమనకాండ సాగిస్తున్నారు. ఎన్నికల హామీలను అమలు చేయని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులతో విరుచుకుపడుతున్నారు. సోషల్ మీడియా గొంతును అణచివేసేందుకు ప్రభుత్వ పెద్దల పక్కా పన్నాగాన్ని పోలీసులు నిర్లజ్జగా అమలు చేస్తూ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు.

ముగ్గురు రిటైర్డ్ ఐపీఎస్‌ల పర్యవేక్షణలో..

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించాల్సిందేనని ప్రభుత్వ ముఖ్య నేత పోలీసులకు విస్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. నాలుగు నెలల్లోనే తమ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వెల్లువెత్తుతుండటాన్ని ఆయన గుర్తించారు. ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళుతుండటంతో ముఖ్య నేత బెంబేలెత్తుతున్నారు. ప్రధానంగా శాంతిభద్రతలు పూర్తిగా దిగజారడం.. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం చేతులెత్తేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. దాంతో సోషల్ మీడియా కార్యకర్తలను అణచివేస్తే ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించవచ్చని ఆయన భావించారు. టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఉంటూ రాష్ట్ర డీజీపీ కార్యాలయాన్ని శాసిస్తున్న ముగ్గురు రిటైర్డ్ ఐపీఎస్ అధికారులకు ఆ బాధ్యత అప్పగించారు. ఆ వెంటనే టీడీపీ వీర విధేయులైన ఆ ముగ్గురు రిటైర్డ్ అధికారులు రంగంలోకి దిగారు. ఏకంగా డీజీపీ, సీఐడీ చీఫ్, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లకు ఆ ముగ్గురే మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. టీడీపీ కార్యాలయం నుంచి పంపిన జాబితా ప్రకారం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించాలని స్పష్టం చేశారు. లేకపోతే వారి పోస్టులు ఊడతాయని కూడా హెచ్చరించినట్టు సమాచారం.

పోలీస్ యంత్రాంగం జీహుజూర్

ప్రభుత్వ ముఖ్య నేత ఆదేశాలతో జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు చెలరేగిపోతున్నారు. టీడీపీ కార్యాలయం పంపిన జాబితా ప్రకారం కార్యాచరణకు దిగారు. కేవలం మూడు రోజుల్లోనే ఏకంగా వందకుపైగా అక్రమ కేసులు బనాయించడం ప్రభుత్వ కుట్రకు నిదర్శనం. సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా కేసులు పెట్టవద్దని.. 41 ఏ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తల ఇళ్లపై పడి వారిని బలవంతంగా తీసుకుపోతున్నారు. ఎక్కడికి తీసుకువెళుతున్నారన్న సమాచారాన్ని సైతం కార్యకర్తల కుటుంబ సభ్యులకు చెప్పడం లేదు. వచ్చింది పోలీసులో.. టీడీపీ గూండాలో తెలియక కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ..

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తల కళ్లకు గంతలు కట్టి పోలీసు వాహనాల్లో ఎక్కడెక్కడో తిప్పుతున్నారు. గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకువెళ్లి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి తీవ్రంగా హింసిస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించవద్దని హెచ్చరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు న్యాయవాదులతో వెళ్లి ప్రశ్నిస్తున్నా పోలీసులు సరైన సమాధానం చెప్పడం లేదు. కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చేస్తే తప్పనిసరై కొందర్ని విడిచిపెడుతున్నా.. మర్నాడు మళ్లీ రావాలని చెబుతున్నారు. తాము తీవ్రంగా కొట్టిన విషయాన్ని ఎవరికైనా చెబితే మర్నాడు వచ్చినప్పుడు మరోసారి అంతకుమించిన స్థాయిలో చిత్రహింసలకు గురి చేస్తామని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారికంగా అరాచకాన్ని సృష్టిస్తోంది. ఖాకీ క్రౌర్యంతో లాఠీ రాజ్యం సాగుతోంది. యథేచ్ఛగా రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోంది. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోంది. పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ టీడీపీ కూటమి ప్రభుత్వ పాల్పడుతున్న హక్కుల ఉల్లంఘనపై వైఎస్సార్‌సీపీ న్యాయ పోరాటానికి సిద్ధపడుతోంది.

'హైడల్'కు అత్యల్ప ప్రాధాన్యమన్న కేఆర్ఎంబీ

శ్రీశైలం, సాగర్‌లో జలవిద్యుదుత్పత్తి నిలుపుదలకు కృష్ణాబోర్డు సూచన

- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటిపారుదల శాఖలకు లేఖ
- తాగు, సాగునీటికి నిల్వలు సంరక్షించాలన్న బోర్డు
- జలవిద్యుత్ కోసమే శ్రీశైలం, సాగర్ నిర్మించినట్టు ఇప్పటివరకు తెలంగాణ వాదన


సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో జలవిద్యుదుత్పత్తిని తక్షణమే నిలుపుదల చేయాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) కోరింది. ఏపీ పునర్విభజన చట్టంలోని 11వ షెడ్యూల్‌లో జలవిద్యుత్‌కు అత్యల్ప ప్రాధాన్యం ఇచ్చారని కీలక వ్యాఖ్య చేసింది. వర్షాకాలం వచ్చే వరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నిల్వలను సాగు, తాగునీటి అవసరాల కోసం సంరక్షించాలని సూచించింది. ఈ మేరకు కృష్ణాబోర్డు సభ్యుడు ఆర్ఎన్.శంఖువా సోమవారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటిపారుదల శాఖలకు లేఖ రాశారు. విద్యుదుత్పత్తి ద్వారా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి నీటి విడుదలను నిలిపివేయాలని, ఇతర అవుట్ లెట్ల ద్వారా అవసరానికి మించి నీటిని తీసుకోరాదని ఆ లేఖలో స్పష్టం చేశారు. దిగువ ప్రాంతాల్లో తాగు, సాగునీటి అవసరాలను తీర్చడానికే రెండు జలాశయాల నుంచి నీటిని తీసుకోవాలన్నారు.

కృష్ణాబోర్డు కొత్త వాదన

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను జలవిద్యుదుత్పత్తి అవసరాల కోసమే నిర్మించారని చాలాకాలంగా తెలంగాణ వాదిస్తోంది. సాగు, తాగునీటి అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీ డిమాండ్ చేస్తోంది. ఈ వివాదం నేపథ్యంలో శ్రీశైలం, సాగర్ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో పూర్తి స్థాపిత సామర్థ్యం మేరకు విద్యుదుత్పత్తి నిర్వహించాలని తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో)ను ఆదేశిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన కేసుపై విచారణ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఏపీ పునర్విభజన చట్టంలోని షెడ్యూల్-11లో జలవిద్యుత్‌కు అత్యల్ప ప్రాధాన్యం కల్పించారని కృష్ణాబోర్డు కొత్త వాదనను తెరపైకి తీసుకొచ్చింది. జలవిద్యుదుత్పత్తిని నిలుపుదల చేయాలని కోరుతూ ఏటా కృష్ణాబోర్డు రెండు రాష్ట్రాలకు లేఖలు రాస్తున్నా, ఎన్నడూ ఇలా పేర్కొనలేదు. కృష్ణాబోర్డు తాజా వాదనకు అభ్యంతరం తెలుపుతూ త్వరలో తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసే అవకాశముంది.

విమానాశ్రయం తరహాలో సికింద్రాబాద్ స్టేషన్

పార్లమెంటరీ స్థాయీసంఘం చైర్మన్ సీఎం రమేశ్ వెల్లడి



పనుల పురోగతి వివరాలు తెలుసుకుంటున్న లక్ష్మణ్. చిత్రంలో సీఎం రమేశ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో అత్యాధునిక సదుపాయాలతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అందుబాటులోకి రానుందని పార్లమెంటరీ స్థాయీ సంఘం చైర్మన్, ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సుమారు రూ.750 కోట్లతో కేంద్రం పనులు చేపట్టిందని వివరించారు. పార్లమెంటరీ స్థాయీసంఘం ప్రతినిధుల బృందం మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను సందర్శించింది. సీఎం రమేశ్‌తో పాటు బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కాంగ్రెస్‌కు చెందిన రాజస్థాన్ ఎంపీ బెనివల్ ఉమ్మేద్ రామ్, బీహార్ సీపీఐఎంఎల్ పార్టీకి చెందిన ఎంపీ ప్రసాద్ సుధామ, ఒడిశాకు చెందిన బిజూ జనతాదళ్ ఎంపీ సుభాషిస్ కుంతియాలు ఈ బృందంలో ఉన్నారు. అలాగే పార్లమెంటరీ స్థాయీసంఘం ప్రతినిధుల కార్యదర్శి ఎండీ ఆఫ్తాబ్ ఆలమ్, డిప్యూటీ సెక్రటరీ సవిధ కాలియా, దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్‌కుమార్ జైన్ తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిని కమిటీ పరిశీలించింది. అనంతరం సీఎం రమేశ్ మీడియాతో మాట్లాడుతూ, కొద్దిరోజుల్లోనే నగరంలో బ్రహ్మాండమైన రైల్వేస్టేషన్ ప్రయాణికులకు అందుబాటులోకి రానుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ, సికింద్రాబాద్ స్టేషన్ చుట్టూ మౌలిక సదుపాయాల విస్తరణకు రాష్ట్రప్రభుత్వం సహాయ సహకారాలను అందించాలని కోరారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధిపైన దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

స్పీకర్‌కు కోర్టులు గడువు విధించలేవు

▶ మొదటి పేజీ తరువాయి

అందజేయకుంటే మేమే ఆదేశాలు జారీ చేయాల్సి వస్తుందని సెప్టెంబర్ 9న స్పీకర్ కార్యదర్శికి హైకోర్టు తేల్చిచెప్పింది. సింగిల్ జడ్జి తీర్పులో ఇచ్చిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని అసెంబ్లీ కార్యదర్శి గత నెల హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. 'ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మార్చి 18న స్పీకర్ కార్యాలయంలో అనర్హతకు సంబంధించి పిటిషన్లు ఇచ్చారు. స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో మార్చి 30న రిజిస్టర్ పోస్టులో పంపారు. కనీసం సమయం ఇవ్వకుండానే నేరుగా ఏప్రిల్ 10న హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. తమ పిటిషన్లను స్పీకర్ నేరుగా స్వీకరించలేదని అసభ్యకర పదజాలంతో విమర్శించారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వారిపై అసభ్యపదజాలంతో మాట్లాడటం క్షమించరానిది. స్పీకర్ నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని గతంలో ఎర్రబెల్లి దయాకర్ పిటిషన్‌లో ఇదే హైకోర్టు స్పష్టం చేసింది. స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేసే అధికార పరిధి కోర్టులకు లేదు. స్పీకర్‌కు కనీస గడువు కూడా ఇవ్వకుండానే న్యాయసమీక్ష కోరడం చెల్లదు. తన వద్దకు వచ్చిన ఫిర్యాదులపై నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ రాజ్యాంగం స్పీకర్‌కు ఇచ్చింది. రిట్ పిటిషన్లు దాఖలు చేయడంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలది తొందరపాటు చర్య' అని పేర్కొన్నారు. ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం 'మహారాష్ట్ర' అంశంలో తాజాగా ఇచ్చిన తీర్పు, కైశం మేఘచంద్రసింగ్, రాజేంద్రసింగ్ రాణా, కిహోటో హోలోహన్ కేసులను ప్రస్తావించారు.

నేరుగా స్పీకర్‌కు ఎలా ఇస్తారు..

అనంతరం ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్ తరఫు న్యాయవాది జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపిస్తూ.. 'స్పీకర్ తన ముందున్న పిటిషన్లపై నిర్ణయం వెలువరించిన తర్వాత కోర్టులు న్యాయసమీక్ష జరపొచ్చు. అయితే అది కూడా చాలా స్వల్పమే. కానీ, స్పీకర్ ఇంకా నిర్ణయం తీసుకోక ముందు కోర్టులు ఆయనపై ఒత్తిడి తేలేవు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం రాజ్యాంగ అధిపతి అయిన స్పీకర్ విధుల్లో కోర్టుల జోక్యం అతి స్వల్పం. అడ్మినిస్ట్రేటివ్, లెజిస్లేటివ్, ట్రిబ్యునల్ చైర్మన్‌గా.. ఇలా స్పీకర్ పలు కీలక విధులు నిర్వర్తిస్తారు. స్పీకర్ తన ముందున్న అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం, స్వేచ్ఛ ఆయనకు ఉంటుంది. నేరుగా స్పీకర్‌కు పిటిషన్లు ఇవ్వడం సరికాదు.. దానికి ఓ విధానం ఉంది. అది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాటించలేదు. స్పీకర్ ఆదేశాలివ్వలేం కాబట్టి కార్యదర్శికి ఇస్తామని సింగిల్ జడ్జి పేర్కొనడం సమంజసం కాదు' అని నివేదించారు. తదుపరి వాదనల కోసం విచారణను ధర్మాసనం బుధవారానికి వాయిదా వేసింది.

అన్ని ప్రైవేట్ ఆస్తుల స్వాధీనానికి రాష్ట్రాలకు అధికారం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

జస్టిస్ హృషీకేశ్ రాయ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీ ఈ మేరకు మెజారిటీ తీర్పు వెలువరించారు. వారి తరఫున సీజేఐ 193 పేజీల తీర్పును రాశారు. ఈ తీర్పుతో జస్టిస్ బి.వి.నాగరత్న పాక్షికంగా, జస్టిస్ సుధాన్షు ధూలియా పూర్తిగా విభేదించారు.

కాలానుగుణంగా మారాలి: సీజేఐ

ఆర్టికల్ 39(బి) కింద కేవలం ప్రైవేట్ ఆస్తులను కూడా సామాజిక వనరులుగా భావించవచ్చా అన్న అంశం 1992 నుంచి న్యాయస్థానాల్లో నలుగుతోంది. దీనికి సంబంధించి 16 పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. దీన్ని 2002లో తొమ్మిది మంది సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించారు. 2024లో సీజేఐ చంద్రచూడ్ ధర్మాసనం దీన్ని విచారణకు చేపట్టింది. ప్రైవేట్ ఆస్తులన్నింటినీ సామాజిక వనరులుగా భావించడానికి వీల్లేదని సీజేఐ తన తీర్పులో స్పష్టం చేశారు. అలా భావించవచ్చని, వాటిని సమాజ హితం కోసం స్వాధీనం చేసుకోవచ్చని పేర్కొన్న గత తీర్పులు సామ్యవాద ధోరణితో కూడినవని అభిప్రాయపడ్డారు. ''ఆర్టికల్ 39(బి)లో పేర్కొన్న సామాజిక వనరులు అన్న పదబంధం ప్రైవేటు యాజమాన్యంలోని అన్ని ఆస్తులు, వనరులకు వర్తిస్తుందా అన్నది మా ముందున్న ప్రశ్న. సైద్ధాంతికంగా చూస్తే అవుననే సమాధానమే వస్తుంది. కానీ ఆ మేరకు జస్టిస్ కృష్ణయ్యర్ ఇచ్చిన తీర్పు, దాని ఆధారంగా సంజీవ్ కోక్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఏకీభవించలేకపోతున్నాం. కేవలం భౌతిక అవసరాల నిర్వచన పరిధిలోకి వచ్చినంత మాత్రాన ప్రతి ప్రైవేట్ ఆస్తినీ సామాజిక వనరుగా పరిగణించడం కుదరదు. సదరు ఆస్తి తాలూకు స్వభావం, సమాజ శ్రేయస్సుపై దాని ప్రభావం, వనరుల అలభ్యత, అది ప్రైవేటు చేతుల్లో ఉంటే తలెత్తే పరిణామాలు తదితరాలన్నింటినీ బేరీజు వేసిన మీదట మాత్రమే అది సామాజిక వనరో, కాదో తేల్చాలి. ప్రజా విశ్వాస సిద్ధాంతాన్ని కూడా దీనికి వర్తింపజేయాల్సి ఉంటుంది. అడవులు, చెరువు లు, చిత్తడి నేలలు, సహజ వనరులతో కూడిన భూముల వంటివి ప్రైవేట్ స్వాధీనంలో ఉంటే ఆర్టికల్ 39(బి) కింద వాటిని సమాజ అవసరాల నిమిత్తం ప్రభుత్వాలు సేకరించవచ్చు. అదే సమయంలో స్పెక్ట్రం, ఎయిర్‌వేవ్స్, సహజ వాయువు, గనులు, ఖనిజాల వంటి కొరతతో కూడిన పరిమిత వనరులు కొన్నిసార్లు ప్రైవేట్ అజమాయిషీలో ఉండేందుకు ఆస్కారముంది. కనుక పంపకం అనే మాటకున్న అర్థం విస్తృతమైనది'' అని సీజేఐ పేర్కొన్నారు. ''గత తీర్పుల్లో జస్టిస్ కృష్ణయ్యర్, జస్టిస్ చిన్నపరెడ్డి నిర్దిష్ట ఆర్థిక సిద్ధాంతాల ప్రాతిపదికన అభిప్రాయాలు వెలిబుచ్చారు. కానీ స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో సంక్షేమ ఆధారిత విధానాలున్నాయి. తర్వాత మిశ్రమ ఆర్థిక వ్యవస్థ, జాతీయీకరణ వంటివాటి కాలం నడిచింది. ఇది పెట్టుబడుల ఉపసంహరణల యుగం. ప్రైవేట్ పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. కనుక గత పరిస్థితులను ఇప్పుడు ప్రాతిపదికగా తీసుకోరాదు. ప్రస్తు త, భావి అవసరాలను తగ్గట్టుగా తీర్పులుండాలి'' అని ఆయన అభిప్రాయపడ్డా రు. రాజ్యాంగం కూడా ఫలానా ఆర్థిక విధా నాన్నే పాటించాలని సూచించలేదన్నారు.

కృష్ణయ్యర్, చిన్నపురెడ్డి తీర్పులు...

సమాజహితం కోసం ప్రైవేట్ ఆస్తులను సేకరించే అధికారం ప్రభుత్వాలకు ఉంటుందని 1977లో కర్నాటక ప్రభుత్వం వర్సెస్ రంగనాథరెడ్డి కేసులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణయ్యర్ పేర్కొన్నారు. ప్రైవేట్ యాజమాన్యంలోని ఆస్తులు సామాజిక వనరుల నిర్వచనంలోకి రావంటూ ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన మెజారిటీతో తీర్పును వ్యతిరేకించారు. ప్రైవేట్ ఆస్తులు కూడా ఆ నిర్వచనం పరిధిలోకి వస్తాయంటూ ఆయన మైనారిటీ తీర్పు వెలువరించారు. ఆస్తులపై భూస్వాములు, పెట్టుబడిదారుల ఆస్తుల కోటలను బద్దలు కొట్టడానికి ఆర్టికల్ 39(బి)ని రాజ్యాంగంలో ఉద్దేశపూర్వకంగానే చేర్చారని అభిప్రాయపడ్డారు. 1983లో సంజీవ్ కోక్ కేసులో సీజేఐ చిన్నపరెడ్డి కూడా జస్టిస్ కృష్ణయ్యర్ మైనారిటీ తీర్పును పూర్తిగా సమర్థించారు. సామ్యవాద సిద్ధాంతకర్తల ఆదర్శాలే ఆర్టికల్ 39(బి)లో ప్రతిఫలించాయని ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు న్యాయమూర్తులు ఏమన్నారంటే...

ఏ ప్రైవేట్ ఆస్తులనైనా సమాజ హితానికి స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వాలకు ఉందన్న జస్టిస్ కృష్ణయ్యర్, జస్టిస్ చిన్నపరెడ్డి తదితర తీర్పులకు నేటికీ కాలదోషం పట్టలేదని జస్టిస్ ధూలియా అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఆర్టికల్ 38, 39ల్లో పేర్కొన్న సూత్రాలను పక్కన పెట్టడం సబబు కాదన్నారు. అలా చేయడం ప్రభుత్వాల చేతులను కట్టేయడమే అవుతుందని 97 పేజీల తీర్పులో స్పష్టం చేశారు. ''ఎందుకంటే అంబేడ్కర్ హెచ్చరించిన సామాజిక, ఆర్థిక అసమానతలు మన దేశంలో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. పేద, సంపన్న వర్గాల మధ్య ఆదాయ, సంపదపరమైన భారీ అసమానతలు నానాటికీ మరింతగా పెరుగుతున్నాయి'' అన్నారు. జస్టిస్ కృష్ణయ్యర్, జస్టిస్ చిన్నపరెడ్డి తీర్పులకు పూర్తిగా కాలదోషం పట్టలేదని జస్టిస్ నాగరత్న కూడా అభిప్రాయపడ్డారు. అయితే, ''భౌతిక వనరులను ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యంలోవిగా విభజించవచ్చు. పూర్తిగా వ్యక్తిగత అవసరాలను తీర్చే వాటిని మినహాయించి ఇతర ప్రైవేటు ఆస్తులను సమాజ హితం కోసం ప్రభుత్వం సేకరించవచ్చు. ఆ మీదట సమాజ హితం కోసం అర్హులకు వాటిని చట్టపరమైన మార్గాల్లో తాత్కాలిక/శాశ్వత ప్రాతిపదికన బేషరతుగానో, షరతులతోనో పంపకం చేయవచ్చు'' అని ఆమె పేర్కొన్నారు. అయితే జస్టిస్ కృష్ణయ్యర్ తీర్పుపై సీజేఐ చంద్రచూడ్ వ్యాఖ్యలను 'పరుషమైనవి, అనవసరమైనవి'గా జస్టిస్ ధూలియా, జస్టిస్ నాగరత్న అభివర్ణించడం విశేషం. వాటితో తాము గట్టిగా విభేదిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

ఆర్టికల్ 39(బి) ఏం చెబుతోందంటే...

''సామాజిక వనరులు సమాజ విశాల హితం కోసం పంపిణీ అయేలా చూడటం ప్రభుత్వ బాధ్యత. ఇందుకు వీలుగా సదరు వనరులపై యాజమాన్యం, నియంత్రణకు అవసరమైన విధానాలను రూపొందించాలి''.

సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీగా లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) అసిస్టెంట్ సెక్రటరీగా డిప్యూటీ కలెక్టర్ వి.లచ్చిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయనను నియమిస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకుముందు సీసీఎల్ఏ కార్యాలయంలో సీఎంఆర్‌వో ప్రాజెక్టు డైరెక్టర్‌గా లచ్చిరెడ్డి పనిచేశారు. కాగా, ఆ పోస్టులో ప్రభుత్వం ఇటీవల ఐఏఎస్ అధికారిని నియమించింది. ఈ నేపథ్యంలో లచ్చిరెడ్డిని సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీగా బదిలీ చేశారు.



రూట్స్

'నిన్నటి ఆధునిక కళ నేటి సంప్రదాయ కళ' అంటారు.
కొన్ని దశాబ్దాల వెనక్కి వెళితే....లంబాడ గిరిజనుల సంప్రదాయ వస్త్రాధారణ కన్నుల పండగగా ఉండేది. ఇప్పుడు ఎక్కడో తప్ప సంప్రదాయ దుస్తులు ధరించే వారు కనిపించడం లేదు.
ఇక సంప్రదాయ వస్త్రధారణ అనేది నిన్నటి కళేనా?
'కానే కాదు' అంటుంది బాలమణి. ఎనభై సంవత్సరాల బాలమణి పాతతరం ప్రతినిధి.
'అయ్యో...మా కళలు మాకు దూరం అవుతున్నాయే' అని నిట్టూర్చేది ఒకప్పుడు.
ఇప్పుడు ఆమెలో నిన్నటి నిట్టూర్పు లేదు. 'ఇదిగో మా కళలు మళ్లీ మా దగ్గరికి వస్తున్నాయి' అనే సంతోషం ఆమె కళ్లలో మెరుస్తుంది....

... అద్దాల అందం

కల్చరల్ ఐడెంటిటీగా భావించే 'లంబాడీ ఎంబ్రాయిడరీ'కి మళ్లీ ప్రాధాన్యత పెరిగింది. సేవాలాల్, మేరీమా, పన్నీ భవానీ పూజలు, తీజ్...మొదలైన పండగలకు సంప్రదాయ దుస్తులు వేసుకోవడం తప్పనిసరిగా మారింది. ప్రత్యేక కార్యక్రమాల్లో సెలబ్రిటీలు కూడా బంజార సంప్రదాయ దుస్తులు ధరిస్తున్నారు. దీంతో వీటిని రూ. 30వేల నుండి రూ. 2లక్షల వరకు ఖర్చుపెట్టి మరీ తయారు చేయించుకుంటున్నారు. సినిమాలు, ప్రైవేట్ ఆల్బమ్స్ పాటల చిత్రీకరణకు ఈ దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

మహిళలు వేసుకునే సంప్రదాయ దుస్తులను పేట్యి, పేట్, గుంగుటో, కాంట్లీపేటీ, పులియ, గున్నో ...ఇలా ప్రత్యేకమైన పేర్లతో పిలుస్తారు. వారు ధరించే ఆభరణాలు టోబ్లీ (చెవులకు పెట్టుకునేవి), హస్లీ(మెడలో వేసుకునే కడియం), వాంగ్డీ, కస్సులు(కాళ్లకు వేసుకునే వంకులు), హారం(రూపాయి బిల్లలను అతికించి వెండితో తయారు చేసే ఆభరణం) బల్యా(గాజులు)లకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పట్కారి వారు వీరికి దుస్తులు, ఆభరణాలు, అలంకరణ వస్తువులు తయారుచేస్తుంటారు.

బాలమణికి, సోనియా రాథోడ్‌కి ఎన్నో తరాల దూరం ఉంది. అయితే సంప్రదాయ కళల పట్ల వారి అభిరుచి విషయంలో మాత్రం ఎలాంటి దూరం లేదు. ఒకరు తమ తరం కళను ఈతరంలో చూసుకోవాలనుకుంటున్నారు. మరొకరు అలనాటి సంప్రదాయ కళలకు వారధిగా ఉండాలనుకుంటున్నారు.

ఒకరిది ఆశావాదం. మరొకరిది ఆ ఆశావాదాన్ని ఆచరణలో తీసుకొచ్చి పూర్వ కళలకు అపూర్వ వైభవాన్ని తీసుకువచ్చే నవ చైతన్యం.

– ఈరగాని భిక్షం, సాక్షి, మహబూబాబాద్
ఫొటోలు: మురళీ మోహన్

అద్దాల రవిక అందమే వేరు!



నాకు 80 సంవత్సరాలు ఉంటాయి. చిన్నప్పటి నుంచి మా అమ్మానాయినలు, తర్వాత అత్తామామలు లంబాడ దుస్తులు తయారీ చేస్తుంటే చూసి నేర్చుకున్నాను. రెండు రూపాయిలకు రవిక కుట్టడం నుంచి నాకు తెలుసు, రవికలు, అద్దాలు, రంగు రంగుల అతుకులతో పేటీలు కుట్టి ఇస్తే వాళ్ల ఇండ్లల్లో పండే ప్రతీ పంట మాకు పెట్టేవాళ్లు. కాలం మారింది. ఇప్పుడు మాతోపాటు, ఇతర ప్రాంతాల్లో కూడా వీటిని కుడుతున్నారు. ఏ బట్టలు వేసుకున్నా రాని అందం అద్దాల రవికతో వస్తుంది

- బాలామణి



కలర్‌ఫుల్‌గా!

నాకు చిన్నప్పటి నుండి మా సంస్కృతి సంప్రదాయాలంటే బాగా ఇష్టం. మా తండాలో ఉత్సవాలు జరిగినప్పుడు అందరం సంప్రదాయ దుస్తులు వేసుకుంటాం. తీజ్‌తో సహా ఇతర పండుగలకు కలర్‌ఫుల్ దుస్తులతో ఆడవారు కన్పించే తీరు కన్నుల పండుగగా ఉంటుంది. వేడుకలు, ఉత్సవాలలో సంప్రదాయ దుస్తులను ధరించడానికి ఇష్టపడతాను.

- డాక్టర్ సోనికా రాథోడ్



పెద్దల బాటలో...

గిరిజన సాంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయి. వివాహాలు, ఇతర శుభ కార్యాక్రమాలలో సాంప్రదాయ దుస్తులు తప్పకుండా వేసుకోవాలి. అప్పుడు మన సంస్కృతి, సాంప్రదాయాన్ని పెద్దలు చూపిన మార్గాన్ని అనుసరించిన వారం అవుతాం.

- పద్మ, సేవాలాల్ సేనా మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు

మనసులో మాట



● కిరణ్ రావ్

ఆడవాళ్లేం మొద్దు మొహాలు కారు

'లాపతా లేడీస్ ' సినిమాలో కొత్త దంపతులు (రెండు జంటలు) అనుకోకుండా తప్పిపోయి విడిపోతే, నిజ జీవితంలో అనుకుని విడిపోయిన జంట కిరణ్ రావ్, ఆమిర్ ఖాన్. 16 ఏళ్ల దంపతులుగా ఉన్న ఆమిర్, కిరణ్ 2021 లో విడాకులు తీసుకున్నారు. తీసుకున్నారు సరే, కలిసి పని చేయటం మానలేదు. కొడుకు అజాద్ ను కూడా విడివిడిగా ఉంటూనే కలిసి పెంచుతున్నారు. మరి ఇంత మంచి కో ఆర్డినేషన్ ఉన్న వాళ్లు కలిసి ఎందుకు జీవించ లేకపోయారు? విడిగా ఉంటే ఇంకా బాగా కలిసి జీవించ వచ్చని వారు అనుకున్నట్లుంది! ఆస్కార్ కు నామినేట్ అయిన ' లాపతా లేడీస్ ' వాళ్ళిద్దరూ కలిసి తీసిందే. ఆమె డైరెక్టర్. ఆయన ప్రొడ్యూసర్.

'ఆమిర్ లో మీకు నచ్చే విషయం ఏమిటి?' అని కరీనా కపూర్ తన ' వాట్ ఉమెన్ వాంట్ ' తాజా షోలో అడిగినప్పుడు కూడా కిరణ్ ఆమిర్ గురించి చాలా గొప్పగానే చెప్పారు. 'వ్యక్తిగా ఆయన 100 పర్సెంట్ గై' అన్నారు. (భర్తగా ఎంత పర్సెంట్ అని కరీనా అడగలేదు, కిరణ్ కూడా చెప్పలేదు). 'గొప్ప క్రియేటివ్ పర్సన్' అన్నారు. 'ఏదైనా అనుకుంటే అది పూర్తయ్యే వరకు దాని మీదే ఉంటారు' అన్నారు.

'ఓకే, మరి ఆమిర్ లో మీకు నచ్చనిది ఏమిటి?' అని కరీనా ప్రశ్న.

'ఒకేసారి 20 పనులు పెట్టుకుంటారు. ఏ పనిలోనూ త్వరగా నిర్ణయం తీసుకోరు. ఆ ఇరవైలో మొదటి మూడు మేమిద్దరం కలిసి చేస్తున్నవి అయినా సరే వాటికి ప్రాముఖ్యం ఉంటుందే కానీ, ప్రాధాన్యం ఉండదు' అని కిరణ్.

'అవునా, ఇంకా ఏం నచ్చదు మీకు ఆమిర్ లో?' అని నవ్వుతూ, కరీనా.

'వద్దు లెండి'... 'పర్లేదు చెప్పండి'

'ఒకటేదైనా చెప్పవలసి వస్తే రెండు ముక్కల్లో చెప్పరు. సుదీర్ఘంగా లెక్చర్ ఇస్తారు. అదెలా ఉంటుందంటే... ఆడవాళ్ళను మొద్దుమొహాలు గా భావించి మగవాళ్ల చేసే బోధనలా ఉంటుంది..' అని చెప్పారు.

ఆ మాటకు పెద్దగా నవ్వారు కరీనా. నిజానికి అది నవ్వే సంగతి కాదని కరీనాకు తెలియకుండా ఉంటుందా?

దంపతులు విడిపోవటానికి వారు చూపే కారణాలు ఒక్కోసారి బయటి వారికి చాలా చిన్నవిగా కనిపించవచ్చు. కానీ కలిసి ఉండలేక పోవటానికి వారు చూపని పెద్ద కారణాలు కూడా అవే కావచ్చు. ఏమైనా ఆమిర్, కిరణ్ లను ఇప్పటికీ ఆదర్శ ప్రాయమైన జంటే అనుకోవాలి. విడిపోయాక విసుర్లు లేవు. కలిసి లేరు కనుక కసుర్లూ లేవు.

స్ఫూర్తి

'పెద్ద చదువులు చదవాలి' అనేది పేదింటి అమ్మాయి ఆక్సా కోరిక. అయితే అదంత తేలికైన విషయం కాదని ఆమెకు అర్థం అయింది. దారి పొడగునా ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంది. అయినా సరే ఆమె ప్రయాణం ఆగలేదు. 'పెద్ద చదువులు చదవడానికి పేదరికం అడ్డు కాదు' అని నిరూపించి ఎంతో మంది అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలుస్తోంది అక్సా పులారా. టెక్ దిగ్గజం గూగుల్‌లో ఇన్నోవేషన్ ప్రాజెక్ట్‌లలో కీలక బాధ్యతలు చూస్తోంది.



● ఆక్సా పులారం

సాంగ్లీ నుంచి స్టాన్‌ఫర్డ్ వరకు

మహారాష్ట్రలోని సాంగ్లీలో పుట్టిన ఆక్సా పులారా 'వాల్చంద్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్' నుండి బ్యాచిలర్ డిగ్రీ చేసింది. 'చదివింది చాలు' అన్నారు ఇంటి పెద్దలు. ఉన్నత చదువులు చదవాలనేది అక్సా లక్ష్యం.

'నేను ఇంకా చదువుకోవాలనుకుంటున్నాను' అంటే ససేమిరా అన్నారు.

అదేపనిగా అడిగితే పెద్దల మనసు కరిగింది.

'సరేలే. చదువుకో' అన్నారు.

ఆరోజు తనకు ఎంత సంతోషమైందో!

'యస్...నేను సాధించగలను' అనే గట్టి నమ్మకం వచ్చింది.

ఆ నమ్మకమే అక్సాకు ఎంతో శక్తిని ఇచ్చింది. ఆ శక్తే తనను అమెరికా వరకు తీసుకెళ్లింది.

అమెరికాలో చదువుకుంటున్న వారి గురించి వినడమే కాని తాను కూడా చదువు కోసం అక్కడికి వెళతానని కలలో కూడా అనుకోలేదు. సదరన్ కాలిఫోర్నియా యూనివర్శిటీలో చేరింది. ఆ తరువాత స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీలో కొంతకాలం పని చేసింది. అక్కడ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్(యంఎల్)తో సహా అత్యాధునిక సాంకేతికతలో తన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంది.

ఆ తరువాత గూగుల్‌లో చేరింది. అక్కడ ఏఐ, మెషిన్ లెర్నింగ్ ఇన్నోవేషన్‌లకు సంబంధించిన ప్రాజెక్ట్‌లను లీడ్ చేస్తోంది.

కాలేజీ, యూనివర్శిటీ రోజుల్లో గూగుల్‌లో ఆవిష్కరణల గురించి ఆసక్తిగా తెలుసుకునేది. ఇప్పుడు ఆ ఆవిష్కరణలలో తాను కూడా భాగం అయింది.

అక్సాకు మొదటి నుంచి టెక్నాలజీ అంటే ఇష్టం. ముఖ్యంగా కట్టింగ్–ఎడ్జ్ టెక్నాలజీగా చెప్పే ఏఐ, ఎంఎల్‌లో ప్రతి చిన్న విషయం తెలుసుకునే ప్రయత్నం చేసేది. నిజజీవితంలో మనం ఎదుర్కొనే ట్రాఫిక్‌జామ్‌లాంటి సమస్యలకు ఏఐ, ఎంఐ సాంకేతికత పరిష్కారం చూపుతుందని అంటుంది ఆక్సా పులారా.

గూగుల్‌లో చేరిన తరువాత ఆ సంస్థ ఏఐ అండ్ ఎంఎల్ డెవలప్‌మెంట్స్‌లో ప్రధాన పాత్ర పోషిస్తోంది. టీమ్ వర్క్‌స్పేసెస్, లుకర్ స్టూడియో ప్రో... మొదలైన ఇన్నోవేటివ్ గూగుల్ ప్రాడక్ట్స్‌లో తన వంతు పాత్ర నిర్వహించింది.

మనలో సామర్థ్యం ఉండగానే సరిపోదు. ఆ సామర్థ్యానికి తగిన వేదిక కూడా దొరకాలి. గూగుల్ రూపంలో ఆమెకు సరైన వేదిక దొరికింది.

'గూగుల్‌లో కనిపించే కల్చరల్ ఆఫ్ ఇన్నోవేషన్ ప్రభావంతో పరిశోధనలపై ఆసక్తి పెరిగింది. సంక్లిష్టమైన సమస్యలకు పరిష్కారం కనుక్కోవాలనే కుతూహలం నన్ను ముందుకు నడిపించింది' అంటుంది అక్సా పులారా.

ఆమె పట్టుదల, ఉత్సాహం చూస్తుంటే ఎన్నో ఆవిష్కరణలలో కీలకపాత్ర పోషించబోతుందని గట్టిగా చెప్పవచ్చు.

వైల్డ్ లైఫ్

వారి పిల్లలు చెట్లు దైవం కృష్ణజింక

సల్మాన్‌ఖాన్‌కు గ్యాంగ్ స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి బెదిరింపులు రావడంతో బాలీవుడ్ సూపర్‌స్టార్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మరోవైపు 'కృష్ణజింకలను వేటాడిన కేసులో సల్మాన్‌ఖాన్ నిర్దోషి' అని అతని తండ్రి సలీంఖాన్ ప్రకటనపై బిష్ణోయ్ సంఘాలు నిరసన ప్రకటించాయి. ఈ నేపథ్యంలో కృష్ణజింకలు, వాటితో బిష్ణోయ్ సమాజానికి ఉన్న అనుబంధం మరో సారి వార్తల్లోకి వచ్చింది.

చెట్లను బిడ్డల్లా చూసుకోవడం విషయానికి వస్తే...

1730లో జోధ్‌పూర్ సమీపంలోని ఖేజర్లీ గ్రామంలో చెట్లను నరికి వేయకుండా కాపాడే క్రమంలో 362 మంది బిష్ణోయిలు మరణించారు. జోధ్‌పూర్ మహారాజా అభయ్‌సింగ్ ఆదేశాల మేరకు ఈ మారణకాండ జరిగింది.

కొత్త రాజభవనాన్ని నిర్మించడానికి అభయ్ సింగ్ కలప కోసం చెట్లను నరికి వేయడానికి సైనికులను పంపాడు. అమృతాదేవి అనే మహిళ నాయకత్వంలో బిష్ణోయ్ ప్రజలు ప్రతిఘటించారు. అమృతాదేవి తదితరులు చెట్లను కౌగిలించుకొని వాటిని రక్షించడానికి సాహసోపేతంగా ప్రతిఘటించారు. ఈ సంఘటన 1973 చిప్కో ఉద్యమానికి ప్రేరణ ఇచ్చింది.



వారిది 550 సంవత్సరాల అనుబంధం!

పదిహేనవ శతాబ్దంలో గురు జంబేశ్వర్ (జాంబాజీ అని కూడా పిలుస్తారు) స్థాపించిన బిష్ణోయ్ శాఖ 29 సూత్రాలతో మార్గనిర్దేశం చేయబడింది. జాంబాజీ బోధనలు వన్య ప్రాణులు, చెట్ల ప్రాముఖ్యత, సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తాయి.

కృష్ణజింకను తమ ఆధ్యాత్మిక గురువుగా జాంబేశ్వర్ పునర్జన్మగా నమ్మి పూజిస్తారు.

బిష్ణోయ్‌ల జానపద కథల్లోనూ కృష్ణజింక ప్రధానంగా కనిపిస్తుంది. కృష్ణజింకను తన ప్రతీకగా, వ్యక్తీకరణగా ఆరాధించమని జాంబేశ్వర్ తన అనుచరులకు ఆదేశించినట్లు చెబుతారు.

తాము కృష్ణజింకలుగా పునర్జన్మ పొందుతామని బిష్ణోయ్‌లు నమ్ముతారు.

మనీ మంత్ర

రోజుకు నాలుగు గంటలు పనిచేస్తుంది నెల ఆదాయం 15 లక్షలకు పై మాటే!

'నేను రోజుకు నాలుగు గంటలే పనిచేస్తాను' అని ఎవరైనా అంటే....

'అయితే ఏంటటా' అనుకుంటాం.

'నేను రోజుకు నాలుగు గంటలే పనిచేసినా నెలకు పదిహేను లక్షలు సంపాదిస్తాను' అని అంటే మాత్రం 'అయ్ బాబోయ్' అని బోలెడు ఆశ్చర్యపోవడమే కాదు 'అలా ఎలా?' అని అడుగుతాం.

అమీ లాండినో (న్యూయార్క్)ను ఇప్పుడు చాలామంది ఈ ప్రశ్న అడుగుతున్నారు.

'నేను ఉండాల్సింది ఇక్కడ కాదు. డిజిటల్ ఫీల్డ్‌లో' అంటూ చాలా సంవత్సరాల క్రితం కాలేజీకి గుడ్‌బై చెప్పిన అమీ లాండినో మన కరెన్సీలో నెలకు పదిహేను లక్షలకు పైగా సంపాదిస్తుంది. 'సోషల్ మీడియా'ను లాభదాయకమైన వ్యాపారక్షేత్రంగా మలుచుకోవడంలో విజయం సాధించింది. మొదట్లో వీడియోలను యూట్యూబ్‌లో షేర్ చేసేది. ఇలా చేస్తున్న క్రమంలోనే తనలోని స్కిల్స్‌ను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకునేది.



● అమీ లాండినో

వ్యాపారులు తమకు కావలసిన వీడియోలను సొంతంగా ఎలా క్రియేట్ చేసుకోవచ్చో నేర్పే ఆన్‌లైన్ కోర్సును ప్రారంభించడం అమీ లాండినోకు టర్నింగ్ పాయింట్. లాండినో యూట్యూబ్ చానల్ 'అమీ టీవి'లో తన గోల్–సెట్టింగ్ ప్రాసెస్‌తో సహా వెయ్యికి పైగా వీడియోలు ఉన్నాయి.

అమీ లాండినో 'స్టార్ యూట్యూబర్' మాత్రమే కాదు ఎన్నో పుస్తకాలు కూడా రాసింది.

లీగల్

మిమ్మల్ని వెళ్లగొట్టే హక్కు వారికి లేదు!

నా వయసు 45 సంవత్సరాలు. మా పెళ్లి జరిగి పాతికేళ్లకు పైగా అయింది. పెళ్లయిన నాటినుంచి నాకు భర్త నుంచి ఆదరణ లేదు సరికదా, చీటికిమాటికీ నాపై చెయ్యి చేసుకోవడం, అత్తమామలు, ఆడబిడ్డల నుంచి ఆరళ్లు... పిల్లలు పుట్టి, పెద్దవాళ్లయినా నాకీ మానసిక, శారీరక బాధలు తప్పడం లేదు. అదేమంటే నన్ను ఇంటిలోనుంచి వెళ్లగొడతానని బెదిరిస్తున్నారు. ఈ పరిస్థితులలో నేను ఏం చేయాలి? సలహా ఇవ్వగలరు.

– కె. సుజాత, శంషాబాద్

పెళ్ళైన తర్వాత భర్త ఇంటికి వెళ్ళి, గృహిణిగా వుండే స్త్రీలే మన సమాజంలో ఎక్కువ. అలా గృహిణిగా వుంటున్న స్త్రీలని ఏదో వారికి సేవ చేయటానికి మాత్రమే కట్నం ఇచ్చి మరీ పెళ్ళి చేశారు అనే పురుషాహంకార భావజాలాలు కల్గిన భర్తలు, అత్త–మామలూ కూడా ఎక్కువే! ఉద్యోగం వదిలేసి, తనకంటూ స్వంత ఆదాయం లేకుండా కొన్ని సంవత్సరాల పాటు కాపురం చేశాక ''నేను వదిలేస్తే నీకు జీవితం లేదు.. వుండటానికి నీడ కూడా దొరకదు.. నీకు విడాకులు ఇస్తాను, రోడ్డున పడతావ్' అంటూ బెదిరిస్తూ మహిళలపై అజమాయిషి చలాయించేవారిని తరచు చూస్తుంటాం. ముందూ వెనుకా ఎవరి సహాయం లేకుండా, పెద్దగా చదువుకోకుండా, ఉద్యోగంలో చాలా గ్యాప్ వచ్చి లేదా పుట్టినింటినుంచి పెద్దగా ఆదరణ లేదు అని అనుకున్న స్త్రీలైతే భర్త వదిలేస్తే వారి పరిస్థితి ఏమిటి అని భయపడుతూ, వారికి ఎదురయ్యే గృహహింసను కూడా మౌనంగా భరిస్తూ ఉంటారు.

నిజానికి అలా భయపడవలసిన అవసరం లేదు. ఇలాంటి పరిస్థితులలో మహిళలకు ఎంతో బాగా ఉపయోగపడే, రక్షణ కల్గించే చట్టమే 'గృహ హింస చట్టం, 2005'. ఈ చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం, భర్త (లేదా అత్త–మామలు) నివసిస్తున్న ఇంట్లోనే, విడాకుల కేసు లేదా మరేయితర కేసులు నడుస్తున్నప్పటికీ గృహహింసకు గురైన మహిళకు కూడా సమానంగా నివసించే హక్కు వుంటుంది. కొన్ని సందర్భాలలో ఐతే భార్య/గృహ హింసకి గురవుతున్న స్త్రీ రక్షణ కొరకు భర్తను ఇంట్లోనుంచి వెళ్లిపోవాలి అని కూడా కోర్టులు ఆదేశాలు ఇచ్చాయి. భర్త పేరిట ఇల్లు ఉన్నా గాని, అలాంటి ఆదేశాలు ఇచ్చే అవకాశం కల్పిస్తుంది ఈ చట్టం. అలా కుదరని పక్షంలో భర్త నివసించే ఇంటికి సమానమైన ప్రత్యామ్నాయ వసతిని కల్పించవలసి ఉంటుంది. అంతేకాక, మరలా గృహహింసకు పాల్పడే వీలు లేకుండా భర్త – తన కుటుంబ సభ్యులపై కూడా ఇంజక్షన్ ఇస్తూ కోర్టు ''ప్రొటెక్షన్ ఆర్డరు / రక్షణ ఉత్తర్వులు '' ఇవ్వవచ్చు. కాబట్టి, భర్త వదిలేస్తే ఇక తనకి జీవితం వుండదు అనుకునే ధోరణి అవసరం లేదు. గృహ హింసని భరించాల్సి అవసరం అంతకంటే లేదు. గృహ హింస చట్టం, 2005 అనేది ఒక ప్రత్యేక చట్టం. ఇందుకుగాను మీరు నేరుగా మెజిస్ట్రేట్ ను గానీ, స్త్రీ – శిశు సంక్షేమ శాఖను గానీ సంప్రదించ వచ్చు. ఐపీసీ 498అ (కొత్త చట్టం – సెక్షన్ 85 బి.ఎన్.ఎస్) కు, గృహ హింస చట్టానికి సంబంధం లేదు. ఆరోపణలు, గృహహింస ఒకటే అయినప్పటికీ రెండు కేసులు వేర్వేరుగా పిర్యాదు చేయాలి.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.com కు మెయిల్ చేయవచ్చు.

సమ్‌థింగ్ స్పెషల్

ప్లీజ్... ఇంకో బిడ్డను కనవచ్చు కదా!



'మీరు ఇప్పుడు ప్రెగ్నెంటా?' అని ప్రభుత్వ అధికారులు చైనాలోని మహిళలకు ఫోన్ చేసి అడుగుతున్నారు. అడిగితే అడిగారు అని సర్దుకున్నా 'ఇంకో బిడ్డను కనవచ్చు కదా' అని సలహా కూడా ఇస్తున్నారు.

ఒకప్పుడు కఠినమైన జనన నియంత్రణ చర్యలు చేపట్టిన చైనా ఇప్పుడు అదనపు జనాభా కోసం ఎందుకు ఆరాటపడుతుంది?

ప్రధాన కారణాలలో ఒకటి చైనాలో సంతానోత్పత్తి రేటు తగ్గడం. 2035 నాటికి చైనా జనాభాలో మూడింట ఒక వంతు 60 ఏళ్ల పైబడిన వారు ఉంటారని 'ప్యూ' రీసెర్చ్ నివేదిక చెప్పింది. 'ప్రపంచ కర్మాగారం'గా తనకు తాను గర్వించుకునే చైనాకు యువ జనాభా అవసరం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని జనాభా పెంచడానికి కృషి చేస్తోంది.

జనాభా నియంత్రణ కోసం 'వన్–చైల్డ్ పాలసీ'ని కఠినంగా అమలుచేసిన దేశంలో ఈ సరికొత్త మార్పు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.



తొలి రౌండ్‌లోనే ఓడిన ఆకుల శ్రీజ

వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చాంపియన్స్ ఫ్రాంక్‌ఫర్ట్ టోర్నీలో భారత నంబర్ వన్, తెలంగాణ క్రీడాకారిణి ఆకుల శ్రీజ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. జర్మనీలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 25వ ర్యాంకర్ శ్రీజ కేవలం 18 నిమిషాల్లో 3-11, 4-11, 8-11తో ప్రపంచ 15వ ర్యాంకర్ అడ్రియానా దియాజ్ (ప్యూర్టోరికో) చేతిలో ఓడిపోయింది. శ్రీజకు 4,250 డాలర్ల (రూ. 3 లక్షల 57 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 15 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

విదిత్‌పై 96 ఎత్తుల్లో గెలిచిన అర్జున్



చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ శుభారంభం చేశాడు. చెన్నైలో మంగళవారం ఐదు గంటలపాటు జరిగిన తొలి రౌండ్ గేమ్‌లో అర్జున్ 96 ఎత్తుల్లో భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ విదిత్‌పై గెలిచాడు. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఏడు రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఇదే వేదికపై జరుగుతున్న చెన్నై చాలెంజర్స్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక తొలి రౌండ్‌లో 63 ఎత్తుల్లో ప్రణవ్ (భారత్) చేతిలో ఓడిపోయింది.

రియాద్‌లో కాదు... జిద్దాలో

ఈనెల 24, 25వ తేదీల్లో ఐపీఎల్ మెగా వేలం • బరిలో 1574 క్రికెటర్లు



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మెగా వేలానికి వేదిక ఖరారైంది. ఈ నెల 24, 25న సౌదీ అరేబియాలోని జిద్దా నగరంలో ఐపీఎల్–2025 వేలంపాట జరగనుందని మంగళవారం బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. గత ఏడాది దుబాయ్‌లో ఐపీఎల్ వేలం నిర్వహించగా... వరుసగా రెండో ఏడాది విదేశాల్లో ఐపీఎల్ వేలం జరగనుంది. ముందుగా సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో వేలం నిర్వహిస్తారని వార్తలు వచ్చినా బీసీసీఐ మాత్రం జిద్దా నగరాన్ని ఎంచుకుంది.

• ఇటీవల ఫ్రాంచైజీల రిటెన్షన్ జాబితా విడుదల కాగా... 1574 మంది ప్లేయర్లు వేలానికి రానున్నారు. ఇందులో 1165 మంది భారత ఆటగాళ్లు, 409 మంది విదేశీయులు ఉన్నారు. మొత్తంగా 320 మంది క్యాప్డ్ ప్లేయర్లు, 1224 మంది అన్ క్యాప్డ్ ప్లేయర్లు ఉన్నారు. ఇందులో జాతీయ జట్టుకు ఆడిన భారత ఆటగాళ్లు 48 మంది ఉండగా... 965 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లు ఉన్నారు. అసోసియేట్ దేశాల నుంచి 30 మంది ప్లేయర్లు వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

• ఇంగ్లండ్ స్టార్ బెన్ స్టోక్స్ వచ్చే ఐపీఎల్ టోర్నీకి దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నాడు. 2014 నుంచి ఒక్క టి20 మ్యాచ్ కూడా ఆడని ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ అండర్సన్ ఏకంగా రూ. 1 కోటి 25 లక్షల కనీస ధరకు తన పేరును నమోదు చేసుకోవడం విశేషం.

• ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా టీమిండియా తొలి టెస్టు ఆడుతున్న సమయంలోనే ఈ వేలం జరగనుంది. ఒక్కో జట్టు రీటైన్ ఆటగాళ్లను కలుపుకొని అత్యధికంగా 25 మంది ప్లేయర్లను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. అంటే ప్రస్తుతం ఫ్రాంచైజీలు రీటైన్ చేసుకున్న ఆటగాళ్లు కాకుండా... ఇంకా 204 మంది ప్లేయర్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంది.

• రిటెన్షన్ విధానంలో పలువురు ప్రధాన ఆటగాళ్లను ఫ్రాంచైజీలు వదిలేసుకోవడంతో... రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, సిరాజ్ లాంటి పలువురు భారత స్టార్ ఆటగాళ్లు వేలానికి రానున్నారు. మొత్తంగా 10 ఫ్రాంచైజీలు కలిపి 204 మంది ప్లేయర్ల కోసం రూ. 641.5 కోట్లు వేలంలో ఖర్చు చేయనున్నాయి. ఇందులో 70 మంది విదేశీ ఆటగాళ్లకు అవకాశం దక్కనుంది.

• రిటెన్షన్ గడువు ముగిసేసరికి 10 జట్లు రూ. 558.5 కోట్లు ఖర్చు పెట్టి 46 మంది ప్లేయర్లను అట్టిపెట్టుకున్నాయి. రిటెన్షన్ ప్రక్రియ ముగిసిన తర్వాత అత్యధికంగా పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ వద్ద రూ.110.5 కోట్లు మిగిలి ఉన్నాయి.

మళ్లీ టాప్-10లోకి హర్మన్‌ప్రీత్ కౌర్



దుబాయ్: భారత మహిళల క్రికెట్ జట్టు సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ మళ్లీ టాప్–10 ర్యాంకింగ్స్‌లోకి వచ్చింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం విడుదల చేసిన మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో హర్మన్ (654 రేటింగ్ పాయింట్లు) తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచింది. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో ఆఖరి పోరులో కెప్టెన్ అజేయ అర్ధసెంచరీ చేసింది. తొలి రెండు వన్డేల అనంతరం ఆమె మూడు స్థానాలు కోల్పోయి టాప్–10 నుంచి బయటకు వచ్చింది. అయితే సిరీస్ నిర్ణాయక వన్డేలో ఆమె 63 బంతుల్లో 59 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. దీంతో మళ్లీ మూడు స్థానాలు మెరుగుపర్చుకుంది. భారత జట్టు వైస్ కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన నిలకడగా నాలుగో ర్యాంక్‌లోనే కొనసాగుతోంది. చివరి వన్డేలో సాధించిన శతకంతో ఆమె రేటింగ్ పాయింట్లు మెరుగయ్యాయి. 23 పాయింట్లు పెరగడంతో ప్రస్తుతం స్మృతి 728 పాయింట్లతో టాప్–3కి చేరువైంది. బౌలింగ్ విభాగంలో భారత స్పిన్నర్ దీప్తి శర్మ రెండో ర్యాంక్‌లో మార్పు లేకపోయినప్పటికీ రేటింగ్ పాయింట్లను 687 నుంచి 703కి పెంచుకుంది.

మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మేము సైతం ఒలింపిక్స్ నిర్వహణకు...

2036 విశ్వ క్రీడల ఆతిథ్యం కోసం భారత్ ఆసక్తి

తొలి అడుగు వేసిన కేంద్ర ప్రభుత్వం	ఐఓసీకి 'లెటర్ ఆఫ్ ఇంటెంట్' సమర్పణ	పలు అగ్రదేశాల నుంచి భారీ పోటీ

భారత్‌లో ఒలింపిక్స్ క్రీడల నిర్వహణ అనేది సుదీర్ఘ కాలపు స్వప్నం. జనాభా పరంగా అతి పెద్ద దేశమే అయినా క్రీడల్లో వెనుకబడిన దేశాల జాబితాలోనే మనం ఉన్నాం. పైగా మెగా ఈవెంట్ నిర్వహణ ఆర్థికపరంగా చాలా భారం అయ్యే అవకాశం ఉండటంతో ఇప్పటి వరకు అలాంటి ఆలోచన కూడా మన వైపు జరగలేదు. కానీ మొదటిసారి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక విశ్వ క్రీడల నిర్వహణ కోసం ఆసక్తి చూపిస్తోంది. అందుకే 2036 క్రీడల నిర్వహణ కోసం బరిలోకి దిగింది. ఆతిథ్య హక్కుల కేటాయింపులో చాలా పెద్ద ప్రక్రియ ఉన్నా... మేమూ సిద్ధం అన్నట్లుగా తొలి అడుగు వేసి చూపించింది.



గత ఏడాది ఐఓసీ సెషన్ సందర్భంగా ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాచ్‌తో ప్రధాని మోదీ (ఫైల్)



అహ్మదాబాద్‌లో ఒలింపిక్ వేదికల ప్రతీకాత్మక చిత్రం

న్యూఢిల్లీ: భారత్‌లో ఇప్పటి వరకు జరిగిన ఏకైక ప్రపంచ స్థాయి మెగా స్పోర్ట్స్ ఈవెంట్ 2010 కామన్వెల్త్ గేమ్స్. దేశ రాజధాని వేదికగా జరిగిన ఈ పోటీలు ఆటల పరంగా విజయవంతంగా ముగియడంతో పాటు ఆర్థికపరంగా వివాదాలను కూడా వెంట తెచ్చాయి. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు మన దేశం మరో ప్రతిష్టాత్మక క్రీడా సంబరం కోసం ముందుకు వస్తోంది. 2036 ఒలింపిక్స్ నిర్వహించేందుకు తామూ సిద్ధంగా ఉన్నామని భారత్ ప్రకటించింది. దీనికి సంబంధించి తమ ఆసక్తిని కనబరుస్తూ అక్టోబర్ 1న అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి చెందిన ఫ్యూచర్ హోస్ట్ కమిషన్‌కు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) 'లెటర్ ఆఫ్ ఇన్‌టెంట్'ను సమర్పించింది. 'ఒలింపిక్స్ నిర్వహించే అవకాశం వస్తే అది భారత ఆర్థిక వ్యవస్థకు, సామాజిక పురోగతికి, దేశవ్యాప్తంగా యువత స్వావలంబనకు ఎంతో మేలు చేస్తుంది' అని ఐఓఏ అధికారి ఒకరు అభిప్రాయ పడ్డారు. ఏడాది క్రితం దేశ ప్రధాని నరేంద్ర మోదీ ముంబైలో జరిగిన ఐఓసీ సెషన్‌లో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించే అంశాన్ని మొదటిసారి ప్రస్తావించారు. ఆయన సూచనల మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలోని మిషన్ ఒలింపిక్ సెల్ అధికారులు సమగ్ర సమాచారంతో ప్రత్యేక నివేదికను రూపొందించారు. ఒలింపిక్స్‌కు ఎలా బిడ్ వేయాలనే అంశం మొదలు అవకాశం దక్కించేందుకు సాగే ప్రక్రియకు సంబంధించి అన్ని వివరాలను ఇందులో పొందుపరిచారు. ఆ తర్వాతే ఐఓఏ దీనిపై ముందుకు వెళ్లింది. 2028 ఒలింపిక్స్ లాస్ ఏంజెలిస్ (అమెరికా)లో, 2032 బ్రిస్బేన్ (ఆస్ట్రేలియా)లో జరగనున్నాయి.

ప్రక్రియ ఇలా...

సాధారణంగా ఒలింపిక్స్ నిర్వహణపై ఆసక్తి మొదలు హక్కుల కేటాయింపు వరకు మూడు దశలు ఉంటాయి. ఎలాంటి ప్రక్రియలో అడుగుపెట్టకుండా వేర్వేరు వేదికలపై మేమూ నిర్వహిస్తాం అంటూ ప్రకటించే 'ఇన్‌ఫార్మల్ డైలాగ్' ఇందులో మొదటిది. దీని వల్ల ప్రపంచవ్యాప్తంగా కొంత ఆసక్తి మాత్రం ఏర్పడుతుంది తప్ప అధికారికంగా ఎలాంటి విషయమూ ఉండదు. అయితే ఇప్పుడు 'లెటర్ ఆఫ్ ఇంటెంట్' ఇవ్వడంతో దానిని దాటి భారత్ 'కంటిన్యూయస్ డైలాగ్' దశకు చేరింది. ఆసక్తి కనబర్చిన దేశాలు, అక్కడి రాజకీయ, ఇతర సామాజిక అంశాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఐఓసీ తెలుసుకుంటుంది. ఇందులో పర్యావరణ పరిరక్షణ, మానవ హక్కుల అమలు లేదా ఉల్లంఘన వంటివి కూడా ఉంటాయి. ఆయా దేశాలతో కూడా దీనిపై ఐఓసీ చర్చిస్తుంది. అయితే నిర్వహణపై ఎలాంటి హామీని ఇవ్వదు. మూడో దశలో 'టార్గెటెడ్ డైలాగ్' ఉంటుంది. ఇక్కడే అసలు నిర్వహణపై స్పష్టత వస్తుంది. ఆయా దేశాలు నిర్వహణపై తమ ప్రణాళికలు, మొత్తం బడ్జెట్ సహా ఇతర ఆర్థికపరమైన సమాచారం, తమకు అవకాశం ఇస్తే ఇతర దేశాలకంటే భిన్నంగా ఏం చేస్తామో అనే అన్ని అంశాలకు ఒక ఫార్మాట్‌లో వెల్లడించాల్సి ఉంటుంది. దీనిపై ఐఓసీ ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ తుది నిర్ణయం తీసుకుంటుంది. 2036 క్రీడల వేదికను 2025 తర్వాత ప్రకటించే అవకాశం ఉంది.

అవకాశం వస్తే అహ్మదాబాద్‌లో!

ఒలింపిక్స్ నిర్వహణ కోసం ఆసక్తి చూపిస్తున్న దేశాలు బిడ్‌లో వేదికగా నగరాల పేర్లను కూడా వెల్లడించాల్సి ఉంటుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌ను దీని కోసం భారత్ ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. అహ్మదాబాద్, గాంధీనగర్‌లలో కలిపి 22 రకాల క్రీడా వేదికలను అధికారులు గుర్తించారు. అయితే 2036 కోసం పోటీ పడుతున్న ఇతర నగరాలు, దేశాలతో పోలిస్తే మన దేశానికి అవకాశం రావడం అంత సులువు కాదనేది వాస్తవం. నుసాన్‌తారా (ఇండోనేసియా), ఇస్తాంబుల్ (టర్కీ), శాంటియాగో (చిలీ), న్యూ అడ్మినిస్ట్రేటివ్ క్యాపిటల్ (ఈజిప్ట్), సియోల్ (దక్షిణ కొరియా), దోహా (ఖతర్), రియాద్ (సౌదీ అరేబియా), బుడాపెస్ట్ (హంగేరి), ట్యురిన్ (ఇటలీ), కోపెన్‌హాగెన్ (డెన్మార్క్), టొరంటో–మాంట్రియల్ (కెనడా) ఈసారి భారత్‌తో హక్కుల కోసం పోటీ పడుతున్నాయి. వీటిలో సియోల్, మాంట్రియల్‌లకు గతంలోనే ఈ క్రీడలను నిర్వహించిన అనుభవం ఉండగా... నుసాన్‌తారా, ఇస్తాంబుల్, దోహా నగరాలు వరుసగా హక్కుల కోసం పోటీ పడుతూ త్రుటిలో అవకాశాలు చేజార్చుకున్నాయి. ఈ నగరాల్లో అన్నింటిలో కూడా ఆర్థికపరంగా పరిపుష్టిగా ఉండటంతో పాటు 2022లో 'ఫిఫా' వరల్డ్ కప్ నిర్వహణతో ఇప్పటికే తమ స్థాయిని చూపించిన దోహా... 2034 'ఫిఫా' వరల్డ్ కప్ హక్కులు దక్కించుకున్న రియాద్ ఒలింపిక్ రేసులో మిగతా నగరాలకంటే ముందున్నాయి. వీటన్నింటిని దాటి భారత్ అవకాశం దక్కించుకుంటుందా అనేది ఆసక్తికరం. ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్ నిర్వహణ బడ్జెట్ అధికారికంగా 900 కోట్ల పౌండ్లు (సుమారు రూ.98 వేల కోట్లు) అంటే ఒలింపిక్స్ నిర్వహణ స్థాయి ఏమిటో ఊహించుకోవచ్చు!

సినిమా



• 'సన్‌ఫ్లవర్స్ వర్ ది ఫస్ట్ వన్స్ టు నో' పోస్టర్

ఆస్కార్ బరిలో...

కన్నడ షార్ట్ ఫిల్మ్ 'సన్‌ఫ్లవర్స్ వర్ ది ఫస్ట్ వన్ టు నో' చిత్రం చరిత్ర సృష్టించింది. 2025 మార్చి 3న అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో 97వ ఆస్కార్ ప్రదానోత్సవం జరగనుంది. 'లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్' విభాగంలో ఆస్కార్ పోటీకి 'సన్‌ఫ్లవర్స్ వర్ ది ఫస్ట్ వన్ టు నో' అర్హత సాధించినట్లుగా ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) 'ఎక్స్'లో షేర్ చేసింది. ఎఫ్‌టీఐఐ నిర్మించగా, ఎఫ్‌టీఐఐ విద్యార్థి చిదానంద ఎస్. నాయక్ ఈ షార్ట్ ఫిల్మ్‌కు దర్శకత్వం వహించారు. ఓ కన్నడ జానపద కథ ఆధారంగా 16 నిమిషాల నిడివితో ఈ షార్ట్ ఫిల్మ్ ఉంటుంది. ఓ వృద్ధురాలి కోడి అపహరించబడుతుంది. తన కోడిని ఎవరు దొంగలించారో తెలుసుకోవడానికి ఆమె పడే తపన నేపథ్యంలో ఈ షార్ట్ ఫిల్మ్ ఉంటుంది. అలాగే ఫ్రాన్స్ వేదికగా ఈ ఏడాది మేలో జరిగిన 77వ కాన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్ వేడుకలో 'సన్‌ఫ్లవర్స్: వర్ ది ఫస్ట్ వన్ టు నో' అవార్డు సాధించింది. మరి.. ఆస్కార్‌ని సైతం గెలుస్తుందా? వేచి చూడాల్సిందే. మరోవైపు ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో హిందీ చిత్రం 'లపతా లేడీస్'ను ఇండియా ఎంట్రీగా ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆస్కార్–2025 పోటీకి పంపింది.



హీరో... విలన్ ఒక్కరే

- దర్శకుడు సంజీవ్ మేగోటి

మంచు లక్ష్మి, ఎస్తేర్, శివ కంఠమనేని, ఆదిత్యా ఓం ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్విక్షా ఆర్ట్స్ పతాకంపై ఏఐ ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సంజీవ్ మేగోటి మాట్లాడుతూ– ''1994లో మధు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో స్టూడెంట్‌గా చేరడంతో చిత్ర పరిశ్రమలో నా జర్నీ మొదలైంది. నాకు 21 ఏళ్ల వయసు ఉన్నప్పుడు 1995లో నిర్మాతగా నా తొలి సినిమా తీశాను. ఇప్పటివరకు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో మొత్తంగా పది సినిమాలకు దర్శకత్వం వహించాను. 14 సినిమాలకు సంగీత దర్శకుడిగా చేశాను. 42 సీరియల్స్‌కు రచన చేశాను. ఇలా నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, లిరిసిస్ట్‌గా, మ్యూజిక్ డైరెక్టర్‌గా నా జర్నీ కొనసాగుతోంది. కన్నడలో ఓ సినిమా తీసి నిర్మాతగా దెబ్బతిన్నాను. ఆ తర్వాత సీరియల్స్‌కు రచన చేయడంలో బిజీ అయిపోయాను. దీంతో దర్శకుడిగా నాకు తెలుగులో కొంత గ్యాప్ వచ్చింది. ఒక రకంగా నాకు 'ఆదిపర్వం' సినిమా రీ ఎంట్రీ అనుకోవచ్చు. రాయలసీమలోని కడప దగ్గర ఉన్న ఎర్రగుడి నేపథ్యంలో 'ఆదిపర్వం' తీశాం. 1974–90 మధ్య కాలంలో జరిగిన కొన్ని వాస్తవ ఘటనలకు కొంత కాల్పనికతను జోడించి, ఈ సినిమా తీశాను. మంచు లక్ష్మి ఈ సినిమాలో డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారు. యాక్షన్ ఎపిసోడ్ కూడా ఉంది. ఓ రకంగా ఈ సినిమాకు హీరో విలన్ ఒక్కరే (మంచు లక్ష్మి పాత్రను ఉద్దేశించి). 'అమ్మోరు', 'అరుంధతి' పాత్రల తరహాలో ఈ సినిమా ఉంటుంది'' అని చెప్పారు.



• 'బన్నీ' వాసు, అల్లు అరవింద్, నాగచైతన్య, సాయి పల్లవి, చందు మొండేటి

ఇది మామూలు సినిమా కాదు

- నాగ చైతన్య

''**తం**డేల్' సినిమా విడుదల తేదీ ప్రకటించమని డైరెక్టర్ చందు నన్ను కోరాడు. సినిమా రెండో భాగం రష్ చూసిన తర్వాత చెప్తాను అన్నాను. రెండు రోజుల క్రితం సెకండ్ హాఫ్ చూశాను. కంటెంట్ చూశాక 2025 ఫిబ్రవరి 7న రిలీజ్ చేద్దామని చెప్పాను. ఎందుకంటే ఫిబ్రవరి 14కి (ప్రేమికుల రోజు) ఉన్న ప్రాముఖ్యత మనకు తెలుసు. అందుకే ఆ డేట్‌కి రిలీజ్ చేద్దామని చెప్పాను'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై 'బన్నీ' వాసు నిర్మిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో 'తండేల్'ని ఫిబ్రవరి 7న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగ చైతన్య మాట్లాడుతూ– ''ఇది మామూలు సినిమా కాదు. శ్రీకాకుళంలోని కొందరు మత్స్యకారుల జీవితం. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ చేసినా అది పండగే అవుతుంది. నన్ను తెరపై నెక్స్ట్ లెవల్‌లో చూపించాలని చందు చాలా కష్టపడ్డారు'' అని తెలిపారు. ''అరవింద్‌గారి లాంటి గొప్ప నిర్మాత అన్నీ చూసుకునే రిలీజ్ తేదీ ప్రకటిస్తారు'' అని చందు మొండేటి చెప్పారు. ''చాలా కష్టపడి ఈ సినిమా చేశాం. మా మూవీ అందరికీ నచ్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు సాయి పల్లవి. 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''తండేల్' మొదలు పెట్టినప్పుడు డిసెంబర్ 20న రిలీజ్ అనుకున్నాం. కానీ చిత్రీకరణ సవాల్‌గా మారడంతో ఆలస్యం అయ్యింది. అక్కినేని అభిమానులందరూ సంతోషపడి, కాలర్ పైకెత్తే సినిమా ఇది. నిర్మాతగా నాకు తొలి అవకాశం ('100% లవ్') ఇచ్చిన నాగ చైతన్యకి బహుమతిగా 'తండేల్'ని 100 కోట్ల క్లబ్‌లోకి తీసుకెళతాను'' అని పేర్కొన్నారు.



• రామ్‌కుమార్, శ్రీను వైట్ల, సాయి కిషోర్, వైవీఎస్ చౌదరి, సాయికుమార్

రెడీలా బ్లాక్ బస్టర్ కావాలి

- శ్రీనువైట్ల

''**ధూం** ధాం' సినిమా పాటలు బాగున్నాయి. ఈ చిత్రం ఫస్టాఫ్ ప్లెజెంట్‌గా ఉండి సెకండాఫ్ హిలేరియస్‌గా ఉందని ఈ మూవీకి పని చేసిన నా స్నేహితులు చెప్పారు. మా 'రెడీ' సినిమాకి కూడా సెకండాఫ్ హిలేరియస్‌గా ఉందనే టాక్ విడుదలకి ముందే వచ్చింది. అదే తరహాలో రూపొందిన 'ధూం ధాం' చిత్రం 'రెడీ'లా బ్లాక్ బస్టర్ ఎంటర్‌టైనర్ కావాలి'' అని డైరెక్టర్ శ్రీను వైట్ల ఆకాంక్షించారు. చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా సాయి కిషోర్ మచ్చా దర్శకత్వం వహించిన సినిమా 'ధూం ధాం'. ఎంఎస్ రామ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'ధూం ధాం' ప్రీ రిలీజ్‌కి అతిథిగా హాజరైన దర్శకుడు వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ– ''సాయికిషోర్ మచ్చ నాకు మంచి మిత్రుడు. 'ధూం ధాం'తో తనకి, యూనిట్‌కి మంచి విజయం దక్కాలి'' అన్నారు. ''చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని దర్శకుడు సాయి రాజేశ్ అన్నారు. ''మా అబ్బాయి చేతన్‌ను ఈ సినిమా హీరోగా మరో మెట్టు ఎక్కిస్తుంది'' అన్నారు రామ్ కుమార్. ''శ్రీను వైట్లగారి కామెడీని, వైవీఎస్ గారి సాంగ్స్ స్టైల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ మూవీ చేశాను. ప్రేక్షకుల టికెట్ ధరకు సరిపడా నవ్వులు అందిస్తాం'' అని సాయికిషోర్ మచ్చా తెలిపారు. కాగా తెలుగు చిత్ర పరిశ్రమలో గీత రచయితగా రెండు దశాబ్దాల ప్రయాణం పూర్తి చేసుకున్న రామజోగయ్య శాస్త్రిని ఈ వేదికపై సన్మానించారు. నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, దామోదర ప్రసాద్ మాట్లాడారు.

రిషబ్ శెట్టిలా పెద్ద హీరో కావాలి

- తమ్మారెడ్డి భరద్వాజ



• తమ్మారెడ్డి భరద్వాజ, సతీష్ బాబు, దీయా రాజ్

''జాతర' సినిమా ట్రైలర్ ఆసక్తిగా ఉంది. మంచి కథ ఉంటే.. హీరో, దర్శకుల గురించి ప్రేక్షకులు పట్టించుకోరు. కొత్తగా వచ్చిన సతీష్ హీరో, రైటర్, డైరెక్టర్ అయ్యాడు. రిషబ్ శెట్టిలా తను కూడా పెద్ద హీరో, పెద్ద దర్శకుడు కావాలి. అలాగే 'జాతర' చిత్రం ఘనవిజయం సాధించాలి'' అని దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. సతీష్ బాబు రాటకొండ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'జాతర'. దీయా రాజ్ హీరోయిన్‌గా నటించారు. గల్లా మంజునాథ్ సమర్పణలో రాధాకృష్ణా రెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో నటుడు శివ బాలాజీ మాట్లాడుతూ– ''జాతర' ట్రైలర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఈ మూవీ చాలా పెద్ద హిట్ అవ్వాలి'' అన్నారు. ''మంచి కథతో ఈ మూవీని చక్కగా తీశారాయన'' అని శివ శంకర్ రెడ్డి చెప్పారు. ''నటుడిగా, దర్శకుడిగా ఇది నా మొదటి సినిమా. మా చిత్రాన్ని ఆదరించాలి'' అని సతీష్ బాబు రాటకొండ కోరారు.

రొమాన్స్... ఎంటర్‌టైన్‌మెంట్... ఎమోషన్స్



• సందీప్, హర్ష, సోనూ ఠాకూర్, సుప్రజ్, మేఘలేఖ, తరుణ్

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘ లేఖ, ఖుష్బూ చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి బెక్కెం వేణుగోపాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ– ''నేటి యువతరానికి నచ్చే అంశాలకు కుటుంబ భావోద్వేగాలను మేళవించి రూపొందించిన యూత్‌ఫుల్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది. రొమాన్స్... ఎంటర్‌టైన్‌మెంట్... ఎమోషన్స్ ఈ మూవీకి ప్రధాన బలం'' అన్నారు. ''సరికొత్త పాయింట్‌ను ఈ మూవీలో చెబుతున్నాం. క్లైమాక్స్ సన్నివేశాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంటాయి'' అని తెలిపారు విక్రమ్ రెడ్డి. ఈ సమావేశంలో కెమెరామేన్ సంతోష్ రెడ్డి, సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్, నిర్మాత సృజన్ బొజ్జం తదితరులు పాల్గొన్నారు.

లైఫ్‌లో రిస్క్ ఉండాలి

- కోమల్ ఆర్. భరద్వాజ్



''**ఈ** విశ్వమే పెద్ద మిస్టరీ. ఇతిహాసాలు, పురాణాల ప్రకారం పద్నాలుగు లోకాలు ఉన్నాయంటారు. ఈ లోకాల మధ్య తిరిగిన వాళ్లు ఉన్నారని చెబుతుంటారు. అయితే వాళ్లు ఎలా తిరిగారు? సైన్స్ ప్రకారం వామ్‌హోల్స్‌తో ట్రావెల్ చేస్తే ఇంకో టైమ్‌లోకి ఎలా వెళతాం? అన్న అంశాలనే 'రహస్యం ఇదం జగత్' సినిమాలో చూపిస్తున్నాం'' అని దర్శకుడు కోమల్ ఆర్. భరద్వాజ్ అన్నారు. రాకేష్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానస వీణ, భార్గవ్ గోపీనాథం ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రహస్యం ఇదం జగత్'. కోమల్ ఆర్. భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా కోమల్ ఆర్. భరద్వాజ్ మాట్లాడుతూ– ''అమెరికాలో ఎమ్ఎస్ పూర్తి చేసి, ఉద్యోగం చేశాను. సినిమాలపై ప్యాషన్‌తో ఫిల్మ్ స్కూల్‌లో జాయిన్ అయ్యాను. కొన్ని షార్ట్ ఫిల్మ్ చేశా. ఆ తర్వాత 'రహస్యం ఇదం జగత్' సినిమా తీశాను. సడన్‌గా సినిమాల్లోకి రావడం అనేది కాస్త రిస్కే.. కాదనను. కానీ లైఫ్‌లో రిస్క్ ఉండాలి. శ్రీ చక్రం గురించి అమెరికాలో అన్వేషణ జరిగిందన్న విషయం నన్ను బాగా ఇన్‌స్పైర్ చేసింది. ఆశ్చర్యకరంగా ఆ తవ్వకాలు జరిగిన ప్రదేశం అమెరికాలో నేనుండే చోటుకు దగ్గరగానే ఉంటుంది. ఇలా ఈ సినిమా కథే నన్ను వెతుక్కుంటూ వచ్చిందనిపించింది. ఈ సినిమాలో ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌ను చెప్పాం'' అన్నారు.

విడుదల షురూ



• విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి, సూరి లీడ్ రోల్స్‌లో నటించిన 'విడుదల 2' సినిమా డిసెంబరు 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. వెట్రిమారన్ దర్శకత్వం వహించిన 'విడుదల పార్ట్ 1' చిత్రం 2023లో విడుదలై తమిళ్, తెలుగులో సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా వెట్రిమారన్ 'విడుదల 2' తెరకెక్కించారు. విజయ్ సేతుపతి, సూరి, మంజు వారియర్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, భవానీ శ్రీ ముఖ్య తారలుగా నటించారు. ఈ సినిమా తెలుగు విడుదల హక్కులను నిర్మాత చింతపల్లి రామారావు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి రామారావు మాట్లాడుతూ–''మంచి వాణిజ్య విలువలున్న 'విడుదల 2' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించబోతున్నందుకు సంతోషంగా ఉంది. 'విడుదల పార్ట్ 1' లా 'విడుదల 2' కూడా హిట్ అవుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వేల్ రాజ్, సంగీతం: ఇళయరాజా.

సాక్షి బిజినెస్
బుధవారం
6-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
694	217
79,477	24,213

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	18,439	▲	261
డోజోన్స్	42,190	▲	395
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,172	▽	12
డాక్స్	19,256	▲	108
షాంఘై	3,387	▲	77
నికాయ్	38,475	▲	421

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	78,566	▽	48
బంగారం (99.5 స్వచ్ఛత)	78,251	▽	47
వెండి (కిలో)	94,261	▽	221

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.68	84.70
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.61	110.46
€	యూరో	ఎస్‌బీఐ	89.62	92.32
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.27	55.71
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.22	56.41
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.55	66.32
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.51	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.04	23.81
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.89	12.65

నేటి నుంచి స్విగ్గీ ఐపీవో

ఆఫర్ ధర:	రూ. 371-390
సమీకరణ:	రూ. 11,327 కోట్లు
రిటైలర్లకు కనీస లాట్:	38 షేర్లు
ఆఫర్ ముగింపు:	శుక్రవారం (8న)
షేర్ల అలాట్‌మెంట్:	11న
లిస్టింగ్:	13న

న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్ దిగ్గజం స్విగ్గీ పబ్లిక్ ఇష్యూ నేడు(6న) ప్రారంభం కానుంది. ఒక్కో షేరుకి రూ. 371-390 ఆఫర్ ధరలో వస్తున్న ఇష్యూ శుక్రవారం(8న) ముగియనుంది. ఐపీవోలో భాగంగా రూ. 4,499 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 6,828 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్, ప్రస్తుత వాటాదారులు విక్రయించనున్నారు. తద్వారా రూ. 11,327 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. వెరసి 11.3 బిలియన్ డాలర్ల(రూ. 95,000 కోట్లు) విలువను ఆశిస్తోంది. ఇప్పటికే (2021 జూలై) లిస్టయిన ప్రత్యర్థి కంపెనీ



జొమాటో విలువ ప్రస్తుతం రూ. 2.13 లక్షల కోట్లకు చేరింది.

నిధుల వినియోగమిలా...

2014లో ఏర్పాటైన స్విగ్గీ 2024 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ. 611 కోట్ల నష్టం ప్రకటించింది. ఈక్విటీ జారీ నిధులను టెక్నాలజీ, క్లౌడ్ ఇన్‌ఫ్రా, బ్రాండ్ మార్కెటింగ్, రుణ చెల్లింపులు, ఇతర సంస్థల కొనుగోళ్లు తదితరాలకు వినియోగించనుంది.


డాక్టర్ రెడ్డీస్ లాభం 1,342 కోట్లు

- క్యూ2లో 9 శాతం డౌన్
- ఆదాయం రూ. 8,016 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ (డీఆర్ఎల్) రూ. 1,342 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత క్యూ2లో నమోదైన రూ. 1,480 కోట్లతో పోలిస్తే ఇది 9 శాతం తక్కువ. గ్లోబల్ జనరిక్స్ దన్నుతో సమీక్షాకాలంలో ఆదాయం రూ. 6,880 కోట్ల నుంచి సుమారు 17 శాతం వృద్ధి చెంది రూ. 8,016 కోట్లకు పెరిగినట్లు మంగళవారం ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా కంపెనీ తెలిపింది. వివిధ వ్యాపార విభాగాల వ్యాప్తంగా మెరుగైన వృద్ధిని కొనసాగించినట్లు సంస్థ కో-చైర్మన్ జీవీ ప్రసాద్ తెలిపారు. నికోటినెల్ తదితర బ్రాండ్ల కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశామని, భవిష్యత్ వృద్ధి చోదకాల విషయంలో పురోగతి సాధించామని ఆయన పేర్కొన్నారు. సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం, ప్రధాన వ్యాపారాలను బలోపేతం చేసుకోవడంపై మరింతగా దృష్టి పెట్టడాన్ని కొనసాగిస్తామని ప్రసాద్ వివరించారు. ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవడం తదితర అంశాలపై ఈ ఆర్థిక సంవత్సరం రూ. 2,500 కోట్ల మూలధన వ్యయాలను చేయనున్నట్లు సంస్థ సీఈవో ఎరెజ్ ఇజ్రేలీ తెలిపారు.

మరిన్ని విశేషాలు..

- క్యూ2లో గ్లోబల్ జనరిక్స్ విభాగం ఆదాయం 17 శాతం పెరిగి రూ. 6,108 కోట్ల నుంచి సుమారు రూ. 7,158 కోట్లకు చేరింది. కీలకమైన ఉత్తర అమెరికా మార్కెట్ 17 శాతం



పెరిగి రూ. 3,728 కోట్లకు చేరింది. అమెరికాలో నాలుగు కొత్త ఉత్పత్తులను కంపెనీ ప్రవేశపెట్టింది. క్యూ2లో దేశీయంగా మూడు కొత్త బ్రాండ్లను కంపెనీ ప్రవేశపెట్టింది.
- రిటుగ్జిమాబ్ బయోసిమిలర్‌కి యూరోపియన్ కమిషన్ నుంచి మార్కెటింగ్ ఆథరైజేషన్ లభించింది. అలాగే, గ్యాస్ట్రోఇంటెస్టినల్ ఔషధం వొనొప్రాజాన్‌ను భారత్‌లో విక్రయించేందుకు టకెడా సంస్థతో లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది.

కంపెనీ షేరు బీఎస్‌ఈలో స్వల్పంగా పెరిగి రూ. 1,273 వద్ద ముగిసింది.

టైటాన్ లాభం నేలచూపు



క్యూ2లో రూ. 704 కోట్లు

న్యూఢిల్లీ: జ్యువెలరీ, వాచీల తయారీ దిగ్గజం టైటాన్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 23 శాతం క్షీణించి రూ. 704 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 916 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 16% ఎగసి రూ. 14,656 కోట్లను తాకింది. జ్యువెలరీ విభాగం నుంచి 15% వృద్ధితో రూ. 12,771 కోట్లు లభించింది.

టైటాన్ షేరు ఎన్ఎస్‌ఈలో అర శాతం లాభంతో రూ. 3,235 వద్ద ముగిసింది.

హిందుస్తాన్ జింక్‌లో కేంద్రం వాటా విక్రయం



ఫ్లోర్ ధర షేరుకి రూ. 505

న్యూఢిల్లీ: మైనింగ్ రంగ దిగ్గజం హిందుస్తాన్ జింక్ (హెచ్‌జెడ్ఎల్)లో కేంద్ర ప్రభుత్వం ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా మైనారిటీ వాటాను విక్రయించనుంది. షేరుకి రూ.505 ఫ్లోర్ ధరలో 2.5% వాటాను ఆఫర్ చేస్తోంది. తద్వారా రూ. 5,000 కోట్లు సమకూర్చుకోనుంది. సంస్థాగత ఇన్వెస్టర్లకు ఓఎఫ్ఎస్ నేడు(6న) ప్రారంభం కానుంది. రిటైల్ ఇన్వెస్టర్లకు రేపు (7న) బిడ్ చేసుకోవచ్చు. ప్రభుత్వం 10.56 కోట్లకు పైగా షేర్లు ఆఫర్ చేస్తున్నట్లు దీపమ్ కార్యదర్శి తుహిన్ కాంత పాండే చెప్పారు.

బీఎస్‌ఈలో హింద్ జింక్ షేరు 3% ఎగసి రూ. రూ. 559.5 వద్ద ముగిసింది.

నష్టాల్లోంచి లాభాల్లోకి...

- స్టాక్ సూచీల అనూహ్య రికవరీ
- సెన్సెక్స్ మైనస్ 485 నుంచి ప్లస్ 694

ముంబై: ఆరంభ నష్టాల నుంచి అనూహ్యంగా పుంజుకున్న స్టాక్ సూచీలు మంగళవారం భారీ లాభాలతో ముగిశాయి. ఫైనాన్షియల్స్, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు రాణించడంతో పాటు ఆసియా, యూరప్ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. ఇంట్రాడేలో 485 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్ ఒక్కసారిగా పుంజుకొని 694 పాయింట్ల లాభంతో 79,477 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 217 పాయింట్లు పెరిగి 24,213 వద్ద నిలిచింది. అమెరికా ఎన్నికల నేపథ్యంలో బలహీనంగా మొదలైన



సూచీలు.., ప్రథమార్ధమంతా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 78,297 వద్ద, నిఫ్టీ 23,843 వద్ద కనిష్టాలను తాకాయి. అయితే మిడ్‌సెషన్ నుంచి కనిష్ట స్థాయిల వద్ద కీలక రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు రికవరీ బాటపట్టాయి. చివరి గంటలో కొనుగోళ్లు మరింత పెరగడంతో ఆరంభ నష్టాలు భర్తీ చేసుకోవడమే కాకుండా భారీ లాభాలతో ట్రేడింగ్ ముగించాయి. ఐటీ, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.48%, 0.41 శాతం లాభపడ్డాయి.

- రంగాల వారీగా అత్యధికంగా మెటల్ ఇండెక్స్ 2.38% ర్యాలీ చేసింది. బ్యాంకెక్స్, కమోడిటీ సూచీలు 2%, ఫైనాన్షియల్ సర్వీసెస్ 1.58%, టెలికం, ఆటో ఇండెక్సులు 1% లాభపడ్డాయి.
- చైనా ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించవచ్చనే వార్తలు మెటల్స్‌కు డిమాండ్ పెంచాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 4.50%, సెయిల్, ఎన్ఎండీసీ, టాటా స్టీల్ షేర్లు 4% ఎగిశాయి. హిందాల్కో 3.50%, హిందుస్థాన్ జింక్, జిందాల్ స్టీల్ 3% పెరిగాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఎన్‌టీపీసీ 80 వేల కోట్ల పెట్టుబడులు	నాలుగో దశ ఆర్ఆర్‌బీల విలీనం షురూ..

రూ. 57 నుంచి 5,000కు!

ఆరేళ్లలో ఈ2ఈ షేరు ప్రభంజనం...

స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ చిన్న కంపెనీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో లిస్టయిన కంపెనీ ఈ2ఈ నెట్‌వర్క్స్. తాజాగా డైవర్సిఫైడ్ దిగ్గజం ఎల్అండ్‌టీ పెట్టుబడుల రూపంలో 21 శాతం వాటాను కొనుగోలు చేస్తోంది. అయితే అతిచిన్న కంపెనీగా ప్రారంభమైన ఈ షేరు ప్రస్తుతం మిడ్‌క్యాప్ స్థాయికి చేరుకోవడం విశేషం!

ప్రస్థానమిలా..

2018 మే 15న ఎన్ఎస్ఈ ఎమర్జ్‌లో షేరుకి రూ. 57 ధరలో ఐపీవోకు వచ్చిన కంపెనీ ఈ2ఈ నెట్‌వర్క్స్. తాజాగా ఎన్ఎస్ఈలో 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ. 4,978 వద్ద ముగిసింది. వెరసి వరుసగా ఏడో రోజు అప్పర్ సర్క్యూట్ వద్ద నిలిచింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) రూ. 8,404 కోట్లకు చేరింది. గత 8 ట్రేడింగ్ సెషన్లలో ఈ షేరు 48 శాతం జంప్‌చేసింది. గత నెల రోజుల్లో చూస్తే 70 శాతం ర్యాలీ చేసింది. ఇదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ 3 శాతం నీరసించడం గమనార్హం!



ఇటీవల ధూమ్‌ధామ్

గత 9 వారాలను పరిగణిస్తే అంటే సెప్టెంబర్ 2నుంచి ఈ2ఈ షేరు రూ. 2,332 నుంచి 113 శాతం ఎగసింది. నిజానికి 2024 జనవరి నుంచి 621 శాతం దూసుకెళ్లింది. ఈ సమయంలో నిఫ్టీ 10 శాతం మాత్రమే బలపడింది. ఇక 2023 ఆగస్ట్ 4న రూ. 285 వద్ద కదిలిన ఈ షేరు గత 15 నెలల్లో 17 రెట్లు లేదా 1,644 శాతం పురోగమించింది. కాగా.. 2024 సెప్టెంబర్30న సుప్రసిద్ధ ఇన్వెస్టర్ ఆశిష్ కచోలియా 1.05 శాతం వాటాకు సమానమైన 1,77,043 షేర్లను కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఈ2ఈ కంపెనీ షేరు మెయిన్‌బోర్డ్‌లో ట్రేడవుతోంది.

కంపెనీ ఏం చేస్తుందంటే?

ఈ2ఈ నెట్‌వర్క్స్ సీపీయూ, జీపీయూ ఆధారిత క్లౌడ్ కంప్యూటింగ్ ప్లాట్‌ఫామ్స్‌ను అందించడంలో ప్రత్యేకతను కలిగి ఉంది. తద్వారా కస్టమర్లకు భారీస్థాయి జనరల్ అండ్ ఏఐ వర్క్‌లోడ్స్‌ను నిర్వహించడంలో సహకారమందిస్తుంది. చిప్ దిగ్గజం ఎన్‌విడియా సాంకేతిక సహకారం ఇందుకు కంపెనీకి తోడ్పాటునిస్తోంది. ఈ బాటలో చిప్ తయారీ దిగ్గజాలు ఎన్‌విడియా, ఇంటెల్, ఏఎండీసహా హెచ్‌పీఈ, మైక్రోసాఫ్ట్, డెల్‌తో వ్యూహాత్మక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఓపెన్‌సోర్స్ టెక్నాలజీ ద్వారా ప్రొప్రయిటరీ వర్చువలైజేషన్, క్లౌడ్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్(ఐపీ) అభివృద్ధి చేస్తోంది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఎల్అండ్‌టీకి 21% వాటా...

డీల్ విలువ రూ.1,407 కోట్లు

క్లౌడ్ సేవల్లో ఉన్న ఈ2ఈ నెట్‌వర్క్స్‌లో 21 శాతం వాటా కొనుగోలు చేస్తున్నట్లు మౌలిక రంగ దిగ్గజం లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ) మంగళవారం ప్రకటించింది. డీల్ విలువ రూ.1,407 కోట్లు. ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్ ద్వారా 15% వాటా కోసం ఎల్అండ్‌టీ రూ. 1,079.27 కోట్లు పెట్టుబడి పెడుతుంది. అలాగే స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా అదనంగా 6% వాటా కోసం రూ.327.75 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. డిసెంబర్ 31లోగా డీల్ పూర్తి అవుతుందని ఎల్అండ్‌టీ వెల్లడించింది. ఈ2ఈ నెట్‌వర్క్స్‌లో నియంత్రిత వాటా తీసుకోబోమని, నిర్దిష్ట రక్షణ హక్కులతో మైనారిటీ వాటాదారుగా ఉంటామని వివరించింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ, క్లౌడ్ సేవల విభాగాల్లో మార్కెట్‌కు అనుగుణంగా ఈ2ఈని కొనుగోలు చేసినట్లు తెలిపింది. సాఫ్ట్‌వేర్ లైసెన్స్, రీసెల్లర్, కో-లొకేషన్ ఒప్పందాలను ఈ2ఈతో కుదుర్చుకోవాలని ఒప్పందంలో భాగంగా ఎల్అండ్‌టీ ప్రతిపాదిస్తోంది.



భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విదేశీ భాష.. కొలువుకు బాట!

» ఫారెన్ లాంగ్వేజ్ నిపుణులకు డిమాండ్
» విదేశీ భాషల నైపుణ్యంతో ఉద్యోగాలు
» ప్రభుత్వ, ప్రైవేట్ విభాగాల్లో కొలువులు

గ్లోబలైజేషన్, డిజిటలైజేషన్ కారణంగా ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక, వ్యాపార, వాణిజ్య పరంగా సంయుక్త కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి! విదేశాల్లో కార్యాలయాలు నిర్వహించడం సర్వసాధారణంగా మారింది. ఇలా ప్రపంచ వ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బహుళజాతి సంస్థలు.. సదరు విదేశీ భాషలపై పట్టున్న నిపుణులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. దీంతో ఫారెన్ లాంగ్వేజెస్ ఉపాధికి వేదికలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో.. ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో డిమాండ్ నెలకొన్న ఫారెన్ లాంగ్వేజెస్, నేర్చుకునేందుకు మార్గాలు, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

ప్రస్తుత పరిస్థితుల్లో.. భాషలతోనే కెరీర్‌కు బాటలు వేసుకునే అవకాశం ఉంది. పేరున్న ఏదైనా విదేశీ భాషలో పట్టు సాధిస్తే.. దాని ఆధారంగానే కొలువులు సొంతం చేసుకోవచ్చు. విద్యార్థులు మల్టీ లాంగ్వేజ్ స్కిల్స్ పెంచుకుంటే కెరీర్‌లో మరింతగా రాణించే అవకాశం ఉంటుంది. భాషా నైపుణ్యం అంటే కేవలం ఇంగ్లిష్‌లో ప్రావీణ్యానికే పరిమితం కాకుండా.. అదనంగా ఏదో ఒక ఫారెన్ లాంగ్వేజ్ నేర్చుకుంటే మరింత ఉన్నతంగా ఎదగొచ్చు అంటున్నారు నిపుణులు.

ఈ భాషలకు డిమాండ్

ఫ్రెంచ్, జపనీస్, జర్మనీ, స్పానిష్, కొరియన్, చైనీస్ తదితర విదేశీ భాషల నిపుణులకు బహుళజాతి సంస్థల్లో భారీగా డిమాండ్ నెలకొంది. ఆయా భాషలను బట్టి వేతనాలు ఆకర్షణీయంగా ఉంటున్నాయి. నెలకు రూ.40వేల నుంచి రూ.50 వేల వరకు సంపాదించే అవకాశం ఉంది. విదేశీ భాషలను బ్యాచిలర్ డిగ్రీ స్థాయి నుంచే నేర్చుకునే వీలుంది.

29 దేశాల్లో అధికార భాష.. ఫ్రెంచ్

కెరీర్ అవకాశాలు అందించే విదేశీ భాషల్లో ఫ్రెంచ్ లాంగ్వేజ్ ముందుంటోంది. ప్రస్తుతం దాదాపు 29 దేశాల్లో అధికార భాషగా గుర్తింపు పొందిన ఫ్రెంచ్ భాషను నేర్చుకుంటే అంతర్జాతీయంగా ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ఫ్రెంచ్‌ను అధికార భాషగా గుర్తిస్తున్న దేశాలు.. విదేశాల్లో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల కోసం ఇంగ్లిష్ నుంచి ఫ్రెంచ్‌లోకి, ఫ్రెంచ్ నుంచి ఇంగ్లిష్‌లోకి అనువదించే నిపుణుల కోసం అన్వేషిస్తున్నాయి. ప్రధానంగా ఫార్మా, బ్యాంకింగ్, రీసెర్చ్ విభాగాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో ఫ్రెంచ్ భాషపై నైపుణ్యం సాధిస్తే నెలకు సగటున రూ.50 వేలతో కొలువు సొంతం చేసుకోవచ్చు.

- ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ వివరాలు: మిరిండా హౌస్,ఢిల్లీ యూనివర్సిటీ;జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఢిల్లీ, ఇఫ్లూ-హైదరాబాద్.

జపనీస్.. కెరీర్‌కు జయం

జపనీస్.. ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ నెలకొన్న లాంగ్వేజ్! మన దేశంలోని పలు రంగాల్లోని సంస్థలు జపాన్‌కు చెందిన దాదాపు మూడు వందలకు పైగా సంస్థలతో సంయుక్త భాగస్వామ్యంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీంతో ఈ సంస్థలకు భారీ సంఖ్యలో అనువాదకుల అవసరం ఏర్పడుతోంది. అదే విధంగా జైకా (జపాన్, ఇండియా కోఆపరేటివ్ ఏజెన్సీ) ద్వారా జపాన్, భారత్‌ల మధ్య అధికారికంగా పలు ద్వైపాక్షిక ఒప్పందాలు జరుగుతున్నాయి.

- ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు: జేఎన్‌యూ-ఢిల్లీ, ఇన్‌స్టిట్యూట్ ఫర్ కెరీర్ స్టడీస్ వైఎంసీఏ, ఢిల్లీ యూనివర్సిటీ, నిహోంగో-బషి (nihongobashi).

విద్య, ఉపాధికి జర్మన్



కెరీర్ పరంగానే కాకుండా అకడమిక్‌గా కూడా జర్మన్ లాంగ్వేజ్ ప్రాధాన్యం సంతరించుకుంది. జర్మనీలోని యూనివర్సిటీల్లో ఉన్నత విద్య కోర్సుల్లో చేరాలనుకునే విదేశీ విద్యార్థులకు జర్మన్ భాషపై అవగాహన తప్పనిసరి అనే నిబంధన ఉంది. అదేవిధంగా మన దేశంలోని సంస్థలు పరిశోధన, తయారీ రంగాలకు సంబంధించి జర్మనీలోని సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జర్మన్ భాషా నైపుణ్యం ఉంటే.. విద్య, ఉపాధి అవకాశాలు దక్కించుకోవచ్చు. మరోవైపు నైపుణ్యం కలిగిన భారతీయులకు ఇచ్చే వీసాల సంఖ్యను 20 వేల నుంచి 90 వేలకు పెంచుతున్నట్లు జర్మనీ తాజాగా ప్రకటించింది. దీంతో జర్మన్ భాషా నైపుణ్యాలున్న వారు ఆ దేశంలో తేలిగ్గా ఉద్యోగాలు దక్కించుకునే అవకాశముంది.

- ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు:
-గొయెత్ జర్మన్, -ఇన్‌లింగ్వా (Inlingua).

యూఎన్, ఈయూ అధికారిక భాష.. స్పానిష్

ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న మరో విదేశీ భాష.. స్పానిష్.

ఇది యూఎన్‌ఓ, యూరోపియన్ యూనియన్ వంటి ప్రముఖ సంస్థల్లోనూ అధికారిక భాషగా ఉంది. దీంతో స్పానిష్ లాంగ్వేజ్ నిపుణులకు అంతర్జాతీయంగా డిమాండ్ నెలకొంది. మన దేశానికి చెందిన సంస్థలు.. స్పానిష్ స్పీకింగ్ కంట్రీస్‌గా పేర్కొనే లాటిన్ అమెరికా, అర్జెంటీనా, కొలంబియా తదితర దేశాలతో పలు ఒప్పందాలు చేసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇది కూడా కెరీర్ అవకాశాల పెరుగుదలకు దోహదపడుతోంది.

- ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు/యూనివర్సిటీలు: స్కూల్ ఆఫ్ లాంగ్వేజ్, లిటరేచర్ అండ్ కల్చరల్ స్టడీస్, జేఎన్‌యూ, ఐ.పి.కాలేజ్ ఫర్ ఉమెన్, ఢిల్లీ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ అకాడమీ ఫర్ ఫారెన్ లాంగ్వేజెస్, ఇన్‌లింగ్వా (Inlingua).

అకడెమిక్ కోర్సులకు మార్గం

సంప్రదాయ యూనివర్సిటీలు మొదలు స్పెషలైజ్డ్ ఇన్‌స్టిట్యూట్స్ వరకు ఎన్నో శిక్షణ సంస్థలు ఫారిన్ లాంగ్వేజెస్ కోర్సులను అందిస్తున్నాయి. ఇవి సర్టిఫికెట్ స్థాయి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయి వరకు పలు కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. సర్టిఫికెట్ స్థాయి కోర్సుల కాల వ్యవధి మూడు నుంచి ఆరు నెలల వరకూ ఉంటోంది. పీజీ, పీహెచ్‌డీ స్థాయిలో ఇఫ్లూ, జేఎన్‌యూ, ఢిల్లీ యూనివర్సిటీ వంటి ప్రముఖ యూనివర్సిటీలు ప్రత్యేకంగా ఫారెన్ లాంగ్వేజ్ కోర్సులను అందిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రా యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తదితర విశ్వవిద్యాలయాలు సైతం విదేశీ భాషల కోర్సులను అందిస్తున్నాయి.

ఉపాధి అందించే రంగాలు

ఫార్మా, ఐటీ, ఆటోమొబైల్, కేపీఓ, ఎల్‌పీఓ, కన్సల్టింగ్.. ఇలా ఉత్పత్తి రంగం మొదలు సర్వీసెస్ సెక్టార్‌లోని ప్రముఖ సంస్థల వరకూ.. అనేక కంపెనీలు విదేశీ భాషా నిపుణులను నియమించుకుంటున్నాయి. హాస్పిటాలిటీ, టూరిజం, ఫార్మాస్యుటికల్ సంస్థలు, రాయబార కార్యాలయాలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, బీపీఓ సంస్థలు, ఎగుమతి, దిగుమతి సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. విదేశీ భాషలు నేర్చుకున్న వారు ఫ్రీలాన్సింగ్ విధానంలో అనువాదకులుగా పనిచేసి ఆదాయం పొందే అవకాశం ఉంది.

నెలకు రూ.50వేల వేతనం

విదేశీ భాష నైపుణ్యం ద్వారా టూరిజం మొదలు తయారీ, ఐటీ, బీపీఓ, కేపీఓ, ఎల్‌పీఓ విభాగాల వరకూ.. వివిధ రంగాల్లో కొలువులు దక్కించుకోవచ్చు. వీరికి సగటు వేతనం నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటోంది. సంబంధిత లాంగ్వేజ్‌లో పీజీ స్థాయి సర్టిఫికెట్ ఉంటే.. ఉత్పత్తి రంగం, ఐటీ, కేపీఓల్లో నెలకు రూ.50 వేల వేతనం ఖాయం.

జాబ్ పాయింట్

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 61 పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న ఈసీఐఎల్ కేంద్రాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 61.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్-20, టెక్నికల్ ఆఫీసర్-26, ఆఫీసర్-02, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజనీర్-అసిస్టెంట్ ఇంజనీర్-13. సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుకు రూ.45,000 నుంచి రూ.55,000. టెక్నికల్ ఆఫీసర్/ఆఫీసర్‌కు రూ.25,000 నుంచి రూ.31,000. అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు రూ.24,500 నుంచి రూ.30,000.
» **ప్రాజెక్ట్ లొకేషన్:** ఈస్ట్ జోన్(కోల్‌కతా), నార్త్ జోన్(న్యూఢిల్లీ), వెస్ట్ జోన్(ముంబై), హెడ్ క్వార్టర్స్(హైదరాబాద్).
» **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఇంటర్వ్యూ తేదీలు:** 04.11.2024, 05.11.2024, 07.11.2024, 11.11.2024.
» **ఇంటర్వ్యూ వేదిక:** హైదరాబాద్, ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతాలోని ఈసీఐఎల్ కార్యాలయాలు.
» **వెబ్‌సైట్:** https://www.ecil.co.in

బీడీఎల్, సంగారెడ్డిలో 117 అప్రెంటిస్‌లు

తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా భానూర్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 117.
శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం.
» **ట్రేడులు:** ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెషినిస్ట్(సి), మెషినిస్ట్(జి), వెల్డర్, మెకానిక్(డీజిల్), ఎలక్ట్రీషియన్, టర్నర్, సీవోపీఏ, ప్లంబర్, కార్పెంటర్, ఆర్-ఏసీ, ఎల్ఏసీపీ.
» **అర్హత:**పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.దీంతోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.10.2024 నాటికి 14 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.11.2024.
» **వెబ్‌సైట్:** https://bdl-india.in



ఏపీసీఆర్‌డీఏ, విజయవాడలో 19 పోస్టులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీసీఆర్‌డీఏ).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 19.
» **పోస్టుల వివరాలు:** జీఐఎస్-రిమోట్ సెన్సింగ్ అసిస్టెంట్-06, ప్లానింగ్ అసిస్టెంట్-02, సీనియర్ లైవ్లీహుడ్ స్పెషలిస్ట్-01, జూనియర్ లైవ్లీహుడ్ స్పెషలిస్ట్-03, జెండర్/జీబీవీ స్పెషలిస్ట్-01, సీనియర్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ స్పెషలిస్ట్-02, జూనియర్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ స్పెషలిస్ట్-04.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఆర్క్, బీటెక్/బీఈ, ఎంఈ/ఎంటెక్, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.11.2024.
» **పనిచేయాల్సిన ప్రదేశం:**విజయవాడ-అమరావతి.
» **వెబ్‌సైట్:** https://crda.ap.gov.in

హాల్ హైదరాబాద్‌లో 17 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

హైదరాబాద్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)కు చెందిన ఏవియోనిక్స్ డివిజన్‌లో షార్ట్ టర్మ్ ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 17.
» **పోస్టుల వివరాలు:**సీఎంఎం(లెవల్-5)ఇంజనీర్-4,మిడిల్ స్పెషలిస్ట్-8,జూనియర్ స్పెషలిస్ట్-5
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్(మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్,కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సీఎంఎం పోస్టుకు 45 ఏళ్లు, మిడిల్ స్పెషలిస్ట్ పోస్టుకు 40 ఏళ్లు, జూనియర్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు సీఎంఎం పోస్టుకు రూ.60,000, మిడిల్ స్పెషలిస్ట్ పోస్టుకు రూ.50,000, జూనియర్ పోస్టుకు రూ.40,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.11.2024.
» **వెబ్‌సైట్:** https://hal-india.co.in

ఎయిమ్స్ జోధ్‌పూర్‌లో 10 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

జోధ్‌పూర్(రాజస్థాన్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్-06, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్-01, అకౌంట్స్ ఆఫీసర్-01, మెడికల్ ఆఫీసర్ ఆయుష్(ఆయుర్వేద)-01,చైల్డ్ సైకాలజిస్ట్-01.
» **అర్హత:**పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎండీ/ఎంఎస్, ఎంఏ/ఎంఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్ పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు, మిగతా పోస్టులకు 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్ పోస్టులకు రూ.6,600, మిగతా పోస్టులకు రూ.5,400.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** నోటిఫికేషన్ వెలువడిన 20 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి.
» **నోటిఫికేషన్ వెలువడిన తేది:** 22.10.2024.
» **వెబ్‌సైట్:** www.aiimsjodhpur.edu.in

క్లుప్తంగా...



మంగళవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వరరావు

11 నుంచి తెలుగు రాష్ట్రాల్లో 'మనగుడి'

తిరుపతి (అలిపిరి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 17 వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని ఎంపిక చేసిన శివాలయాల్లో 'మనగుడి' నిర్వహించనున్నట్టు టీటీడీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. దీన్లో భాగంగా ఏపీలోని 26 జిల్లాలు, తెలంగాణలోని 33 జిల్లాల్లో జిల్లాకు ఒకటి చొప్పున ఎంపిక చేసిన శివాలయాల్లో 7 రోజుల పాటు కార్తీకమాస విశిష్టతపై ధార్మికోపన్యాసాలు నిర్వహిస్తారు. ఒక్కో జిల్లాలో రెండు చొప్పున ఆలయాలను ఎంపిక చేసి నవంబరు 13న కైశిక ద్వాదశి పర్వదిన కార్యక్రమాలు, జిల్లాకు ఒకటి చొప్పున ఎంపిక చేసిన శివాలయాల్లో నవంబరు 15న కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు టీటీడీ పేర్కొంది.

తిరుమల నర్సరీలో ఏడడుగుల జెర్రిపోతు



తిరుమల జీఎన్‌సీ టోల్‌గేట్ సమీపంలోని నర్సరీలో మంగళవారం ఏడు అడుగుల జెర్రిపోతు భయభ్రాంతులకు గురిచేసింది. నర్సరీలో పనిచేస్తున్న కార్మికులు పామును చూసి, ఫారెస్ట్ స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడికి సమాచారం అందించారు. ఆయన పామును చాకచక్యంగా పట్టుకుని అవ్వాచారి కోనలో వదిలేశారు.

నటి కస్తూరిపై చెన్నైలో కేసు నమోదు

పలు చోట్ల ఫిర్యాదుల హోరు



సాక్షి, చెన్నై: తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటి కస్తూరిపై చెన్నై ఎగ్మూర్ పోలీసుస్టేషన్‌లో నాలుగు సెక్షన్లతో మంగళవారం సాయంత్రం కేసు నమోదైంది.వివరాలు.. తమిళనాడులోని తెలుగు వారిని, తెలుగు మహిళలను కించ పరిచేలా సినీ నటి కస్తూరి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. ఆమెకు వ్యతిరేకంగా తెలుగు సంఘాలే కాదు, కొన్ని తమిళ సంఘాలు సైతం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. వివాదం ముదరడంతో తెలుగు వారి గురించి తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు తన ఎక్స్‌పేజీలో నటి కస్తూరి ప్రకటించారు. తన వ్యాఖ్యలు తెలుగు వారి మనోభావాలు దెబ్బతిని ఉంటే క్షమాపణ చెప్పుకుంటున్నానని పోస్ట్ చేశారు. అయితే ఆమెను చట్టపరంగా శిక్షించాలని కొన్ని సంఘాలు మంగళవారం పోలీసు అధికారులను ఆశ్రయించి ఫిర్యాదులు చేశాయి. ఆమెపై చర్యలు తీసుకోవాలని మదురై కమిషనరేట్‌లో తెలుగు నాయుడు సంఘం, ఆర్‌ఎంఆర్ పాసరై, టీఎస్ నాయుడు సంఘాల నేతృత్వంలో ఫిర్యాదులు అందాయి. ఈనెల 10వ తేదీలోపు ఆమెపై చట్టపరంగా చర్యలు తీసుకోని పక్షంలో మదురైలోని తిరుమల నాయకర్ విగ్రహ కూడలిలో 50 వేల మందితో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని ఆ సంఘాలు హెచ్చరించాయి. అలాగే, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు సీఎంకే రెడ్డి, ప్రధాన కార్యదర్శి నందగోపాల్ తరఫున చెన్నై పోలీసు కమిషనరేట్‌కు ఫిర్యాదు చేరింది. అలాగే తమిళగ మున్నేట్ర పడై అధ్యక్షురాలు వీరలక్ష్మి నేతృత్వంలోని బృందం సైతం కమిషనరేట్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కస్తూరిపై సాయంత్రం ఎగ్మూర్ పోలీసు స్టేషన్‌లో నాలుగు సెక్షన్లతో కేసు నమోదు చేశారు.

నలిగిపోతున్న నాలుగో సింహం

కేన్సర్.. లేదంటే కిడ్నీ సమస్యలతో పోలీసుల సతమతం



40% మంది సిబ్బందికి బీపీ, షుగర్

పని ఒత్తిడి.. సమయం తప్పిన ఆహారపు అలవాట్లు

సాక్షి, హైదరాబాద్: కేన్సర్..లేదంటే కిడ్నీ జబ్బుల బారిన పడే పోలీసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఐదేళ్ల గణాంకాలు పరిశీలిస్తే..ఈ విషయం స్పష్టమవుతోంది. పోలీస్‌శాఖలోని దాదాపు 40 శాతం మందికిపైగా సిబ్బందికి బీపీ, షుగర్ రావడం సర్వసాధారణంగా మారింది. పనిఒత్తిడి, సమయం తప్పిన ఆహారంతోనూ అనారోగ్య సమస్యలకు దారితీస్తోంది. పోలీస్ అధికారులు, సిబ్బంది..వారి కుటుంబీలకు ఆరోగ్య భద్రత పథకం కింద పలు నెట్‌వర్క్ ఆస్పత్రులలో వైద్యం అందిస్తున్నారు. ఆరోగ్య భద్రత కింద 2019 నుంచి ఈ ఏడాది అక్టోబర్ 21 వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది కలిపి మొత్తం 1,04,014 మంది పలు రోగాలకు చికిత్సలు పొందారు. వీరి వైద్యం కోసం రూ.446.3 కోట్లు ఖర్చు చేశారు. పోలీస్ సిబ్బంది తల్లిదండ్రుల్లో 45,923 మంది చికిత్సకు రూ.318.03 కోట్లు ఖర్చు చేశారు. వైద్యంతోపాటు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణలో భాగంగా తెలంగాణ పోలీస్‌శాఖ నుంచి ఆరోగ్య భద్రత కింద ప్రతి రెండేళ్లకు ఒకసారి ఉచిత ఆరోగ్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.ఓపీ పేషెంట్లకు సబ్సిడీ ధరలకే వైద్య పరీక్షలు చేసేలా రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది రకాల డయాగ్నొస్టిక్ సెంటర్లతో ఆరోగ్య భద్రత ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఆరోగ్య భద్రత కింద లబ్ధిదారుల సంఖ్యతోపాటు వైద్యఖర్చులు పెరగడంతో ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రీయింబర్స్‌మెంట్ నిధులు సైతం పేరుకుపోతున్నాయి. 2021 నుంచి రీయింబర్స్‌మెంట్ సకాలంలో జరగడం లేదు. దాదాపు రూ.200 కోట్ల వరకు ఆరోగ్య భద్రత నిధులు పెండింగ్ ఉండగా.. ఇటీవలే 30 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. రీయింబర్స్‌మెంట్ నిధుల పెండింగ్ కారణంగా కొన్నిసార్లు ఆస్పత్రులు వైద్యం అందించేందుకు ఇబ్బంది పెడుతున్న సందర్భాలూ ఉంటున్నాయి. ఎప్పటికప్పుడు పోలీస్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుంటూ సిబ్బందికి సకాలంలో వైద్యం అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉరుకులు పరుగులతో...

పోలీస్ అధికారులు విధులకు ఒకవేళంటూ ఉండదు. లా అండ్ ఆర్డర్‌లో ఉండే సిబ్బందికి ఉరుకులుపరుగులు మరీ ఎక్కువ. శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తులు, కేసుల దర్యాప్తు, కోర్టులకు హాజరుకావడం..ఉన్నతాధికారుల సమీక్షలకు వెళ్లడం..ఇలా బహుళ డ్యూటీలు చేస్తుండాలి. ఏఆర్, టీజీఎస్పీ సిబ్బంది విధుల్లోనూ తిప్పలు తప్పవు. పండుగలు, సభలు, సమావేశాలు, వీఐపీల బందోబస్తులంటూ గంటల తరబడి నిలబడక తప్పదు. ఇలా శారీరకంగా, మానసికంగానూ శ్రమ ఎక్కువే. ఈ ప్రభావం అంతా పోలీసుల ఆరోగ్యంపై వివిధ జబ్బుల రూపంలో చూపుతోంది. బీపీ, షుగర్‌తో మొదలై క్రమంగా పలు ప్రమాదకర జబ్బులకు దారితీస్తోంది. 2019 నుంచి ఈ ఏడాది అక్టోబర్ 21 వరకు ఆరోగ్య భద్రత అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం..6,347 మంది కేన్సర్ చికిత్స తీసుకున్నారు. రెండో స్థానంలో కిడ్నీ రోగులు ఉన్నారు. 4,922 మంది నెఫ్రాలజీ చికిత్స తీసుకున్నారు. యూరాలజీ సమస్యలతోనూ ఎక్కువ మందే బాధపడుతున్నారు. గుండె జబ్బుల కారణంగా 2,875 మంది ఆస్పత్రులపాలయ్యారు. మానసిక ఒత్తిడిసైతం అధికంగానే ఉంటోంది. కొన్నిసార్లు బీపీ పెరగడంతో న్యూరో సమస్యలు వస్తున్నాయి. న్యూరాలజీకి సంబంధించి 1,937 మంది చికిత్స పొందారు.

వేతనం నుంచి కార్పస్ ఫండ్‌కు నిధులు

ఆరోగ్య భద్రత కార్పస్ ఫండ్ కోసం కానిస్టేబుల్ నుంచి ఎస్సై ర్యాంకు వరకు కేటగిరీ–1 కింద నెలకు రూ.200 చొప్పున, ఇన్‌స్పెక్టర్ నుంచి డీజీపీ ర్యాంకు వరకు కేటగిరీ–2 కింద అధికారుల వేతనంలో నెలకు రూ.250 చొప్పున జమ చేస్తున్నారు. ఇలా పోలీస్‌శాఖలోని 68 వేల మంది సిబ్బంది నుంచి ఈ కార్పస్ ఫండ్ నిధులు జమ అవుతుంటాయి.


ఇవీ జబ్బులకు ప్రధాన కారణాలు

- పోలీస్ అంటే 24 గంటలపాటు విధి నిర్వహణ తప్పని ఉద్యోగం. పోలీస్‌స్టేషన్లలో శాంతిభద్రతల విధులు మొదలు ఏ ప్రత్యేక బలగంలో ఉన్నా.. ఒత్తిడి తప్పనిసరి అవుతోంది.
- ఎండ, వాన, చలి, దుమ్మూధూళి, కాలుష్యం ఇలా పలు రకాల వాతావరణ పరిస్థితుల్లో పనిచేయడం సైతం జబ్బులకు కారణమవుతోంది.
- బందోబస్తు విధుల్లో ఉన్నా.. ట్రాఫిక్ విధుల్లో ఉన్నా.. గంటల తరబడి నిలబడక తప్పని పరిస్థితి.
- ఆహార నియమాల విషయంలో శ్రద్ధ తీసుకోవాలని ఉన్నా.. తీసుకునేలా పరిస్థితులు లేకపోవడం సైతం అనారోగ్యానికి కారణం అవుతోంది.
- శాంతిభద్రతల విధుల్లో ఒక్కోసారి తగినంత విశ్రాంతి తీసుకోవడం సాధ్యం కాని పరిస్థితులు ఉండడం సైతం శారీరక శ్రమను పెంచుతోంది.

జబ్బుల వారీగా 2019 నుంచి ఈ ఏడాది అక్టోబర్ 21 వరకు చికిత్సలు పొందిన పోలీసు శాఖ సిబ్బంది

చికిత్స పొందినవారు	రోగం/స్పెషాలిటీ
13,987	జనరల్ మెడిసిన్
6,347	అంకాలజీ
2,875	కార్డియాలజీ
1,937	న్యూరాలజీ
4,922	నెఫ్రాలజీ
2,005	న్యూరో సర్జరీ
4,822	జనరల్ సర్జరీ
2,203	గ్యాస్ట్రోఎంట్రాలజీ
3,173	యూరాలజీ
824	పల్మనాలజీ
2,702	ఆప్తమాలజీ
16,630	డెంటల్

ఏడాది వారీగా పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు అందించిన అన్ని చికిత్సలు ఇలా..



నాగపూర్ కోచ్‌లు రానట్లే!



అటకెక్కిన హైదరాబాద్ మెట్రో కోచ్‌ల పెంపు

- ఒక్కో రైలుకు 3 నుంచి 6కు పెంచాలని ప్రణాళిక
- అదనపు కోచ్‌లు కొనటానికి రూ.500 కోట్లు
- నష్టాలు వస్తున్నాయని పక్కన పెట్టిన ఎల్ అండ్ టీ
- నిత్యం రద్దీతో ప్రయాణికుల ఇబ్బందులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో మెట్రోలో ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతోంది. దీంతో మెట్రో రైళ్లలో నిత్యం రద్దీ నెలకొంటోంది. ఏ స్టేషన్‌లో చూసినా ప్రయాణికులు మెట్రో కోసం ఎదురు చూస్తూ కనిపిస్తున్నారు. కానీ అందుకు అనుగుణంగా కోచ్‌ల సంఖ్యను పెంచటం లేదు. ప్రయాణికుల రద్దీ మేరకు మెట్రో సర్వీసులను ఒక్కో రైలుకు 3 కోచ్‌ల నుంచి 6 కోచ్‌లకు పెంచేందుకు ఏడాది క్రితమే ప్రణాళిక రూపొందించారు. మహారాష్ట్రలోని నాగపూర్ మెట్రో నుంచి కోచ్‌లను తెప్పించాలనుకున్నా.. ఆ దిశగా ఎలాంటి పురోగతి లేదు.

రోజంతా రద్దీనే

రద్దీ ఎక్కువగా ఉన్న రాయదుర్గం–నాగోల్, మియాపూర్–ఎల్బీనగర్ రూట్లలో ప్రతి 3 నుంచి 5 నిమిషాలకు ఒకటి చొప్పున రైళ్లు నడుస్తున్నా ప్రయాణికులకు పడిగాపులు తప్పడం లేదు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో మాత్రమే కాదు, అన్ని సమయాల్లోనూ ఈ కారిడార్లలో రైళ్లు కిటకిటలాడుతున్నాయి. దీంతో ఐటీ కారిడార్లలో పనిచేసే ఉద్యోగులు, పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేసేవారు సకాలంలో కార్యాలయాలకు చేరుకోలేకపోతున్నారు. సాధారణంగా రద్దీ కారణంగా ఒక రైలు ఎక్కలేకపోయినా మరో రైలు ఉందిలే అనే భరోసా ఉంటుంది. కానీ ఆ తరువాత వచ్చే మరో రెండు రైళ్లలోనూ ప్రయాణం భారంగానే ఉంటుందని హబ్సిగూడ నుంచి నిత్యం హైటెక్ సిటీకి ప్రయాణించే శ్రీకాంత్ వాపోయాడు.

పెరిగిన ప్రయాణికులు

ప్రస్తుతం మూడు కారిడార్లలో 59 మెట్రో రైళ్లు రోజుకు సుమారు 1,065 ట్రిప్పుల వరకు తిరుగుతున్నాయి. ప్రతి రోజూ సుమారు 5 లక్షల మంది మెట్రోలో రాకపోకలు సాగిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో ఈ సంఖ్య 5.10 లక్షల వరకు కూడా ఉంటున్నది. నగరంలో మెట్రో సేవలను ప్రారంభించినప్పటి నుంచి 40 కోట్లకు పైగా ప్రజలు ఈ సేవలను వినియోగించుకున్నారు. 2017 నవంబర్‌లో మెట్రోరైళ్లను ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు క్రమంగా ప్రయాణికుల సంఖ్య పెరుగుతూనే ఉంది. దశలవారీగా మెట్రో విస్తరణతో పాటే ప్రయాణికుల రద్దీ పెరిగింది. అందుకు అనుగుణంగా ట్రిప్పులు కూడా పెంచారు. కానీ కోచ్‌ల కొరత వల్ల ఎన్ని ట్రిప్పులు తిరిగినా ప్రయాణికుల రద్దీ మాత్రం తగ్గటంలేదు. ప్రస్తుత ప్రయాణికుల్లో ప్రతి రోజూ 1.20 లక్షల మంది విద్యార్థులు, 1.40 లక్షలకుపైగా సాఫ్ట్‌వేర్ నిపుణులు, ఐటీ ఉద్యోగులు ఉంటున్నట్లు అంచనా.

నష్టాల నెపంతో...

మెట్రో రైళ్ల నిర్వహణలో భారీగా నష్టాలొస్తున్నాయనే కారణంతో కొత్త కోచ్‌ల కొనుగోలుపై వెనుకడుగు వేసినట్లు సమాచారం. ఒక కోచ్‌ను కొనాలంటే సుమారు రూ.10 కోట్ల వరకు వ్యయం అవుతుంది. ఈ లెక్కన 59 రైళ్లకు అదనంగా 3 చొప్పున కొనుగోలు చేయాలంటే రూ.500 కోట్లకుపైగా ఖర్చవుతుందని మెట్రో అధికారులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో కోచ్‌ల కొనుగోలు అసాధ్యమని అంటున్నారు. మెట్రో నిర్వహణలో నష్టాలు వస్తున్నాయని చెప్తూ మెట్రో నిర్వహణ సంస్థ ఎల్‌అండ్‌టీ కోచ్‌ల పెంపుపై దాటవేత ధోరణి అవలంబిస్తోంది. ప్రభుత్వానికి సైతం ఇప్పుడున్న పరిస్థితుల్లో రూ.500 కోట్లు వెచ్చించడం సాధ్యం కాకపోవచ్చునని అధికారులు అంటున్నారు. అద్దె ప్రాతిపదికన నాగపూర్ మెట్రో నుంచి అదనపు కోచ్‌లను తెప్పించే అవకాశం ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.



శ్రీరామ యంత్రానికి భద్రాచలంలో పూజలు

భద్రాచలం/మణుగూరుటౌన్: అయోధ్యలోని బాలరాముడి ఆలయంలో ప్రతిష్ఠించేందుకు కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో 180 కేజీల రాగి, బంగారు పూతతో తయారు చేసిన శ్రీరామ యంత్రానికి మంగళవారం భద్రాచలంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ యంత్రాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్లి పూజలు నిర్వహిస్తున్న క్రమంలో భద్రాద్రికి చేరుకుంది. ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు ఘన స్వాగతం పలకగా, శ్రీరామ ప్రచార రథంలోని ఉత్సవమూర్తుల వద్ద యంత్రాన్ని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మణుగూరు సాయినగర్‌లోని బాబా ఆలయానికి చేరుకోగా, పట్టణ, మండల ప్రజలు మంగళ నీరాజనాలతో ఘనంగా స్వాగతం పలికారు. దర్శనం తర్వాత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు, పూజారులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కాలేయ దానం అనంతరం చికిత్స పొందుతున్న తల్లి కవిత



కాలేయ వ్యాధితో చికిత్స పొందుతున్న మహాలక్ష్మి

పునర్జన్మనిచ్చిన అమ్మ

కూతురికి కాలేయ దానం

టేకుమట్ల: బిడ్డ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంటే.. ఏ తల్లి అయినా తన ఆయుష్షును ధారపోయడానికైనా సిద్ధమవుతుందనడానికి ఈ అమ్మే నిదర్శనం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రాఘవాపూర్‌లోని కవిత, రమేశ్‌ల కూతురు మహాలక్ష్మి కాలేయ వ్యాధితో బాధపడుతోంది. ఆ కుటుంబ దీన పరిస్థితిపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'మా ఇంటి మహాలక్ష్మిని నిలబెట్టండి' అనే కథనానికి చలించిన ఎంతోమంది దాతలు విరాళాలు అందిస్తుండటం తెలిసిందే. ఈ క్రమంలోనే వైద్యులు మహాలక్ష్మికి కాలేయ మార్పిడి చేయాలని సూచించడంతో.. కవిత తన కాలేయంలోని కొంతభాగాన్ని బిడ్డకు దానం చేసింది. వైద్యులు మహాలక్ష్మికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయడంతో ఆమె ప్రాణాపాయం నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. ఒక్కరి వైద్య ఖర్చులకే డబ్బులు లేని సమయంలో.. ఇప్పుడు జరిగిన శస్త్రచికిత్స నేపథ్యంలో తల్లీకూతుళ్లు చికిత్స పొందుతున్నారు. దీంతో ఒకవైపు భార్య, మరోవైపు కూతురి వైద్యానికి డబ్బుల కోసం రమేశ్ విలవిల్లాడుతున్నారు.

పోర్టల్‌తో చిన్నారుల సంరక్షణ

- సమన్వయంతోనే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యం
- మహిళా భద్రత డీజీ శిఖాగోయల్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అధికారులు నిర్వహించే వివిధ దాడుల్లో రక్షించిన బాలకార్మికులు, అనాథలు, ఇతర చిన్నారుల సంరక్షణ, సమర్థవంతమైన పర్యవేక్షణకు ఒక పోర్టల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ అభిప్రాయపడ్డారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) ఆదేశాల మేరకు మంగళవారం రాష్ట్ర మహిళా భద్రత విభాగం కార్యాలయంలో.. పాన్ ఇండియా రెస్క్యూ అండ్ రీహాబిలిటేషన్ ఆఫ్ చైల్డ్ లేబర్ అంశంపై భాగస్వామ్య ప్రభుత్వ విభాగాలు, ఎన్జీవోల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. మొత్తం 33 జిల్లాల చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్లు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ల అధికారులు ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. ఈ సందర్భంగా శిఖాగోయల్ మాట్లాడుతూ, బాలకార్మికులు, వెట్టి చాకిరీ, అత్యధికంగా చిన్నారుల అదృశ్యం కేసులున్న ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. పాన్ ఇండియా రెస్క్యూ అండ్ రీహాబిలిటేషన్ ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు, దాబాలు, హోటళ్లు, దుకాణాలు, గనులు, ఇటుకలు వంటి సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే చిన్నారులను రక్షించే లక్ష్యంతో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈనెల 20 వరకు ఇది కొనసాగుతుందని తెలిపారు. చిన్నారుల సంరక్షణ ఇతర అంశాలను మహిళాభద్రత విభాగం డీఐజీ రెమా రాజేశ్వరి పోలీస్ అధికారులు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్‌సీపీసీఆర్), స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారులకు సుదీర్ఘంగా వివరించారు. సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు బృందాధర్‌రావు, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ జీకే సునంద తదితరులు పాల్గొన్నారు.

పోయినా పట్టేస్తున్నారు

- చోరీ మొబైల్ ఫోన్ల రికవరీలో 2వ స్థానంలో తెలంగాణ పోలీస్
- 50 వేల ఫోన్లు రికవరీ.. సిబ్బందిని అభినందించిన డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను ఉపయోగించి గుర్తించడంలో తెలంగాణ పోలీసులు దేశంలోనే రెండో స్థానంలో నిలిచారు. ఏప్రిల్ 20, 2023 నుంచి ఈ నెల 3 వరకు 557 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో కలిపి 50,788 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్టు సీఐడీ డీజీ శిఖాగోయల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఈఐఆర్ వ్యవస్థ ఇప్పుడు తెలంగాణలోని మొత్తం 780 పోలీస్ స్టేషన్లలో పని చేస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం సగటున రోజుకు 91 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేస్తున్నారు. శిఖాగోయల్ నేతృత్వంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ సమన్వయంతో సీఐడీ విభాగం సైబర్ క్రైం ఎస్పీ ఎన్‌జీపీ లావణ్య, డీడీజీ సెక్యూరిటీ హేమంత్ రాథ్వే, డైరెక్టర్ సెక్యూరిటీ ఎం.అరవింద్ కుమార్, జేటీవో నంబి మృదుపాణి, వి.విజయ్ కుమార్ బృందం సెల్‌ఫోన్ల రికవరీకి సంబంధించిన సీఈఐఆర్ పోర్టల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయటానికి పనిచేస్తోంది. సెల్‌ఫోన్ల రికవరీలో ఉత్తమ పనితీరు కనబర్చిన సిబ్బందిని మంగళవారం డీజీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్రైమ్ రివ్యూలో భాగంగా డీజీపీ జితేందర్ అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. ఉత్తమ పనితీరు కనబర్చిన 11 యూనిట్లు, 10 పోలీస్ స్టేషన్ల సిబ్బందిని అభినందించారు.



పది నెలల్లో వెయ్యి వాస్కులర్ సర్జరీలు

నిమ్స్ ఆస్పత్రి రికార్డు

లక్డీకాపూల్ : వాస్కులర్ సర్జరీల్లో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి సరికొత్త రికార్డును నమోదు చేసింది. పది నెలల్లో వెయ్యికిపైగా ఫిస్టుల ఆర్టియావెనస్ శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించింది. 2023లో జనవరి నుండి డిసెంబర్ వరకు 1,000 సర్జరీలు జరిగితే, ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు 1,000 సర్జరీలు పూర్తిచేసి గత రికార్డును అధిగమించినట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం వాస్కులర్ సర్జరీ విభాగం అధిపతి ప్రొఫెసర్ సందీప్ మహాపాత్రతో కలిసి బీరప్ప కేక్ కట్ చేసి వేడుక చేసుకున్నారు. ఈ సర్జరీల్లో పాల్గొన్న డా.అనూష, వాస్కులర్ నిపుణులు, నర్సింగ్ సిబ్బందిని బీరప్ప అభినందించారు. నిమ్స్ పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతుందనడానికి రోజురోజుకు పెరుగుతున్న ఓపీల సంఖ్యే కొలమానమని బీరప్ప పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రొ. నిమ్మ సత్యనారాయణ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రూ.11.61 కోట్ల విలువైన గంజాయి.. డ్రగ్స్ కాల్చివేత

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్‌శాఖ సిబ్బంది నమోదు చేసిన 703 కేసుల్లో పట్టుబడిన గంజాయి, ఇతర డ్రగ్స్‌ను పది జిల్లాల్లో దహనం చేసినట్టు ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 7,951 కేజీల గంజాయి, ఇతర డ్రగ్స్ కలిపి మొత్తం రూ.11,61,90,294 విలువైన మత్తు పదార్థాలను దహనం చేసినట్టు పేర్కొన్నారు. గత నెలంతా ఈ మేరకు మత్తు పదార్థాల దహనానికి అన్ని జిల్లాల్లో స్థానిక ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. ఇంకా చాలా జిల్లాల్లో రూ.70 కోట్ల నుంచి రూ.75 కోట్ల విలువైన గంజాయిని, డ్రగ్స్‌ను దహనం చేయాల్సి ఉందని పేర్కొన్నారు. వాటిని నవంబర్ నెలలో దహనం చేసేందుకు కసరత్తు జరుగుతోందని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలు ప్రారంభం

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో ఘనంగా పోటీలు



ఉట్నూర్‌లో రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్

సాక్షి, ఆదిలాబాద్

రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐటీడీఏ పరిధిలోని జిల్లాల నుంచి 1,600 మంది ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొంటున్నారు. స్థానిక కేబీ కాంప్లెక్స్‌లోని మైదానంలో నిర్వహిస్తున్న పోటీలను ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం ప్రారంభించారు. గురువారం వరకు ఈ పోటీలు కొనసాగనున్నాయి. అండర్–14, అండర్–17 బాల, బాలికలకు 8 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. 250 మంది పీడీలు, పీఈటీలు, కోచ్‌లు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కోసం ఏడాదికి రూ.320 కోట్లు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవలే ప్రభుత్వం ప్రతి విద్యార్థికి డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచిందని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ హైదరాబాద్ కార్యాలయం డీడీ చందన, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు.


Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.

ఖమ్మం జిల్లా కేంద్రానికి సుమారు 24 కిలోమీటర్ల దూరాన నేలకొండపల్లిలో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన బౌద్ధ క్షేత్రం ఉంది. బౌద్ధుల ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లిన ఈ క్షేత్రం.. దేశ, విదేశీ పర్యాటకుల రాకతో పర్యాటకంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది.

- నేలకొండపల్లి

నేలకొండపల్లి.. బౌద్ధం వర్ధిల్లి..

దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన బౌద్ధక్షేత్రం
దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్న నేలకొండపల్లి
పర్యాటక కేంద్రంగా అభివృద్ధి వైపు అడుగులు


నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం

స్తూపం వద్దకు ఇలా చేరుకోవచ్చు..

- ఖమ్మం నుంచి వచ్చే పర్యాటకుల కోసం నేలకొండపల్లి శివారులో బైపాస్‌రోడ్డు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి నుంచి దాదాపు కిలోమీటరు దూరం వెళితే బౌద్ధక్షేత్రం వద్దకు చేరుకోవచ్చు.
- కోదాడ నుంచి వచ్చే పర్యాటకులు మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి మసీద్ సెంటర్ వైపుగా వెళ్లి ముజ్జుగూడెం రహదారి నుంచి వెళితే బౌద్ధక్షేత్రానికి చేరుకుంటారు.
- కూసుమంచి వైపు నుంచి వచ్చే సందర్శకులు నేలకొండపల్లి వరకు వచ్చి సుందరయ్య చౌక్ మీదుగా ఆంజనేయస్వామి సెంటర్, మర్రి చెట్టు సెంటర్ నుంచి ముజ్జుగూడెం రహదారి వైపుగా వెళ్లాలి.
- బౌద్ధక్షేత్రానికి వెళ్లడానికి బస్సు సౌకర్యం లేదు. ప్రత్యేక వాహనాల్లో నేరుగా వెళ్లొచ్చు. లేదంటే నేలకొండపల్లి వరకు బస్సుల్లో చేరుకుని అక్కడి నుంచి ఆటోల్లో వెళ్లాలి.

1976లో తొలిసారి తవ్వకాలు..

ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి–ముజ్జుగూడెం మధ్య ఈశాన్య దిక్కుగా బౌద్ధ స్తూపం ఉంది. ఈ స్తూపం చరిత్ర ఎంతో ఘనమైనది. క్రీ.శ. 2 – 3వ శతాబ్దానికి చెందినదిగా పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. దేశంలో చరిత్ర కలిగిన బౌద్ధమతానికి ఇదొక ప్రధాన కేంద్రం. అయితే పూర్వం స్థానికులు దీనిని ఎర్రదిబ్బ అని పిలిచేవారు. 1976లో పురావస్తు శాఖ అధికారులు ప్రథమంగా తవ్వకాలు జరిపారు. రెండో దఫా 1984లోనూ పెద్దఎత్తున తవ్వకాలు జరిపారు. అనంతరం దీనికి ఒక ఆకారం తీసుకొచ్చాక బౌద్ధ స్తూపంగా గుర్తించారు. ఈ స్తూపం సుమారు 106 అడుగుల వ్యాసం, 60 అడుగుల ఎత్తుతో ఉంటుంది. స్తూపానికి మొత్తం 12 ఎకరాల స్థలం ఉంది. ఇక్కడి తవ్వకాల్లో బుద్ధుని పాలరాతి విగ్రహాలు, మృణ్మయ పాత్రలు, మట్టిపూసలు, ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణుకుండినుల కాలంనాటి నాణేలు, బుద్ధుని పద్మాసనం, పంచలోహ విగ్రహాలు అనేకం బయటపడ్డాయి. వీటిని పురావస్తు శాఖ అధికారులు మ్యూజియంలో ఉంచారు. ఈ బౌద్ధ స్తూపాన్ని పోలిన ఒక మినీ స్తూపాన్ని దగ్గరే ఏర్పాటు చేశారు. క్రీ.శ. 2 శతాబ్దంలో చరిత్రకారుడు టోలమీ రచించిన భూగోళ చరిత్ర గ్రంథంలో దీన్ని నెల్సిండా అని పేర్కొన్నారు. అదే నేడు నేలకొండపల్లిగా మారిందని చరిత్రకారుల అభిప్రాయం. బౌద్ధ స్తూపం వద్దనున్న బాలసముద్రం చెరువు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.


బోటింగ్ ఏర్పాటుచేయనున్న బాలసముద్రం చెరువు

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి..

నేలకొండపల్లి గ్రామ సమీపంలో గల బౌద్ధ స్తూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2009లో రూ.1.26 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. బౌద్ధ స్తూపంతో పాటు ఫెన్సింగ్, పార్కు ఏర్పాటు చేశారు. ఆర్కియాలజీ వారి ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో దీనిని అభివృద్ధి చేశారు. గతేడాది మరో రూ.50 లక్షలతో పర్యాటకుల కోసం విశ్రాంతి భవనం నిర్మించారు. ఇటీవల రాష్ట్ర పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. అభివృద్ధి కోసం రూ.2.50 కోట్లు మంజూరు చేశారు. మరో రెండెకరాల స్థలంలో వివిధ అభివృద్ధి పనులు చేసేలా చర్యలు చేపట్టారు.

విదేశీ యాత్రికుల తాకిడి..

దక్షిణ భారతదేశంలోకెల్లా అతిపెద్దదైన బౌద్ధక్షేత్రానికి విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ముఖ్యంగా చైనా, జపాన్ నుంచి ఎక్కువగా వస్తుంటారు. దేశంలోని బౌద్ధ పర్యాటకులు కూడా వస్తుంటారు. అందుకే బౌద్ధక్షేత్రం పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. అంతేకాకుండా ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగానే వస్తున్నారు. పిక్నిక్, విహార యాత్రలకు వచ్చే వారు కోకొల్లలుగా ఉన్నారు. పర్యాటకులకు చరిత్రను వివరించేలా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో బోర్డులు ఏర్పాటుచేశారు.

ప్రత్యేక ఆకర్షణగా చెరువు..

బౌద్ధక్షేత్రాన్ని ఆనుకుని ఉన్న బాలసముద్రం చెరువు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బౌద్ధక్షేత్రం చుట్టూ తిరిగిన సందర్శకులు కట్టపైకెక్కి చెరువును తిలకిస్తారు. చెరువులో వివిధ రంగులలో పూలు ఆహ్లాదకరంగా ఉంటాయి. దీనిని గమనించిన టూరిజం అధికారులు చెరువులో బోటు షికారుకు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం పర్యాటక చెరువుగా ఎంపిక చేసి రూ.50 లక్షల నిధులు మంజూరు చేసింది.



మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగిన మహాధర్నా కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

'కులగణన సర్వే పేరిట బీసీలకు వెన్నుపోటు'



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వే పేరిట బీసీలను వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ సర్వే పేరిట సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేపడుతోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ ప్రయోజనాలను, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను రద్దు చేయడానికే ఈ సర్వే చేపడుతున్నట్లుగా అనుమానం కలుగుతోందన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజల వ్యక్తిగత వివరాలు, గోప్యతకు సంబంధించి సర్వే ప్రొఫార్మాలో ప్రశ్నలు ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల వేళ రాహుల్ గాంధీ హడావుడిగా తెలంగాణకు వచ్చి, ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం ప్రతి ఎంపీ స్థానంలో రెండు అసెంబ్లీ సీట్లు బీసీలకు ఇవ్వాలని కాసం డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ రాష్ట్రాల్లో అమలుకాని పథకాలు

బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బోలాసింగ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయకుండా, ప్రజలకు లబ్ధి జరగకుండా అడ్డుకుంటున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బోలాసింగ్ ఆరోపించారు. కేంద్ర పథకాలైన ఆయుష్మాన్ భారత్‌తో పాటు మౌలిక సదుపాయాల కల్పన, ఆసుపత్రులు, పాఠశాలల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఆయన మంగళవారం ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, క్రాంతి కిరణ్, జి.అంబేడ్కర్, తులసిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగానికి కట్టుబడి పనిచేస్తానని చెప్పిన రాహుల్ గాంధీ.. అమెరికాకు వెళ్లి రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 50 వేల సభ్యత్వాలు నమోదు చేయడాన్ని బోలాసింగ్ అభినందించారు.


మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సినీనటి అనన్య


లండన్‌లో నిర్వహిస్తున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్‌లో ఇంక్రెడిబుల్ ఇండియా స్టాల్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో యూకేలో భారత హైకమిషనర్ విక్రమ్ దురై స్వామి తదితరులు

టపాసుల కాలుష్యంలో టాప్ ఫైవ్

- బెంగళూరుతో కలిసి ఐదో స్థానంలో హైదరాబాద్
- మొదటి స్థానంలో ఉన్న దేశ రాజధాని ఢిల్లీ
- రెండు, మూడు, నాలుగు స్థానాల్లో ముంబై, కోల్‌కతా, చెన్నై
- వాయు నాణ్యత సూచీలో అథమస్థాయికి మహానగరాలు
- నేషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో దిగజారుతున్న ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని మహానగరాల్లో కాలుష్య మేఘాలు మరింత చిక్కబడుతున్నాయి. సాధారణ సమయంలో కూడా వాయు కాలుష్యం రికార్డులను బద్దలు కొడుతోంది. ఇక పటాకుల పండుగ దీపావళి రోజు వాయు కాలుష్యం అన్ని హద్దులు దాటుతోంది. గత నెల 31న దేశవ్యాప్తంగా ప్రజలు ఎంతో సంతోషంగా దీపావళి పండుగ జరుపుకొన్నారు. కానీ ఆరోజు దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలో కాలుష్యం ఎంతటి ప్రమాదకర స్థాయికి చేరిందో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) సర్వేలో తేలింది.

మొదటి స్థానం ఢిల్లీదే

దీపావళి రోజు నమోదైన వాయు కాలుష్యం విషయంలో హైదరాబాద్ నగరం బెంగళూరుతో కలిసి ఐదో స్థానంలో నిలిచింది. దీపావళి రోజు 24 గంటల్లో ప్రధాన నగరాల్లో వాయు కాలుష్య వివరాలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) విడుదల చేసింది. పండుగ రోజు అత్యధిక కాలుష్యం ఉన్న నగరంగా దేశ రాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో నిలిచింది. దీపావళి రోజు గ్రీన్ కాకర్స్ మినహా సాధారణ పటాకులు కాల్చటంపై నిషేధం ఉన్నా ఢిల్లీ మొదటి స్థానంలోనే నిలవటం గమనార్హం. దీపావళి రోజు ఢిల్లీలో ఏక్యూఐ 339 పాయింట్లుగా నమోదైంది. స్విస్ కంపెనీ ఐక్యూ ఏఐఆర్ 'లైవ్ ర్యాంకింగ్ ఆఫ్ గ్లోబల్ సిటీస్ ఆన్ ఏక్యూఐ'నివేదిక ప్రకారం దీపావళి పండుగ మరుసటి రోజు ఉదయం 8 గంటల సమయంలో ప్రపంచవ్యాప్తంగా వాయు కాలుష్య స్థాయిలను విశ్లేషించినపుడు ఢిల్లీ నగరం ప్రపంచంలోనే అత్యంత వాయు కాలుష్య నగరంగా నిలిచింది.

ఏక్యూఐ ప్రామాణిక (స్టాండర్డ్) స్థాయిలు..

కేటగిరీ	పాయింట్లు
గుడ్	0-50
సాటిస్‌ఫాక్టరీ	51-100
మోడరేట్	101-200
పూర్	201-300
వెరీ పూర్	301-400
సివియర్	401-500



ఐక్యూ ఏఐఆర్ నివేదిక ప్రకారం

- పర్టిక్యులేట్ మ్యాటర్ (పీఎం 2.5) ప్రామాణిక పాయింట్లపరంగా 30 పాయింట్లు దాటితే కాలుష్యకారకంగా పరిగణిస్తారు.
- మనదేశంలోని ప్రధాన నగరాల్లో కాలుష్య స్థాయిలు జాతీయ సగటు కంటే రెండింతలు నమోదయ్యాయి.
- పీఎం 2.5 (అతి సూక్ష్మస్థాయిలోని ధూళి కణాలు–పీఎం 2.5) విషయానికొస్తే జాతీయ సగటు కంటే ఢిల్లీలో 2022లో 92.6 పాయింట్లు అధికంగా ఉండగా, 2023లో 102.1 పాయింట్లు అధికంగా నమోదైంది. జాతీయ సగటు 2022లో 53.3 పాయింట్లు, 2023లో 54.4 పాయింట్లు మాత్రమే ఉన్నది.
- పీఎం 2.5 2022లో ముంబైలో 46.7 పాయింట్లు, 2023లో 43.8 పాయింట్లు నమోదైంది.
- కోల్‌కతాలో 2022లో 50.2, 2023లో 47.8 పాయింట్లు రికార్డయ్యింది.
- హైదరాబాద్‌లో 2022లో 42.4 పీఎం 2.5 పాయింట్లు, 2023లో 39.9 పాయింట్లు నమోదైంది.
- ప్రామాణికంగా చూస్తే పీఎం 10 స్థాయిలు (మైక్రోగ్రామ్ పర్ క్యూబిక్ మీటర్) 60 పాయింట్లు దాటితే వాయు కాలుష్యకారకాలు పెరిగినట్టుగా భావించాలి. 2023-24 నాటికి ఏడాదికి 20 నుంచి 30 శాతం పీఎం 10 సాంద్రతను తగ్గించాలని ప్రభుత్వం నిర్దేశించుకొన్నది. ఐతే సగటు వార్షిక పీఎం 10 స్థాయిలు 2023-24లో ఢిల్లీలో 208, ముంబైలో 94, కోల్‌కతాలో 94, అహ్మదాబాద్‌లో 98, పుణేలో 98, బెంగళూరులో 70, హైదరాబాద్‌లో 81, చెన్నైలో 63 పాయింట్లు రికార్డయ్యింది.

సీపీసీబీ నివేదిక ప్రకారం ప్రధాన నగరాల్లో ఏక్యూఐ స్థాయిలు

(దీపావళి పండుగ రోజు సాయంత్రం 4 గంటల నుంచి మరుసటి రోజు సాయంత్రం 4 గంటల వరకు)

నగరం	ర్యాంకు	ఏక్యూఐ పాయింట్లు
ఢిల్లీ	1	328-339
ముంబై	2	167-169
కోల్‌కతా	3	57-155
చెన్నై	4	213-142
బెంగళూరు	5	109-135
హైదరాబాద్	5	99 -135

నవంబర్ 1న ఉదయం 8 గంటలకు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వాయు కాలుష్యం రికార్డయిన నగరాలు

నగరం	ర్యాంకు	ఏక్యూఐ పాయింట్లు
ఢిల్లీ	1	196
లాహోర్	2	175
బీజింగ్	3	170
ముంబై	4	167
ఢాకా	5	166
కోల్‌కతా	6	155
జకార్తా	7	152
రోట్టర్‌డామ్	8	138
ఉహాన్	9	134





పండగల్లో రూ. లక్ష కోట్ల వస్తువులు కొనేశారు

దసరా, దీపావళి సీజన్‌లో లక్ష కోట్లు దాటిన అమెజాన్, ఫ్లిప్‌కార్టుల అమ్మకాలు

- 70 శాతం అమ్మకాలు గ్రామీణ భారతం నుంచే
- ఏఐ టెక్నాలజీ ఉన్న స్మార్ట్‌ఫోన్స్‌కు భారీగా డిమాండ్
- లగ్జరీ వస్తువుల పైనే ఆసక్తి
- ఈ కామర్స్ కన్సల్టెన్సీ డాటమ్ ఇంటెలిజెన్స్ సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి: ఈ పండుగల సీజన్‌లో ఆన్‌లైన్ అమ్మకాలు రికార్డుస్థాయిలో దుమ్ము రేపాయి. దేశ చరిత్రలో తొలిసారిగా కేవలం నెల రోజుల్లో లక్ష కోట్లకు పైగా ఆన్‌లైన్ కొనుగోళ్లు జరిగాయి. దసరా దీపావళి పండుగలకు ప్రముఖ ఈ కామర్స్ సంస్థలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ప్రవేశపెట్టిన భారీ డిస్కౌంట్ ఆఫర్లు సూపర్ హిట్ అయ్యాయి. ఈకామర్స్ కన్సల్టెన్సీ సంస్థ డాటమ్ ఇంటెలిజెన్స్ ఈ విషయాలు తెలిపింది. ఇదే సీజన్‌లో 2022లో రూ.69,000 కోట్ల విలువైన అమ్మకాలు జరగ్గా, 2023లో రూ.81,000 కోట్లుకు చేరాయని, ఈ ఏడాది రూ.లక్ష కోట్లు దాటినట్లు ఆ సంస్థ సర్వేలో వెల్లడైంది. ఇటీవలి దసరా సమయంలో రూ.55,000 కోట్ల అమ్మకాలు జరిగితే దీపావళి సమయంలో మరో రూ.50,000 కోట్ల అమ్మకాలు జరిగినట్లు డాటమ్ పేర్కొంది.

నాన్ మెట్రో అమ్మకాలే అధికం

ఈసారి ఆన్‌లైన్ అమ్మకాల్లో నాన్ మెట్రో పట్టణాలు సత్తా చూపించాయి. మొత్తం అమ్మకాల్లో 85 శాతం చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల నుంచే జరిగినట్లు అమెజాన్ పేర్కొంది. మొత్తం అమ్మకాల్లో 65 శాతం స్మార్ట్ ఫోన్లే ఉన్నాయంటే ఏ స్థాయిలో మొబైల్ ఫోన్లను కొన్నారో అర్థం చేసుకోవచ్చు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫీచర్స్ ఉన్న లగ్జరీ స్మార్ట్ ఫోన్లపై యువత అత్యంత ఆసక్తిని కనబర్చినట్లు తేలింది. గతేడాదితో పోలిస్తే లగ్జరీ వస్తువుల అమ్మకాల్లో 30 శాతం వృద్ధి నమోదు కాగా, బ్రాండెడ్ లగ్జరీ ఫ్యాషన్ అమ్మకాల్లో 400 శాతం వృద్ధి నమోదైంది. లగ్జరీ వాచీలు, డియోడరెంట్లు, హ్యాండ్‌బాగ్స్, స్పోర్ట్స్ వేర్, కిడ్స్‌వేర్ రంగాల్లో అమ్మకాలు అత్యధికంగా జరిగినట్లు డాటమ్ నివేదిక పేర్కొంది.

కుల గణన కోసం పోరుబాట



- 2025లో జన గణనకు కేంద్రం కసరత్తు
- కుల గణనకు కేంద్రం అంగీకరించకపోవడంతో రాష్ట్రాలపై ఒత్తిడి
- ఇప్పటికే బిహార్‌లో పూర్తి.. తెలంగాణలో పచ్చజెండా
- ఏపీలోనూ కుల గణన ప్రక్రియ ప్రారంభించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయిన కుల గణన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కుల గణన చేపట్టాలనే డిమాండ్ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా జన గణనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దానితోపాటే కుల గణన కూడా చేపట్టాలని బీసీ సంఘాలు ఒత్తిడి చేస్తున్నాయి. జనాభా లెక్కల సేకరణ 2011లో దేశవ్యాప్తంగా జరిగింది. మళ్లీ 2021లో జరగాల్సిన ఉండగా, కోవిడ్, ఇతర కారణాల వల్ల జాప్యమైంది. తాజాగా 2025లో జన గణన చేపట్టి 2026కు పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. దీంతో జనాభా లెక్కల ఫార్మాట్‌లో ఈసారి బీసీ కులం కాలమ్ కూడా చేర్చి కుల గణన కూడా చేపట్టాలనే డిమాండ్ కేంద్రం ముందుకు వచ్చింది. ఈ డిమాండ్‌ను అంగీకరించేది లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. గతంలో మాదిరిగానే జనాభా లెక్కల సేకరణ మాత్రమే నిర్వహిస్తామని తేల్చి చెప్పింది. ఫలితంగా రాష్ట్రాల్లో కుల గణనకు డిమాండ్ పెరిగింది. ఈ మేరకు మన రాష్ట్రంలో ఉద్యమానికి బీసీ నేతలు సిద్ధమవుతున్నారు.

కుల గణనకు చర్యలు చేపట్టిన జగన్

జనాభా లెక్కల్లోనే కుల గణన ద్వారా ఏయే కులాల జనాభా ఎంత అనేది తేలుతుంది. ఆర్థిక, సామాజిక, రాజకీయ తదితర రంగాల్లో ఆయా వర్గాల స్థానం ఏమిటీ అనేది తెలుసుకోవచ్చు. తద్వారా దామాషా పద్ధతిలో వారికి తగిన అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఈ విషయాన్ని గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... ముఖ్యమంత్రిగా ఉండగానే బీసీ నేతలు కోరకముందే రాష్ట్రంలో కుల గణన చేపడతామని ప్రకటించారు. దానికి అనుగుణంగా చర్యలు కూడా చేపట్టారు. ఈలోపు ఎన్నికలు రావడంతో ఆగిపోయింది.

నైపుణ్య గణన పేరుతో కుల గణనకు బాబు బ్రేక్!

దేశంలోనే బిహార్ రాష్ట్రం మొదట కుల గణన చేపట్టి పూర్తిచేసింది. ఆ తర్వాత ఏపీలోను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుల గణన ప్రక్రియను ప్రారంభించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కుల గణనను పక్కన పెట్టి నైపుణ్య గణన అంటూ కొత్త నినాదాన్ని తెరపైకి తెచ్చింది. పొరుగున ఉన్న తెలంగాణలోను కుల గణన చేపడతామని తాజాగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోను కుల గణనను పూర్తి చేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు దశలవారీ ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. పలువురు బీసీ నేతలు సైతం సీఎం చంద్రబాబును కలిసి రాష్ట్రంలో కుల గణన చేపట్టాలని వినతిపత్రాలు అందించారు. అయినప్పటికీ కుల గణన విషయంలో చంద్రబాబు నుంచి సానుకూల స్పందన రావడంలేదని, బీసీ నేతలు రాష్ట్ర వ్యాపిత ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు.

క్లుప్తంగా...

ఎమ్మెల్సీ అభ్యర్థి నారాయణరావుకు ఎస్టీయూ మద్దతు

సాక్షి, అమరావతి: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం నారాయణరావుకు రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి.. మూడున్నర దశాబ్దాలకుగాపై అధ్యాపక వృత్తిలో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన నారాయణరావుకు మద్దతు ఇచ్చేలా ఎస్టీయూ కార్యవర్గంలో తీర్మానించినట్టు ఆ సంఘం అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి మంగళవారం తెలిపారు. విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యల పరిష్కారానికి శాసన మండలిలో ఆయా వర్గాల వాణిని వినిపించేలా నారాయణరావుని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

మాజీ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా పిటిషన్ కొట్టివేత

సాక్షి, అమరావతి: ఓ హత్య కేసుకు సంబంధించి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ తుని మాజీ ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. కేసు తీవ్రమైనదని, జీవితఖైదు లేదా ఉరిశిక్ష పడే కేసు అయినందున ముందస్తు బెయిల్ మంజూరు చేయడం సాధ్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ మంగళవారం తీర్పు వెలువరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, ఎస్.అన్నవరం వద్ద 2019లో సత్యనారాయణ అనే విలేకరి హత్య జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దాడిశెట్టి రాజాతో పాటు మరికొందరిని నిందితులుగా చేర్చారు. ఈ నేపథ్యంలో ఆయన ముందస్తు బెయిల్ కోసం ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. గత వారం వాదనలు విన్న జస్టిస్ కృపాసాగర్ మంగళవారం తీర్పు వెలువరించారు.

సుప్రీంకోర్టుకు విద్యాసాగర్
ఏపీ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్



సాక్షి, న్యూఢిల్లీ: ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన అరెస్టును సమర్థిస్తూ.. ఏపీ హైకోర్టు అక్టోబర్ 10న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో విద్యాసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. ట్రయల్ కోర్టులో ఇప్పటికే బెయిల్ అప్లికేషన్ దాఖలు చేసినట్లు ఆయన తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. బెయిల్ అప్లికేషన్‌పై త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని ధర్మాసనాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్ ధర్మాసనం... మూడు వారాల్లో బెయిల్ అప్లికేషన్‌పై నిర్ణయం తీసుకోవాలని కింది కోర్టుకు మార్గదర్శకాలు ఇచ్చింది. అలాగే ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

పిటిషన్‌ను ఉపసంహరించుకున్న వాసంశెట్టి

సాక్షి, అమరావతి: అమలాపురం మేజిస్ట్రేట్ కోర్టులో తనపై విచారణ జరుగుతున్న ఓ కేసును కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో తాను దాఖలు చేసిన పిటిషన్‌ను మంత్రి వాసంశెట్టి సుభాష్ ఉపసంహరించుకున్నారు. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఈ వ్యాజ్యం విచారణకు వచ్చినప్పుడు సుభాష్ తరపు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు స్పందిస్తూ, ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ నిమిత్తం ఈ వ్యాజ్యాన్ని ఉపసంహరించుకుంటున్నామని తెలిపారు. అందుకు అనుమతినివ్వాలని కోరారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ఉపసంహరణకు అనుమతినిస్తూ ఆ మేర ఉత్తర్వులు జారీ చేశారు.

పేషీల్లో టీడీపీ నిఘా

రాష్ట్ర సచివాలయంలో అన్ని శాఖల్లోనూ ఇదే పరిస్థితి | **అనుకూల ఉద్యోగులతో ప్రత్యేక వ్యవస్థ**

- అనుకూల ఉద్యోగులతో ప్రత్యేక వ్యవస్థ
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరున్నారో తెలుసుకునేందుకే
- ఫోన్ ట్యాపింగ్ కూడా చేస్తున్నట్లు అనుమానాలు
- ఫోన్లలో మాట్లాడేందుకు సైతం భయపడుతున్న అధికారులు, ఉద్యోగులు
- మంత్రులు, ఐఏఎస్‌లలోనూ వణుకు



సాక్షి, అమరావతి : ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న వారిని గుర్తించి, నిరంత నిఘాకు రాష్ట సచివాలయంలో అన్ని శాఖలు, సెక్షన్లలో టీడీపీ వేగులు తిష్ట వేశారు. ఆ శాఖలు, సెక్షన్లలోనే అనుకూలంగా ఉండే కొందరితో టీడీపీ ఈ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. శాఖల్లో ఎవరు ఏం మాట్లాడుకుంటున్నారు, ఏం జరిగిందో సమాచారాన్ని వీరు నిరంతరం టీడీపీ పెద్దలకు చేరవేస్తున్నట్లు సమాచారం. ఉద్యోగుల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేస్తున్నట్లు అనుమానాలు కలుగుతుండటంతో అధికారులు, ఉద్యోగుల్లో తీవ్ర భయం నెలకొంది. కొందరు మంత్రులు, ఐఏఎస్ అధికారులు కూడా ఫోన్లలో మాట్లాడేందుకు కూడా జంకుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

మాజీ నాయకులతోనే నిఘా వ్యవస్థ!

సచివాలయ ఉద్యోగుల సంఘానికి గతంలో నాయకులుగా పనిచేసిన పలువురితో పాటు టీడీపీకి అనుకూలంగా ఉండే కీలక అధికారులతో ఈ నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. వివిధ సెక్షన్లలో పనిచేసే అదనపు కార్యదర్శులు, డిప్యూటీ కార్యదర్శులు, ఇతర అధికారులను టీడీపీ, వైఎస్సార్‌సీపీ, న్యూట్రల్ అని మూడుగా విభజించారు. అందులోనూ ఎవరు ఏ సామాజికవర్గానికి చెందిన వారో కూడా పరిశీలించి, పూర్తిగా తమకు అనుకూలంగా ఉండే వారిని ముఖ్యమైన శాఖల్లో కీలక స్థానాల్లో నియమించారు. వైఎస్సార్‌సీపీ ముద్ర వేసిన వారిలో కొందరిని జీఏడీకి అటాచ్ చేయగా, మరికొందరిని అప్రాధాన్యమైన పోస్టుల్లోకి పంపించారు. న్యూట్రల్ అనుకున్న వారికీ అప్రాధాన్య పోస్టులు ఇచ్చారు. దాదాపు అన్ని కీలక స్థానాల్లో అనుకూలమైన వారినే పెట్టుకొన్నారు. వారి ద్వారానే సెక్షన్లు, ముఖ్య కార్యదర్శుల పేషీల్లో ఏం జరుగుతుందో నిరంతరం టీడీపీ పెద్దలకు తెలిసే ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది.

పార్టీల ముద్ర వేసి మరీ వేధింపులు

ఎవరైనా ప్రభుత్వంలో జరుగుతున్న విషయాలపై పిచ్చాపాటిగా మాట్లాడినా, అసంతృప్తి వెలిబుచ్చినా వారి గురించి ఈ నిఘా వర్గాలు ప్రభుత్వ పెద్దలు, ఆయా శాఖల ముఖ్యులకు చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా మాట్లాడిన వారిపై వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి వేధిస్తుండటం పరిపాటిగా మారిందంటున్నారు. ఐఏఎస్‌లూ ఈ నిఘా దెబ్బకు భయపడుతున్నట్లు తెలుస్తోంది. అధికారులను ఎవరు, ఎందుకు కలుస్తున్నారు, వారు ఎవరికి సంబంధించిన వ్యక్తులనే సమాచారాన్ని కూడా పెద్దలకు చెబుతున్నట్లు సమాచారం. మంత్రుల పేషీల్లో ఓఎస్‌డీలు, పీఎస్‌లు కూడా స్వేచ్ఛగా మాట్లాడేందుకు జంకుతున్నారు.

ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని అనుమానాలు

నిఘాతోపాటు ఫోన్ ట్యాపింగ్ కూడా జరుగుతున్నట్లు సచివాలయంలో ప్రచారం జరుగుతోంది. ఐఏఎస్‌లతోపాటు వివిధ స్థాయిల్లో ఉన్న అధికారులు సైతం ఫోన్లలో మాట్లాడేందుకు భయపడుతున్నట్లు తెలిసింది. వాట్సాప్ కాల్స్ మాట్లడడానికీ వెనుకాడుతున్నారంటే ట్యాపింగ్ భయం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇద్దరి మధ్య సంభాషణ బయటకు తెలిసిపోతుండడంతో కచ్చితంగా ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు మంత్రులు సైతం స్వేచ్ఛగా మాట్లాడేందుకు జంకుతున్నారు. ఏ కామెంట్ చేసినా, ఎవరిని కలిసినా పెద్దలకు తెలిసిపోతుందంటూ వారు కూడా ఆందోళన వెలిబుచ్చుతున్నట్లు సమాచారం.

ఏపీ ట్రాన్స్‌కో కొత్త సబ్ స్టేషన్లు



సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఐదు నూతన సబ్ స్టేషన్లను ప్రారంభించడంతో పాటు, 14 సబ్ స్టేషన్లు, లైన్లకు సీఎం చంద్రబాబు ఈ నెల 7న భూమి పూజ చేయనున్నారని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ట్రాన్స్ కో సీఎండీ కె.విజయానంద్ వెల్లడించారు. సీఆర్‌డీఏ పరిధిలో 400/220 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్ స్టేషన్(జీఐఎస్) ప్రారంభానికి సంబంధించి తాళ్లాయపాలెంలో సీఎం కార్యక్రమ ఏర్పాట్లను విజయానంద్ మంగళవారం పరిశీలించి విద్యుత్ శాఖ అధికారులకు తగు సూచనలు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మిగతా నాలుగు సబ్ స్టేషన్లను తాళ్లాయపాలెం నుంచి వర్చువల్ విధానంలో సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే మొత్తం 14 సబ్ స్టేషన్లు , లైన్ల నిర్మాణాలకు సంబంధించి భూమి పూజ కూడా చేస్తారని చెప్పారు. రూ.5407 కోట్లతో ఎన్టీఆర్, గుంటూరు, చిత్తూరు, నంద్యాల, శ్రీ సత్యసాయి, శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాల పరిధిలోని 132/33 కేవీ, 220/132 కేవీ, 400/220 కేవీ, వివిధ సామర్థ్యాలతో సబ్ స్టేషన్లు, లైన్లను నూతనంగా ఏర్పాటు చేస్తున్నట్లు విజయానంద్ వివరించారు.

నేడు స్టెమీ, సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభం

- 2023 సెప్టెంబర్‌లోనే శ్రీకారం చుట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: గుండె పోటు, క్యాన్సర్ ఈ రెండు ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారాయి. వీటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించేలా 'ఎస్టీ–ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్ (స్టెమీ)', సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను బుధవారం సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. వీటిపై మంగళవారం వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సమీక్షించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అమలు...

ఈ రెండు కార్యక్రమాలు మాజీ సీఎం వైఎస్ జగన్ ఆలోచనల నుంచి రూపుదాల్చాయి. 238 స్పోక్స్ (సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులు), 37 హబ్‌లు ద్వారా 2023, సెప్టెంబర్ నుంచి 'స్టెమీ' రాష్ట్రవ్యాప్తంగా అమలవుతోంది. సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులకు గుండెపోటు లక్షణాలతో వచ్చిన రోగులకు ఈసీజీ తీసి థ్రాంబోలైసిస్ ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా ప్రాణాపాయ ముప్పును తప్పించడమే స్టెమీ ముఖ్య ఉద్దేశం. గతేడాది సెప్టెంబర్ నుంచి డిసెంబర్ మధ్య హబ్ ఆస్పత్రులకు వచ్చిన 2,107 మంది ఛాతీ నొప్పి బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించి ప్రాణాలు నిలిపారు. ఇక.. క్యాన్సర్ ప్రొసీజర్‌లను ఆరోగ్యశ్రీలో చేర్చి బాధితులకు అండగా నిలిచిన వైఎస్ జగన్, సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టి ప్రారంభ దశలోనే జబ్బును గుర్తించడం ద్వారా ప్రాణ నష్టాన్ని నివారించాలని భావించారు. ఈ క్రమంలోనే 18 ఏళ్ల పైబడిన అందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టడానికి గత ప్రభుత్వంలోనే కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అలవెన్స్‌లు చెల్లించాలి: ఎన్‌ఎంయూ

సాక్షి, అమరావతి: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు నాలుగు నెలలుగా నిలిపివేసిన డే అవుట్ అలవెన్స్‌లను తక్షణమే చెల్లించడంతోపాటు ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూ) డిమాండ్ చేసింది. ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జారీ చేసిన పారదర్శకమైన విధానాన్ని కొనసాగించాలని కోరింది. ఈ మేరకు ఎన్‌ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తోపాటు ఇతర ప్రతినిధులు మంగళవారం ఆర్టీసీ ఈడీ రవివర్మను విజయవాడలో కలసి వినతిపత్రం అందించారు. గతంలో అంగీకరించినట్టుగా సిక్ లీవు వేతనాలను అదే నెలలో చెల్లించాలని కోరారు. క్యాడర్ స్ట్రెంత్ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఉద్యోగులకు ఈపీఎఫ్ హయ్యర్ పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డిస్లెక్సియా చిన్నారులకు ప్రత్యేక తర్ఫీదునివ్వాలి..
సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీనివాసరావు



ర్యాలీని ప్రారంభిస్తున్న సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి : నిర్దిష్ట అభ్యసనా వైకల్యం(డిస్లెక్సియా) విద్యార్థులను గుర్తించి తర్ఫీదునిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీనివాసరావు అన్నారు. అక్టోబర్‌ను 'డిస్లెక్సియా అవగాహన నెల'గా ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం విజయవాడలోని పటమట కేబీసీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో 'స్టేట్ వాక్' ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.


ప్రభుత్వం ద్వంద్వనీతి విడనాడాలి: సామాజిక న్యాయ వేదిక

సాక్షి, అమరావతి: సనాతన ధర్మం ఎంత ముఖ్యమో... సమధర్మం కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని పాలకులు గుర్తించాలని సామాజిక న్యాయ వేదిక (ఎస్‌జేఎఫ్) పేర్కొంది. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమన్యాయం, సామాజికన్యాయం చేసే విషయంలో ప్రభుత్వం ద్వంద్వ నీతిని విడనాడాలని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు రాసిన లేఖను ఎస్‌జేఎఫ్ రాష్ట్ర చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్ మీడియాకు విడుదల చేశారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లోను జనాభా ప్రాతిపదికగా సమన్యాయం, సామాజికన్యాయం పాటించాలన్నారు. ప్రభుత్వం ద్వంద్వ విధానాలను విడనాడి సకలజనులకు సామాజికన్యాయం చేసే విధంగా బుధవారం జరిగే మంత్రిమండలి సమావేశంలో తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖరీఫ్ ఆహార ధాన్యాల ఉత్పత్తి 1,647.05 ఎల్ఎంటీ

మొదటి ముందస్తు అంచనాలను విడుదల చేసిన కేంద్ర వ్యవసాయ శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో 2024–25 సంవత్సరానికి ప్రధాన వ్యవసాయ పంటల (ఖరీఫ్ మాత్రమే) ఉత్పత్తికి సంబంధించిన మొదటి ముందస్తు అంచనాలను కేంద్ర వ్యవసాయ శాఖ విడుదల చేసింది. మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కింద నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే నుంచి డేటాను సేకరించి అంచనాలను సిద్ధం చేయడానికి ఉపయోగించారు. మొదటి ముందస్తు అంచనాల ప్రకారం 2024–25లో మొత్తం ఖరీఫ్ ఆహారధాన్యాల ఉత్పత్తి 1,647.05 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ)గా అంచనా వేశారు. ఇది గతేడాది ఖరీఫ్ ఆహారధాన్యాల ఉత్పత్తితో పోలిస్తే 89.37 ఎల్ఎంటీ అధికం. వరి, జొన్న, మొక్కజొన్నల ఉత్పత్తి కారణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగింది. 2024–25లో ఖరీఫ్ వరి మొత్తం ఉత్పత్తి 1,199.34 ఎల్ఎంటీగా అంచనా వేశారు.



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్టుమెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 74,651 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందే వెళ్లే భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

భక్తిశ్రద్ధలతో హోమాలు




పుల్లంపేట: మండల పరిధిలోని కోనెయ్యగారిపల్లి గ్రామంలో మంగళవారం శ్రీ సీతారామ లక్ష్మణ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం పురవీధులలో ఊరేగించారు. నేడు బుధవారం విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని, తదుపరి అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, ఆలయ ధర్మకర్త నారంరెడ్డి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ నాగా పిచ్చిరెడ్డి, ఆలయ కమిటీ మెంబర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగుల చవితి వేడుకలు

రాయచోటి: నాగుల చవితి సందర్భంగా వైఎస్సార్ జిల్లాలోని అన్ని మండలాల్లో మహిళలు పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే పుణ్య స్నానాలు ఆచరించి ఉపవాసాలు ఉండి సమీపంలోని ఆలయాలు, పుట్టల వద్దకు చేరుకుని పూలు, పసుపు, కుంకుమలు సమర్పించి పుట్టకు పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా ఆలయాల వద్ద దేవతమూర్తులను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సిరులతల్లికి లక్ష కుంకుమార్చన




డాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి దేవస్థానంలో లక్ష కుంకుమార్చన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా మొదటి మంగళవారం నిర్వహించే ఈ కుంకుమార్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.10 వేలు చెల్లిస్తే వారి తరపున నలుగురు దంపతులను అనుమతించనున్నట్లు ఈవో శోభారాణి తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో విభాగాల తనిఖీ

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు నేతృత్వంలోని కమిటీ సభ్యులు మంగళవారం ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, న్యూ క్లాస్ రూమ్ కాంప్లెక్స్‌లను తనిఖీ చేశారు. విభాగాల్లో అవసరమైన మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని విభాగాధిపతులకు సూచించారు. సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు.





ఎస్పీడబ్ల్యూ విద్యార్థుల ప్రతిభ



తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ మహిళల అంతర కళాశాలల టోర్నమెంట్ వర్సిటీ క్రీడామైదానంలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. వర్సిటీ పరిధిలోని పలు కళాశాలల విద్యార్థినులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. వాలీబాల్ పోటీలో ఎస్పీడబ్ల్యూ విద్యార్థినుల జట్టు విజేతగా నిలవగా, మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. అలాగే కోకో మ్యాచ్ విన్నర్స్‌గా ఎస్పీడబ్ల్యూ కళాశాల జట్టు నిలువగా, రన్నరప్‌గా ఎస్వీయూ కళాశాల విద్యార్థినులు నిలిచారు. బాల్‌బ్యాడ్మింటన్ విభాగంలో శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల జట్టు విజేతగా నిలువగా, తిరుపతి ఎస్పీడబ్ల్యూ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. గెలుపొందిన జట్లకు ఎస్వీయూ వీసీ అప్పారావు ట్రోఫీ, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.

వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య పరీక్షల నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని రద్దు చేసి ఆ విద్యార్థులకు కర్నూలులోని ఎస్ఎల్ఎస్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కొత్త పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసే విద్యార్థులకు ఆ సెంటర్ పేరుతో హాల్‌టికెట్లు జారీ చేశామని దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను ఏఎన్‌యూ దూర విద్యాకేంద్రం వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దూరవిద్యా కేంద్రం పరీక్షలు జరుగుతున్న అన్ని కేంద్రాల్లో యూనివర్సిటీ ఉన్నతాధికారుల అనుమతితో యూనివర్సిటీ నిబంధనలకు లోబడి పరిశీలకులు, స్క్వాడ్ బృందాలను ఇప్పటికే నియమించడం జరిగిందన్నారు.

పశువులు, కోళ్ల వైద్యంలో యాంటీబయాటిక్స్ అతిగా వాడొద్దంటున్న ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.), భారత ప్రభుత్వం

* * *

ముఖ్యమైన 22 రకాల పశు వ్యాధులకు పెరటి వైద్యమే మేలంటున్న ఎన్.డి.డి.బి.

ఆయుర్వేద పశు వైద్యానికి పెద్ద పీట!

పశువైద్యంలో యాంటీబయాటిక్స్ ఔషధాల దుర్వినియోగం వల్ల సూక్ష్మ క్రిములు నిరోధకతను పెంచుకుంటున్న సమస్య ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి పెనుముప్పుగా పరిణమించింది. వ్యవసాయం, పశుపోషణ, కోళ్ల పెంపకం, ఆక్వా సాగులోనూ యాంటీబయాటిక్స్ వాడాకం విషయంలో అప్రమత్తత అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పశు పోషణలో యాంటీబయాటిక్స్ ఔషధాల వాడకాన్ని సాధ్యమైనంత తగ్గించుకోవడానికి సంప్రదాయ ఆయుర్వేద చికిత్సా పద్ధతుల (ఎత్నో వెటరినరీ మెడిసిన్ ప్రాక్టీసెస్ – ఈవీఎంల)ను అనుసరించడం మేలని జాతీయ పాడి అభివృద్ధి సంస్థ (ఎన్.డి.డి.బి.) రైతులకు, గత ఐదేళ్లుగా సూచిస్తోంది. 22 రకాల పశువ్యాధులకు సాంప్రదాయ మూలికా చికిత్స పద్ధతులను యూట్యూబ్ ఛానల్ ద్వారా ఎన్.డి.డి.బి. అందుబాటులోకి తెచ్చింది.

భారత పశుసంవర్థక మంత్రిత్వశాఖ 80 మంది ప్రముఖ అల్లోపతి, ఆయుర్వేద, యునాని, హోమియో పశు వైద్య నిపుణులను ఇటీవల సంప్రదించి.. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుందేళ్లు, కోళ్ల పెంపకంలో భాగంగా వ్యాధులకు చికిత్స చేసేటప్పుడు యాంటీబయాటిక్ ఔషధాలు, ఇతర అల్లోపతి మందులకు ప్రత్యామ్నాయంగా ఈవీఎంలను, హోమియో మందులను వాడుకోవటం ఉత్తమ మార్గమని నిర్దేశిస్తూ ప్రామాణిక మార్గదర్శకాలను ఇటీవల ప్రకటించింది.

ప్రమాదకరమైన పొదుగువాపు (మాస్టైటిస్) వ్యాధి సహా 22 రకాల వ్యాధులకు రసాయనికేతర చికిత్స పద్ధతులను నిర్ధారించింది. దీనికి సంబంధించిన వీడియోలను తెలుగు సహా వివిధ ప్రాంతీయ భాషల్లో రూపొందించింది. ఎన్.డి.డి.బి. యూట్యూబ్ ఛానల్‌లో ఈ వీడియోలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా.. కొన్ని ప్రభావశీలమైన సంప్రదాయ ఆయుర్వేద చికిత్సా పద్ధతులను ఇక్కడ తెలుసుకుందాం. వీటిని రైతులు స్వయంగా ఇంటి దగ్గర తామే తయారు చేసుకొని వాడుకోవచ్చు.

నిర్వహణ:
పంతంగి రాంబాబు,
సాగుబడి డెస్క్

పొదుగు వాపు: కలబంద, పసుపు పేస్టుతో చికిత్స

పశువ్యాధుల్లో అత్యధికంగా (29%) పొదుగుకు సంబంధించినవే. 9 రాష్ట్రాల్లో 24 పాల సహకార సంఘాల ద్వారా 92,917 పశువులకు పొదుగు వాపు వ్యాధికి కలబంద, పసుపు పేస్టు వాడారు. 78 శాతం పశువుల్లో అంటే 72,129 పశువుల్లో పొదుగువాపు పూర్తిగా తగ్గిపోయిందని ప్రభుత్వం ప్రకటించింది.

పొదుగు వాపునకు సంప్రదాయ ఆయుర్వేద చికిత్స పద్ధతులు రెండు విధాలుగా ఉన్నాయి. ఒకటి నీటితో దినుసులు కలిపి పొదుగుకు పూసే పద్ధతి. రెండోది నూనెతో కలిపి పూసేది. ఈ రెండిటి గురించి తెలుసుకుందాం.





నీటితో కలిపి వాడే మందు తయారీకి ఒక రోజుకు కావలసిన పదార్థాలు :

కలబంద ఆకులు 250 గ్రాములు; పసుపు పొడి 50 గ్రాములు సున్నం 15 గ్రాములు; నిమ్మకాయలు 6

పొదుగుకు పేస్టు రాసే పద్ధతి :

కలబంద ఆకుల ముళ్ల తీసివేసి, తొక్కతోపాటుగానే చిన్న ముక్కలుగా కోసుకోవాలి. వీటిని పసుపు పొడి, సున్నంతో కలిపి మిక్సీలో వేసి లేదా రోటిలో రుబ్బి.. ఎర్ర రంగు పేస్టును తయారు చేయాలి. ఈ పేస్టుకు 200 ఎం.ఎల్. నీటిని కలిపి పలుచన చేయాలి. పొదుగువాపు వ్యాధికి గురైన పశువు పొదుగును నీటితో శుభ్రంగా కడిగి ఆరబెట్టిలి. ఆ తర్వాత నీటిలో కలిపిన ఈ పేస్టును పొదుగుపై అర చేతితో గట్టిగా నొక్కుతూ గుండ్రంగా తిప్పుతూ పొదుగు అంతా రాయాలి. ఇలా రోజుకు పది సార్లు (నూనె కలిపిన పేస్టు అయితే రోజుకు 3 సార్లు సరిపోతుంది).. ఐదు రోజుల పాటు రాయాలి. దీనితోపాటు 2 నిమ్మకాయలను ముక్కలు చేసి రోజుకు 3 సార్లు పశువుకు తినిపించాలి. ఇలా మూడు రోజుల దాకా తినిపించాలి.

నూనెతో కలిపిన పేస్టు వాడే విధానం:

కలబంద, పసుపు, సున్నంతో తయారు చేసిన పేస్టులో నీటిని కలిపి గానీ లేదా నూనెను కలిపి గానీ రాయవచ్చు. నూనెతో కలిపి రాసేటప్పుడు రోజుకు 3 సార్లు రాస్తే చాలు(నీటితో కలిపి రాస్తే.. రోజుకు 10 సార్లు రాయాలి).

గుప్పెడు పేస్టులో 200 ఎం.ఎల్. ఆవ నూనె లేదా నువ్వుల నూనెను కలిపి పలచన చెయ్యాలి. నూనెలో కలిపిన పేస్టును రోజుకు 3 సార్లు అరచేతితో గట్టిగా వత్తుతూ గుండ్రంగా తిప్పుతూ రాయాలి. ఇలా 5 రోజుల పాటు రాయాలి. పొదుగుకు, వాపు వచ్చిన లేదా వాపు లేని రొమ్ములకు కూడా రాయాలి. పేస్టును పొదుగు అంతటా రాయాలి.

ఈ సాంప్రదాయ చికిత్సపై తెలుగు వీడియోలు National Dairy Development Board యూట్యూబ్ ఛానల్‌లో ఉన్నాయి. ఇలా వెతకండి..
Ethno-veterinary formulation (water-based) for Mastitis (Telugu)
Ethno-veterinary formulation (oil-based) for Mastitis (Telugu)



క్రిముల సమస్య (డీ వార్మింగ్)

'క్రిముల సమస్య నివారణ (డీ వార్మింగ్)'కు సంప్రదాయ ఆయుర్వేద చికిత్స.

ఉల్లి + వెల్లుల్లి + ఆవాలు + వేపాకులు..

పశువులకు కడుపులో క్రిముల సమస్య ఉంటే గనక ఉల్లి పాయ 1, వెల్లుల్లి 5 పాయలు, ఆవాలు 10 గ్రాములు, వేపాకులు గుప్పెడు, జీలకర్ర 10 గ్రాములు, కాకర కాయ 50 గ్రాములు, పసుపు పొడి 5 గ్రాములు, మిరియాలు 5 గ్రాములు, అరటి కాండం 100 గ్రాములు, డ్రోణ్ పుష్పీ గుప్పెడుతోపాటు బెల్లం 100 గ్రాములు తీసుకోండి. ఈ అన్ని సామగ్రి ఒక్క రోజు చికిత్స కోసం.

చికిత్సకు మందును తయారు చేసే విధానం:

మందు తయారు చేయడానికి మిరియాలు, జీలకర్ర, ఆవాలను 30 నిమిషాల పాటు నీటిలో నానబెట్టండి. అన్ని సామగ్రులను కలిపి దంచండి లేదా మిక్సీలో వేయండి. అలా ఒక పేస్ట్ తయారు చేయండి. ఇంకా ఇందులో బెల్లం, పసుపు పొడి కలిపి చిన్న చిన్న లడ్డూలుగా చేయండి.

చికిత్స చేసే పద్ధతి :

అలా తయారైన లడ్డూలను కొద్దిగా ఉప్పుతో పాటు రోజుకు ఒకసారి పశువుకు తినిపించండి. క్రిముల సమస్య ఉన్న ప్రతి పశువుకు 3 రోజుల వరకు తినిపించాలి.

తిరిగి పొర్లే సమస్య

'పాడి పశువుల్లో తిరిగి పొర్లే సమస్య'(రిపీట్ బ్రీడింగ్)కు సంప్రదాయ ఆయుర్వేద చికిత్స.

పాడి పశువు తిరిగి పొర్లుతూ ఉండటం, సకాలంలో చూడి కట్టకపోవటం పాడి రైతులను ఆర్థికంగా నష్టపరిచే ఒకానొక ముఖ్య సమస్య. పాడి రైతులు ఆర్థికంగా లాభపడాలంటే ఏడాదికో దూడను పొందాలి. కలబంద, నల్లేరు, ముల్లంగి, మునగాకు, పసుపు, కరివేపాకు తదితర దినుసులను 5 రోజులు తినిపించడం ద్వారా ఈ సమస్యకు చికిత్స చేసి చక్కని ఫలితం పొందవచ్చు.

ఈ మొత్తం సామగ్రి ఒక రోజు కోసం.. కలబంద ఒక ఆకు, ముల్లంగి ఒకటి, మునగాకు నాలుగు గుప్పిళ్లు, నల్లేరు కాండం నాలుగు గుప్పిళ్లు, కరివేపాకు నాలుగు గుప్పిళ్లు, ఇంకా పసుపు పొడి 5 గ్రాములు అవసరం ఉంది. వీటిని అన్నీ కలిపి తినిపించకూడదు. ఒకదాని తర్వాత మరొకటి వరుస క్రమంలో తినిపించాలి.

ఇప్పుడు ఎలా వాడాలో చూద్దాం.. ఎద అయిన మొదటి లేదా రెండో రోజు చికిత్స ఆరంభించండి. రోజుకు ఒకసారి.. తాజాగా ఉండే ఒక ముల్లంగి దుంపను ముక్కలు చేసి బెల్లం లేదా ఉప్పుతో పాటు ప్రతి రోజూ 5 రోజుల వరకు తినిపించండి. ఆ తర్వాత కొద్దిసేపటికి కలబంద ఒక ఆకును (ఆకు చివర్లలో ముళ్ల కత్తిరించి తీసేసి, ముక్కలుగా కోసి).. ప్రతి రోజూ నాలుగు రోజుల దాకా తినిపించండి. దీని తర్వాత మునగ ఆకులు.. నాలుగు గుప్పిళ్లు ప్రతి రోజూ నాలుగు రోజుల దాకా తినిపించండి. నాలుగు గుప్పిళ్లు నల్లేరు కాండం ముక్కలను ప్రతి రోజూ నాలుగు రోజుల దాకా తినిపించండి. దీని తర్వాత నాలుగు గుప్పిళ్లు కరివేపాకును 5 గుప్పిళ్ల పసుపు పొడిని కలిపి నాలుగు రోజుల దాకా తినిపించండి.

మొదట ఇలా చేసిన తర్వాత కూడా పశువు చూడి కట్టకపోతే.. ఇదే చికిత్సను మరో ఐదు రోజులు తిరిగి చెయ్యండి.

పొంగు, మొటిమలు చర్మం పగలటం

'పాడి పశువుల పొదుగులో పొంగు, మొటిమలు, చర్మం పగలటం' సమస్యలకు సంప్రదాయ ఆయుర్వేద చికిత్స.

వెల్లుల్లి + పసుపు + జీలకర్ర + తులసి + వేప + వెన్న..

పాడి పశువుల పొదుగులో పొంగు, మొటిమలు, చర్మం పగలటం వంటి సమస్యల చికిత్సకు.. వెల్లుల్లి 5 పాయలు, పసుపు పొడి 10 గ్రాములు, జీలకర్ర 15 గ్రాములు, తులసి ఆకులు గుప్పెడు, వేప ఆకులు గుప్పెడు, వెన్న లేదా నెయ్యి 50 గ్రాములు అవసరమవుతాయి.

చికిత్సకు మందును తయారు చేసే విధానం:

జీలకర్రను 15 నిమిషాల పాటు నీటిలో నానబెట్టండి. సిద్ధం చేసుకున్న పై దినుసులు అన్నిటినీ రోట్లో దంచి లేదా మిక్సీలో వేసి గుజ్జులాగా చెయ్యండి. ఇప్పుడు ఇందులో వెన్న లేదా నెయ్యి వేసి బాగా కలపండి.

చికిత్స చేసే పద్ధతి :

వెల్లుల్లి, పసుపు, జీలకర్ర, తులసి ఆకులు, వేప ఆకులు, నెయ్యి లేదా వెన్నలతో సిద్ధం చేసుకున్న మిశ్రమాన్ని పొంగు, మొటిమలు, చర్మం పగలటం వంటి సమస్యలు ఉన్న పశువు పొదుగుపై చేతితో రాయండి. ఈ మిశ్రమాన్ని రాయడానికి ముందు పశువు పొదుగును నీటితో శుభ్రంగా కడిగి, ఆరబెట్టండి. ఈ మిశ్రమాన్ని పొంగు, మొటిమలు ఉన్న చోట, చర్మం పగిలిన చోట నిండుగా రాయండి. ఈ సమస్యలు పూర్తిగా పోయే వరకు రోజుకోసారి రాస్తూ ఉండండి.

గాలికుంటు వ్యాధి

'పశువుల్లో గాలికుంటు వ్యాధి/కాలి పుండ్లు' సమస్యకు సంప్రదాయ ఆయుర్వేద చికిత్స.

కావలసిన పదార్థాలు : మూర్గొండ ఆకులు చారెడు, వెల్లుల్లి 10 రెబ్బలు, వేప ఆకులు చారెడు, కొబ్బరి నూనె లేదా నువ్వుల నూనె 200 మి.లీ., పసుపు 20 గ్రా., గోరింటాకు చారెడు, తులసి ఆకులు చారెడు.

తయారు చేసే విధానం: ● దినుసులు అన్నింటినీ కలిపి బాగా రుబ్బాలి. ● ఈ మిశ్రమానికి 250 మి.లీ.ల కొబ్బరి లేదా నువ్వుల నూనె కలిపి మరిగించి చల్లార్చాలి.

చికిత్స చేసే పద్ధతి :

● పుండ్లను శుభ్రంగా కడగాలి. పుండ్లపై మందును రాయాలి. శుభ్రమైన గాజుగుడ్డతో కట్టు కట్టవచ్చు. ● ఒక వేళ పుండ్లలో పురుగులు ఉంటే, మొదటి రోజు కొబ్బరి నూనెలో కర్పూరం కలిపి రాస్తే లేదా సీతాఫలం గుజ్జును రాస్తే పురుగులు పోతాయి. తరువాత పై మిశ్రమాన్ని యథావిధిగా పుండ్లపై రాయాలి.

జ్వరం

పశువుల్లో 'జ్వరం' సమస్యకు సంప్రదాయ ఆయుర్వేద చికిత్స.

కావలసిన పదార్థాలు : వెల్లుల్లి : 2 రెబ్బలు, ధనియాలు–10 గ్రాములు, జీలకర్ర–10 గ్రాములు, తులసి ఆకులు ఒక గుప్పెడు, బిర్యానీ ఆకులు–10 గ్రాములు, మిరియాలు–10 గ్రాములు, తమలపాకులు–5, ఉల్లిపాయలు–2, పసుపు–10 గ్రాములు, నేలవేము ఆకుల పొడి–20 గ్రాములు, సబ్జా ఆకులు చారెడు, వేప ఆకులు చారెడు, బెల్లం–100 గ్రాములు.

తయారు చేసే విధానం: ● జీలకర్ర, మిరియాలు, ధనియాలను 15 నిమిషాలు నీటిలో నానబెట్టాలి. ● అన్ని పరదార్థాలను మిక్సీలో వేసి ఆడించాలి. ఆ మిశ్రమం పేస్టుగా తయారవుతుంది.

వాడే విధానం : ఇలా తయారు చేసిన పేస్టును చిన్న మోతాదులో పొద్దున, సాయంత్రం తినిపించాలి.

కడుపు ఉబ్బరం / అజీర్ణం

పశువుల్లో 'కడుపు ఉబ్బరం/అజీర్ణం' సమస్యకు సంప్రదాయ ఆయుర్వేద చికిత్స.

కావలసిన పదార్థాలు : ఉల్లి–100 గ్రాములు, వెల్లుల్లి–10 గ్రాములు, ఎండు మిరపకాయలు–2, జీలకర్ర–10 గ్రాములు, పసుపు–10 గ్రాములు, బెల్లం–100 గ్రాములు, మిరియాలు–10 గ్రాములు, తమలపాకులు–10, అల్లం–100 గ్రాములు.. ఇవన్నీ ఒక్క పశువుకు, ఒక్క రోజు సంప్రదాయ చికిత్సకు సరిపోయే దినుసులు.

తయారు చేసే విధానం: ● ముందుగా మిరియాలు, జీలకర్రను ఒక గంట సేపు నీటిలో నానబెట్టాలి. మిరియాలు, జీలకర్ర, పసుపు, మిరపకాయలను మిక్సీలో వేసి ఆడించాలి. ● తరువాత మిగిలిన పదార్థాలను కలిపి మిక్సీలో ఆడించి పేస్టును తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమానికి 100 గ్రాముల బెల్లం తురుము కలిపి ఉండలుగా చేయాలి.

వాడే విధానం : ఆ ఉండలను రోజుకు 3 నుంచి 4 సార్లు చొప్పున వరుసగా 3 రోజులు కడుపు ఉబ్బరం/ అజీర్ణం సమస్యతో బాధపడుతున్న పశువుకు తినిపించండి.

పారుడు/ అతిసార వ్యాధి

'పారుడు వ్యాధి (విరేచనాలు/అతిసారం)'కి సంప్రదాయ ఆయుర్వేద చికిత్స.

కావలసిన పదార్థాలు : మెంతులు –10 గ్రాములు, ఉల్లి–1, వెల్లుల్లి–1 రెబ్బ, జీలకర్ర–10 గ్రా, పసుపు–10 గ్రా, కరివేపాకు– చారెడు, గసగసాలు–5 గ్రా, మిరియాలు–10 గ్రా, బెల్లం–100 గ్రా, ఇంగువ–5 గ్రా.

తయారు చేసే విధానం: ● జీలకర్ర, మెంతులు, గసగసాలు, ఇంగువ, మిరియాలు, పసుపును తీసుకొని ముందుగా వేయించాలి. ● తరువాత వాటిని నూరాలి. ● ఆ పేస్టును ఉల్లి, వెల్లుల్లి, కరివేపాకు, బెల్లంను కలిపి మరలా మెత్తగా నూరాలి.

వాడే విధానం : ● ఈ పేస్టును ఉండలుగా చేయాలి. ● ఈ మిశ్రమాన్ని పశువు దవడలో ఉంచాలి. ఈ మందును రోజుకు ఒకసారి చొప్పున 1–3 రోజులు పెట్టాలి.

చలికాలంలో ఇంటిపంటల రక్షణ ఇలా..!



ఇంటి పంట



శీతాకాలం చలి వాతావరణంలో ఉష్ణోగ్రత తక్కువగా, గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. రసం పీల్చే పురుగులు, వైరస్ తెగుళ్ల వ్యాప్తికి ఇది అనువైన కాలం. కుండీల్లో, పెరట్లో ఆకుకూరలు, టమాటా, చిక్కుడు, వంగ, మిరప, బీర, ఆనప తదితర పంటలు చీడపీడల బారిన పడకుండా చూసుకోవడానికి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలి. చీడపీడలు రానీయని టీకాలన్నమాట. జనవరి ఆఖరులో చలి తగ్గేవరకు వీటిని పాటించాలి.

● జీవామృతంను 1:10 పాళ్లలో నీటిలో కలిపి ప్రతి 10–15 రోజులకోసారి క్రమం తప్పకుండా పిచికారీ చేస్తుంటే పంటలు ఆరోగ్యంగా పెరుగుతాయి. చీడపీడలను తట్టుకునే శక్తి పెరుగుతుంది.

● ఆచ్ఛాదన: కుండీలు, మడుల్లో కూరగాయ మొక్కలు/చెట్ల చుట్టూ గడ్డీ గాదంతో ఐదారు అంగుళాల మందాన ఆచ్ఛాదనగా వేస్తే మంచిది.

● ఇంటిపంటల్లో పెద్ద పురుగులు కనిపిస్తే వాటిని చేతితో ఏరేయడం ఉత్తమం.

శీతాకాలంలో పంటలనాశించే కొన్ని పురుగులు

టమాటా, వంగ, ఆకుకూరలతోపాటు మందారం, చామంతి, గులాబీ వంటి పంటలపై పిండినల్లి(మీలీ బగ్), తామర పురుగు(త్రిప్స్) తరచూ కనిపిస్తుంటాయి. వీటితోపాటు పేను బంక, దీపపు పురుగులు, తెల్లదోమ, ఎర్రనల్లి కూడా ఆశిస్తుంటాయి.

పిండినల్లి: పిండినల్లి మొక్కలను ఆశించి రసం పీల్చుతుంటుంది. అందువల్ల మొక్క పెరుగుదల నిలిచిపోతుంది. ఇది సోకినప్పుడు పళ్లు తోముకునే బ్రష్‌ను ముంచి తుడిచేస్తే పోతుంది. కలబంద రసం లేదా వేపనూనె లేదా సబ్బు నీళ్లలో బ్రష్‌ను ముంచి తుడిచేయాలి.

పేనుబంక: దీన్నే మసిపేను అని కూడా అంటారు. కంటికి కనిపించనంత చిన్న పేన్లు బంకవంటి తీపి పదార్థాన్ని విసర్జిస్తుంటాయి. ఈ తీపి కోసం చీమలు చేరతాయి. మొక్కల మీద చీమలు పారాడుతూ ఉంటే పేనుబంక లేదా పిండినల్లి సోకిందన్నమాటే.

పచ్చదోమ: ఆకుపచ్చగా ఉండే చిన్న దోమలు ఆకుల నుంచి రసం పీల్చుతుంటాయి. పచ్చదోమ ఆకుల చివర్ల నుంచి పని మొదలు పెడతాయి. కాబట్టి ఇది సోకిన ఆకులు కొసల నుంచి లోపలి వరకు ఎండిపోతూ ఉంటాయి. బీర, ఆనప వంటి పెద్ద ఆకులుండే పంటలను పచ్చదోమ ఎక్కువగా ఆశిస్తూ దిగుబడిని తగ్గించేస్తాయి.

తామర పురుగు: తామర పురుగు సోకిన మిరప ఆకులకు పైముడత వస్తుంది. మిరప కాయలు వంకర్లు తిరుగుతాయి. వాటిపై చారలు ఏర్పడతాయి. దీన్ని గజ్జి తెగులు, తామర తెగులు అని కూడా అంటారు.

బూడిద తెగులు: చల్లని వాతావరణంలో శిలీంద్రం వేగంగా వ్యాపించడం వల్ల బూడది తెగులు వస్తుంది. ఇది సోకిన పంటల ఆకులపై తెల్లని పొడి కనిపిస్తుంది. మిరప, వంగ, టమాటా, ఆకుకూరలపై ఇది ఎక్కువగా కనిపిస్తుంటుంది.

రసంపీల్చే పురుగులు: ముందుజాగ్రత్త పిచికారీలు

రసం పీల్చే పురుగులు పంటల జోలికి రాకుండా ముందుగానే జాగ్రత్తపడడం ఉత్తమం. వేపాకు రసం లేదా వావిలి ఆకుల కషాయం లేదా వేప నూనె లేదా వేపపిండి కషాయంను (వీటిలో ఏదైనా ఒక దాన్ని గానీ లేదా ఒక దాని తర్వాత మరొక దాన్ని మార్చి మార్చి గానీ) ప్రతి 7–10 రోజులకోసారి పిచికారీ చేయాలి.

వేపాకు రసం: పావు కిలో వేపాకులు రుబ్బి + 5 లీటర్ల నీటిలో కలిపి అదే రోజు పంటలపై చల్లాలి(10 కిలోల వేపాకులు రుబ్బి 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరంలో పంటలకు చల్లవచ్చు).

వావిలి ఆకుల కషాయం: 2 లీటర్ల నీటిలో 350 గ్రాముల వావిలి ఆకులు వేసి 2 లేదా 3 పొంగులు వచ్చే వరకు మరిగించి.. చల్లార్చిన తర్వాత ఆ కషాయంలో 10 లీటర్ల నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేయాలి(5 కిలోల వావిలి ఆకుల కషాయాన్ని 100 లీటర్ల నీటిలో కలిపితే ఎకరానికి సరిపోతుంది).

వేప నూనె: మార్కెట్లో దొరుకుతుంది. సీసాపై ముద్రించిన సాంద్రతకు తగిన మోతాదులో పిచికారీ చేయాలి.


వేపకాయల పిండి రసం: 10 లీటర్ల నీటిలో అర కేజీ వేపకాయల పిండి(వేపగింజల పిండి 300 గ్రాములు చాలు)ని పల్చటి గుడ్డలో మూటగట్టి.. 4 గంటలు నానబెట్టాలి. ఆ తర్వాత మూటను నీటిలో నుంచి తీసి పిండాలి. ఇలా అనేకసార్లు ముంచుతూ తీస్తూ పిండాలి. అదే రోజు పిచికారీ చేయాలి లేదా రోజ్ క్యాన్ ద్వారా మొక్కలపై చల్లవచ్చు. ఈ కషాయాలు, రసాలను పిచికారీ చేసేముందు 10 లీటర్లకు 5 గ్రాముల(100 లీటర్లకు 200 గ్రాముల) సబ్బుపొడి లేదా కుంకుడు రసాన్ని కలపాలి.

నూనె పూసిన ఎరలు:

నూనె పూసిన ఎరలు(స్టిక్కీ ట్రాప్స్) వేలాడదీస్తే పురుగులను ఆకర్షించి నశింపజేస్తాయి. తామర పురుగులను ఆకర్షించడానికి తెలుపు, తెల్లదోమలను నీలం, పచ్చదోమలను పసుపుపచ్చ ఎరలను వాడాలి. టమాటా, వంగ, మిర్చి వంటి ప్రతి 20 కూరగాయ మొక్కలకు ఒక్కో రకం ఎరలను రెండేసి చొప్పున వేలాడదీయాలి. ఎరలను మార్కెట్లో కొనొచ్చు. లేదా ఆయా రంగుల డబ్బాలు లేదా ప్లాస్టిక్ షీట్లు ఉంటే వాటికి నూనె లేదా గ్రీజు రాసి వేలాడదీయవచ్చు.

రసంపీల్చే పురుగుల తీవ్రత ఎక్కువగా ఉంటే?

రసంపీల్చే పురుగులు ఇప్పటికే మొక్కలకు తీవ్రస్థాయిలో ఆశించి ఉంటే పైన పేర్కొన్న పిచికారీలు కొనసాగిస్తూనే.. తెల్లటి షేడ్‌నెట్‌ను మొక్కలపై గ్రీన్‌హౌస్ మాదిరిగా రక్షణగా ఏర్పాటు చేయాలి. ఇనుప తీగతో డోమ్ ఆకారం చేసి దానిపై తెల్లని షేడ్‌నెట్ చుట్టేస్తే సరి.



– డా. గడ్డం రాజశేఖర్
సుస్థిర వ్యవసాయ కేంద్రం, సికింద్రాబాద్

సాక్షి ప్లస్
బుధవారం | 6-11-2024

బిజినెస్ రీల్

విస్తరణలో పాసిడెక్స్ టెక్నాలజీస్



ముంబై: కస్టమర్ డేటా మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ అందించే పాసిడెక్స్ టెక్నాలజీస్ ఇతర మార్కెట్లలోని కస్టమర్లకు చేరువయ్యే ప్రణాళికల్లో ఉంది. ఉత్తర అమెరికా, మధ్యప్రాచ్యంలో మరింతగా కార్యకలాపాలను విస్తరించనున్నట్లు సంస్థ సహ–వ్యవస్థాపకుడు కె. వెంకట్ రెడ్డి తెలిపారు. రీబ్రాండింగ్‌లో భాగంగా కొత్త లోగోను క్రీడాకారిణి పీవీ సింధు ఆవిష్కరించారు. రెండు దశాబ్దాల వ్యవధిలో 60 పైగా దిగ్గజ సంస్థలకు సేవలను అందించినట్లు వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం దేశీయంగా 9 భారీ ప్రైవేట్ బ్యాంకుల్లో ఏడింటికి, 15 నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో తొమ్మిదింటికి సర్వీసులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

థాయ్ ఎయిర్‌ఏషియాతో సెలెబి ఇండియా జట్టు



ముంబై: థాయ్ ఎయిర్‌ఏషియా కొత్తగా ప్రారంభించిన హైదరాబాద్–బ్యాంకాక్ ఫ్లయిట్స్‌కి గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలు అందించనున్నట్లు సెలెబి ఇండియా తెలిపింది. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గ్రౌండ్ హ్యాండ్లింగ్ భాగస్వామిగా వ్యవహరించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. హైదరాబాద్–బ్యాంకాక్ రూట్లో థాయ్ ఎయిర్‌ఏషియా కొత్తగా వారానికి నాలుగు డైరెక్ట్ ఫ్లయిట్స్‌ను ప్రారంభించింది. ఇరు దేశాలు వారానికి అదనంగా 7,000 ఫ్లయిట్ సీట్స్‌ను పెంచాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో ప్రయాణికుల సంఖ్యతో పాటు గ్రౌండ్ హ్యాండ్లింగ్ అవసరాలు కూడా గణనీయంగా పెరుగుతాయని సెలెబి ఇండియా పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-11-2024

విశాఖ	550–00
చిత్తూరు	593–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

నేటి బోర్డు సమావేశాలు

టాటా స్టీల్, జిందాల్ స్టీల్, ట్రిడెంట్, బ్లూ స్టార్, అపోలో హాస్పిటల్స్, జేకే లక్ష్మి సిమెంట్స్, బాంబే సైకిల్, ప్రికాల్, ఎస్కార్ట్స్, ఏజి ఫ్యాషన్, రైన్ ఇండస్ట్రీస్, కన్సాయి నెరోలాక్, చంబల్ ఫెర్టిలైజర్స్, జేబి కెమికల్స్, గ్రాన్యూల్స్ ఇండియా, విరించి, డెల్టా కార్ప్, ఉషా మార్టిన్

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	2,878.00	2.14
TECHM	1,633.40	1.86
CIPLA	1,584.00	1.57
SBIN	830.25	1.1
DRREDDY	1,269.95	0.82

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HEROMOTOCO	4,807.00	-4.25
GRASIM	2,592.10	-3.96
BAJAJ-AUTO	9,534.00	-3.46
ADANIPORTS	1,349.00	-3.26
BPCL	303.45	-3.05

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	5,948
ఎన్‌ఎస్‌ఈ	99,926
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	2,36,749
ఎఫ్‌ఐఐ	- 2,569
డీఐఐ	+ 3,031

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.58	$ 71.47
బ్రెంట్	75.19	$ 75.08

నాలుగో దశ ఆర్ఆర్‌బీల విలీనం షురూ..

43 నుంచి 28కి తగ్గనున్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు



న్యూఢిల్లీ: ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బీ) నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చడం, వ్యయాలను క్రమబద్ధీకరించడంలో భాగంగా నాలుగో దశ విలీన ప్రక్రియను కేంద్ర ఆర్థిక శాఖ ప్రారంభించింది. నిర్దిష్ట మార్గదర్శ ప్రణాళిక ప్రకారం వివిధ రాష్ట్రాల్లోని 15 ఆర్ఆర్‌బీలను విలీనం చేయనున్నారు. దీనితో ఆర్ఆర్‌బీల సంఖ్య 43 నుంచి 28కి తగ్గనుంది. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 4 బ్యాంకులను కన్సాలిడేట్ చేయనుండగా ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ (చెరి మూడు) బీహార్, గుజరాత్ తదితర రాష్ట్రాలు (తలో 2) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. తెలంగాణ విషయానికొస్తే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌కి సంబంధించిన అసెట్స్, లయబిలిటీలను విడదీయటంపై ఆర్ఆర్‌బీల విలీనం ఆధారపడి ఉంటుంది. 'ఒక రాష్ట్రం – ఒక ఆర్ఆర్‌బీ' లక్ష్యం సాధన దిశగా ఈ ప్రక్రియను చేపడుతున్నట్లు స్పాన్సర్ బ్యాంకులకు పంపిన లేఖలో ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి వివరించారు. దీనిపై స్పాన్సర్ బ్యాంకులు నవంబర్ 20లోగా తమ అభిప్రాయాలను తెలపాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న రైతులు, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తులవారికి రుణాలు, ఇతరత్రా ఆర్థిక సేవలను అందించేందుకు ఆర్ఆర్‌బీ యాక్ట్–1976 ప్రకారం ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఏర్పాటయ్యాయి. మూడు విడతల్లో విలీనంతో 2020–21 నాటికి వీటి సంఖ్య 196 నుంచి 43కి తగ్గింది. ప్రస్తుతం ఆర్ఆర్‌బీల్లో కేంద్ర ప్రభుత్వానికి 50 శాతం, స్పాన్సర్ బ్యాంకులకు 35 శాతం, రాష్ట్ర ప్రభుత్వానికి 15 శాతం వాటాలు ఉంటాయి.

యూపీఐతో ఎన్నారైలు రోజుకు లక్ష పంపొచ్చు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రవాస భారతీయులకు (ఎన్నారైలు) నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తీపి కబురు అందించింది. నాన్ రెసిడెంట్ ఎక్స్‌టర్నల్ (ఎన్ఆర్ఈ), నాన్ రెసిడెంట్ ఆర్డినరీ (ఎన్ఆర్ఓ) ఖాతాలున్న ఎన్నారైలు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా ఇక నుంచి రోజుకు రూ.1 లక్ష వరకు భారత్‌లోని తమ కుటుంబ సభ్యులు, ఇతర చెల్లింపులకు నగదు పంపించవచ్చు. అంటే ఎన్నారైలు ఇక నుంచి అంతర్జాతీయ మొబైల్ నంబర్‌ను ఉపయోగించి నేరుగా వారి స్మార్ట్‌ఫోన్ నుండి ఉచిత లావాదేవీల కోసం యూపీఐని ఉపయోగించవచ్చు. తద్వారా విదేశాల నుండి లావాదేవీలను నిర్వహించడం మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. యూఎస్, కెనడా, యూకే, యూఏఈ, సింగపూర్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, హాంగ్‌కాంగ్, మలేషియా, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాలోని ఎన్నారైలకు ఈ సౌకర్యం వర్తిస్తుంది. కొత్తగా నమోదైన యూపీఐ ఐడీల ద్వారా తొలి 24 గంటల్లో రూ.5,000 మాత్రమే పంపేందుకు వీలుంది. ఆ తర్వాతి రోజు నుంచి రోజుకు రూ.1 లక్ష పంపొచ్చు.

ఇవీ బ్యాంకులు..

యూపీఐ కోసం అంతర్జాతీయ మొబైల్ నంబర్ల అనుసంధానానికి ప్రస్తుతం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, సిటీ యూనియన్ బ్యాంక్, డీబీఎస్ బ్యాంక్, ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, నేషనల్ బ్యాంక్, సౌత్ ఇండియన్ బ్యాంక్ మద్దతు ఇస్తున్నాయి. అంతర్జాతీయ మొబైల్ నంబర్లకు అనుకూలమైన యూపీఐ అప్లికేషన్లలో ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, భీమ్, భీమ్ ఏయూ, ఫెడ్‌మొబైల్, ఐమొబైల్, భీమ్ ఇండస్ పే, ఎస్ఐబీ మిర్రర్ ప్లస్ వంటివి ఉన్నాయి. ఎన్నారైలు తమ ఎన్ఆర్ఈ మరియు ఎన్ఆర్ఓ ఖాతాల మధ్య, అలాగే భారత్‌లోని ఖాతాలకు యూపీఐ లావాదేవీలు చేయవచ్చు. ఎన్ఆర్ఓ ఖాతా నుండి ఎన్ఆర్ఈ ఖాతాకు నిధులను బదిలీ చేయలేరు. విభిన్న బ్యాంక్ ఖాతాలను కలిగి ఉన్న ఎన్నారైలు ప్రతి ఖాతాకు ప్రత్యేక యూపీఐ ఐడీ అవసరం. ఖాతా ఉమ్మడిగా ఉంటే ప్రాథమిక ఖాతాదారు మాత్రమే యూపీఐని ఉపయోగించగలరు.

ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ జత

రెనెవబుల్ ఎనర్జీలో అవకాశాలపై దృష్టి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజాలు ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ తాజాగా చేతులు కలిపాయి. తద్వారా నూతన, పునరుత్పాదక ఇంధన విభాగంలో అవకాశాలను అన్వేషించనున్నాయి. ఇందుకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ అనుబంధ సంస్థల ద్వారా భాగస్వామ్య కంపెనీ(జేవీ)కి తెర తీయనున్నాయి. చమురు దిగ్గజం ఓఎన్‌జీసీ సహకారంతో కొత్తతరం ఇంధన అవకాశాలను అందిపుచ్చుకోనున్నట్లు విద్యుత్ రంగ దిగ్గజం ఎన్‌టీపీసీ పేర్కొంది. ఓజీఎల్‌తో సమాన భాగస్వామ్య(50:50 వాటా) కంపెనీ(జేవీ) ఏర్పాటుకు వీలుగా కార్పొరేట్ వ్యవహారాల శాఖకు ఎన్‌జీఈఎల్ దరఖాస్తు చేసినట్లు తెలియజేసింది.



సోలార్, విండ్, ఎనర్జీ స్టోరేజీ, ఈమొబిలిటీ, కార్బన్ క్రెడిట్స్ తదితర న్యూ ఎనర్జీ అవకాశాలపై జేవీ పనిచేయనున్నట్లు వివరించింది. పునరుత్పాదక ఇంధన ఆస్తుల కొనుగోలుతోపాటు.. తమిళనాడు, గుజరాత్‌లలో రాబోయే ఆఫ్‌షోర్ విండ్ టెండర్లలో పాలుపంచుకునే యోచనలో ఉన్నట్లు వెల్లడించింది.

ఎన్‌టీపీసీ రూ. 80 వేల కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి దిగ్గజం ఎన్‌టీపీసీ భారీ పెట్టుబడి ప్రణాళికలపై దృష్టి పెట్టింది. మొత్తం 6,400 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టులపై రూ. 80,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు బోర్డు ఆమోదముద్ర వేసినట్లు కంపెనీ వెల్లడించింది. రూ. 29,345 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో దశ పనులు, రూ. 20,446 కోట్ల అంచనా వ్యయంతో గదర్వారా సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో దశ పనులు వీటిలో ఉన్నాయి. ఎన్‌టీపీసీ గ్రూప్ స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 76,443 మెగావాట్లుగా ఉంది.

రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎలక్ట్రిక్ రైడ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మోటార్‌సైకిల్స్ తయారీలో ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎలక్ట్రిక్ రైడ్‌కు రెడీ అయింది. ఎలక్ట్రిక్ బైక్స్ కోసం ప్రత్యేకంగా ఫ్లైయింగ్ ఫ్లీ బ్రాండ్‌ను మిలన్‌లో జరుగుతున్న ఈఐసీఎంఏ మోటార్‌సైకిల్ షో వేదికగా కంపెనీ ప్రకటించింది. ఈ సందర్భంగా ఫ్లైయింగ్ ఫ్లీ సీ6, ఎస్6 బైక్స్‌ను ఆవిష్కరించింది. 2026 ప్రారంభంలో ఇవి రోడ్డెక్కనున్నాయని కంపెనీ వెల్లడించింది. నగరాల్లోని కస్టమర్ల కోసం వీటిని అభివృద్ధి చేస్తున్నట్లు రాయల్ ఎన్‌ఫీల్డ్ తెలిపింది. 3–పిన్ ప్లగ్‌తో సులువుగా చార్జింగ్ చేయవచ్చని సంస్థ వివరించింది. టీఎఫ్‌టీ డిస్‌ప్లే ఏర్పాటు ఉంది. ట్రాక్షన్ కంట్రోల్, యాంటీ బ్రేకింగ్ సిస్టమ్, క్రూజ్ కంట్రోల్ సిస్టమ్ తదితర భద్రతా ఫీచర్లను జోడించింది. రెండు మోడళ్లూ ఒకసారి చార్జింగ్‌తో 100 కిలోమీటర్లకుపైగా ప్రయాణిస్తాయి. గంటకు గరిష్ఠ వేగం 115 కిలోమీటర్లు. భారత్‌తో పాటు యూకేలోని 200 మందికిపైగా సంస్థకు చెందిన ఇంజనీర్లు వీటి అభివృద్ధిలో నిమగ్నమయ్యారు.

పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

- లేదా తగ్గించి తీసుకోవచ్చు
- పన్ను అధికారులకు సీబీడీటీ ఆదేశాలు



న్యూఢిల్లీ: పన్ను చెల్లింపుదారుల నుంచి రావాల్సిన పన్ను బకాయిలపై వడ్డీని మాఫీ చేయడం లేదంటే తగ్గించి తీసుకోవచ్చంటూ అధికారులకు ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) సూచించింది. నోటీసులో పేర్కొన్న మేరకు పన్ను చెల్లించడంలో జాప్యం చేస్తే నిబంధనల ప్రకారం ప్రతి నెలా 1 శాతం చొప్పున వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్, చీఫ్ కమిషనర్, ప్రిన్సిపల్ కమిషనర్ లేదా కమిషనర్ ర్యాంక్ అధికారి ఎవరికి అయినా సరే వడ్డీని మినహాయించడం లేదంటే తగ్గించేందుకు ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 220 (2ఏ) కింద అధికారులున్నట్లు సీబీడీటీ స్పష్టం చేసింది. వడ్డీ మాఫీ చేసే లేదా తగ్గించే అధికారాలపైనా స్పష్టత ఇచ్చింది. ''రూ.1.5 కోట్లకు పైన వడ్డీ మాఫీ చేయడమా లేదంటే తగ్గించడమా అన్నది ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ పరిధిలో ఉంటుంది. రూ.50 వేల నుంచి 1.5 లక్షల మధ్య ఉంటే చీఫ్ కమిషనర్‌కు అధికారం ఉంటుంది. రూ.50 లక్షల వరకు వడ్డీ ప్రిన్సిపల్ కమిషనర్ లేదా ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ పరిధిలోకి వస్తుంది''అని సబీడీడీ పేర్కొంది. ఈ నిర్ణయం పన్ను చెల్లింపుదారుల దరఖాస్తుల సత్వర పరిష్కారానికి వీలు కల్పిస్తుందని నాంజియా అండ్ కో ఎల్ఎల్‌పీ పార్ట్‌నర్ సచిన్ గార్గ్ అభిప్రాయపడ్డారు.

మోసం కేసులకు ఏడాదిలో పరిష్కారం

ఎగుమతులు/దిగుమతుల మోసాల కేసుల విచారణలో క్షేత్రస్థాయి కస్టమ్స్ అధికారులు తటస్థంగా వ్యవహరించాలని పరోక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీఐసీ) కోరింది. విచారణకు ముందే సమాచారం మొత్తాన్ని విశ్లేషించి, క్రాస్ చెక్ చేసుకోవాలని సూచించింది. కమర్షియల్ ఇంటెలిజెన్స్ ఫ్రాడ్ కేసుల్లో విచారణను ఏడాది దాటకుండా ముగించాలని కూడా కోరింది.

18వేల కంపెనీలు.. రూ.25వేల కోట్ల ఎగవేత

జీఎస్‌టీ అధికారుల గుర్తింపు

న్యూఢిల్లీ: జీఎస్‌టీ కింద నమోదైన 18,000 కంపెనీలు 25,000 కోట్ల పన్ను ఎగవేత వ్యవహారం వెలుగు చూసింది. ఇటీవలే జీఎస్‌టీ అధికారులు దేశవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఇది తెలిసింది. కేవలం ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కోసమే 73,000 కంపెనీలు ఏర్పాటైనట్టు పన్ను అధికారులు అనుమానిస్తున్నారు. ''ఎందుకంటే ఈ సంస్థలకు ఎలాంటి అమ్మకాలు లేకపోవడం గమనార్హం. వీటిల్లో 18వేల కంపెనీలు మనుగడలో లేవు. అవి రూ.24,550 కోట్ల పన్ను ఎగవేతకు పాల్పడ్డాయి''అని ఓ పన్ను అధికారి తెలిపారు. గతేడాది నిర్వహించిన తొలి డ్రైవ్‌లోనూ.. 21,791 కంపెనీలు రూ.24,010 కోట్లు ఎగవేసినట్టు గుర్తించడం గమనార్హం.

వ్యయాలు, ఆరు నెలల రాబడులు వెల్లడించాల్సిందే

ఫండ్స్ సంస్థలకు సెబీ ఆదేశం

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ సమాచార వెల్లడి (డిస్‌క్లోజర్)కి సంబంధించి తాజా నిబంధనలను సెబీ తీసుకొచ్చింది. ఇక మీదట ఫండ్స్ సంస్థలు డైరెక్ట్, రెగ్యులర్ ప్లాన్లలో ఎక్స్‌పెన్స్ రేషియో, ఆరు నెలలు, ఏడాది రాబడుల వివరాలను విధిగా వెల్లడించాల్సి ఉంటుంది. దీనికితోడు రిస్క్‌ను తెలిపే రంగుల కోడ్‌ను కూడా ప్రదర్శించాలి. కొత్త నిబంధనలు డిసెంబర్ 5 నుంచి అమల్లోకి వస్తాయని సెబీ ప్రకటించింది. పారదర్శకత పెంపుతోపాటు, రెండు రకాల ప్లాన్ల మధ్య వ్యయాలు, పనితీరును ఇన్వెస్టర్లు సులభంగా పరిశీలించి చూసుకునేందుకు ఈ సమాచారం ఉపకరిస్తుందని సెబీ పేర్కొంది.

అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ రికార్డులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈ ఏడాది నిర్వహించిన గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ కొత్త రికార్డులను నమోదు చేసిందని ఈ–కామర్స్ సంస్థ అమెజాన్ తెలిపింది. 'తొలిసారిగా 140 కోట్ల కస్టమర్ విజిట్స్ నమోదయ్యాయి. వీరిలో 85 శాతంపైగా మెట్రోయేతర నగరాల నుంచి ఉన్నారు. 96 శాతంపైగా ప్రైమ్ సభ్యులు షాపింగ్ చేశారు. ప్రైమ్ సభ్యులు ఆర్డర్ ఇచ్చిన రోజు లేదా మరుసటి రోజు 3 కోట్లపైచిలుకు ఉత్పత్తులను అందుకున్నారు. 2023తో పోలిస్తే రూ.1 కోటికిపైగా విలువైన అమ్మకాలు సాధించిన విక్రేతల సంఖ్య 70 శాతంపైగా పెరిగింది. ఖరీదైన వస్తువుల అమ్మకాలను ఈఎంఐలు నడిపించాయి. 25 శాతం మంది ఈఎంఐల ద్వారా ఎలక్ట్రానిక్స్‌ను కొనుగోలు చేశారు. మహిళా వ్యాపారులు, చేనేత కార్మికులు, చేతివృత్తుల వారితో సహా చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలు ప్రతి నిముషానికి 1,000కిపైగా యూనిట్లను విక్రయించాయి. రూ.10,000లోపు ధరల శ్రేణి స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో 5జీ మోడళ్ల వాటా 33 శాతం ఉంది' అని వివరించింది.

వర్చువల్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లపై జాగ్రత్త

- రిజిస్టర్డ్ మధ్యవర్తుల ద్వారానే లావాదేవీలు
- ఇన్వెస్టర్లకు సెబీ హెచ్చరిక



న్యూఢిల్లీ: అనధికార వర్చువల్ ట్రేడింగ్ లేదా గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు దూరంగా ఉండాలని సెబీ ఇన్వెస్టర్లను హెచ్చరించింది. కేవలం రిజిస్టర్డ్ ఇంటర్‌మీడియరీల (మధ్యవర్తిత్వ సంస్థలు) ద్వారానే లావాదేవీలు నిర్వహించాలని సూచించింది. యాప్‌లు/వెబ్ అప్లికేషన్లు/ప్లాట్‌ఫామ్‌లపై లిస్టెడ్ కంపెనీల షేర్ల ధరల ఆధారంగా వర్చువల్ ట్రేడింగ్ లేదా ఫాంటసీ గేమ్‌లు ఆఫర్ చేస్తున్నట్లు సెబీ దృష్టికి వచ్చింది. ఈ తరహా కార్యకలాపాలు సెక్యూరిటీస్ కాంట్రాక్ట్ (రెగ్యులేషన్స్) చట్టం, 1956, సెబీ చట్టం 1992కు విరుద్ధమని, ఇన్వెస్టర్ల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ చట్టాలను తీసుకొచ్చినట్టు సెబీ తెలిపింది. రిజిస్టర్డ్ సంస్థల ద్వారానే పెట్టుబడులు, ట్రేడింగ్ కార్యకలాపాలు నిర్వహించాలని సూచించింది. ''అనధికారిక పథకాల్లో పాల్గొనడం, వ్యక్తిగత కీలక సమాచారాన్ని పంచుకోవడం ఇన్వెస్టర్ల సొంత రిస్క్, పైనే ఆధారపడి ఉంటుంది. దీని వల్ల ఎదురయ్యే పరిణామాలకు ఇన్వెస్టర్లే బాధ్యులు. ఎందుకంటే ఆయా సంస్థలు సెబీ వద్ద నమోదైనవి కావు. కనుక ఆయా సంస్థలతో నిర్వహించే లావాదేవీలకు సంబంధించి ఇన్వెస్టర్లకు పెట్టుబడిదారుల పరిరక్షణ, ఫిర్యాదుల పరిష్కార విభాగం తదితర సెబీ యంత్రాంగాలు అందుబాటులో ఉండవు'' అని స్పష్టం చేసింది.

విదేశీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు..

మ్యూచువల్ ఫండ్స్ విదేశీ పెట్టుబడుల విషయంలో సెబీ కొంత ఉపశమనాన్ని కల్పించింది. భారత సెక్యూరిటీల్లో విదేశీ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు పెట్టిన మేరకు.. ఆయా విదేశీ పథకాల్లో భారత మ్యూచువల్ ఫండ్స్ పథకాలు ఇన్వెస్ట్ చేసుకోవచ్చని సెబీ తాజాగా ప్రకటించింది. అయితే ఆయా విదేశీ ఫండ్స్ భారత పెట్టుబడులు వాటి నిర్వహణ ఆస్తుల్లో 25 శాతానికి మించకూడదని పేర్కొంది. మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు తమ పెట్టుబడులను మరింత వైవిధ్యం చేసుకునేందుకు సెబీ తాజా నిర్ణయం వీలు కల్పించనుంది. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని సెబీ తెలిపింది. ఫండ్స్ పెట్టుబడుల విలువ సెబీ పరిమితులను మించితే నిబంధనలకు అనుగుణంగా తగ్గించుకునేందుకు ఆరు నెలల వ్యవధి ఉంటుంది.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

సారేగామా ఇండియా లాభం డౌన్

క్యూ2లో రూ. 45 కోట్లు



న్యూఢిల్లీ: మ్యూజిక్ లేబుల్ కంపెనీ సారేగామా ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 6 శాతం క్షీణించి రూ. 45 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 48 కోట్లు ఆర్జించింది. అయితే సంజీవ్ గోయెంకా గ్రూప్ కంపెనీ మొత్తం ఆదాయం రూ. 172 కోట్ల నుంచి రూ. 242 కోట్లకు ఎగసింది. నిర్వహణ వ్యయాలు రెట్టింపై రూ. 87 కోట్లను తాకాయి. దీంతో మొత్తం వ్యయాలు రూ. 120 కోట్ల నుంచి రూ. 195 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో సారేగామా షేరు ఎన్ఎస్ఈలో 5 శాతం పతనమై రూ. 510 వద్ద ముగిసింది.

ఎస్‌జేవీఎన్ లాభం ఫ్లాట్

ఆదాయం రూ. 1,108 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ జల విద్యుత్ కంపెనీ ఎస్‌జేవీఎన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం యథాతథంగా రూ. 440 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2023–24) ఇదే కాలంలో రూ. 440 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 952 కోట్ల నుంచి రూ. 1,108 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 398 కోట్ల నుంచి రూ. 529 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో ఎస్‌జేవీఎన్ షేరు ఎన్ఎస్ఈలో 1.4 శాతం లాభంతో రూ. 113 వద్ద ముగిసింది.

సుందరం ఫైనాన్స్ లాభం డీలా


రూ. 45 కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ ఎన్‌బీఎఫ్‌సీ.. సుందరం ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 7 శాతం క్షీణించి రూ. 340 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2023–24) ఇదే కాలంలో రూ. 366 కోట్లు ఆర్జించింది. అయితే నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) 20 శాతం జంప్‌చేసి రూ. 48,058 కోట్లను తాకాయి. మొత్తం ఆదాయం సైతం రూ. 1,378 కోట్ల నుంచి రూ. 1,612 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో సుందరం ఫైనాన్స్ షేరు ఎన్ఎస్ఈలో 1.2 శాతం నీరసించి రూ. 4,910 వద్ద ముగిసింది.

గెయిల్ లాభం రూ.2,690 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ సహజవాయువు పంపిణీ సంస్థ గెయిల్ సెప్టెంబర్ త్రైమాసికానికి రూ.2,690 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. ఆదాయం పెద్ద మార్పు లేకుండా రూ.33,981 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.2,442 కోట్లుగా ఉంది. గ్యాస్ పంపిణీ విభాగంలో పన్ను ముందుకు లాభం 8 శాతం పెరిగి రూ.1,402 కోట్లుగా నమోదైంది. పెట్రోకెమికల్ వ్యాపారం రూ.146 కోట్ల లాభాన్ని ఆర్జించింది. సహజ వాయువు పంపిణీ పరిమాణం 13.63 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లుగా, గ్యాస్ మార్కెటింగ్ 96.60 ఎంఎంఎస్‌సీఎండీగా నమోదైంది. సెప్టెంబర్ క్వార్టర్‌లో సామర్థ్య విస్తరణపై రూ.1,885 కోట్లు వ్యయం చేసింది.

ఆకాశ ఎయిర్‌కు రూ.1,670 కోట్ల నష్టం

2023-24లో నమోదు



న్యూఢిల్లీ: విమానయాన సేవల్లోని ఆకాశ ఎయిర్ గడిచిన ఆర్థిక సంవత్సరానికి (2023–24) రూ.1,670 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ.3,144 కోట్లకు పెరిగింది. 2022–23లో ఆదాయం రూ.777 కోట్లు, నష్టం రూ.744 కోట్ల చొప్పున ఉండడం గమనార్హం. ఏడాది కాలంలో సంస్థ నిర్వహణలోని విమానాల సంఖ్య 24 నుంచి 110కి పెరిగింది. రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా సహ వ్యవస్థాపకుడిగా ఉన్న ఆకాశ ఎయిర్ 2022 ఆగస్ట్ 7న కార్యకలాపాలు ప్రారంభించింది.

సాక్షి ప్లస్
బుధవారం । 6-11-2024

జొకోవిచ్ దూరం

గాయం కారణంగా ఏటీపీ ఫైనల్స్ టోర్నీ నుంచి వైదొలిగిన సెర్బియా దిగ్గజం

బెల్‌గ్రేడ్: పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నమెంట్ ఏటీపీ ఫైనల్స్ టైటిల్‌ను సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ఈసారి నిలబెట్టుకోలేకపోతున్నాడు. ఈనెల 10 నుంచి 17 వరకు ఇటలీలోని ట్యూరిన్ నగరంలో ఈ మెగా టోర్నీ జరగనుంది. గాయం కారణంగా తాను ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో పాల్గొనడం లేదని ప్రపంచ ఐదో ర్యాంకర్, డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ మంగళవారం ప్రకటించాడు. 'ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో ఆడాలని ఆసక్తితో ఎదురుచూశా. కానీ గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో ఈ టోర్నీలో ఆడటం లేదు. నా ఆట చూసేందుకు ప్రణాళికలు చేసుకున్న వారికి క్షమించాలని కోరుతున్నాను. ఈ టోర్నీలో ఆడబోతున్న ఆటగాళ్లందరికీ నా తరఫున శుభాకాంక్షలు. త్వరలో మళ్లీ కలుద్దాం' అని జొకోవిచ్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పేర్కొన్నాడు.

ఏడుసార్లు విజేతగా...

54 ఏళ్ల చరిత్ర కలిగిన ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో అత్యధికసార్లు విజేతగా నిలిచిన ప్లేయర్‌గా జొకోవిచ్ రికార్డు నెలకొల్పాడు. ఈ ప్రతిష్టాత్మక టోర్నీ టైటిల్‌ను జొకోవిచ్ ఏడుసార్లు (2008, 2012, 2013, 2014, 2015, 2022, 2023) సొంతం చేసుకున్నాడు. స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ (6 సార్లు) పేరిట ఉన్న రికార్డును గత ఏడాది జొకోవిచ్ బద్దలు కొట్టాడు.

37 విజయాలతో ముగింపు...

ఇప్పటికే అత్యధికంగా 24 గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా గుర్తింపు పొందిన జొకోవిచ్ ఈ ఏడాది తన కెరీర్‌ను పరిపూర్ణం చేసుకున్నాడు. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తోన్న ఒలింపిక్స్ వ్యక్తిగత సింగిల్స్ స్వర్ణ పతకాన్ని అతను 'పారిస్'లో అందుకున్నాడు. వింబుల్డన్ టోర్నీలో, షాంఘై మాస్టర్స్ టోర్నీలో ఫైనల్ చేరుకున్నా రన్నరప్ ట్రోఫీలతో సంతృప్తి పడ్డాడు. ఓవరాల్‌గా ఈ ఏడాది జొకోవిచ్ 37 మ్యాచ్‌ల్లో గెలిచి, 9 మ్యాచ్‌ల్లో ఓడిపోయి మొత్తం 44,21,916 డాలర్ల (రూ. 37 కోట్ల 19 లక్షలు) ప్రైజ్‌మనీని గెల్చుకున్నాడు.


2023 ఏటీపీ ఫైనల్స్ విన్నర్స్ ట్రోఫీతో జొకోవిచ్

మెయిన్ 'డ్రా'కు విష్ణు

భువనేశ్వర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) ఎం25 పురుషుల టోర్నమెంట్‌లో భారత డేవిస్‌కప్ జట్టు మాజీ సభ్యుడు, లండన్ ఒలింపియన్ విష్ణువర్ధన్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో 37 ఏళ్ల విష్ణువర్ధన్ 6-4, 6-4తో భారత్‌కే చెందిన శివాంక్ భట్నాగర్‌పై గెలుపొందాడు. హైదరాబాద్‌కు చెందిన విష్ణుకు క్వాలిఫయింగ్‌లో టాప్ సీడింగ్ లభించింది. తొలి రౌండ్‌లో విష్ణు 6-1, 6-1తో ఒమర్ రెహాన్ సుమర్ (భారత్)పై, రెండో రౌండ్‌లో 6-4, 6-2తో బిక్కీ సాగ్లోషెమ్ (భారత్)పై విజయం సాధించాడు. భారత్‌కే చెందిన రోహన్ మెహ్రా, రాఘవ్ జైసింఘాని, నితిన్ కుమార్ సిన్హా, అభినవ్ షణ్ముగం, మాన్ కేశర్వాణి, హితేశ్ చౌహాన్, యశ్ చౌరాసియా కూడా మెయిన్ 'డ్రా'కు అర్హత పొందారు.





అర్జున్ థౌజండ్‌వాలా

- 1000 రెయిడ్ పాయింట్లు పూర్తి చేసుకున్న జైపూర్ స్టార్
- యూపీపై పింక్ పాంథర్స్ విజయం

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు ప్రధాన ఆటగాడు అర్జున్ దేశ్వాల్ 1000 రెయిడ్ పాయింట్లు పూర్తి చేసుకున్నాడు. తద్వారా పీకేఎల్ చరిత్రలో ఈ ఘనత సాధించిన ఏడో రెయిడర్‌గా రికార్డుల్లోకెక్కాడు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన పోరులో ఈ ఘనత నమోదైంది. హోరాహోరీగా సాగిన పోరులో జైపూర్ పింక్ పాంథర్స్ 33-30 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది. జైపూర్ జట్టు తరఫున అర్జున్ దేశ్వాల్ 5 పాయింట్లు సాధించగా... నీరజ్ నర్వాల్ 9 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. యూపీ యోధాస్ తరఫున భరత్ (7 పాయింట్లు), హితేశ్ (5 పాయింట్లు) పోరాడినా ఫలితం లేకపోయింది. దీంతో తాజా సీజన్‌లో మూడో విజయం ఖాతాలో వేసుకున్న జైపూర్ పింక్ పాంథర్స్ 19 పాయింట్లతో మూడో స్థానానికి దూసుకెళ్లింది. ఏడు మ్యాచ్‌లు ఆడి మూడింట గెలిచి నాలుగింట ఓడిన యూపీ యోధాస్ 19 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. మంగళవారమే జరిగిన మరో మ్యాచ్‌లో యు ముంబా 32-26 పాయింట్ల తేడాతో దబంగ్ ఢిల్లీపై గెలుపొందింది. యు ముంబా తరఫున మన్‌జీత్ (9 పాయింట్లు) రాణించగా... దబంగ్ ఢిల్లీ తరఫున అశు మలిక్ 11 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. యు ముంబా జట్టుకు ఇది రెండో విజయం కాగా... దబంగ్ ఢిల్లీ జట్టుకు నాలుగో పరాజయం. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో యు ముంబా (రాత్రి 8 గంటలకు), తమిళ్ తలైవాస్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.


అర్జున్



డబ్ల్యూబీఎఫ్ టైటిల్ నెగ్గిన భారత బాక్సర్ మన్‌దీప్

న్యూఢిల్లీ: భారత ప్రొఫెషనల్ బాక్సర్ మన్‌దీప్ జాంగ్రా అంతర్జాతీయ బాక్సింగ్ వేదికపై అపూర్వ విజయం సాధించాడు. ప్రపంచ బాక్సింగ్ సమాఖ్య (డబ్ల్యూబీఎఫ్) సూపర్ ఫెదర్ వెయిట్‌లో మన్‌దీప్ ప్రపంచ చాంపియన్‌గా ఆవిర్భవించాడు. కేమన్ ఐలాండ్స్‌లో జరిగిన ఈ ఈవెంట్ టైటిల్ పోరులో బ్రిటన్ బాక్సర్ కానర్ మెకింటోష్‌ను మన్‌దీప్ కంగుతినిపించాడు. 31 ఏళ్ల ఈ హరియాణా స్టార్ పంచ్ పవర్ ముందు బ్రిటన్ ప్రత్యర్థి నిలువలేకపోయాడు. ఆరంభ రౌండ్ నుంచి ప్రత్యర్థిపై ముష్టిఘాతాలు కురిపించిన భారత బాక్సర్ మొత్తం పది రౌండ్ల పాటు మెకింటోష్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగాడు. రౌండ్ రౌండ్‌కు తన పంచ్ పదును పెరిగిపోవడంతో ప్రత్యర్థికి ఎటు పాలుపోలేదు. అమెచ్యూర్ సర్క్యూట్‌లో 12 సార్లు రింగ్‌లోకి దిగితే కేవలం ఒకే ఒక్కసారి ఓడిన మన్‌దీప్ 11 సార్లు ఘనవిజయం సాధించాడు. 2014 గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో జాంగ్రా రజత పతకం గెలిచాడు. మాజీ ఒలింపిక్ రజత పతక విజేత రాయ్ జోన్స్ జూనియర్... మన్‌దీప్‌ను చాంపియన్‌గా మలిచాడు. 'నా కెరీర్లోనే ఇదే అతిపెద్ద విజయం. ఎన్నో ఏళ్లపాటు కఠోరంగా శ్రమించినందుకు దక్కిన ఫలితమిది. భారత ప్రతిష్ట పెంచిన విజయమిది. నన్ను ప్రోత్సహించిన వారందరికీ కృతజ్ఞతలు' అని మన్‌దీప్ వ్యాఖ్యానించాడు.

ఆఫ్రో-ఆసియా కప్ పునరుద్ధరణ!

మళ్లీ టోర్నీ నిర్వహించేందుకు ఆఫ్రికా క్రికెట్ సంఘం ప్రయత్నాలు

బెనోనీ (దక్షిణాఫ్రికా): సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి ఆఫ్రో-ఆసియా కప్ నిర్వహించే దిశగా చర్చలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు రెండుసార్లు జరిగిన ఈ కప్‌ను పునరుద్ధరించాలని ఆఫ్రికా క్రికెట్ సంఘం (ఏసీఏ) ప్రయత్నాలు చేస్తోంది. దీనికి సంబంధించి ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీతో)తో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. 2005లో తొలిసారి దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన ఆఫ్రో ఆసియా కప్ 'డ్రా'గా ముగియగా... 2007లో భారత్ వేదికగా జరిగిన టోర్నీలో ఆసియా జట్టు విజేతగా నిలిచింది. షెడ్యూల్ ప్రకారం 2009లో కెన్యా వేదికగా మూడో ఎడిషన్ జరగాల్సి ఉన్నా అది సాధ్యపడలేదు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఇప్పుడు మళ్లీ దీనిపై చర్చ జరుగుతోంది. 'ఆఫ్రో-ఆసియా కప్ ద్వారా కేవలం ఆటే కాదు... రెండు సంఘాలకు ఆర్థికంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది' అని ఏసీఏ తాత్కాలిక చైర్మన్ తవెంగ్వా ముకులాని అన్నాడు. జింబాబ్వే క్రికెట్ సంఘం అధ్యక్షుడిగానూ పని చేస్తున్న తవెంగ్వా దీని కోసం చర్చలు జరుగుతున్నాయని వెల్లడించాడు. 'ఆసియా క్రికెట్ కౌన్సిల్‌తో ఈ కప్ గురించి చర్చ జరుగుతుంది. ఆఫ్రికా వాసులంతా ఈ టోర్నీని తిరిగి తీసుకు రావాలని కోరుకుంటున్నారు' అని తవెంగ్వా పేర్కొన్నాడు. 2005లో జరిగిన ఆఫ్రో-ఆసియా కప్‌లో ఆసియా జట్టుకు అప్పటి పాకిస్తాన్ సారథి ఇంజమాముల్ హక్ సారథిగా వ్యవహరించగా... భారత్ నుంచి రాహుల్ ద్రవిడ్, ఆశిష్ నెహ్రా, అనిల్ కుంబ్లే పాల్గొన్నారు. ఇక 2007లో జరిగిన టోర్నీలో భారత్ నుంచి ధోనీ, సౌరవ్ గంగూలీ, హర్భజన్ సింగ్, జహీర్ ఖాన్, యువరాజ్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్, సచిన్ టెండూల్కర్ పాల్గొనగా... పాక్ జట్టు నుంచి మొహమ్మద్ యూసుఫ్, షోయబ్ అక్తర్, మొహమ్మద్ ఆసిఫ్ ప్రాతినిధ్యం వహించారు. ఈసారి ఆఫ్రో-ఆసియా కప్‌ను ఐపీఎల్ తరహాలో నిర్వహించాలని భావిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఎక్కడ నిర్వహించాలి, ఎప్పుడు నిర్వహించాలి, ఎలాంటి పద్ధతిలో ముందుకు వెళ్లాలి అనే దశ వరకు చర్చలు జరగనట్లు సమాచారం. కాగా... సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్తాన్‌తో భారత్ ద్వైపాక్షిక సిరీస్‌లే ఆడటం లేదు. అలాంటిది ఇప్పుడు ఇరు దేశాల ఆటగాళ్లు కలిసి ఒకే జట్టుకు ప్రాతినిధ్యం వహించడం అంటే అది అంత సులభం మాత్రం కాదు.


2007 ఆఫ్రో-ఆసియా కప్ టోర్నీలో ధోని, చాచర్ (ఫైల్)

కేఎల్ రాహుల్‌పై దృష్టి

రేపటి నుంచి ఆస్ట్రేలియా 'ఎ'తో భారత్ 'ఎ' రెండో అనధికారిక టెస్టు

మెల్‌బోర్న్: టీమిండియా ఆటగాడు కేఎల్ రాహుల్‌ను ఒత్తిడిలోనే ఉంచే ప్రయత్నం చేస్తామని... ఆస్ట్రేలియా పేసర్ స్కాట్ బోలాండ్ అన్నాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 22 నుంచి ఐదు మ్యాచ్‌ల 'బోర్డర్-గావస్కర్' టెస్టు సిరీస్ ప్రారంభం కానుండగా... ప్రస్తుతం భారత 'ఎ' జట్టు ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆస్ట్రేలియా 'ఎ'తో భారత 'ఎ' జట్టు ఒక అనధికారిక టెస్టు ఆడి ఓడిపోగా... రెండో మ్యాచ్ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో ఆడేందుకు రాహుల్‌తో పాటు వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ ముందుగానే ఆస్ట్రేలియాలో అడుగు పెట్టారు. ఇటీవలి కాలంలో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న రాహుల్... 'బోర్డర్-గావస్కర్' ట్రోఫీ సిరీస్‌కు ముందు ఈ మ్యాచ్‌లో సత్తా చాటాలని పట్టుదలతో ఉన్నాడు. తాజాగా న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో మాత్రమే ఆడి తర్వాత తుది జట్టులో చోటు కోల్పోయిన రాహుల్... బోర్డర్-గావస్కర్ సిరీస్‌లోని మొదటి టెస్టు కోసం తుది జట్టులో ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కెప్టెన్ రోహిత్ శర్మ వ్యక్తిగత కారణాలరీత్యా తొలి టెస్టుకు అందుబాటులో లేకపోతే టీమ్ మేనేజ్‌మెంట్ రాహుల్‌కే తొలి ప్రాధాన్యత ఇస్తుంది. ఈ నేపథ్యంలో బోలాండ్ మాట్లాడుతూ.. 'గతంలో రాహుల్‌కు బౌలింగ్ చేసిన అనుభవం ఉంది. మళ్లీ ఇన్ని రోజుల తర్వాత స్వదేశంలో అతడికి బౌలింగ్ చేయనున్నా. అతడు ప్రపంచ స్థాయి ప్లేయర్. అతడిని ఒత్తిడిలో ఉంచేందుకు ప్రయత్నిస్తాం' అని అన్నాడు. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో ఓడినంత మాత్రాన టీమిండియాను తక్కువ అంచనా వేయడం లేదని బోలాండ్ పేర్కొన్నాడు. 'ఇక్కడి పిచ్‌లపై బౌన్స్ ఎక్కువ ఉంటుంది. ఆస్ట్రేలియా పర్యటన కోసం టీమిండియా జట్టును ఎంపిక చేసుకునే విధానం భారత్‌తో పోలిస్తే పూర్తి భిన్నంగా ఉంటుంది' అని అన్నాడు. 2015లో తొలిసారి ఆస్ట్రేలియాలో పర్యటించిన రాహుల్... సిడ్నీ టెస్టులో సెంచరీతో ఆకట్టుకున్నాడు. గత ఏడాది డిసెంబర్‌లో సెంచూరియన్ వేదికగా దక్షిణాఫ్రికాపై చివరిసారి సెంచరీ చేసిన రాహుల్... ఆ తర్వాత 9 ఇన్నింగ్స్‌ల్లో కేవలం రెండు అర్ధ శతకాలు మాత్రమే నమోదు చేశాడు.

హంపి ఖాతాలో రెండో ఓటమి

షిమ్‌కెంట్ (కజకిస్తాన్): అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ క్రీడాకారిణి కోనేరు హంపికి రెండో పరాజయం ఎదురైంది. మంగళవారం జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హంపి 41 ఎత్తుల్లో స్థావ్రూలా సాలాకిడూ (గ్రీస్) చేతిలో ఓడిపోయింది. పది మంది క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. భారత్‌కే చెందిన జూనియర్ ప్రపంచ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ ఖాతాలో ఐదో 'డ్రా' చేరింది. సలీమోవా (బల్గేరియా)తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను దివ్య 52 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది.



ఆంధ్రప్రదేశ్ గెలుపు

చెన్నై: జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి విజయం నమోదు చేసింది. అండమాన్ అండ్ నికోబార్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'సి' రెండో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 13-0 గోల్స్ తేడాతో గెలిచింది. ఆంధ్రప్రదేశ్ తరఫున లేఖ్ల హితేశ్ రావు (13వ, 15వ, 21వ, 41వ, 48వ, 55వ, 56వ నిమిషాల్లో) ఏకంగా ఏడు గోల్స్ సాధించాడు. వీర రాయుడు (5వ నిమిషంలో), హర్ష కమల్ తేజ (6వ నిమిషంలో), గల్లా శివ ప్రమోద్ (30వ నిమిషంలో), తాటిపర్తి ఆరోన్ సరోజ్ (33వ నిమిషంలో), మద్దిమేని రాజేశ్ (38వ నిమిషంలో), వేణు గోరెల గోపాల్ (49వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు.



స్వియాటెక్‌కు కోకో గాఫ్ షాక్

రియాద్: మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నమెంట్ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో అమెరికా స్టార్, ప్రపంచ మూడో ర్యాంకర్ కోకో గాఫ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన ఆరెంజ్ గ్రూప్ రెండో లీగ్ మ్యాచ్‌లో కోకో గాఫ్ 6-3, 6-4తో ప్రపంచ రెండో ర్యాంకర్, డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)పై సంచలన విజయం సాధించింది. తద్వారా వరుసగా రెండో విజయంతో కోకో గాఫ్‌నకు సెమీఫైనల్ బెర్త్ ఖరారైంది. ఇదే గ్రూప్‌లోని మరో లీగ్ మ్యాచ్‌లో బార్బరా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) 6-3, 6-3తో జెస్సికా పెగూలా (అమెరికా)పై గెలిచింది. ఫలితంగా రెండు పరాజయాలతో జెస్సికా పెగూలా సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. స్వియాటెక్, క్రెజికోవా మధ్య జరిగే చివరి లీగ్ మ్యాచ్ విజేతకు రెండో సెమీఫైనల్ బెర్త్ లభిస్తుంది.

సందేశ్ పునరాగమనం



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టు డిఫెండర్ సందేశ్ జింగాన్ గాయం నుంచి కోలుకొని తిరిగి జాతీయ జట్టు ప్రాబబుల్స్‌లో చోటు దక్కించుకున్నాడు. ఈ నెల 18న హైదరాబాద్‌లో మలేసియాతో భారత జట్టు అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనుంది. దీని కోసం అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య 26 మందితో కూడిన ప్రాబబుల్స్‌ను ప్రకటించింది. మోకాలి గాయంతో ఈ ఏడాది జనవరి నుంచి సందేశ్ ఆటకు దూరమయ్యాడు.

భారత ప్రాబబుల్స్: గోల్‌కీపర్స్: అమరిందర్, గుర్‌ప్రీత్, విశాల్. **డిఫెండర్స్:** ఆకాశ్, అన్వర్ అలీ, ఆశిష్ రాయ్, చింగ్లెన్‌సనా సింగ్, హమింగ్‌తన్మవియా రాల్టే, మెహతాబ్, రాహుల్, రోషన్, సందేశ్ జింగాన్ **మిడ్‌ఫీల్డర్స్:** అనిరుధ్ థాపా, బ్రాండన్, జీక్సన్, జితిన్, లెలెంగ్‌మావియా రాల్టే, లిస్టన్, సురేశ్, విబిన్. **ఫార్వర్డ్స్:** ఎడ్మండ్, ఇర్ఫాన్ యద్వాడ్, ఫారుఖ్ చౌధరీ, లాలినజులా చాంగ్టే, మాన్వీర్ సింగ్, విక్రమ్ ప్రతాప్ సింగ్.

ఢిల్లీతో విశాఖ ఫ్రాంచైజీ గోనాసిక తొలిపోరు

హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) షెడ్యూల్ విడుదల • వచ్చే నెల 28 నుంచి లీగ్ షురూ

న్యూఢిల్లీ: విశాఖపట్నం ఫ్రాంచైజీ గోనాసిక తమ తొలి పోరులో ఢిల్లీ ఎస్‌జీ పైపర్స్‌తో తలపడుతుంది. రూర్కెలాలో వచ్చే నెల 28న జరిగే పోరుతో హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) పునఃప్రారంభం కానుంది. భారత హాకీలో ఫ్రాంచైజీ టోర్నీ ఏడేళ్ల తర్వాత తిరిగి మొదలవనుంది. ఈసారి పురుషులతో పాటు మహిళల జట్లు బరిలోకి దిగనున్నాయి. పురుషుల లీగ్‌లో ఎనిమిది ఫ్రాంచైజీలు బరిలో ఉంటే... మహిళల్లో నాలుగు జట్లు తలపడనున్నాయి. అమ్మాయిల పోటీలు రాంచీలో నిర్వహిస్తారు. పురుషుల విభాగాన్ని రెండు దశలుగా నిర్వహిస్తారు. తొలి దశలో డిసెంబర్ 28 నుంచి జనవరి 18 వరకు బరిలోని ఎనిమిది ఫ్రాంచైజీలు రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో తలపడతాయి. 19 నుంచి జరిగే రెండో దశలో ఎనిమిది జట్లను నాలుగు చొప్పున రెండు పూల్స్‌గా విభజిస్తారు. పూల్ 'ఎ'లో ఢిల్లీ, బెంగాల్ టైగర్స్, సూర్మ హాకీ క్లబ్, వేదాంత కళింగ లాన్సర్స్... పూల్ 'బి'లో గోనాసిక, హైదరాబాద్ తుఫాన్స్, తమిళనాడు డ్రాగన్స్, యూపీ రుద్రాస్‌లు ఉన్నాయి. ఈ రెండు పూల్స్ నుంచి రెండు చొప్పున నాలుగు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. 31న సెమీఫైనల్స్, ఫిబ్రవరి 1న ఫైనల్‌తో పాటు మూడో స్థానం మ్యాచ్ నిర్వహిస్తారు. తొలిసారి మహిళల విభాగంలో నిర్వహించే ఫ్రాంచైజీ లీగ్ రాంచీలో జనవరి 12 నుంచి జరుగుతుంది. నాలుగు ఫ్రాంచైజీలు ఢిల్లీ, బెంగాల్, సూర్మ, ఒడిశా వారియర్స్‌లు ఒక్కో జట్టుతో రెండేసి లీగ్ మ్యాచ్‌లు ఆడతాయి. ఇందులో నుంచి రెండు జట్లు ఫిబ్రవరి 1న జరిగే ఫైనల్‌కు అర్హత పొందుతాయి. ఏడేళ్ల తర్వాత మళ్లీ మొదలవుతున్న హాకీ ఇండియా లీగ్‌ను ఇకపై క్రమం తప్పకుండా విజయవంతంగా నిర్వహిస్తామని హెచ్ఐఎల్ గవర్నింగ్ కమిటీ చైర్మన్ దిలీప్ టిర్కీ తెలిపారు. ప్రతిభ గల జాతీయ, అంతర్జాతీయ ప్లేయర్లతో పోటీ రసవత్తరంగా సాగుతుందని చెప్పారు.

కమల పూర్వీకుల గ్రామంలో సందడి

కమలా హారిస్ పూర్వీకుల గ్రామం తమిళనాడులోని మన్నార్‌గుడి జిల్లా తులసేంద్రపురంలో సందడి నెలకొంది. మంగళవారం స్థానిక ధర్మ శాస్త శ్రీ కేశవ పెరుమాళ్ ఆలయంలో జరిగిన అభిషేకం, అర్చన కార్యక్రమాల్లో అమెరికా, యూకేల నుంచి వచ్చిన ముగ్గురు మహిళా అభిమానులు పాల్గొనడం విశేషం. వీరిని చూసి గ్రామస్తులంతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వీరిలో ఒకరు అమెరికాలోని లాస్‌వెగాస్ నుంచి వచ్చినట్లు తెలిపారు. కమలా హారిస్ గెలవాలని కోరుకుంటున్నామన్నారు. ఈ ఆలయ దేవత కమల తాత గోపాలన్ కుటుంబం కుల దైవమని ఆలయ పూజారి సెంథిల్ కుమార్ తెలిపారు. గోపాలన్ కుటుంబ సభ్యులు గతంలో ఆలయానికి రూ.లక్ష విరాళమిచ్చారంటూ అక్కడి శిలాఫలకంపైన పేర్లను చూపించారు. 2014లో కమలా హారిస్ పేరిట జరిగిన కుంభాభిషేకం కోసం రూ.5 వేలు ఇచ్చారన్నారు. గోపాలన్ కుటుంబ సభ్యులెవరూ ప్రస్తుతం గ్రామంలో ఉండటం లేదన్నారు. గోపాలన్ బ్రిటిష్ ప్రభుత్వంలో అధికారిగా పని చేశారు. ఆయన కుమార్తె శ్యామలే కమల తల్లి. 2021లో కమలా హారిస్ అమెరికా ఉపాధ్యక్షురాలయ్యారు. ఆ సమయంలో కమల కోసం ఆమె పిన్ని, శ్యామల చెల్లెలు చిట్టి ఇదే ఆలయంలో పూజలు చేశారని పూజారి సెంథిల్ కుమార్ చెప్పారు. అమెరికా అధ్యక్షురాలిగా కమల గెలిస్తే ఊళ్లో అన్నదానం జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని స్థానిక కౌన్సిలర్ అరుల్ మొళి తెలిపారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



కమల పూర్వీకుల తులసేంద్రపురం గ్రామమిదే



అమెరికా, బ్రిటన్‌ల నుంచి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కమల అభిమానులు



హారిస్ విజయం కోరుకుంటూ ఇళ్ల ముందు మహిళల రంగవల్లులు



ఆలయ విరాళ దాతల్లో కమల పేరుందని చూపిస్తున్న పూజారి

అమెరికా ఎన్నికల్లో భారతీయం

కొద్ది రోజులుగా ఎక్కడ చూసినా అమెరికా అధ్యక్ష ఎన్నికల చర్చే. అయితే వాటితో పాటే అమెరికా కాంగ్రెస్‌లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, ఎగువ సభ సెనేట్‌లో 34 సీట్లకు కూడా ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రతినిధుల సభ ఎన్నికల బరిలో ఈసారి ఏకంగా తొమ్మిది మంది భారతీయ అమెరికన్లు ఉండటం విశేషం. వీరిలో ఐదుగురు సిట్టింగ్ సభ్యులు కాగా ముగ్గురు తొలిసారి పోటీ చేస్తున్నారు. వీరిలో ఏడుగురు డెమొక్రటిక్ పార్టీ తరఫున, ఇద్దరు రిపబ్లికన్ పార్టీ నుంచి బరిలో ఉన్నారు. మరో 36 మందికి పైగా పలు రాష్ట్రాల అసెంబ్లీలకు, స్థానిక సంస్థలకు పోటీ చేస్తుండటం మరో విశేషం. ఇంతమంది భారత అమెరికన్లు ఎన్నికల బరిలో దిగడం ఆ దేశ చరిత్రలో ఇదే తొలిసారి! ఉపాధ్యక్షురాలు, డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌వి కూడా భారత మూలాలేనన్నది తెలిసిందే.

- బరిలో భారీ సంఖ్యలో ఇండియన్ అమెరికన్లు
- ప్రతినిధుల సభకు ఏకంగా 9 మంది పోటీ
- స్థానిక సంస్థల బరిలోనూ 36 మందికి పైనే

అమెరికాలో ప్రస్తుతం 52 లక్షల పైచిలుకు భారతీయ అమెరికన్లున్నారు. దేశంలో రెండో అతి పెద్ద వలస సమాజంగా గుర్తింపు పొందారు. భారత మూలాలున్న సభ్యులకు అమెరికా కాంగ్రెస్‌లో 'సమోసా కాకస్'అనే ముద్దుపేరుంది.

సుహాస్ సుబ్రమణ్యం: ప్రస్తుతం వర్జీనియా సెనేటర్. డెమొక్రాట్ల కంచుకోట అయిన 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌లో పోటీ చేస్తున్నారు. గెలిస్తే వర్జీనియా, ఈస్ట్ కోస్ట్ నుంచి ప్రతినిధుల సభకు ఎన్నికైన తొలి భారతీయ అమెరికన్‌గా చరిత్ర సృష్టిస్తారు. రాజధాని వాషింగ్టన్ డీసీ సమీపంలోని వర్జీనియా శివారులో నివసించే సుబ్రమణ్యం బరాక్ ఒబామా హయాంలో వైట్‌హౌస్ సలహాదారుగా పనిచేశారు. దేశవ్యాప్తంగా భారతీయ అమెరికన్లలో ఆయనకు మంచి ఆదరణ ఉంది.

అమీ బెరా: మరో సీనియర్ సెనేటర్. వృత్తి రీత్యా వైద్యుడు. 2013 నుంచి కాలిఫోర్నియా 6వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్‌లో సుదీర్ఘ కాలం పనిచేసిన భారతీయ అమెరికన్. ప్రతినిధుల సభలో ప్రస్తుతం రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ ఉంది. సభపై డెమొక్రాట్లు తిరిగి ఆధిపత్యం సాధిస్తే లభిస్తే 59 ఏళ్ల బెరాకు మరింత ప్రాధాన్యం దక్కే అవకాశముంది.

ప్రమీలా జయపాల్: 59 ఏళ్ల ప్రమీల డెమొక్రటిక్ పార్టీలో ప్రభావశీల నాయకురాలు. 2017 నుంచి వాషింగ్టన్ స్టేట్‌లోని 7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

అమీశ్ షా: 2018 నుంచి అరిజోనా స్టేట్ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు పోటీ చేసి గెలిచారు. అరిజోనా మొదటి కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి తొలిసారి ప్రతినిధుల సభకు పోటీ చేస్తున్నారు. ఇక్కడినుంచి ఏడు సార్లు గెలిచిన రిపబ్లికన్ అభ్యర్థి డేవిడ్ ష్వీకర్ట్‌కు డాక్టర్ షా సవాలు విసురుతున్నారు.

వీరితో పాటు 2017 నుంచి ఇలినాయీ 7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజా కృష్ణమూర్తి, 2017నుంచి కాలిఫోర్నియా 17వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న రో ఖన్నా, 2023 నుంచి మిషిగన్ 13వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ థానేదార్ కూడా బరిలో ఉన్నారు. ఈ స్థానాలన్నీ డెమొక్రటిక్ కంచుకోటలు కావడంతో వీరంతా మరోసారి గెలవడం ఖాయంగా కనిపిస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సెనేట్‌లో హారిసే

అమెరికా సెనేట్‌కు ఎన్నికైన తొలి భారత మూలాలున్న నేతగా కమలా హారిస్ చరిత్ర సృష్టించారు. 2016లో కాలిఫోర్నియా నుంచి సెనేట్‌లో అడుగుపెట్టారు. 2020లో డెమొక్రటిక్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడ్డారు. కానీ ప్రైమరీలకు ముందే రేసు నుంచి తప్పుకున్నారు. అనంతరం పార్టీ అధ్యక్ష అభ్యర్థి జో బైడెన్ ఆమెను రన్నింగ్‌మేట్‌గా ఎంచుకున్నారు. ఎన్నికల విజయంతో దేశ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈ ఘనత సాధించిన తొలి మహిళగానే గాక తొలి నల్లజాతీయురాలిగా, ఆసియా, భారత మూలాలున్న తొలి మహిళగా పలు రికార్డులు సృష్టించారు. సెనేట్ ప్రెసిడెంట్ హోదాలో సభలో అత్యంత ఎక్కువసార్లు టై బ్రేకింగ్ ఓటు వేశారు. ఆ ఘనత సాధించిన తొలి వైస్ ప్రెసిడెంట్‌గా కూడా మరో రికార్డు సాధించారు.

ఇద్దరు రిపబ్లికన్లు

ప్రతినిధుల సభ బరిలో ఉన్న ఇద్దరు ఇండియన్ అమెరికన్లలో డాక్టర్ ప్రశాంత్ రెడ్డి ఒకరు. కాన్సాస్‌లోని థర్డ్ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ మూడుసార్లు విజయం సాధించిన డెమొక్రాట్ అభ్యర్థి షారిస్ డేవిడ్స్‌తో ఆయన తలపడుతున్నారు. డాక్టర్ రెడ్డి చెన్నైలో జన్మించారు. ఐదేళ్ల వయసులో కుటుంబంతో పాటు అమెరికాకు వలస వెళ్లారు. ఇక డాక్టర్ రాజేశ్ మోహన్ న్యూజెర్సీలోని థర్డ్ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి పోటీలో ఉన్నారు. వీరిద్దరికీ విజయావకాశాలు అంతంత మాత్రమేనని పరిశీలకులు చెబుతున్నారు.

తొలి భారతీయ అమెరికన్

కాంగ్రెస్‌లో కాలు పెట్టిన తొలి భారతీయ అమెరికన్‌గా దలీప్ సింగ్ సౌంద్ చరిత్ర సృష్టించారు. 1957లో కాలిఫోర్నియా 29వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి గెలుపొందారు. మొత్తం మూడుసార్లు ప్రతినిధుల సభకు ప్రానతిధ్యం వహించారు. తద్వారా అగ్ర రాజ్యపు రాజకీయాల్లో భారతీయ అమెరికన్లకు బాటలు వేశారు. అనంతరం దాదాపు నాలుగు దశాబ్దాలు గడిచాక 2005లో బాబీ జిందాల్ లూసియానా నుంచి ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. 2సార్లు ప్రతినిధుల సభ సభ్యునిగా, తర్వాత రెండుసార్లు లూసియానా గవర్నర్‌గా పని చేశారు.

నింగిలోకి దూసుకెళ్లిన
కలప ఉపగ్రహం

ప్రపంచంలో తొలిసారిగా తయారుచేసిన జపాన్ వర్సిటీ శాస్త్రవేత్తలు



వాషింగ్టన్: అత్యంత కఠినమైన లోహాలతో రూపొందిన కృత్రిమ ఉపగ్రహాలు కాలం చెల్లాక కక్ష్యల్లో స్పేస్‌జంక్‌గా పోగుబడుతున్న నేపథ్యంలో వాటికి ప్రత్యామ్నాయంగా కలపను భవిష్యత్తులో వాడే ఉద్దేశ్యంతో జపాన్ శాస్త్రవేత్తలు కలపతో ఉపగ్రహాన్ని తయారుచేశారు. ప్రపంచంలో తొలిసారిగా కలపతో తయారైన 'లిగ్నోశాట్' ఉపగ్రహం అమెరికాలోని నాసా వారి కెన్నడీ అంతరిక్షప్రయోగ కేంద్రం నుంచి స్పేస్ఎక్స్ రాకెట్‌లో నింగిలోకి దూసుకుపోయిందని క్యోటో వర్సిటీ హ్యూమన్ స్పేసాలజీ సెంటర్ మంగళవారం ప్రకటించింది. కేవలం అరచేయి సైజులో 10 సెంటీమీటర్ల వృత్తాకార పరిమాణంలో ఈ బుల్లిశాటిలైట్‌ను తయారుచేశారు. ఒక కంటైనర్‌లో అమర్చి పంపారు. త్వరలో ఇది అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని చేరుకోంది. కొద్దిరోజుల విరామం తర్వాత దీనిని ఐఎస్ఎస్ బయట ప్రవేశపెట్టనున్నారు. ఆరునెలలపాటు ఇది తన కక్ష్యలో తిరగనుంది. శూన్యంలో రోదసీ వాతావరణంలో కలప ఏ మేరకు మన్నికగా ఉంటుందనే విషయాలపై అధ్యయనం చేయనున్నారు. ప్రతి 45 నిమిషాలకు ఇది రోదసీలో చీకటి మొదలు తీక్షణమైన సూర్యరశ్మి దాకా అంటే మైనస్ 100 డిగ్రీ సెల్సియస్ నుంచి 100 డిగ్రీ సెల్సియస్‌దాకా భిన్న ఉష్ణోగ్రతలను తట్టుకోవాల్సి ఉంటుంది. కలపను దహించే ఆక్సిజన్ వంటి వాయువులు శూన్యంలో ఉండవుకాబట్టి అక్కడ కలప ధృఢంగా ఉండగలదని జపాన్‌లోని క్యోటో విశ్వవిద్యాలయ అటవీశాస్త్ర ప్రొఫెసర్ కోజీ మురాటా వాదిస్తున్నారు. ఖడ్గం పిడి, ఒరగా వాడే మంగోలియా జాతి హొనోకీ చెట్టు కలపను ఈ శాటిలైట్ తయారీలో వాడారు. జపాన్ సంప్రదాయక కళతో ఎలాంటి నట్లు, బోల్ట్‌లు, జిగురు వాడకుండానే లిగ్నోశాట్‌ను సిద్ధంచేశారు. కాలం చెల్లిన శాటిలైట్ తిరిగి భూవాతావరణంలోకి వచ్చేటపుడు ప్రమాదకర అల్యూమినియం ఆక్సైడ్ అణువులను వెలువరుస్తుంది. అదే కలప శాటిలైట్‌తో పర్యావరణానికి, కమ్యూనికేషన్ కక్ష్యలకు ఎలాంటి సమస్యలు ఉండవని క్యోటో వర్సిటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం బయట కలపశాటిలైట్ మన్నిక బాగుందని తేలితే భవిష్యత్తులో చంద్రుడు, మార్స్‌పై వ్యోమగాముల ఆవాసాలకు కలపను విరివిగా వాడే అవకాశముంది. ఐఎస్ఎస్ నుంచి సరకుల రాకపోకల్లోనూ కంటైనర్లకు కలపను వాడే వీలుంది.

ఆర్మీ చేతికి స్వదేశీ
అస్మీ మెషీన్ పిస్టల్స్

నార్తర్న్ కమాండ్ బృందానికి అందిన 550 పిస్టళ్లు



కొత్తరకం పిస్టళ్లు



కల్నల్ ప్రసాద్

జమ్మూ: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన 'అస్మీ'మెషీన్ పిస్టళ్లు భారత సైన్యం చేతికొచ్చాయి. ''దేశ ఆత్మనిర్భరత కార్యక్రమానికి మరింత ఊతమిస్తూ 100 శాతం భారత్ తయారీ ఆయుధాన్ని ఇండియన్ ఆర్మీ తమ అమ్ములపొదిలోకి తీసుకుంది''అని డిఫెన్స్ జమ్మూ విభాగం ప్రజావ్యవహారాల శాఖ మంగళవారం 'ఎక్స్'లో ట్వీట్‌చేసింది. ఇండియన్ ఆర్మీ కల్నల్ ప్రసాద్ బన్సూద్‌తో కలిసి సంయుక్తంగా రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) ఈ పిస్టల్‌ను అభివృద్ధిచేసింది. ఈ పిస్టళ్లను హైదరాబాద్‌లోని లోకేశ్ మెషీన్స్ కర్మాగారంలో తయారుచేశారు. దీంతో కీలకమైన రక్షణ సాంకేతికలో భారత్ మరింత స్వావలంభన సాధించింది. అత్యంత చిన్నగా, తేలిగ్గా ఉండటం అస్మీ పిస్టల్ ప్రత్యేకత. శత్రువుతో అత్యంత సమీపం నుంచి పోరాడాల్సి వచ్చినపుడు వేగంగా స్పందించేందుకు ఈ పిస్టల్ ఎంతగానో ఉపయోగపడుతుంది. సాధారణ పిస్టల్‌గా, సబ్ మెషీన్ గన్‌గా రెండు రకాలుగా వాడుకోవచ్చు. స్వల్ప, మధ్య శ్రేణి దూరాల్లోని లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో షూట్ చేయొచ్చు. అత్యంత వేడి, చలి వాతావరణంలోనూ ఏమాత్రం మొరాయించకుండా పనిచేస్తాయి. 8 అంగుళాల బ్యారెల్‌కు 33 తూటాల మేగజైన్‌ను అమర్చవచ్చు. 9ఎంఎం బుల్లెట్‌ను దీనిలో వాడతారు. తొలి దఫా 550 పిస్టళ్లను నార్తర్న్ కమాండ్ పరిధిలోని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ సరిహద్దులవెంట పహారా కాసే భారత సైన్యంలోని ప్రత్యేక బలగాలకు అందజేశారు. వీటి తయారీ ఆర్డర్‌ను లోకేశ్ మెషీన్స్ సంస్థకు ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇచ్చారు.

ఇదే మా అమ్మమ్మ గారిల్లు..!

జపాన్ వాసి 'నానీ కా ఘర్' వ్లాగ్ వైరల్ ● భేషంటూ నెటిజన్ల మెచ్చుకోలు

పేరు కొకి షిషిడో. జపాన్ వ్యాపారవేత్త. మాతృభాష జపనీస్. ఇన్‌స్టాలో 60 లక్షల మంది ఫాలోయర్లున్నారు. తాజాగా కొకి షిషిడో 'నానీ కా ఘర్'అంటూ వాళ్ల అమ్మమ్మ గారింట్లో గదిగదికీ తిరుగుతూ జపాన్ ఆచారాలు, అలవాట్లను హిందీలో భారతీయులకు పరిచయం చేశారు. ఇన్‌స్టాలో ఈ వైరలవుతోంది. ముఖ్యంగా కొకి షిషిడో హిందీ అనర్గళంగా మాట్లాడిన తీరు భారతీయులకు తెగ నచ్చేసింది. షిషిడో ఫ్యూయర్లకు హలో చెబుతూ, మా అమ్మమ్మ వాళ్లిల్లు ఇదేనంటూ పరిచయం చేయడంతో వీడియో మొదలవుతుంది. ఇదే ప్రధాన ద్వారం.. ఇక్కడో తోట కూడా ఉంది. ఇది 50 ఏళ్ల క్రితం కట్టిన ఇల్లు'అని చెప్పుకొచ్చారు. అంతకుముందు, వాళ్ల అమ్మమ్మ మనవడికి, ఫ్యూయర్లకు స్వాగతం పలుకుతూ కొద్దిసేపు కనిపించారు. ఆ ఇంటిని మొత్తం కలియదిరుగుతూ..ఇదే అందులోని విశిష్టతలను ఏమాత్రం తడుముకోకుండా హిందీలో వివరించారు. 'ఇది ఒకటో నంబర్ గది. ఇది మా అమ్మమ్మ బెడ్ రూం. ఇది ఆమె బెడ్. ఆమెది పెద్ద కుటుంబం. ఈ గోడకు ఉన్నవన్నీ వాళ్ల పొటోలే'అని చెప్పారు షిషిడో. ఆ తర్వాత ఆ ఇంట్లో ఉన్న మిగతా గదులు, అందులోని బాత్‌టబ్, షవర్, వాషింగ్ మెషీన్ వంటి ప్రత్యేకతలు చూపిస్తూ సంబంధించిన అంశాలను వివరించారు. ఇంట్లోని జపాన్ సంప్రదాయ పూజా మందిరాన్ని గురించి హిందీలో చెప్పడంతోపాటు అందులోని బుద్ధుని ప్రతిమను చూపారు. ఆఖరుగా టాప్ ఫ్లోర్‌లోని గదికి తీసుకెళ్లి వాస్తవానికి ఇదో బెడ్ రూం. ఇప్పుడిది స్టోర్ రూంగా మారిందని వివరించారు. ఈ వీడియో చూసిన జనం..అచ్చం ప్రజాదరణ పొందిన జపాన్ కార్టూన్ షో 'షిన్‌చాన్'లోని ఇంటిని చూసినట్లుగా ఉందంటూ తబ్బిబ్బయ్యారు. హిందీపై తనకున్న పట్టును ప్రదర్శించడం మాత్రమే కాదు..రెండు దేశాలకు సాంస్కృతిక వారధిగా షిషిడో నిలిచారంటూ ప్రశంసలు కురిపించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎన్నికల్లో మస్క్ దుష్ప్రచారం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తప్పుడు సమాచారాన్ని, తప్పుదోవ పట్టించే కథనాలను ఎక్స్, సంస్థ సీఈఓ ఎలన్ మస్క్ వ్యాప్తి చేసినట్టు ఓ అధ్యయనం తెలిపింది. కీలకమైన స్వింగ్ రాష్ట్రాల్లో అవి బాగా ప్రభావం చూపినట్టు వెల్లడించింది. అమెరికా ఎన్నికలకు సంబంధించి తప్పుడు సమాచారంపై అధ్యయన ఫలితాలను సెంటర్ ఫర్ కౌంటరింగ్ డిజిటల్ హేట్ వెల్లడించింది. ''తప్పుడు సమాచార వ్యాప్తికి మస్క్, ఎక్స్ ముఖ్య కేంద్రాలుగా మారినట్టు గుర్తించాం. ఎన్నికలపై మస్క్ తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఏడాది పొడవునా ఎక్స్‌లో ఏకంగా 200 కోట్ల వ్యూస్ సాధించడం ఆశ్చర్యకరం. స్వింగ్ రాష్ట్రాల్లో వీటి వ్యాప్తిలో ఎక్స్ పాత్ర ఎక్కువగా ఉంది''అని పేర్కొంది. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మస్క్ బాహాటంగా మద్దతు ప్రకటించడం తెలిసిందే. మస్క్‌కు ఎక్స్‌లో ఏకంగా 20.3 కోట్ల మంది ఫాలోవర్లున్నారు. తాజా అధ్యయనం ప్రకారం ఈ ఏడాది మస్క్ పెట్టిన 87 పోస్టులు అమెరికా ఎన్నికల కంటెంట్‌ను ప్రచారం చేశాయి. ఇవి 200 కోట్ల వ్యూస్ సాధించాయి. వీటిని తప్పుదోవ పట్టించేవిగా ఫ్యాక్ట్ చెకర్స్ గుర్తించారు. స్వింగ్ రాష్ట్రాల్లో కీలకమైన పెన్సిల్వేనియాలో ఈ కథనాలు బాగా ప్రభావం చూపాయి.

క్షిపణులను ప్రయోగించిన ఉత్తర కొరియా

సియోల్: అమెరికాలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతున్న వేళ కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలకు దారి తీసే మరో పరిణామం చోటుచేసుకుంది. ఉత్తర కొరియా మంగళవారం తక్కువ శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను తూర్పు తీరం దిశగా ప్రయోగించిందని దక్షిణ కొరియా మిలటరీ తెలిపింది. అయితే, ఎన్ని క్షిపణులను ప్రయోగించింది? అవి ఎంత దూరం ప్రయాణించాయనే విషయాలను స్పష్టంగా వెల్లడించలేదు. ఉత్తర కొరియా క్షిపణుల ప్రయోగం నిజమేనంటూ మరో పొరుగుదేశం జపాన్ స్పందించింది. సముద్ర జలాల్లో పడిపోయిన ఆ క్షిపణుల జరిగిన నష్టంపై ఇప్పటి వరకు సమాచారం లేదని పేర్కొంది. ఆదివారం దక్షిణ కొరియా, జపాన్ చేపట్టిన విన్యాసాల్లో అమెరికా లాంగ్ రేంజ్ బి-1బీ బాంబర్ పాల్గొనడంపై ఉత్తర కొరియా తీవ్రంగా స్పందించింది. ఈ దేశాలు దుస్సాహసంతో కూడిన దుందుడుకు చర్యలకు పాల్పడుతున్నాయంటూ మండిపడింది. ఆ వెంటనే, కొత్తగా రూపొందించిన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాన్ని కిమ్ స్వయంగా పర్యవేక్షించినట్లు ఉత్తర కొరియా మీడియా ప్రకటించడం తెలిసిందే.

సల్మాన్ ఖాన్‌కు మళ్లీ బెదిరింపు

ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు తాజాగా మళ్లీ బెదిరింపు అందింది. జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడినంటూ ఓ వ్యక్తి మెసేజీ పంపాడు. బతికుండాలనుకుంటే రూ.5 కోట్లివ్వాలని హెచ్చరించాడు. సోమవారం రాత్రి వర్లి ప్రాంతంలోని ముంబై ట్రాఫిక్ పోలీస్ కంట్రోల్ రూం వాట్సాప్ నంబర్‌కు ఈ మేరకు మెసేజీ వచ్చింది. 'సల్మాన్ ఖాన్ ప్రాణాలతో ఉండాలనుకుంటే, మా బిష్ణోయ్ వర్గం ప్రజల ఆలయానికి వెళ్లి క్షమాపణ కోరాలి లేదా రూ.5 కోట్లు ఇవ్వాలి. మేం చెప్పిన విధంగా చేయకుంటే అతడిని చంపేస్తాం. మా ముఠా ఇప్పటికీ చురుగ్గానే ఉంది'అని ఆ మెసేజీలో ఉంది. దీనిని సీరియస్ అంశంగా పరిగణనలోకి తీసుకున్న భద్రతా సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు సల్మాన్ ఖాన్‌కు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. దర్యాప్తు చేపట్టిన అధికారులు ఆ మెసేజీ కర్ణాటకలోని హుబ్బళి పట్టణం నుంచి వచ్చినట్లు గుర్తించారు.

సీఎం యోగిని చంపుతామని హెచ్చరిక

గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను చంపుతామని ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన బెదిరింపును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. నిందితుడు గోరఖ్‌పూర్‌కు చెందిన రియాజుల్ హక్ అన్సారీగా గుర్తించారు. సైఫ్ అన్సారీ అనే పేరుతో రియాజుల్ ఇన్‌స్టాగ్రామ్‌లో బెదిరించినట్లు గుర్తించారు. రియాజుల్ పరారీలో ఉన్నాడని గోరఖ్‌పూర్ ఎస్పీ అభినవ్ త్యాగి మంగళవారం తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో యోగి చంపుతామని బెదిరింపు పోస్టు రావడంతో 'వాయిస్ ఆఫ్ హిందూస్'సంస్థ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రియాజుల్ సోషల్ మీడియా యాక్టివిటీని బయటికి తీయాలని సైబర్ సెల్‌ను ఆదేశించినట్లు ఎస్పీ త్యాగి తెలిపారు. సంఘ వ్యతిరేకశక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

వక్ఫ్ బోర్డు పరిధిలో నుంచి తప్పించండి

జేపీసీకి దావూది బోహ్రా ముస్లింల వినతి

న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లు తమ ప్రత్యేక హోదాను గుర్తించడం లేదు కాబట్టి వక్ఫ్ బోర్డు నుంచి తమను మినహాయించాలని దావూది బోహ్రా ముస్లింలు సంయుక్త పార్లమెంటరీ కమిటీని కోరారు. దావూది బోహ్రాలకు 'అల్-దాయ్ అల్-ముత్లాక్'పేరిట మతపెద్ద ఉంటాడని, తమ మతపరమైన వ్యవహారాల్లో ఆయనే సర్వాధికారి అని బోహ్రా ముస్లింలు జేపీసీ ఎదుట తెలిపారు. తమ మత వ్యవహారాల్లో, ఆస్తులపై మతపెద్దకు కాకుండా వక్ఫ్ బోర్డుకు అధికారమివ్వడం సమంజసం కాదని వాదించారు. దావూది బోహ్రా ముస్లిం తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే జగదాంబికా పాల్ నేతృత్వంలోని జేపీసీ ఎదుట హాజరై తమ వాదనను వినిపించారు. బోహ్రాలు భిన్నమైన సంస్కృతిని, ఆచారవ్యవహారాలను కలిగి ఉంటారని పేర్కొన్నారు. వారి మతవిశ్వాసాలకు వక్ఫ్ బోర్డు ఆధిపత్యం విఘాతమని విన్నవించారు.

భారత్ రైస్ కిలో రూ.34, ఆటా రూ.30

రిటైల్ విక్రయాలు ప్రారంభించిన కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

సాక్షి, న్యూఢిల్లీ: సబ్సిడీపై భారత్ రైస్(బియ్యం), భారత్ ఆట(గోధుమ పిండి) అందించే రిటైల్ విక్రయాల రెండో దశను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మంగళవారం ప్రారంభించారు. భారత్ రైస్ కిలో రూ.34, భారత్ ఆట రూ.30కే ప్రజలకు అందుబాటులో ఉంటాయని మంత్రి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం భారత్ బ్రాండ్ పేరుతో ప్రారంభించిన బియ్యం, పిండి, పప్పుల రిటైల్ అమ్మకం ధరల స్థిరీకరణకు సాయపడిందన్నారు. రెండో దశలో 3.69 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలు, 2.91 లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం అందుబాటులో ఉంచామన్నారు. వీటిని కేంద్రీయ భండార్, నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్(జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య), ఇ-కామర్స్, మొబైల్ వ్యాన్ల ద్వారా 5 కిలోలు, 10 కిలోల సంచుల్లో విక్రయిస్తారని వివరించారు.

పది లక్షల ఉద్యోగాలు

జార్ఖండ్‌లో ఇండియా కూటమి మేనిఫెస్టో

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు ఇండియా కూటమి ఏడు గ్యారెంటీలతో మేనిఫెస్టోను విడుదల చేసింది. అధికారంలోకి వస్తే.. యువతకు 10 లక్షల ఉద్యోగాల కల్పిస్తామని హామీ ఇచ్చింది. అలాగే పేదలకు రూ. 15 లక్షల ఆరోగ్యబీమాను వర్తింపజేస్తామని తెలిపింది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆర్జేడీకి చెందిన జేపీ యాదవ్‌తో కలిసి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ఇండియా కూటమి మేనిఫెస్టోను విడుదల చేశారు. ప్రస్తుతం 26 శాతమున్న ఎస్టీ రిజర్వేషన్లను 28 శాతానికి, ఎస్సీ రిజర్వేషన్లను 10 నుంచి 12 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చింది. అలాగే 14 శాతమున్న ఓబీసీ రిజర్వేషన్లను 27 శాతానికి పెంచుతామని తెలిపింది. 'మేము గ్యారెంటీల గురించి మాట్లాడినపుడల్లా మోదీ తక్షణం మాపై విమర్శలు గుప్పిస్తారు. కానీ వాస్తవమేమింటే కాంగ్రెస్ అన్ని హామీలను అమలులో పెడుతుంది. మోదీ గ్యారెంటీలే ఎప్పటికీ నెరవేరవు'అని ఖర్గే ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఇస్తున్న ఒక వ్యక్తికి 5 కిలోల రేషన్ బియ్యాన్ని 7 కిలోలకు పెంచుతామని ఇండియా కూటమి హామీ ఇచ్చింది. అలాగే సిలిండర్‌కు రూ.450కే అందిస్తామని తెలిపింది. వరి ధాన్యానికి రూ. 3,200 మద్దతు ధర (ప్రస్తుతం రూ. 2,400) ఇచ్చి సేకరిస్తామని హామీ ఇచ్చింది.

గాజాలో 30 మంది మృత్యువాత

డెయిర్ అల్-బలాహ్/జెరుసలేం: గాజా ప్రాంతంపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం రాత్రి నుంచి జరుపుతున్న దాడుల్లో కనీసం 30 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. గాజాలోని ఉత్తర ప్రాంత పట్టణం బెయిట్ లహియాపై సోమవారం రాత్రి జరిగిన దాడిలో 8 మంది మహిళలు, ఆరుగురు చిన్నారులు సహా మొత్తం 20 మంది చనిపోయారు. మంగళవారం ఉదయం టుఫా, జువైదా ప్రాంతాలపై జరిగిన దాడుల్లో నలుగురు చిన్నారులు, ఇద్దరు మహిళలు సహా 10 మంది మృతి చెందారని ఆరోగ్య విభాగం తెలిపింది. ఈ ఘటనలపై ఇజ్రాయెల్ ఆర్మీ స్పందించలేదు.

సకలోత్తర పథేశ్వర అనే బిరుదు కలిగిన రాజు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

గుప్తానంతర యుగం (క్రీ.శ. 6వ శతాబ్దం - 8వ శతాబ్దం)

గుప్తుల అనంతరం భారతదేశం మరోసారి అనేక చిన్న చిన్న రాజ్యాలుగా చీలిపోయింది. ఈ రాజకీయ అనైక్యత ఉత్తర భారతంలో తీవ్రంగా ఉంది. ఈ కాలంలో ఉత్తరాదిలో... వల్లభి కేంద్రంగా-మైత్రకులు, గౌహతి కేంద్రం గా (కామరూప రాజ్యం)-వర్మన్ వంశం, పాటలీపుత్రం కేంద్రంగా-కడపటి గుప్తులు పాలించారు. అలాగే బెంగాల్ కేంద్రంగా - గౌడ వంశం, కనౌజ్ కేంద్రంగా - మౌఖరీలు, ఒడిశా కేంద్రంగా-మాతరులు, మాన వంశం, స్థానేశ్వర్ కేంద్రంగా- పుష్యభూతులు పాలన కొన సాగించారు. అయితే పుష్యభూతులు క్రమంగా ఈ రాజ్యాలన్నింటినీ జయించి మొత్తం ఉత్తర భారతదేశాన్ని రాజకీయంగా ఏకంచేసి పరిపాలించారు.

ఈ కాలంలో దక్షిణ భారతదేశాన్ని పశ్చిమ గాంగులు, బాదామి చాళుక్యులు, పల్లవులు, పాండ్యులు మొదలైన రాజవంశాలు పాలిస్తు న్నాయి. ఈ వంశాలు దక్షిణ భారతదేశంలో వాస్తుశిల్ప కళలకు అమూల్యమైన సేవలనందించాయి. గుప్తుల అనంతర యుగంలో ఉత్తరా దిని పాలించిన రాజ వంశాలన్నింటిలో అతి గొప్ప రాజ వంశం పుష్యభూతి వంశం.

పుష్యభూతి వంశపాలన – హర్షవర్ధనుడు

పుష్యభూతి: ఇతడు తనపేరుతో పుష్యభూతి వంశాన్ని స్థాపించాడు. స్థానేశ్వర్ రాజధానిగా, గుప్తుల సామంతుడిగా ఉంటూ పరిపాలించాడు.

ప్రభాకర వర్ధనుడు: పుష్యభూతి వంశంలో తొలి స్వతంత్ర రాజు. తన స్వతంత్ర పాలనకు గుర్తు గా ఇతడు రాజాధిరాజ అనే బిరుదును ధరించాడు. ప్రభాకరుడి భార్యపేరు యశోమతి. ప్రభాకర వర్ధనుడు క్రీ.శ. 605లో మరణించగా అతడి భార్య సతీ సహగమనాన్ని ఆచరించిందని బాణుడి గ్రంథాల వల్ల తెలుస్తోంది.

రాజ్య వర్ధనుడు: ప్రభాకర వర్ధనుడు తన జ్యేష్ఠ పుత్రుడు రాజ్య వర్ధనుడికి బదులు రెండో కుమారుడు హర్షుడిని రాజుగా చేయాలని సంకల్పించాడు. ఇందుకు హర్షుడు సమ్మతించలేదు. దీంతో రాజ్యవర్ధనుడు రాజయ్యాడు. ఇతడి కాలంలో కనౌజ్‌ను గ్రహవర్మ అనే మౌకరీరాజు పాలించేవాడు. ఇతడు రాజ్య వర్ధనుడి సోదరి రాజ్యశ్రీ భర్త. మగధను, మాళ్వాను పాలించే దేవగుప్తుడు, గౌడ దేశాన్ని పాలించే శశాంకుడితో కలిసి.. గ్రహవర్మను చంపి కనౌజ్‌ను ఆక్రమించాడు. దీంతో రాజ్యవర్ధనుడు దేవగుప్తుడిని చంపి కనౌజ్‌ను ఆక్రమించాడు. కానీ శశాంకుడు ఇతడిని మోసపూరితంగా చంపాడు. దీంతో హర్షుడు రాజ్యానికి వచ్చాడు.

హర్షవర్ధనుడు: ఇతడు గౌడ శశాంకుడి నుంచి కనౌజ్‌ను విడిపించడమే కాకుండా.. రాజధానిని స్థానేశ్వరం నుంచి కనౌజ్‌కు మార్చాడు. శశాంకుడి అనంతరం గౌడ దేశాన్ని కూడా ఆక్రమించాడు.

ఆ తర్వాత తన దిగ్విజయ యాత్రలు ప్రారంభించి..సింధు, వల్లభి, గుజరాత్, సౌ రాష్ట్ర మొదలైన ప్రాంతాల్ని జయించాడు. అయితే లత, మాళ్వా ప్రాంతాలపై ఆధిపత్యం విషయంలో హర్షుడికి.. బాదామి చాళుక్యరాజు రెండో పులకేశితో ఘర్షణ అనివార్యమైంది. హర్షుడు.. పులకేశితో జరిపే యుద్ధానికి చేసిన సన్నాహాల గురించి బాణభట్టుడు తన రచనల్లో వివరంగా తెలిపాడు. వీరి మధ్య జరిగిన యుద్ధం గురించిన ప్రస్తావన రెండో పులకేశికి చెందిన ఐహోల్ ప్రశస్తిలో కనిపిస్తుంది. అయితే ఈ యుద్ధంలో హర్షుడి విజయం సందిగ్ధకరం అని భావించాలి. కానీ పులకేశి వారసులు ఈ యుద్ధంలో పులకేశి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. అయితే చరిత్రకారులు వీరి మధ్య స్నేహపూర్వక ఒప్పందం జరిగినట్లు భావిస్తున్నారు. హర్షుడు సాధించిన సైనిక విజయాల సమాచారం అతడు జారీ చేసిన పలు శాసనాల ద్వారా లభిస్తోంది. హర్షుడు బన్సిఖేర, మధుబన్, సోనేపట్ మొదలైన శాసనాలను జారీ చేశాడు. హర్షుడు మరణించే నాటికి ఇతడి రాజ్యంలో కాశ్మీర్ తప్ప మిగిలిన ఉత్తర భారతదేశమంతా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అంతర్భాగంగా ఉండేది. అందుకే హర్షుడిని ఉత్తర భారతదేశాన్ని పాలించిన చివరి గొప్ప హిందూ రాజుగా పరిగణిస్తారు.

హర్షుడి పాలనా విధానం: ప్రాచీన భారతదేశ చరిత్రలో చివరిసారిగా ఒక పటిష్టమైన పాలనాపద్ధతిని ఏర్పాటు చేసిన రాజు హర్షుడు. ఇతడి పాలనా సమర్థత వల్ల గుప్తుల అనంతరం ఉత్తర భారతంలో దాదాపు 40 ఏళ్ల పాటు శాంతియుత వాతావరణం ఏర్పడింది. కనౌజ్‌కు దగ్గరగా ఉన్న ప్రాంతాలను ఇతడు ప్రత్యక్షంగా పాలించినప్పటికీ.. పరోక్ష పాలనలో మాత్రం చాలా ప్రాంతాలుండేవి. హర్షుడి కాలంలో వచ్చిన ప్రధాన మార్పు భూస్వామ్య వ్యవస్థ ఏర్పడడం. దీంతోపాటు సామంత వ్యవస్థ కూడా పెరిగిపోయింది. ఒక రాజుకున్న సామంతుల సంఖ్యను బట్టి అతడి గొప్పదనాన్ని అంచనా వేయడం ప్రారంభమైంది. హర్షుడు తన సామ్రాజ్యాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం అనేక రాష్ట్రాలుగా విభజించాడు. వీటిని భుక్తి అని పిలిచేవారు. రాష్ట్రాలను విషయ అనే పేరుతో జిల్లాలుగా విభజించారు. జిల్లాలను పాథక అనే మరో విభాగంగా విభజించారు. పాలనలో చిట్టచివరి విభాగం గ్రామం.



పరిపాలనలో రాజుకు సహాయంగా మంత్రి పరిషత్ ఉండేది. హర్షుడి అధికారుల్లో ముఖ్యమైన వారు మంత్రి, సేనాపతి, మహాసామంత, కుమారామాత్య, ఉపారిక, విషయపతి, రాజస్థానీయ తదితరులు. ఉన్నతాధికారులందరికీ వేతనాలను భూముల రూపంలోనే చెల్లించే వారు. కేవలం కింది స్థాయి సైనికులకే జీతాలను నగదు రూపంలో చెల్లించేవారు. అందుకే ఈ కాలంలో అతి తక్కువ సంఖ్యలో నాణేలు కనిపిస్తాయి. నాణేల కొరతకు మరో కారణం ఈ కాలంలో వ్యాపార వాణిజ్యాలు మరింతగా క్షీణించడమే. ప్రజలపై పన్నుల భారం తక్కువగానే ఉండేది. రాజ్యానికి ప్రధాన ఆదాయ వనరు భూమిశిస్తు. ఇది పంటలో 1/6వ వంతుగా ఉండేది. ఇంకా 'తుల్యమేయ' అనే అమ్మకం పన్ను కూడా విధించారు.

హర్షుడి సాంస్కృతిక సేవ: హర్షుడు స్వయంగా మూడు నాటకాలను రచించినట్లు ప్రతీతి. అవి నాగానందం, రత్నావళి, ప్రియదర్శిక. హర్షుడి ఆస్థాన కవి బాణుడు మూడు కావ్యాలను రచించాడు. అవి హర్షచరిత్ర, కాదంబరి, పార్వతీ పరిణయం. హర్షుడి ఆస్థానంలోని మరో కవి మయూరుడు.. సూర్యశతకం అనే గ్రంథాన్ని రచించాడు. హర్షుడు ప్రతి ఐదేళ్లకోసారి ప్రయాగ వద్ద మహామోక్ష పరిషత్‌ను నిర్వహించేవాడు. ఈ సమావేశంలో తన సంపదనంతా దాన, ధర్మాలకు వెచ్చించేవాడని హ్యుయాన్‌త్సాంగ్ తెలిపాడు. క్రీ.శ. 643లో కనౌజ్‌లో హర్షుడు ఒక సర్వమత సమ్మేళనాన్ని హ్యుయాన్‌త్సాంగ్ అధ్యక్షతన నిర్వహించాడు. హర్షుడు మొదట శైవ మతాన్ని ఆదరించినప్పటికీ తర్వాత కాలంలో బౌద్ధాన్ని స్వీకరించాడు. ప్రతీ సంవత్సరం రాజధానిలో బౌద్ధమత సమావేశాలు నిర్వహించేవాడు. నలంద విశ్వవిద్యాలయానికి 100 గ్రామాలను దానంగా ఇచ్చాడు. అందుకే ఇతని కాలంలో నలంద బౌద్ధ విశ్వవిద్యాలయం చాలా ఉన్నత దశలో ఉందని హ్యుయాన్‌త్సాంగ్ పేర్కొన్నాడు. 10వేల మంది విద్యార్థులు, 1,500 మంది గురువులతో ఈ విశ్వవిద్యాలయం గొప్పగా విలసిల్లిందని అతడు తెలిపాడు. హర్షుడు తాను కాశ్మీర్‌ను సందర్శించినప్పుడు అక్కడినుంచి బుద్ధుడి దంతపు అవశేషాన్ని కనౌజ్‌కు తెచ్చి దానిపై బౌద్ధస్థూపాన్ని నిర్మించాడు. ప్రాచీన భారతదేశ చరిత్రలో మహాయాన బౌద్ధాన్ని ఆదరించిన చివరి చక్రవర్తిగా హర్షుడిని పేర్కొనవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. హ్యుయాన్‌త్సాంగ్ ప్రకారం హర్షుడు చాతుర్వర్ణాల్లోని ఏ వర్ణానికి చెందినవాడు?
   ఎ) బ్రాహ్మణ బి) క్షత్రియ
   సి) వైశ్య డి) శూద్ర
2. స్థానేశ్వర్ నుంచి కనౌజ్‌కు రాజధానిని మార్చిన ఉత్తర భారతదేశ రాజు?
   ఎ) నరవర్ధన బి) ఆదిత్య వర్ధన
   సి) ప్రభాకర వర్ధన డి) హర్ష వర్ధన
3. హర్షుడి చేతిలో ఓడిన వల్లభి పాలకుడు?
   ఎ) రెండో ధ్రువసేనుడు
   బి) రెండో ప్రవరసేనుడు
   సి) మూడో ధ్రువసేనుడు
   డి) మూడో ప్రవరసేనుడు
4. హర్షుడి దిగ్విజయ యాత్రలకు నాయకత్వం వహించిన సేనాపతి ఎవరు?
   ఎ) దండి బి) భండి
   సి) వ్యాఘ్రకేతు డి) నిగ్రాత
5. సకలోత్తర పథేశ్వర అనే బిరుదు కలిగిన రాజు?
   ఎ) గ్రహవర్మ బి) శశాంక
   సి) హర్ష డి) భాస్కరవర్మ
6. భారతదేశ చరిత్రలో తొలిసారిగా అధికా రులకు భూదానాలు చేసిన రాజవంశం?
   ఎ) శాతవాహనులు బి) గుప్తులు
   సి) ఇక్ష్వాకులు డి) పుష్యభూతులు
7. ఏ వర్ణాన్ని హ్యుయాన్‌త్సాంగ్ వ్యవసాయదారులుగా పేర్కొన్నాడు?
   ఎ) బ్రాహ్మణులు బి) క్షత్రియులు
   సి) వైశ్యులు డి) శూద్రులు
8. బాణుడి ప్రకారం హర్షుడి సమాజంలో సర్వసాధారణమైపోయిన దురాచారం?
   ఎ) సతీ సహగమనం
   బి) వరకట్నం
   సి) కన్యాశుల్కం
   డి) వితంతు వివాహాల నిషేధం
9. హర్షుడు ఆదరించిన మతం?
   ఎ) హిందూ మతం బి) బౌద్ధ మతం
   సి) జైన మతం డి) వైష్ణవ మతం
10. హర్షుడి కాలంలో అధికంగా వ్యాప్తిలో ఉన్న మతం?
    ఎ) వైష్ణవం బి) బౌద్ధం
    సి) శైవం డి) జైనం
11. ఉత్తర భారతదేశాన్ని పాలించిన చివరి గొప్ప హిందూ చక్రవర్తిగా ఎవరిని పేర్కొంటారు?
    ఎ) సముద్రగుప్తుడు బి) హర్షవర్ధనుడు
    సి) రెండో చంద్రగుప్తుడు డి) యశోధర్ముడు
12. రాజపుత్ర, శీలాదిత్య అనే బిరుదులు ధరిం చిన రాజు?
    ఎ) రెండో పులకేశి
    బి) మొదటి మహేంద్రవర్మ
    సి) హర్షుడు
    డి) రెండో నరసింహవర్మ
13. హర్షుడి కాలంలోని పాలనా విభాగాల్లో సరైన క్రమం?
    ఎ) భుక్తి – విషయ – పాథక – గ్రామ
    బి) విషయ – గ్రామ – భుక్తి – పాథక
    సి) పాథక – భుక్తి – విషయ – గ్రామ
    డి) గ్రామ – భుక్తి – విషయ – పాథక
14. హర్షుడి కాలంలో చాత-భాత అంటే?
    ఎ) పన్నులు
    బి) సైనికులు
    సి) కులాలు డి) భూదానాలు
15. హర్షుడు ఏ ప్రాంతంలో సర్వమత సమ్మేళనం నిర్వహించాడు?
    ఎ) ప్రయాగ బి) పాటలీపుత్రం
    సి) కనౌజ్ డి) వల్లభి

సమాధానాలు

1) సి	2) డి	3) ఎ	4) బి	5) సి
6) డి	7) డి	8) బి	9) బి	10) సి
11) బి	12)సి	13)ఎ	14) బి	15) సి

విద్య, ఉద్యోగ సమాచారం

టీటీడీ-పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్‌లో వివిధ ఉద్యోగాలు

తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో పనిచేసే శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్‌లో ఒప్పంద ప్రాతిపదికన వైద్య పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 02.
- » పోస్టుల వివరాలు: పీడియాట్రిక్ కార్డియాక్ అనెస్తీటిస్ట్-1,పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్-2
- » అర్హత: ఎంబీబీఎస్/ఎండీ/డీఎన్‌బీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. హిందూ మతానికి చెందిన అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుంది.
- » వయసు: 42 ఏళ్ల మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
- » వేతనం: నెలకు రూ.1,01,500 నుంచి రూ.1,67,400.
- » దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డైరెక్టర్, శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్, బీఐఆర్‌ఆర్‌డీ దగ్గర, తిరుపతి చిరునామకు పంపించాలి.
- » దరఖాస్తులకు చివరితేది: 15.11.2024.
- » వెబ్‌సైట్: https://www.tirumala.org

ఓయూ దూరవిద్యలో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ, ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్య విధానంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.



- » కోర్సులు: ఎంబీఏ, ఎంసీఏ. కోర్సు వ్యవధి: రెండేళ్లు.
- » అర్హత: ఎంబీఏ కోర్సుకు ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. ఎంసీఏ కోర్సుకు గణితం సబ్జెక్టుగా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష ఆధారంగా సీటు కేటాయిస్తారు. టీఎస్/ఏపీ ఐసెట్-2024 లో అర్హత సాధించిన అభ్యర్థులు ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో నేరుగా ప్రవేశం పొందవచ్చు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 05.11.2024.
- » రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది: 08.11.2024.
- » ప్రవేశ పరీక్ష తేది: 09.11.2024.
- » వెబ్‌సైట్: http://www.oucde.net

చర్చలో ఉండాల్సిన ప్రధానాంశాలేవి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సాంఘిక శాస్త్రం

బోధనా పద్ధతులు

1. కుదించిన బోధనా ఉద్యమం అని దేనికి పేరు?
   1) పరిహార బోధన 2) సూక్ష్మబోధన
   3) స్థూల బోధన 4) జట్టు బోధన
2. డేవిడ్ వార్విక్ ప్రకారం జట్టు బోధనకు అవసరమైన నాలుగు ఉపగమాల్లో రెండోది?
   1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం
   2) సంచయన క్రమానుగతం
   3) ఏకకేంద్ర ఉపగమం
   4) సమవర్తిత విషయాలు
3. విద్యార్థి ఒక దినపత్రిక నుంచి జూన్‌లో కురిసిన వర్షపాతానికి సంబంధించిన వివరాలను సేకరించాడు. వాటిని సుదీర్ఘంగా పరిశీలించి యథార్థాలను చెప్పగల్గడం అనేది ఏ రకమైన దృక్పథం?
   1) నిగమనాత్మక 2) సంశ్లేషణాత్మక
   3) విశ్లేషణాత్మక 4) ఆగమనాత్మక
4. 'గోల్కొండ కోట' అనే మూలాధారం ఏ రకానికి సంబంధించింది?
   1) వాఙ్మయ 2) సాంప్రదాయ
   3) పురావస్తు 4) శాసన
5. 'బిల్లు చట్టంగా మారడం' అనే పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉత్తమ పద్ధతి?
   1) పానెల్ చర్చ 2) సింపోజియం
   3) స్వయం అధ్యయనం
   4) అనుకరణ పార్లమెంట్
6. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
   1) చర్చ 2) సంశ్లేషణ
   3) విశ్లేషణ 4) వాగ్వాదం
7. ప్రత్యక్ష, పరోక్ష సమాచారాన్ని పొందడానికి అవకాశమిచ్చే దృక్పథాలు వరుసగా?
   1) ఆగమన, నిగమన దృక్పథాలు
   2) ఆగమన, విశ్లేషణ దృక్పథాలు
   3) నిగమన, సంశ్లేషణ దృక్పథాలు
   4) నిగమన, ఆగమన దృక్పథాలు
8. సమస్యా పరిష్కారంలో సమస్యను నిర్వ చించిన తర్వాత చేయాల్సిన పని?
   1) సమస్యను విశ్లేషించి పరిష్కారం కనుగొనడం
   2) సమాచారాన్ని సేకరించి, సమస్యను విశ్లేషించడం
   3) సమాచారాన్ని సేకరించి, అన్వయించడం
   4) సమస్యను విశ్లేషించి, సమాచారాన్ని సేకరించడం
9. 'బ్రౌడి' ప్రకారం బోధనా పద్ధతి అంటే?
   1) కృత్యాలను తరగతి గదిలో నిర్వహించే విధానం
   2) సామాన్యంగా పిలిచే వరస క్రమ చర్యల లాంఛన స్వరూపం
   3) అభ్యసన ప్రక్రియను నిర్దేశించడానికి ఉపాధ్యాయుడు అనుసరించే విధానం
   4) విద్యార్థులకు విజ్ఞానాన్ని అందజేయడానికి ఉపాధ్యాయుడు అనుసరించే మార్గం
10. విషయ సామగ్రి సేకరణలో ద్వితీయ ఆకారానికి చెందినవి?
    1) దస్తావేజులు 2) పాఠ్యపుస్తకాలు
    3) పత్రికలు 4) నాణేలు
11. విద్యార్థులతో పంచదార ఫ్యాక్టరీని సందర్శింపజేయడం అనే ప్రక్రియ ఏ బోధనా పద్ధతిలో ఒక భాగం?
    1) సమస్యా పరిష్కార పద్ధతి
    2) సాంఘిక ఉద్గార పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
12. కిందివాటిలో 'నాటకీకరణ' ద్వారా బోధించడానికి అత్యంత అనువైన పాఠ్యాంశం ఏది?
    1) వేములవాడ 2) ఆకాశవాణి
    3) మన దేశం 4) ఉత్తరాల బట్వాడ
13. 'ప్రాజెక్టు పద్ధతి' సోపానాల్లో మూడోది?
    1) ప్రాజెక్టు నిర్వహణ
    2) ప్రాజెక్టు ప్రణాళికా రచన
    3) నమోదు చేయడం
    4) ప్రాజెక్టు ఎంపిక, ఉద్దేశ వివరణ
14. ఏ పాఠాన్ని బోధించడానికి పరిసరాన్ని ఒక ఉపగమంగా ఉపయోగించవచ్చు?
    1) సేవాసంస్థలు 2) శీతోష్ణస్థితి
    3) ఆర్యుల నాగరికత
    4) హక్కులు బాధ్యతలు
15. 'రామాయణం' ఏ రకానికి చెందిన ఆధారం?
    1) ద్వితీయ 2) ప్రధాన
    3) తృతీయ 4) చతుర్థ
16. జట్టు బోధన రూపకల్పనకు డేవిడ్ వార్విక్ సూచించిన ఉపగమాలేవి?
    1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, పరిసర ఉపగమం, క్రమానుగత ఉపగమం, సమవర్తిత విషయాలు
    2) యూనిట్ ఉపగమం, వర్తులాకార ఉపగమం, క్రమానుగత ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం
    3) వర్తులాకార ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం, సమవర్తిత విషయాలు, క్రమానుగత ఉపగమం
    4) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, సమవర్తిత విషయాలు, సంచయన క్రమానుగతం, ఏకకేంద్ర ఉపగమం
17. సూక్ష్మ బోధనా ప్రక్రియలోని సోపానాల క్రమం ?
    1) పరిపుష్టి, నియోజనం, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
    2) నియోజనం, పరిపుష్టి, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
    3) పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి, నియోజనం, బోధించడం, పరి పుష్టి
    4) నియోజనం, బోధించడం, పరిపుష్టి, పునఃయోజన, పునఃబోధన, పునః పరిపుష్టి
18. 'బెల్లార్డ్' అభిప్రాయంలో ప్రాజెక్టు పద్ధతి అంటే?
    1) పాఠశాల వాతావరణంలోకి తీసుకు వచ్చిన జీవితాశయమే ప్రాజెక్టు
    2) సహజ పరిస్థితిలో ఒక సమస్యాత్మక క్రియను జయప్రదంగా పూర్తిచేయడమే ప్రాజెక్టు
    3) నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు
    4) సాంఘిక పరిసరాల్లో, హృదయ పూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా కొనసాగే కార్యకలాపమే ప్రాజెక్టు
19. చర్చలో ఉండాల్సిన ప్రధానాంశాలేవి?
    1) సమస్య, విషయం, గ్రూపు
    2) సమస్య, విషయం
    3) నాయకుడు, గ్రూపు, విషయం
    4) సమస్య, విషయం, నాయకుడు, గ్రూపు
20. రాష్ట్ర మంత్రిమండలి బాధ్యతలను బోధించడానికి స్థానిక గ్రామ పంచాయతీ పనిచేసే విధానం గురించి చర్చించడం అనేది ఏ బోధనా సూత్రానికి సంబంధించింది?
    1) తెలిసినదాని నుంచి తెలియనిదానికి
    2) సంక్లిష్టత నుంచి సరళతకు
    3) అమూర్తం నుంచి మూర్తానికి
    4) భాగాల నుంచి మొత్తానికి
21. ట్రాఫిక్ ఐలాండ్ అనే పాఠాన్ని బోధించడానికి ఉత్తమ యుక్తి?
    1) చర్చ 2) క్షేత్ర పర్యటన
    3) పాత్రాభినయం 4) నాటకీకరణ
22. సమస్యా పరిష్కార పద్ధతిలో ఉన్న సోపా నాల్లో రెండోది?
    1) సమస్య అధ్యయనం
    2) సమాచార సేకరణ
    3) సమస్యను గుర్తించడం
    4) సమస్య పరిష్కారం
23. 'నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు' అని నిర్వచించిన వ్యక్తి?
    1) స్టీవెన్‌సన్ 2) కిల్ పాట్రిక్
    3) అండర్‌సన్ 4) బైనింగ్ & బైనింగ్
24. 'అయిదో తరగతి పరిసరాల విజ్ఞానం' అనే పాఠ్యపుస్తకం ఏ ఆకారానికి ఉదాహరణ?
    1) ద్వితీయ 2) ప్రధాన
    3) తృతీయ 4) చతుర్థ
25. శివాజీ జీవిత చరిత్రను బోధించడానికి అనువైన పద్ధతి?
    1) అంశ పద్ధతి 2) కథనా పద్ధతి
    3) వివరణ 4) సంభాషణ
26. స్వయంగా విద్యార్థులు పాల్గొనడానికి అవకాశం లేని పద్ధతి?
    1) ఉపన్యాస 2) చర్చా
    3) అంశాల పద్ధతి 4) జీవిత చరిత్ర
27. సాంఘికశాస్త్ర బోధనా పద్ధతుల్లో విద్యావేత్తలు దేన్ని ఉత్తమమైందిగా భావిస్తారు?
    1) ప్రణాళికా పద్ధతి 2) సమస్యా పద్ధతి
    3) ప్రశ్నోత్తర పద్ధతి 4) చర్చా పద్ధతి
28. బోధనా పద్ధతుల్లో అతి ప్రాచీనమైంది?
    1) లెక్చరు పద్ధతి 2) చర్చా పద్ధతి
    3) సంఘీకృత ఉద్గార
    4) సమస్యా పద్ధతి
29. తక్కువ కాలంలో ఎక్కువ విషయాలను బోధించడానికి అనువైన పద్ధతి?
    1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) సంఘీకృత ఉద్గార
    4) వనరుల పద్ధతి
30. విద్యార్థులకు స్వానుభవం ద్వారా విషయ జ్ఞాన సంపాదనకు తోడ్పడేది?
    1) సమస్యా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
31. బోధించిన విషయాలను తక్కువ సమ యంలో సమీక్షించడానికి ఉపయోగపడే బోధనా పద్ధతి?
    1) ఉపన్యాస పద్ధతి 2) వివరణ పద్ధతి
    3) కథనా పద్ధతి 4) ప్రాకల్పనా పద్ధతి
32. బోధనలో ఉపన్యాస పద్ధతికి దేన్ని మేళవిస్తే బోధన మరింత మెరుగ్గా ఉంటుంది?
    1) వివరణ పద్ధతి 2) ప్రదర్శనా పద్ధతి
    3) సమస్యా పద్ధతి 4) వనరుల పద్ధతి
33. విద్యార్థికి ప్రాముఖ్యంలేని బోధనా పద్ధతి?
    1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) సమస్యా పద్ధతి 4) ప్రాకల్పనా పద్ధతి
34. సాంఘికశాస్త్ర బోధనలో విద్యార్థులకు కలి గే సంశయాలను తీరుస్తూ పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉపయోగించే పద్ధతి?
    1) ఉపన్యాస 2) పర్యవేక్షణ
    3) చర్చాపద్ధతి 4) సమస్యా పద్ధతి
35. ఉపాధ్యాయుని పర్యవేక్షణలో విద్యార్థులందరూ శ్రమించి నేర్చుకోవడాన్ని ఏ బోధనా పద్ధతి అనవచ్చు?
    1) ప్రాజెక్టు 2) వనరుల పద్ధతి
    3) సంఘీకృత 4) పర్యవేక్షణాధ్యయన
36. రాజ్‌ఘాట్ అనేది ఏ రకమైన ఆధారం?
    1) తృతీయ 2) చతుర్థ
    3) ప్రాథమిక 4) ద్వితీయ
37. రెండు వరుస పీరియడ్ల పథకంలో బిల్ ఐ.సింప్సన్ ప్రకారం 'నియోజిత అధ్యయనం' అనే కార్యకలాపానికి కేటాయించిన వ్యవధి?
    1) 35 నిమిషాలు 2) 25 నిమిషాలు
    3) 20 నిమిషాలు 4) 30 నిమిషాలు
38. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
    1) వాగ్వాదం 2) చర్చ
    3) సంశ్లేషణ 4) విశ్లేషణ
39. ఏ బోధనా పద్ధతితో 'మోడరేటర్' ఆవశ్యకత ఉంది?
    1) జట్టుబోధన 2) సమస్యా పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
40. 'జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రం ఆధారంగా రూపొందించిన పద్ధతి?
    1) జట్టు బోధన 2) చర్చ
    3) సమస్యా పరిష్కారం 4) ప్రాజెక్టు
41. జట్టు బోధన రూపకల్పనలో నాలుగు ఉపగమాలను సూచించినవారు?
    1) కిల్ పాట్రిక్ 2) మాక్స్‌వెల్
    3) కిల్లర్ 4) డెవిడ్ వార్విక్
42. ప్రాజెక్టుల రకాలను సూచించిన వారెవరు?
    1) జాన్ డ్యూయి 2) కిల్ పాట్రిక్
    3) బైనింగ్ 4) బెల్లార్డ్
43. ఒక అంశానికి ఉన్న పూర్వచరిత్ర చెప్పడానికి ఏ పద్ధతి ప్రయోజనకరంగా ఉంటుంది?
    1) ప్రాజెక్టు
    2) సమస్యా పరిష్కార
    3) ఉపన్యాస 4) ప్రాకల్పనా
44. ఉపన్యాస పద్ధతిని ఎప్పుడు ఉపయో గించాలి?
    1) సింహావలోకనం చేయడానికి
    2) సారాంశాన్ని తయారుచేసి పాఠ్యాంశాన్ని సమీక్షించడానికి
    3) అభిమానులను ఉద్దేపించడానికి
    4) పైవన్నీ
45. విద్యార్థులు 'జీవించడానికి నేర్చుకోకుండా జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రంపై ఆధారపడే పద్ధతి ఏది?
    1) ప్రక్షేపణ పద్ధతి 2) సమస్యా పద్ధతి
    3) అన్వేషణా పద్ధతి
    4) మూలాధార పద్ధతి
46. ప్రాకల్పనా పద్ధతిలోని ప్రధాన సూత్రాల్లో చివరిది?
    1) స్వేచ్ఛా సూత్రం
    2) వాస్తవికతా సూత్రం
    3) ఉద్దేశ సూత్రం
    4) ఉపయుక్తతా సూత్రం



సమాధానాలు

1) 2	2) 4	3) 4	4) 3	5) 4
6) 1	7) 1	8) 2	9) 2	10) 3
11) 3	12) 4	13) 2	14) 2	15) 1
16) 4	17) 4	18) 1	19) 4	20) 1
21) 2	22) 2	23) 4	24) 2	25) 2
26) 1	27) 4	28) 1	29) 2	30) 3
31) 1	32) 2	33) 2	34) 2	35) 1
36) 3	37) 1	38) 2	39) 4	40) 4
41) 4	42) 2	43) 3	44) 4	45) 1
46) 4				

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ-మెయిల్ sakshieducation@gmail.com

భారత రాజ్యాంగ ప్రవేశికను ఎన్నిసార్లు సవరించారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగ పరిణామ క్రమం

1. భారత ప్రభుత్వ చట్టం- 1935 ప్రకారం కార్య నిర్వహణ అధికారం ఎవరికి ఉంది?
   1) కౌన్సిల్‌లోని గవర్నర్ జనరల్
   2) సమాఖ్య శాసనసభ
   3) ఇంగ్లండ్ పార్లమెంట్ 4) బ్రిటిష్ రాణి/ రాజు
2. లార్డ్ లిన్‌లిత్‌గో ప్రతిపాదనలకు మరో పేరు ఏమిటి?
   1) సెప్టెంబర్ ప్రతిపాదనలు – 1940
   2) ఆగస్టు ప్రతిపాదనలు – 1940
   3) జూలై ప్రతిపాదనలు – 1940
   4) ఏదీకాదు
3. సర్ స్టాఫర్డ్ క్రిప్స్ భారతదేశానికి ఏ సంవత్సరంలో వచ్చాడు?
   1) 1942 ఆగస్టు 2) 1942 మార్చి
   3) 1942 అక్టోబర్ 4) 1942 డిసెంబర్
4. సి.ఆర్. ఫార్ములా- 1944 కిందివాటిలో ఏ అంశానికి సంబంధించింది?
   1) మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించడం
   2) భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు
   3) ప్రజాభిప్రాయం ద్వారా దేశ విభజన చేయడం
   4) మహిళలకు ప్రత్యేక నియోజక వర్గాలు
5. వైస్రాయ్ లార్డ్ వేవెల్.. సిమ్లాలో ఏ సంవత్సరంలో సమావేశాన్ని నిర్వహించాడు?
   1) 1946 జూలై 2) 1945 జూలై
   3) 1944 జూలై 4) 1947 జూలై
6. 1935 భారత ప్రభుత్వ చట్టానికి సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టారు
   బి) రాష్ట్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు
   సి) కేంద్ర, రాష్ట్రాల మధ్య సమాఖ్య వివాదాలను పరిష్కరించడానికి ఫెడరల్ కోర్టును ఏర్పాటు చేశారు
   డి) ఒరిస్సా, సింధూ అనే రెండు కొత్త ప్రావిన్సులను ఏర్పాటు చేశారు
   1) ఎ, బి, సి 2) ఎ, డి
   3) ఎ, సి 4) ఎ, బి, సి, డి
7. కింది వాటిలో 1935 భారత ప్రభుత్వ చట్టంలో లేని అంశం?
   1) ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేశారు
   2) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేశారు
   3) ఈ చట్టం ద్వారా మొదటి సారిగా మహిళలకు ఓటు హక్కు కల్పించారు
   4) భారత రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేశారు
8. 'భారతదేశం గోచరించే భూస్వామ్య వ్యవస్థను దృఢం చేయడానికి బ్రిటిష్ పాలకులు ఆడిన నాటకం' అని సుభాష్ చంద్రబోస్ ఏ చట్టాన్ని అభివర్ణించాడు?
   1) 1947 చట్టం 2) 1919 చట్టం
   3) 1935 చట్టం 4) ఏదీకాదు
9. భారత ప్రభుత్వ చట్టం –1935కు సంబంధించి సరికాని అంశం ఏది?
   1) సమాఖ్య వ్యవస్థ ప్రతిపాదన
   2) ఆర్‌బీఐ ఏర్పాటు
   3) ఫెడరల్ న్యాయస్థానం ఏర్పాటు
   4) సార్వజనీన ఓటు హక్కు
10. జతపరచండి.
    జాబితా-I
    i) పోర్ట్ ఫోలియో పద్ధతి
    ii) సివిల్ సర్వీస్ సులభ్
    iii) మత నియోజక వర్గాలు
    iv) భారత న్యాయ సంస్కరణలు
    జాబితా-II
    a) లార్డ్ కానింగ్ b) కార్న్ వాలీస్
    c) లార్డ్ మింటో d) లార్డ్ మెకాలే
    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-b, ii-c, iii-d, iv-a
    3) i-c, ii-d, iii-b, iv-a
    4) i-d, ii-a, iii-b, iv-c
11. బ్రిటిష్ ప్రధానమంత్రి లార్డ్ క్లెమెంట్ అట్లీ ఏ సంవత్సరంలో భారతదేశానికి కేబినెట్ మిషన్ రాయబారం పంపాడు?
    1) 1946 మార్చి 2) 1945 మార్చి
    3) 1947 మార్చి 4) ఏదీకాదు
12. కేబినెట్ మిషన్ లేదా కేబినెట్ రాయబారంలో సభ్యుడు కాని వ్యక్తి ఎవరు?
    1) పెథరిక్ లారెన్స్ 2) సర్ స్టాఫర్డ్ క్రిప్స్
    3) ఎ.వి. అలెగ్జాండర్ 4) లార్డ్ మౌంట్ బాటెన్
13. కింది కేబినెట్ మిషన్ సిఫారసుల్లో సరైనవి ఏవి?
    ఎ) బ్రిటిష్ పాలిత ప్రాంతాలు, స్వదేశీ సంస్థానాలు కలిసి ఇండియన్ యూనియన్ అనే రాజకీయ వ్యవస్థ ఏర్పడుతుంది
    బి) పాకిస్తాన్ అనే మరో దేశం ఏర్పడే భావన ఆచరణ సాధ్యం కాదు
    సి) రాజ్యాంగాన్ని రూపొందించడానికి ప్రత్యేక రాజ్యాంగ పరిషత్ ఏర్పడుతుంది
    డి) పరిపాలన నిర్వహణకు 14 మంది సభ్యులతో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడుతుంది
    1) ఎ, బి, సి 2) ఎ, డి
    3) ఎ, బి 4) ఎ, బి, సి, డి
14. తాత్కాలిక ప్రభుత్వాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1946 నవంబర్ 1 2) 1947 నవంబర్ 2
    3) 1946 సెప్టెంబర్ 2 4) 1946 అక్టోబర్ 2
15. ఏ ప్రతిపాదనల మేరకు రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు చేశారు?
    1) క్రిప్స్ ప్రతిపాదనలు
    2) లార్డ్ వేవెల్ ప్రతిపాదనలు
    3) కేబినెట్ ప్రతిపాదనలు
    4) మౌంట్ బాటెన్ ప్రతిపాదనలు
16. కింది ఏ ప్రకటనను బ్రిటిషర్లు జారీ చేసిన వాటిలో అత్యున్నతమైందిగా మహాత్మాగాంధీ పేర్కొన్నారు?
    1) క్రిప్స్ ప్రతిపాదన 2) అట్లీ ప్రతిపాదన
    3) వేవెల్ ప్రతిపాదన 4) ఇర్విన్ ప్రతిపాదన
17. 1947 ఫిబ్రవరి 20న ఇంగ్లాండ్ పార్లమెంట్‌లోని కామన్స్ సభలో మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశం నుంచి ఏ సంవత్సరం నాటికి వైదొలుగుతుందని ప్రకటించాడు?
    1) 1947 జూన్ నాటికి 2) 1948 జూన్ నాటికి
    3) 1949 జూన్ నాటికి 4) 1950 జూన్ నాటికి



18. మౌంట్ బాటెన్ ప్రణాళికలోని అంశాలను పరిశీలించండి.
    ఎ) ఇండియన్ యూనియన్ భారత్, పాకిస్తాన్ అనే రెండు రాజ్యాలుగా విభజితమవుతుంది.
    బి) 1948 జూన్‌కు బదులు 1947 ఆగస్టు 15న రెండు దేశాలుగా విభజితమవుతుంది.
    1) ఎ మాత్రమే సరైంది 2) బి మాత్రమే సరైంది
    3) ఎ, బి రెండూ సరైనవి కాదు
    4) ఎ, బి రెండూ సరైనవే
19. భారత స్వాతంత్ర్య చట్టం 1947 ప్రకారం కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) ఈ చట్టం రూపొందించడానికి మూలాధారం మౌంట్ బాటెన్ పథకం
    బి) బ్రిటిష్ పార్లమెంట్‌లో ఈ చట్టాన్ని 1947 జూలై 4న ప్రవేశపెట్టారు
    సి) ఈ చట్టంపై బ్రిటిష్ రాణి 1947 జూలై 18న సంతకం చేసింది
    డి) వైస్రాయ్ పదవి రద్దవుతుంది
    1) ఎ, బి, సి, డి సరైనవి 2) సి, డి మాత్రమే సరైనవి
    3) ఎ, సి మాత్రమే సరైనవి 4) పైవేవీ సరైనవి కాదు
20. కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) లార్డ్ మౌంట్ బాటెన్‌ను మొదటి గవర్నర్ జనరల్‌గా నియమించారు
    బి) స్వతంత్ర భారతదేశానికి తొలి, తుది భారత గవర్నర్ జనరల్ సి. రాజగోపాలాచారి
    1) ఎ, బి సరైనవి కాదు 2) ఎ మాత్రమే సరైంది
    3) ఎ, బి సరైనవి 4) బి సరైంది
21. కింది వాటిలో రాజ్యాంగ మౌలిక లక్షణం కానిది ఏది?
    1) సమాఖ్య 2) లౌకిక వాదం
    3) న్యాయ సమీక్షాధికారం
    4) న్యాయస్థాన క్రియాశీలత
22. స్వరాజ్ అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించింది ఎవరు?
    1) ఎం.ఎన్. రాయ్ 2) బి.ఆర్. అంబేడ్కర్
    3) దాదాబాయి నౌరోజీ 4) నెహ్రూ
23. దేశ విభజన తర్వాత రాజ్యాంగ పరిషత్ సభ్యుల సంఖ్య ఎంత?
    1) 229 2) 299
    3) 389 4) 208
24. కింది వారిలో భారత రాజ్యాంగ పరిషత్‌లో సభ్యుడు కాని వారు ఎవరు?
    1) నీలం సంజీవరెడ్డి 2) కళా వెంకట్రావు
    3) ఎన్.జి. రంగా 4) సుబ్బారావు
25. భారత రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశానికి తాత్కాలిక అధ్యక్షుడిగా సచ్చిదానంద సిన్హాను ప్రతిపాదించిన వ్యక్తి?
    1) బి.ఎన్. రావు 2) ఎస్.ఎన్. ముఖర్జీ
    3) జె.బి. కృపలానీ 4) ఫ్రాంక్ ఆంటోని
26. రాజ్యాంగ పరిషత్‌లో సభ్యురాలిగా పని చేసిన ఏకైక ముస్లిం మహిళ ఎవరు?
    1) బేగం కలీదాజియా 2) బేగం ఎయిజాజ్ రసూల్
    3) నజ్మా హెప్తుల్లా 4) బేగం రెజీనా
27. భారత రాజ్యాంగానికి ప్రవేశిక కీనోట్ అని అన్నది ఎవరు?
    1) ఎర్నెస్ట్ బర్కర్ 2) కె.ఎం. మున్షి
    3) అంబేడ్కర్ 4) రాధాకృష్ణన్
28. జతపరచండి.
    జాబితా-I
    i) పార్లమెంట్ నియమ నిబంధనల కమిటీ
    ii) ప్రాథమిక హక్కుల సలహా కమిటీ
    iii) కేంద్ర రాజ్యాంగ విధాన కమిటీ
    iv) చీఫ్ కమిషనర్ ప్రాంతాలపై కమిటీ
    జాబితా-II
    a) పట్టాభి సీతారామయ్య
    b) జవహర్‌లాల్ నెహ్రూ
    c) సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్
    d) జి.వి. మౌలాంకర్
    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-b, ii-c, iii-d, iv-a
    3) i-d, ii-c, iii-b, iv-a
    4) i-c, ii-d, iii-b, iv-b
29. రాజ్యాంగ పరిషత్‌లో జాతీయ జెండాను ప్రతిపాదించింది ఎవరు?
    1) హెచ్.వి. కామత్ 2) హంసా మెహతా
    3) సరోజినీ నాయుడు 4) బి.ఎన్. రావు
30. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను రాజ్యాంగ రూపశిల్పి, అభినవ మనువుగా అభివర్ణించిందెవరు?
    1) ఒ.పి. గోయల్ 2) ఎం.వి. పైలీ
    3) గ్రాన్ విల్లే ఆస్టిన్ 4) జెన్నింగ్స్
31. కింది వాటిలో సరైనవి ఏవి?
    ఎ) ప్రాథమిక హక్కులు – అమెరికా
    బి) గవర్నర్ నియామకం – కెనడా
    సి) ఉభయసభల సంయుక్త సమావేశం–ఆస్ట్రేలియా
    డి) రాజ్యసభ సభ్యుల ఎన్నిక విధానం – సౌతాఫ్రికా
    1) ఎ, బి 2) సి, డి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
32. రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులను బ్రిటిష్ ఇండియా ప్రావిన్సుల నుంచి ఏ విధంగా ఎన్నుకుంటారు?
    1) ప్రజలతో ప్రత్యక్షంగా
    2) వివిధ రాజకీయ పార్టీలనుంచి నామినేట్ చేస్తారు
    3) వైస్రాయ్ నామినేట్ చేస్తాడు
    4) ప్రావెన్సియల్ అసెంబ్లీల నుంచి ఎన్నుకుంటారు
33. జతపరచండి.
    జాబితా-I
    i) రాజ్యాంగ 4వ షెడ్యూల్
    ii) రాజ్యాంగ 7వ షెడ్యూల్
    iii) రాజ్యాంగ 8వ షెడ్యూల్
    iv) రాజ్యాంగ 9వ షెడ్యూల్
    జాబితా-II
    a) రాజ్యసభ నిర్మాణం
    b) కేంద్ర, రాష్ట్ర సంబంధాలు
    c) రాజ్యాంగం గుర్తించిన భాషలను తెలియజేస్తుంది
    d) భూ సంస్కరణల చట్టాలు
    1) i-b, ii-d, iii-c, iv-a
    2) i-a, ii-b, iii-c, iv-d
    3) i-d, ii-b, iii-c, iv-a
    4) i-a, ii-b, iii-b, iv-c
34. భారతదేశం కామన్‌వెల్త్‌లో సభ్యత్వాన్ని పొందడమనేది దేశ విశాల ప్రయోజనాలను సాధించడం కోసమే అని పేర్కొంది ఎవరు?
    1) ఎస్.కె. థార్ 2) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
    3) ఎ.వి. దక్కర్ 4) బి.ఎన్. రావ్
35. భారత రాజ్యాంగ ప్రవేశికలో సౌభ్రాతృత్వం అనే పదం చేర్చాలని సూచించిన వ్యక్తి ఎవరు?
    1) డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్
    2) డాక్టర్ రాజేంద్రప్రసాద్
    3) బి.ఎన్. రావు 4) కె.ఎం. మున్షి
36. 'సామ్యవాద తరహా సమాజ స్థాపన' తమ లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ ఏ సమావేశంలో ప్రకటించింది?
    1) ఆవడి 2) లక్నో
    3) నాగపూర్ 4) కలకత్తా
37. రాజ్యాంగ ప్రవేశిక భారత రాజ్యాంగానికి మణిహారం, కంఠాభరణం, కొలమానం, గీటురాయి లాంటిదని ఎవరు పేర్కొన్నారు?
    1) జస్టిస్ ఎస్.ఎస్. సిక్రీ 2) మహ్మద్ హిదయతుల్లా
    3) ఠాకుర్ దాస్ భార్గవ 4) కె.ఎం. మున్షి
38. కింది అంశాల్లో భారత పార్లమెంట్ సాధారణ మెజార్టీ ద్వారా సవరించడానికి వీలులేని అంశం ఏది?
    1) నూతన రాష్ట్రాలు ఏర్పాటు చేయడం
    2) రాష్ట్రాల్లో విధాన పరిషత్‌ల ఏర్పాటు
    3) పార్లమెంట్ సభ్యుల జీత భత్యాల్లో మార్పులు
    4) ప్రాథమిక హక్కుల మార్పు
39. రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణపై 1948లో జె.వి.పి. కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఏ సమావేశంలో నిర్ణయించింది?
    1) అలహాబాద్ 2) జైపూర్
    3) నాగపూర్ 4) మద్రాస్
40. నూతన రాష్ట్రాలు ఏర్పాటు చేసినప్పుడు రాజ్యాంగంలో కింది ఏ షెడ్యూల్‌లో మార్పు చేయాలి?
    1) 3 2) 4 3) 5 4) 6
41. ఎవరి నివేదిక ఆధారంగా 1905లో లార్డ్ కర్జన్ బెంగాల్‌ను రెండుగా విభజించాడు?
    1) లార్డ్ హార్డింజ్ 2) రాబర్ట్ క్లైవ్
    3) రాబర్ట్ రిస్లే 4) మౌంట్ బాటెన్
42. కింది వారిలో ఫజల్ అలీ కమిషన్‌లో సభ్యుడిగా ఉన్నవారు ఎవరు?
    1) కె.ఎం. ఫణిక్కర్ 2) పన్నాలాల్
    3) పట్టాభి సీతారామయ్య 4) నెహ్రూ
43. 1950లో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చే నాటికి భారత దేశంలో పార్ట్ (సి) ప్రాంతాలుగా గుర్తించిన ప్రాంతాలు ఏవి?
    ఎ) అజ్మీర్ బి) భోపాల్
    సి) మణిపూర్ డి) త్రిపుర
    1) ఎ, బి 2) సి, డి
    3) ఎ, సి 4) ఎ, బి, సి, డి
44. ఈశాన్య రాష్ట్రాల మండలి ప్రధాన కార్యాలయ కేంద్రం ఎక్కడ ఉంది?
    1) గువాహటి 2) అగర్తలా
    3) దిస్‌పూర్ 4) షిల్లాంగ్
45. భారత పార్లమెంట్ మొదటిసారిగా పౌరసత్వ చట్టాన్ని ఏ సంవత్సరంలో రూపొందించింది?
    1) 1950 2) 1955
    3) 1960 4) 1965
46. కింది అంశాలను పరిశీలించండి. (ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్)
    ఎ) మహారాష్ట్ర – విదర్భ బి) గుజరాత్ – సౌరాష్ట్ర
    సి) జమ్మూకశ్మీర్ – లడఖ్ డి) అస్సాం – బోడోలాండ్
    1) ఎ, బి 2) ఎ మాత్రమే
    3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
47. భారత రాజ్యాంగ ప్రవేశికను ఎన్ని సార్లు సవరించారు?
    1) 1 2) 2
    3) 3 4) సవరించలేదు
48. 1960 తర్వాత ఏర్పడిన కింది రాష్ట్రాలను ఆరోహణ క్రమంలో అమర్చండి.
    ఎ) హర్యానా బి) సిక్కిం
    సి) నాగాలాండ్ డి) మేఘాలయ
    1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి, ఎ
    3) బి, డి, ఎ, సి 4) సి, ఎ, డి, బి

సమాధానాలు

1) 1	2) 2	3) 2	4) 3	5) 2
6) 4	7) 4	8) 3	9) 4	10) 1
11) 1	12) 4	13) 4	14) 3	15) 3
16) 2	17) 2	18) 4	19) 1	20) 3
21) 4	22) 3	23) 2	24) 4	25) 3
26) 2	27) 1	28) 3	29) 2	30) 2
31) 4	32) 4	33) 2	34) 4	35) 1
36) 1	37) 3	38) 4	39) 2	40) 2
41) 3	42) 1	43) 4	44) 1	45) 2
46) 4	47) 1	48) 4		

What is difference in time taken by flights..

BANK EXAMS

REASONING

Model Questions

Directions (Q.No.1-5): Study the following information carefully and answer the questions given below.

Eight persons of the family namely A, B, C, D, E, F, G and H are sitting around a circular table and are discussing about the coming festival for which they wish to bringing sweets to home. Each person wants to bring different-different sweets. Sweets are i.e. Kaju katti, Kalakand, Kheer, Double ka meetha, Rasmalai, Rava laddu, Mysor pak and Obbattu, but not necessarily in the same order. Also some of them facing outside and the remaining facing inside. Not more than two people facing same direction sits adjacent to each other. In family there are three generations. The one who want to bring Kaju katti sits second right of D's husband. D and her husband sit opposite to each other but facing opposite directions. Only one person sits between the one who wants to bring Double ka meetha and the one who wants to bring Kaju katti. A wants to bring Kaju katti and she is the mother of E. F sits immediate left of D's husband and facing outside whereas D's husband facing inside. G wants to bring Mysor pak and sits immediate left of A, who is the wife of B's father and she is also facing outside. G's mother is the wife of E, who sits immediate right of D's husband. C has three children, out of two sons and one daughter. C is grandfather of E's son. E is adjacent to the person, who wants to bring Kaju katti. B, who is the son of D's father, sits second right of F and faces inside. C's son-in-law wants to bring Kalakand. Three persons sit between the one who wants to bring Kaju katti and C, who wants to bring Kheer. D sits fifth right of the one, who wants to bring Rava laddu. C is not facing inside. E's wife wants to bring Obbattu.

1. Which of the following person wants to bring Rava laddu?
   a) A b) D's brother
   c) H d) G's father
   e) Both options (b) and (d)
2. Who is the brother-in-law of B?
   a) The one who wants to bring Rasmalai
   b) The one who wants to bring Kaju katti
   c) The one who sits third right of B
   d) F e) Both (b) and (c)
3. Who sits fourth left of the one, who wants to bring Obbattu?
   a) E b) A c) G
   d) H e) None of these
4. Four of the following five are alike in a certain way and hence they form a group. Which one of the following does not belong to that group?
   a) Obbattu b) Kheer
   c) Kaju katti d) Rasmalai
   e) Double ka meetha
5. Which of the following person sits opposite the one, who wants to bring Kaju katti?
   a) H b) G c) A
   d) E e) None of these

Directions (Q.No. 6-10): Study the following diagram and convert it into other diagrams by implementing the instructions which is given in each step to get next step.

INPUT:

I4	RS2	EK3
AC9		MT7
F8	O5	UL

STEP: 1

Interchange the Alphabets to get step 1 as arrow mention in the above figure.

UL4	O2	F3
MT9		AC7
EK8	RS5	I

STEP: 2

i) If the alphabets contain one consonant and one vowel and the number with them is greater than 3, then subtract 3 from the given number.

ii) If the alphabets are two consonant and the number with them is greater than 5, then change the letters with the previous letter in English alphabetical series.

UL1	O2	F3
NS9		AC4
EK5	RS5	I

STEP: 3 This is coded in some special pattern

EK5	N2	I
UL1		F3
NS9	QR5	AC4

As per the rules followed in the above step, find out the appropriate steps for the given input and answer the following questions.

INPUT:

A5	LM3	FT2
ZU8		BC6
G5	S7	MO



6. Which element comes in step-2 in the second column of third row?
   a) LM7 b) KL7 c) ZU3
   d) AB8 e) None of these
7. Which element replaces AB8 in step-3?
   a) PQ7 b) ZU3 c) FT5
   d) MO2 e) None of these
8. Which element replaces FT5 in step-3?
   a) PQ7 b) ZU3 c) AB8
   d) MO2 e) None of these
9. Which element replaces KL7 in step-3?
   a) JK7 b) ZU3 c) FT5
   d) MO2 e) None of these
10. Which element replaces S3 in step-3?
    a) Q3 b) U3 c) T5
    d) R3 e) None of these

Directions (Q.No.11-15): Study the following information carefully and answer the questions given below:

Six flights of different companies Emirates, Jet - Airways, Indigo, Spicejet, Air - India and Vistara are to be scheduled to fly from Khajuraho to Bangalore starting from 2nd August and ending on 8th August with Sunday being an off day. Each of the flight take different time to reach Bangalore: 40 minutes, 50 minutes, 60 minutes, 75 minutes, 90 minutes and 100 minutes, again not necessarily in the same order. 8th August is not Sunday and a flight which take 40 minutes is scheduled on that day. Emirates take less than 60 minutes and is scheduled immediately before Air -India flight. Indigo flight is scheduled before Spicejet flight. There are two flights scheduled between Vistara which take 100 minutes and Indigo which is for 60 minutes. Air - India is before Sunday and there are two days between Sunday and Emirates flight to fly. Spicejet flight which take 75 minutes is not scheduled on 2nd August. Emirates is not scheduled on even numbered date. The flight scheduled on Saturday takes 100 minutes.

11. Which flight is scheduled on 7th August?
    a) Spice jet b) Indigo
    c) Jet - Airways d) No Flight
    e) None of these
12. How much time a flight take which is scheduled on 4th of August to reach Bangalore?
    a) 60 Minutes b) 90 Minutes
    c) 50 Minutes d) 40 Minutes
    e) 75 Minutes
13. What is difference in time taken by flights which scheduled on Saturday and Monday?
    a) 40 Minutes b) 60 Minutes
    c) 50 Minutes d) 10 Minutes
    e) 25 Minutes
14. Which of the following combination is false?
    I. Friday - Air India - 90 minutes - 4th August
    II. Sunday - Off day - 6th august
    III. Tuesday - Indigo - 60 minutes - 7th August
    a) Only I b) Only II
    c) Only III d) Both II and III
    e) Both I and II
15. Tej's flight is scheduled from Bangalore to Delhi on 3rd August which take 50 minutes to reach Delhi from Bangalore and there are 10 minute to change flight in Bangalore except that there are no delay, then what is minimum time that Tej will take to reach Delhi from Khajuraho?
    a) 120 Minutes b) 150 Minutes
    c) 110 Minutes d) 135 Minutes
    e) None of these

Directions (Q.No.16-20): Study the following information carefully and answer the questions given below:

In a certain code

'SMART LOGIC' is written as '2025 0325',

'BASE MATERIAL IS AVAILABLE' is written as '0516 1904 0581 1264',


'ALMOST ALL QUESTIONS' is written as '1209 2036 1981' and

'PEOPLE ARE EATING MONEY' is written as '0536 0509 0736 2525'.

16. Which of the following is the code for 'MATERIAL'?
    a) 1264 b) 0516
    c) 1204 d) 1281
    e) None of these
17. Which of the following can be coded as '2525'?
    a) PEOPLE b) ARE
    c) EATING d) MONEY
    e) None of these
18. Which of the following is the code for 'basic good enough'?
    a) 0325 0416 0836
    b) 0316 0425 0836
    c) 0352 0466 0864
    d) 0425 0516 0836
    e) None of these
19. What can be the code of 'HARI'?
    a) 0916 b) 0816 c) 1816
    d) 1016 e) None of these
20. What can be the code of 'VISHNU'?
    a) 1916 b) 2036
    c) 2136 d) 1036
    e) None of these

Key with Solutions

(1-5):



1) e; 2) c; 3) c; 4) d; 5) e;

(6-10):

INPUT:

A5	LM3	FT2
ZU8		BC6
G5	S7	MO

STEP: 1

MO5	S3	G2
BC8		ZU6
FT5	LM7	A

STEP: 2

MO2	S3	G2
AB8		ZU3
FT5	KL7	A

For obtaining step 3, we need to rotate Columns 1 and 3 by 1 position, which means that row I in columns 1 and 3 would be new row 2 and row 2 in columns 1 and 3 would be new row 3 and row 3 in columns 1 and 3 would be new row1.

The alphabet of first row second column and third row second column is replaced with the previous alphabet in alphabetical series.

STEP: 3

FT5	R3	A
MO2		G2
AB8	JK7	ZU3

6) b; 7) d; 8) c;
9) a; 10) d;

(11-15):

Date	Days	Flight	Time
2	Wed	Indigo	60
3	Thu	Emirates	50
4	Fri	Air India	90
5	Sat	Vistara	100
6	Sun	Off Day	Off day
7	Mon	Spicejet	75
8	Tue	Jet-Airways	40

11) a; 12) b; 13) e;
14) c; 15) c;

(16-20):

In the code there are four digits in which the first two indicates the numerical value of the last letter of the given word and last two digits indicate the square of the number of letters in the given word.

Ex: SMART

Last letter T=20

Number of letters 5 ⊳ $5^2 = 25$, so the code is 2025.

16) a; 17) d; 18) a;
19) a; 20) c